# సాహితీసేతువు

(కవిత్రయం-కాళిదాసు-డాంటే-
టాల్ స్టాయ్-మొహంతి-చెఖోవ్-
కా.రా.)

సూరపరాజు రాధాకృష్ణమూర్తి

# విషయసూచిక

ముందుమాట
1.కవిత్రయం
2. కాళిదాసు
3. డాంటే
4. టాల్ స్టాయ్
5.మొహంతి
6. చెఖోవ్
7. కా.రా.

# ముందుమాట

నేను అయిదారు సంవత్సరాలుగా ముఖపుస్తకమిత్రులకొరకు (Facebook) రాసిన సాహిత్యవ్యాసాలు యీ పుస్తకంగా ప్రచురిస్తున్నాను. ఇందులోని వ్యాసాలు సాధారణంగా సాహిత్య విమర్శకులు చేసే విమర్శ అనిపించకపోవచ్చు, విధానంలోగాని శైలిలోగాని. పాతకాలంలో పల్లెల్లో యింటివీథిఅరుగుమీద చెప్పుకునే ముచ్చట్ల తీరులో ఉంటాయి. సంప్రదాయసాహిత్యవిమర్శలో కనిపించే రసము, ధ్వని, రీతి, శయ్య, ఓజస్సు, వంటి పడికట్టుపదాలు యిందులో కనిపించవు .

నేను ముఖపుస్తకంలో రాయడం మొదలుపెట్టినపుడు, నా ఆలోచన ప్రధానంగా పాశ్చాత్యసాహిత్యంగురించి తెలుగుభాషలో రాయవలసినంత రాయలేదని, నాకుచేతనైనంత ఆ ప్రయత్నం చేయాలని. ఏ పాశ్చాత్యభాషాసాహిత్యంపైననే కాదు, ఏ భారతీయభాషాసాహిత్యంపై కూడా, చివరకు తెలుగుసాహిత్యంపై కూడా ఆంగ్లంలో విమర్శగ్రంథాలున్నాయి. తెలుగులో కూడా పాశ్చాత్యసాహిత్యవిమర్శ ఆ స్థాయికి ఏనాటికైనా చేయవలెనని చేరుతుందని నా ఆశ. నా ప్రయత్నం స్వల్పం. సాధించింది అత్యల్పం.

ఈ విమర్శావ్యాసాలలో మరో విషయం. వీటిలో సంప్రదాయమో అభ్యుదయమో విప్లవమో లేదు. ఈ విమర్శలో మార్క్సు మహర్షులు, కా.రా. కవిత్రయము కలిసి కనిపిస్తారు.

-సూరపరాజు రాధాకృష్ణమూర్తి

# 1. కవిత్రయం

1.1 శ్రీవాణీగిరిజాః
1.2 పాములు, పగ
1.3 ఎర్రన మూడవఋషి
1.4 మౌళిస్రక్
1.5 ద్వాసుపర్ణా,లేక,  రెండవకృష్ణుడు
1.6 తిక్కనదొక రసమార్గము

## 1.1. శ్రీవాణీగిరిజాః

మహాభారతాన్ని మూడు భాగాలుచేసి వ్యవహరించడం సామాన్యం—ఆదిపంచకము, యుద్ధషట్కము, శాంతిసప్తకము అని . కాని స్త్రీపర్వంలో యుద్ధం లేదు. యుద్ధానంతర విషాదమే ఉంది. అందుకే కావచ్చు, వావిళ్ళవారు, యుద్ధషట్కమనలేదు, ఆరుపర్వాలను ఒకే సంపుటిగా వేసినా, ఆ సంపుటిని "యుద్ధపంచకము, స్త్రీపర్వము " అని వేరుచేసి చెప్పారు. .

భారతంలో ఒక్కొకపర్వము ఒక ప్రత్యేకకావ్యమనదగినది , మహాభారతసమగ్రతను సమర్ధిస్తూనే. ఇందులోని స్త్రీపర్వం కూడా అటువంటి ప్రతిపత్తికి అర్హమైనదే. అంతేకాదు, ఒక్క మహాభారతంలోనే కాక , ప్రపంచంలోని గొప్ప కావ్యాలలో ఒకటిగా దాని విశిష్టతను ప్రత్యేకతను నిలుపుకోగల కావ్యమనవచ్చు ఆ పర్వం . వీరరసప్రధానంగా, యుద్ధవర్ణనబహుళంగా కావ్యాలు అనాదిగా అనేకం వచ్చాయి. నిజానికి కావ్యరచన యీ వీరరసప్రధానంగానే మొదలయిందనవచ్చు, ప్రపంచసాహిత్యమంతటా. శృంగారం వీరరసానికి అంగం. అన్నిభాషలలోనూ ఆదికావ్యాలలో యీ వీరశృంగారరసాల సమ్మేళనమే. కాని భారతంలోని యీ స్త్రీపర్వంలో, విజయవిషాదాలలోని (Triumph and Tragedy) విజయం లేదు, విషాదార్ధమే ఉన్నది. ) అలా అని యీ పర్వం మిగిలిపోయిన ముక్కగా కాక, పూర్ణము సమగ్రమనిపించగల లక్షణాలు కలది . అలా స్వతంత్రంగా ఉంటూనే , మహాభారత ఆద్యంతాలను కలిపి ముడివేయగలదు యీ పర్వం. అలా మహాభారతార్థాన్ని సమస్తంగా పోషించడం దీని ప్రత్యేకత, విశిష్టత. సాధారణంగా, వీరసప్రధానమైన కావ్యాలు వీరులగురించి, వారి సాహసంగురించి, మరణించినవారి వీరస్వర్గం గురించి, గెలిచినవాని వైభవవర్ణనతో ఉంటాయి. స్త్రీల భావాలు వారి విషాదం ఆ కావ్యాలలో ప్రధానంకాదు, అవి అప్రధానంకూడా. స్త్రీకి సమాజాలు యిచ్చే అప్రాముఖ్యమే కావ్యాలలోనూ ప్రతిఫలించడం సహజమే. పురుషుడి శృంగారానికే స్త్రీ అనాదిగా వస్తువు, కావ్యవస్తువు . ఇతర రసాలకు స్త్రీ వస్తువు కాదు. ఊహించగలిగిందే. యుద్ధాలలో ఎక్కువ నష్టపోయేది స్త్రీయే. అయినా యుద్ధం స్త్రీల జీవితాలలో కలిగించే విషాదానుభూతి కావ్యవస్తువుగా ప్రపంచంలో ఏ గొప్ప కవి గ్రహించినట్టు కనిపించదు.

బోద్ లేర్ కవిత "హంస" ( Le Cygne) దీనికి అపవాదమనవచ్చేమో? అది పరిమాణంలో ఒక మహేతిహాసమో బృహత్కావ్యమో కాకపోవచ్చు. యుద్ధాల ప్రభావం స్త్రీలపై ఎలా ఉంటుంది అన్న దృష్టికోణంనుండి , వారి వైధవ్యం,ప్రవాసం, దాస్యం కావ్యవస్తువుగా కదిలించే కవితలు ఎక్కువ లేవు. రాసీన్ (Racine) రాసిన "Andromaque" ( ఫ్రెంచి నాటకం) అటువంటి విషాదనాటకం. అప్పటికి చాలాకాలం ముందు యూరిపిడీస్ (Euripides) కూడా ఒక నాటకం రాశాడు కాని,

అతడి నాటకాలకు అంత ప్రసిద్ధి లేదు. ) అదే విషయంగా బోద్ లేర్ ( Baudelaire) రాసిన "హంస" ( Le Cygne) లో కూడా యుద్ధము స్త్రీవిషాదము ప్రధానవస్తువు. కవిత ప్రారంభమే "ఆంద్రోమాక్! నీవు గుర్తొస్తున్నావు !" (Andromaque, je pense à vous!...) ఆంద్రోమాక్ కన్నీళ్ళు సుజలాలై తన కవితాసుక్షేత్రాన్ని సస్యశ్యామలం చేశాయి అంటున్నాడు. (A fécondé soudain ma mémoire fertile:Suddenly made fruitful my fertile memory).యుద్ధాలు ఆమె జీవితాన్ని శోకమయం చేశాయి. ఆ శోకంలోనుండి తన శ్లోకం వచ్చింది అంటున్నాడు బోద్ లేర్.

[ ట్రోయ్ వీరుడు హెక్టర్. అతడి భార్య ఆంద్రోమాక్. ఏకిలస్ ట్రోయ్ నగరాన్ని జయించినపుడు, కొందరు స్త్రీలను, పిల్లలను తప్ప ఆ నగరాన్ని మొత్తం విధ్వంసం చేశారు స్పార్టన్ లు . ఆ స్త్రీలను పిల్లలను బానిసలుగా పంచుకున్నారు గెలిచినవారు. నియోటోలమస్ (Neoptolemus) బానిసలుగా ఆంద్రోమాక్, ఆమె కుమారుడు అతనితో ఎపైరస్ (Epirus) వెళ్లారు. అతడికి ఆంద్రోమాక్ ముగ్గురు కొడుకులను కన్నది. నియోటోలమస్ ను శత్రువులు చంపిన తరువాత ఆమెను హెక్టర్ తమ్ముడు హెలినస్ (Helenus) చేసుకున్నాడు. అతడుకూడా చనిపోయిన తరువాత ఆమె తన చిన్న కుమారుడు పెర్గమస్ తో (Pergamus) స్వస్థలానికి తిరిగి వెళ్ళింది. అప్పుడా స్వస్థలం తన వారెవరూ లేని శూన్యసమాధి . ] అక్కడ హెక్టర్ సమాధిముందు ఆంద్రోమాక్ శోకమూర్తిని వర్ణించాడు బోద్ లేర్ :

ఒక మహావీరుడైన పతికౌగిలి నుండి
మహాగర్వి పిరస్ చేతులలో జారిపడిన బలిపశువువు,
శూన్యసమాధివద్ద పరవశవినమితకృశవ్రతవు,
ఒకనాటి హెక్టర్ భార్య, అయ్యో! ఆపై హెలినస్ ఆలి!

(Andromaque, des bras d'un grand époux tombée,
Vil bétail, sous la main du superbe Pyrrhus,
Auprès d'un tombeau vide en extase courbée
Veuve d'Hector, hélas! et femme d'Hélénus!

Andromache, fallen from the embrace of a mighty husband
Into the hands of proud Pyrrhus,
Bowed in ecstasy before an empty tomb,
Widow of Hector, alas! and wife of Helenus! )

ఒక్క ఆంద్రోమాక్ నే కాదు, యుద్ధాలలో స్వస్థలాలను పోగొట్టుకున్న ఒక ప్రవాస నీగ్రో స్త్రీని కూడా తలచుకున్నాడు. ఆ నీగ్రో స్త్రీ యుద్ధాలలో అన్నీ పోగొట్టుకున్న స్త్రీలకందరికి ప్రతినిధి.

చిక్కిశల్యమైన నీగ్రోవనిత గుర్తొస్తోంది,
బురదదారులు తొక్కుతూ, పొగమంచు వెనక

అదృశ్యమైన తనగొప్పఆఫ్రికా
కొబ్బరిచెట్లకోసం ఆబగా వెదకుతూ;

(Je pense à la négresse, amaigrie et phtisique
Piétinant dans la boue, et cherchant, l'oeil hagard,
Les cocotiers absents de la superbe Afrique
Derrière la muraille immense du brouillard;

I think of the negress, frail and phthisic,
Trampling the mud, and seeking, with a haggard eye,
Behind the immense wall of mist;
The absent coco-palms of superb Africa;)

***

భారతమంతా పగ రగిలినట్లే, పగ అడగించే బోధలుకూడా సాగుతూనే ఉంటాయి. పగ అడగించే సందర్భాలలోను, శోకాపనయనసందర్భాలలోనూ కూడా దేహాల అనిత్యత్వమే బోధవిషయం. భారతంలో భాగమైన భగవద్గీత, యుద్ధం చేయడం ధర్మమని, మానడం అధర్మమని చెప్పవలసిన సందర్భంగా చేసిన బోధ . (వాస్తవానికి గీతాబోధ యుద్ధం చేయమనీ కాదు, మానమనీ కాదు. యుద్ధం చేయను అన్న అర్జునుడు చేయననడానికి చెప్పిన కారణాలు సరిఅయినవి కావని , ఎందుకు కావో వివరించాడు భగవానుడు. అర్జునుడు నిజానికి యుద్ధం చేయననలేదు, యుద్ధం “నా వారితో చేయలేను” అన్నాడు. భగవానుడు యుద్ధం చేయమన్నది యీ “ నా ” తో (“ నా వారు , నా కులం, నా మతం” అన్న అభిమానంతో.) కనుక భారతం , ముఖ్యంగా భగవద్గీత , పగను పెంచేది, యుద్ధానికి ప్రేరేపించేది అన్న అభిప్రాయం సరికాదు. భారతంలో ఎక్కువభాగం పగను వదలమని చెప్పే బోధలే ఉన్నాయి, ముఖ్యంగా కౌరవులకు. ధృతరాష్ట్రుడు శ్రద్ధగా వింటాడు, వదిలేస్తాడు. ఆ బోధలకు పురిటిలోనే సంధి. దుర్యోధనుడు ఆ శ్రమకూడా పడడు .

ధృతరాష్ట్రుడికి నిద్రపట్టని జబ్బు . (మోసాలు చేయాలనుకున్నవాడు మెలకువగా ఉండవలె కదా !) నిద్రపట్టనప్పుడల్లా విదురుణ్ణి నిద్రపోనివ్వడు, పిలిపించుకుంటాడు, వేదాంతం వినిపించడానికి. విదురుడు కాక ( Home faculty) సనత్సుజాతుడితో సహా యింకా అనేకఋషులు, వచ్చేవారు ధృతరాష్ట్రుడి గెస్ట్ ఫేకల్టీ .

స్త్రీపర్వంలో రెండు ఆశ్వాసాలు, రెండు భాగాలు అనవచ్చు. స్థూలంగా, మొదటి భాగం ధృతరాష్ట్రభాగం, రెండవది స్త్రీభాగం, (తల్లుల, భార్యల శోకభాగం ) . మొదటి ఆశ్వాసమంతా ధృతరాష్ట్రుడి పశ్చాత్తాపము, పరితాపము, పగ. అన్నిటి కలబోత. ఈ కలబోత అతిసహజం. అనుభవం లోది. ఈ జీవితవాస్తవాన్ని అంత వాస్తవంగానూ వర్ణించారు, వ్యాసుడు, తిక్కన కూడా. మహాకవిత్వం భావాలను చెప్పేది కాదు, అనుభవాలను చెప్పేది. స్త్రీపర్వంలోని సన్నివేశం

ఆసామాన్యమైంది. అంత పెద్ద యుద్ధం, అంత మారణహోమం, పశ్చాత్తాపం, పెరుగుతున్న పగ, తీరని శోకం. అన్నిటినీ ఏ మాత్రమూ అసహజత్వం లేకుండా వాస్తవంగా వర్ణించడం ఒక మహాకవి మాత్రమే చేయగలడు. వ్యాసుడు మహర్షి, మహాకవి. తిక్కన కూడా. ఋషిమార్గము రసమార్గము వేరు మార్గాలు  అనుకోనవసరం లేదు. నా నృషిః కురుతే కావ్యమ్.

యుద్ధానికి ముందు,  యుద్ధంలో యింతమందిని చంపవలెనా అని బాధపడుతున్న అర్జునుడికి కృష్ణుడు, యుద్ధం తరువాత,  యింతమందిని చంపించానని శోకిస్తున్న ధర్మరాజుకు భీష్ముడు యీ శోకం అవివేకం అని,  నిత్యానిత్యవివేకం బోధించారు . స్త్రీపర్వంలో ధృతరాష్ట్రుడికి కూడా ఆ వివేకమే బోధించారు, సంజయుడు, విదురుడు, వ్యాసుడు.  చివరకు  కృష్ణుడు కూడా పాడిందే పాడి వినిపించాడు పాతగీత,"తత్ర కా పరిదేవనా" అని తిరిగి ధృతరాష్ట్రుడికి. మెత్తగా చీవాట్లయితే పెట్టాడు. "ఎందరు చెప్పినా ఎన్నిసార్లు చెప్పినా చెవికెక్కలేదు, ఎందుకిప్పుడు ఏడుస్తావు" అని. అంత దుఃఖంలోనూ పశ్చాత్తాపంలోనూ ధృతరాష్ట్రుడి  పగ సెగలు కక్కుతూనే ఉంది. అప్పుడుకూడా అయోమయభీముణ్ణి  విరిచి ముక్కలు చేసేటంత పగ ఉంది. ఉండకపోవడం అసహజం. అప్పుడు కృష్ణుడు అన్నాడు ధృతరాష్ట్రుడితో:

" నీయవినీతియుంగొడుకుల దుశ్చరితంబునుం దలచి శోకరోషంబులు విడిచి శాంతుండవై యుండుమనిన ఉపేంద్రునకునన్నరేంద్రుండిట్లనియె.

క. తెలిసితి నీమాటల పుత్రులదెస నెవ్వగలనెల్ల దొఱగి యనుజపు
 త్రుల నాకుంబ్రియమొనర్పంగలవారుగ నడచువాడ కంసారాతీ.

పాత తెలుగు సినిమాలలో చివరి సీనులో విలన్  తను చేసిన తప్పుల లిస్టు చదివినట్టు, మారిపోయినట్టు మారిపోయాడు ధృతరాష్ట్రుడు.  కాని, ఆ సినిమాలలో లాగానే, ఆ మార్పు అసహజమని తెలుస్తూనే ఉంటుంది.ఆ అసహజత్వం చెప్పడమే సహజచిత్రణ. ఆ ఆరనిపగ, తాత్కాలికమైన మార్పు అన్నీ సహజమే. అందుకే భారతం కావ్యం. అందులోని స్త్రీపర్వమూ స్వతంత్రకావ్యమే.

స్త్రీపర్వంలో పగ పరాకాష్ఠ చేరిన సన్నివేశం ప్రసిద్ధం. ఆ పగను ఊహించిన కృష్ణుడు, (పగను ఊహించడానికి పరమాత్ముడే కానక్కరలేదు) , ధృతరాష్ట్రుడికి ముందు ఉక్కు భీముణ్ణి ఉంచిన కథ తెలియని వాడుండడు భారతదేశంలో. పగ పగతో ఆరదు, ఎన్నటికీ తీరదు. ఉక్కు తీర్మానాలు కూడా తుక్కు కావలసిందే. ఇదే భారతం తీర్మానం. భారతం చెప్పిన పరిష్కారం ఏమిటి?

ధృతాష్ట్రుడి పరితాపము పశ్చాత్తాపము దాటి స్త్రీపర్వంలోని ఉత్తరార్ధానికి వద్దాం. ఈ ఉత్తరార్ధంలో  భారతార్థం అతి సూక్ష్మంగా నిక్షిప్తమయిందనవచ్చు. ఈ ఉత్తరార్ధం గాంధారిది, స్త్రీలది . ధృతరాష్ట్రుడు అయోమయభీముణ్ణి ముక్కలు చేస్తే, గాంధారి ఏకంగా శ్రీకృష్ణుణ్ణే శపించింది.  నీ యాదవవంశం నిర్వంశమగుగాక అని, నీవుకూడా దిక్కులేని చావు చస్తావని సాక్షాత్తు భగవానునే  రోజులు లెక్కబెట్టుకో అన్నది:

" సీ. పూని పాతివ్రత్యపుణ్యఫలంబున సంపాదితబైన సారతపము
బలిమి సాధనముగా పలికెదనుత్తమజ్ఞాతుల తమలోన సంగరమున
పొలియజేసితిగాన పొలియుదురన్యోన్యఘాతుకులై భవజ్ఞాతిజనులు
నీవును తప్పక నేడాదిగ ముప్పదారగునేడైన యద్దినమున
నరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపు కుత్సితంపు తెరంగున కూలువాడ
విట్లు మీ వధూజనములునేడ్చువారు పతుల సతుల బంధుల పనవి పనవి. (స్త్రీ: 2-161)

ముప్పదియారు దినాలు మాత్రమే అని ముహూర్తం పెట్టింది. " దిక్కెవ్వరును లేని యగ్గలంపు కుత్సితంబు తెరంగున కూలువాడవు" అని నూర్గురు కొడుకుల శవాలమధ్య కూర్చుని తన శోకాన్ని అందులో ఎగసిన సెగను పగను వెళ్ళగక్కింది. అలా ఆమె శపించకపోవడం అసహజం . ఉన్నదున్నట్టు చెప్పింది భారతం. అదే కదా వ్యాసుడన్నది, లోకంలో ఉన్నదే నేను చెబుతాను అని, ( "యదిహాస్తి తదన్యత్ర").

గాంధారి ఎంతైనా స్త్రీ కదా, తల్లి కదా! అభిమన్యుడిని తలచుకొని కూడా పలవించింది. అది దొంగఏడుపు కాదు, ధృతరాష్ట్రుడు "అనుజపుత్రుల నాకుంబ్రియమొనర్పంగలవారుగ నడచువాడ" అన్నట్టు కాదు . యుద్ధప్రభావం పురుషుడిపై కంటే స్త్రీపై, వారి మనసుల పై మరింత గాఢంగా , వారి జీవితాలపై మరింత తీవ్రంగా ఉంటుంది. ధృతరాష్ట్రుడి బాధ తన బాధ. గాంధారిది అందరి స్త్రీల బాధ. గాంధారి శోకంలో ప్రధానాంశం అనిత్యమైన దేహాలగురించే, వాటి నష్టం గురించే .శోకం అనిత్యంపైననే కదా. ఒక్కొక్క తల్లి పాత్రలో, పత్ని పాత్రలో ప్రవేశించి గాంధారి వారి బాధలో తను బాధపడుతోంది. అభిమన్యుడి దేహంపై పడి విలపిస్తున్న ఉత్తర శోకంలో గాంధారి తన శోకం చూచుకొన్నది. కృష్ణుడికి చూపిస్తున్నది. ( కృష్ణుడికి మేనల్లుడు అభిమన్యుడు ! ) "ఆ ఉత్తరను చూడు ఎట్లా విలపిస్తున్నదో", అని. ఎలా విలపిస్తున్నది ?

" దేవలోకంబున నీవిప్పుడెవ్వత దీపారు పలుకలదేర్చి కురులు
పుడుకుచు దగ నన్న పోలె లోలాత్మగా జేయుచున్నాడవు చెలువు నేర్పు
మెరయంగ నచ్చరతెరవలమనమును గలచి యాడుదుగాక యలతి బోదె
యంగనాగోష్ఠి నున్నపుడు నా నడవడి బుద్ధి దలంతె నిన్బొందగాంచి
యారునెలలు వోయె..."

[ నన్నపోలె=నన్ను చేసినట్టు]

(ఈ అనిత్యదేహం ఉత్తర శోకానికి ఆత్మ . గాంధారి శోకంలో ఉత్తరతో ఆత్మీయత ఉంది. గెలిచినవారిని ఓడినవారిని ఒకటి చేస్తుంది స్త్రీ శోకం . ఇది గాంధారి శోకంలో ఒక అంశం. కాని, యీ చర్చలో మనం నడుస్తున్నది మరో ముఖ్యాంశం వైపు. అది పురుషార్థసాధనలో దేహాత్మల సమన్వయం. ( మహాభారతానికి ఆత్మ "దేహం" .ఇహమే దేహం. కామమే యిహం. ) గాంధారి వేదాంతం మాట్లాడడంలేదు.( మగవాడు మనసులో లేకున్నా వేదాంతం మాట్లాడుతాడు. స్త్రీమాత్రమే వాస్తవం మాట్లాడగలదు.) ఆ వాస్తవం వైపు ,

మరో శోకదృశ్యానికి, నడుద్దాం. సోమదత్తుడి కుమారుడు భూరిశ్రవసుడు . అర్జునుడు భూరిశ్రవసుడి చేయి తెగనరికాడు, తల నరికాడు సాత్యకి. సోమదత్తుడి భార్య, భర్త శవం, కుమారుడి శవం మార్చి మార్చి చూస్తూ శోకిస్తోంది. భూరిశ్రవసుడి తెగిన చేయిని తన తొడపై ఉంచుకొని అతడి భార్య ఒకతె ( " ఆండ్రురలో నొక్కత యతిరమ్యమూర్తి ") యిలా విలపిస్తోంది :

" మెలుపారగా బట్టి మొలనూలిమణులు గదల్చుచు దిగుచుచు దగులొనర్చు
చనుగవమీది కల్లన వచ్చి లలితవిమర్దనంబున లజ్జ మరల ద్రోచు
నాభి యూరులు జఘనము మెత్తమెత్తన యొత్తి ముదంబున నుల్లమూన్చు
ననయంబు తిన్నని యనువున గనయంబు ప్రిదులంగ మెలపి సొక్కిదవజేయు
నిక్కరంబు..."

[ 'ఉల్లము ఊన్చు' , ఊయలఊపు, మనసుకు హాయిగొలుపు ; 'సొక్కిదవజేయు నిక్కరంబు' , ఈ కరము , యీ చేయి; 'గనయము' ,పోకముడి.]

ఈ పద్యం ఆలంకారికులకు పండగ. రసచర్చ, అంగము అంగి, వీటి అంగీకారము- కావలసినంత చర్చ చేసుకున్నారు. కరుణశృంగారరసాల సంఘీభావము, తిక్కన అనితరశిల్పము, వీటిగురించి చాలా చెప్పారు. కాని మనం యిక్కడ పట్టుకోవలసింది అలంకారాలు కాదు. శవాలగుట్టలమధ్య యీ సవివరశృంగారస్మరణ పరమార్థమేమిటి?ఆలంకారికుల "మోదముంబొరయ" రాశాడా తిక్కన యీ వింత పద్యం? తిక్కనను మనం స్మరించవలసింది ఆయన సమగ్రదర్శనానికి. మహాభారత ప్రయోజనానికి అవసరం కానిదేదీ రాయడు. ఈ స్త్రీల శోకంలో వ్యక్తమౌతున్నది ప్రధానంగా దైహికానందం. ఈ దేహాలన్నీ నశించేవే, వాటికోసం శోకించరాదు అన్న వేదాంతం భారతమంతా బలంగానే ఉన్నది. భగవద్గీత కంటే అంతకంటే బలమైన సాక్ష్యం ఏముంటుంది? కాని భగవద్గీత సారం దేహాన్ని నిస్సారం చేయమని, జీవితాలను ఎండగట్టమని ఎంతమాత్రము కాదు. సన్యాసం తీసుకుంటానన్న అర్జునుణ్ణి చీవాట్లు పెట్టాడు భగవానుడు . గీతోపదేశం చావమని కాదు, బతకమని. బతుకును ఎలా సారమయం చేసుకోవాలో చెబుతుంది గీత . గీత నిశ్చితార్థం నిశ్శ్రేయసమే , శంకరుడు తన గీతాభాష్యంలో చెప్పినట్టు. అది నిస్సంశయం. కాని మోక్షం అందరికీ అందనిది. ఏ సాధనవల్ల పొందదగినదీ కాదు. వివాహవ్యవస్థలో , ఏ వ్యవస్థలోనూ , యిమడనిది మోక్షం. అందుకే సన్యాసిని అత్యాశ్రమి అంటారు. "ధర్మేచ అర్థేచ కామేచ యేషా నాతిచరితవ్యా , నాతిచరామి", అని వివాహసమయంలో చెప్పిస్తారు.మోక్షం దీనికి వెలుపలిది, కనుక చేర్చబడదు. ( "ధర్మే చ అర్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ। యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ ।।" . అన్నది మహాభారతం గురించి వ్యాసుడన్న మాట , భారతంలో నాలుగూ చెప్పబడ్డాయని. వాస్తవమే కదా! గీత, సనత్సుజాతీయము కంటే బలమైన సాక్ష్యం అవసరం లేదు, మోక్షంకూడా అందులో చెప్పబడిందనడానికి.)

భగవద్గీత శవాలకు వినిపించవలసినది కాదు, అగతాసువులు వినిపించుకోవలసినది. గృహస్థాశ్రమికి గీత యిచ్చే ఉపదేశం చావని ఆత్మ గురించి కాదు, చనిపోయే దేహాలను ఎలా సార్థకం చేసుకోవలె అనేదే. అందుకు ప్రధానసాధనం కామం. ధర్మావిరుద్ధమైన కామమే తానని భగవానుడు అన్నాడు గీతలో . పురుషార్థాలలో ప్రధానమైనది కామం. ఆ కామం

సువ్యవస్థితమైనపుడే సమాజం సుస్థిరమౌతుంది. సమష్టిలోనే వ్యష్టి పుష్టి. ఈ సమగ్రదర్శనంలో అంతర్భాగంగానే స్త్రీపర్వంలోని యీ పద్యాన్ని ( "మెలుపారగా") గ్రహించవలె. కామసువ్యవస్థ ఆంధ్రమహాభారత కావ్యవస్తువు. మహాభారతనాటకానికి నాందీశ్లోకం ( " శ్రీవాణీగిరిజాః") యీ వస్తునిర్దేశమే చేస్తోంది. ఆ నాందీశ్లోకవివరణతో యీ ముచ్చటకు భరతవాక్యం పలుకుదాం.

" శ్రీవాణీగిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితిమావహంత్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయస్త్రిపురుషాస్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవశ్రీకంధరా శ్శ్రేయసే.

అని సకలభువనరక్షణ ప్రభువులై ఆద్యులైన హరిహరహిరణ్యగర్భపద్మోమావాణీపతుల స్తుతియించి..."

"శ్రీవాణీగిరిజాః", "శ్రీవాణీగిరిజలను", (ద్వితీయావిభక్తి ); "చిరాయ", చిరాయ అంటే చాలాకాలంగా అని కాదు, అనాదిగా అని. ఎప్పటినుండి, ఎంతకాలంగా అన్న ప్రశ్నకు తావులేదు. సృష్ట్యాదినుండి. సృష్టి ఎప్పుడు మొదలైంది అన్న ప్రశ్న లేదు కనుక . ( పద్యం తరువాత వచ్చిన వచనంలో త్రిమూర్తుల క్రమం మారింది. పద్యంలో "శ్రీవాణీగిరిజాః","పురుషోత్తమాంబుజభవశ్రీకంధరాః" వచనంలో హరిహరహిరణ్యగర్భులు, పద్మోమావాణీపతులు అయినారు. క్రమం ముఖ్యంకాదు. ముగ్గురు ఒకరే కనుక. " వేదాంతేషు యమాహురేకపురుషం" ( కాళిదాసు: విక్రమోర్వశీయం: నాందీ శ్లోకం.) అన్న ఏకపురుషుడే. అదే కాళిదాసు వివరించింది కూడా:

నమస్త్రిమూర్తయే తుభ్యం ప్రాక్ సృష్టే: కేవలాత్మనే
గుణత్రయవిభాగాయ పశ్చాద్భేదముపేయుషే.(కుమారసంభవం2.4.)

వేదాంతములయందు, అంటే ఉపనిషత్తులయందు, "ప్రాక్ సృష్టే: కేవలాత్మనే" . "ఆత్మైవేదమగ్ర ఆసీత్"( బృహ. ఉప. 1.4.1.) సృష్టికి పూర్వం కేవలం ఆత్మ ఉండెను. గుణత్రయవిభాగం వలన ముగ్గురుగా కార్యనిర్వహణ చేస్తాడు ఆ ఏకపురుషుడు . అందుకే,"త్రిపురుషాస్సంపూజితాః ...సురైః". ఇంతకంటే స్పష్టంగా భగవద్గీత చెప్పింది:

మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహం
సంభవః సర్వభూతానాం తతో భవతిభారత ॥

సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః
తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా॥( 14.3-4)

ఈ నాందీశ్లోకంలో, యీ చర్చలో కూడా, కీలకమైన పదం "దధతః". 'డుధాఞ్ ధారణ పోషణయోః' , అని ధాతుపాఠం. భర్త అంటే భార్యను పోషించువాడు అని ఒక అర్థం.

పోషించడం అతడి ధర్మం. దయాధర్మం అన్న పదానికి అర్థం ప్రేమతో పోషించడం అని అర్థం, వాడి యిష్టం అని కాదు. ఎందుకు కాదు? త్రిమూర్తి ఏకపురుషుడే కాదు, ఏక పురుషస్త్రీమూర్తి. “ స ఇమమేవాత్మానం ద్వేధాపాయత్ తతః పతిశ్చ పత్నీశ్చాభవతాం...స్త్రియా పూర్యత” ( బృహ. ఉప. 1.4.3.) స్త్రీ పురుషుడిలో భాగం. స్త్రీతో కలిసి పురుషుడు పూర్ణుడు. స్త్రీ లేక అతడు అపూర్ణుడు. కనుక త్రిమూర్తి ఒక్క మూర్తి. స్త్రీపురుషులు ఒక్క మూర్తి. ఒక్క శివుడే కాదు, త్రిమూర్తి కూడా అర్ధనారీశ్వరుడే. ఏకతత్త్వమే. ఆమె పుష్టి పురుషుడి తుష్టి. భర్త మరో ప్రాణిని పోషించడం మాత్రమే కాదు, ధరిస్తున్నాడు ( ‘ధా’, ధారణ) కూడా . కనుక ఆ తెలివి ఉన్న పురుషుడు చేసే పోషణ దయాధర్మం కాదు. ఆమె అర్ధాంగి అన్న ఎరుక, ఆమె తన అంగం. “దధతః” అనడంలో కేవలం “వారు వారి స్త్రీలను ధరిస్తున్నారు, వారికెంత ప్రేమ” అని చెప్పడం కాదు. ధరిస్తున్నారు కనుకనే లోకాలను పాలింపగలుగుతున్నారు, “లోకానాం స్థితిమావహంత్యవిహతాం”. లోకాల సుస్థిరత వారి నిత్యసంయోగం వలన. వివాహవ్యవస్థ లోకసుస్థిరత ( “ లోకానాం స్థితిమావహంత్యవిహతాం”).

పురుషార్థాలలో యీ విధంగా కామం ప్రధానం. ( అదే వేదాంతం చెబుతున్నది, “సోఽకామయత”) అది లోకాల క్షాంతి సంవర్ధిని. స్త్రీపర్వంలోని శవాలగుట్టలమధ్య శృంగారస్మరణ లోకక్షాంతికి శాంతికి ఉపలక్షకం. ఈ లోకం ముఖద్వారంపై రాసిఉంటుంది “ శ్మశానవాటిక ” అని. “శ్మశానే వసంతం”( శివాష్టకం). ఆ శ్మశానంలో వసంతం సృష్టించుకోవలె మనిషి. ఒక్క శివుడే కాదు శ్మశానంలో వసించేవాడు, మనమంతా అక్కడే వసిస్తున్నాం. దానిలో వసంతం సృష్టించగలిగింది వివాహం. కనుకనే పురుషోత్తమాంబుజభవశ్రీకంధరులకన్నా ముందు యీ జగన్నాటకంలో శ్రీవాణీగిరిజల రంగస్థలప్రవేశం.

ఆంధ్రమహాభారతం ఫలశ్రుతిలో పద్యం ( “శిక్షితచిత్తులార....”) లో, ఫలం పుణ్యలోకములు (“పుణ్యలోకములయందు రమించు నిరామయస్థితిన్”) చెప్పబడినవి కాని , “ అలోకంబగు పెంచీకటికవ్వల “ “ శ్రీకైవల్యపదం” , మోక్షం, చెప్పలేదు.

. ***

ముగింపుగా ఒక మాట. తాళి ఎగతాళి అయిన యీ కాలంలో వివాహవ్యవస్థగురించిన మహాభారతసందేశం విలువ ఎంత? విలువలో దోషం కాదది. విలువ తెలుసుకోలేకపోవడంలోని దోషం. విలువను విస్మరించినవాడు పురుషుడు. ఈ నాటి యీ దుర్వ్యవస్థకు ప్రధానకారణం స్త్రీకి వైవాహికబంధంలో ఉన్న ప్రాముఖ్యాన్ని గుర్తించలేని పురుషాహంకారం. ఈ నాటి సామాజిక దురవస్థకు బ్రాహ్మణుడు కారణం, అన్నాడు శంకరుడు తన గీతాసంబంధభాష్యంలో. సామాజికవ్యవస్థకు ఆనాటి పదం వర్ణవ్యవస్థ. అంటే ఎవడి విధులు వాడు సక్రమంగా నిర్వర్తించడం. అలా చేయడానికి బ్రాహ్మణుని జీవనవిధానం, అతడి స్వధర్మాచరణ, సత్ప్రవర్తన ఆదర్శాలై సమాజాన్ని నడిపించవలె, అతడు ఆ బాధ్యతవహించవలె. (“ బ్రాహ్మణత్వస్య హి రక్షణే రక్షితః స్యాత్ వైదికోధర్మః తదధీనత్వాత్ వర్ణాశ్రమభేదానామ్.” "బ్రహ్మ క్షత్రే పరిపాలయితుం అలమ్",("బ్రాహ్మణ ( legislative) క్షత్రియులు (executive) పరిపాలనకు చాలుదురు", అని కూడా అన్నాడు అదే సందర్భంలో.)

సామాజిక అవ్యవస్థకు బ్రాహ్మణుడు బాధ్యుడు. అట్లే, వివాహవ్యవస్థ భగ్నం కావడానికి పురుషుడు బాధ్యుడు. కాలం మారిపోయింది అంటాం. మారింది మనిషి.మారింది మనం.

. ***

## 1.2. పాములు, పగలు

షేక్స్పియర్, డాంటేలు యూరపును పంచేసుకున్నారు, అన్నాడు ఎలియట్. యుగాలముందే, వాల్మీకి, వ్యాసుడు (వ్యాసవాల్మీకులు అనికూడా కొందరంటారు) భరతవర్షాన్ని ఆక్రమించుకున్నారు. తులసీదాసు ఉత్తరభారతాన్ని తుంచుకున్నాడు. పోతన తెలుగునాట నాటుకున్నాడు. ఆంధ్రమహాభారతం మాత్రం తెలుగుదేశంలో మూలల్లో దాగి అరణ్యవాసం అజ్ఞాతవాసం చేస్తున్నది, మళ్లీ మళ్లీ వ్రతభంగమైనట్టు.

కొంతసేపు పడమటికి తిరిగి దణ్ణం పెడదాం. ఇంగ్లీషు తెలిసినవాడెవడైనా షేక్స్పియర్ చదవవచ్చు. పాండిత్యం అవసరంలేదు. రసజ్ఞత చాలు. డాంటేను చదవాలంటే, ఒక గ్రంథాలయమే అవసరం,  చాలా కావాలి. మధ్యయుగపు చరిత్ర, భూగోళం, ఖగోళం, కవి చేసిన విచిత్రవిశ్వనిర్మాణం, క్రైస్తవమతశాఖలు, పోపుల రాజుల వివాదాలు, గ్రీకు యితిహాసం, యివి కాక డాంటే కాలపు కవులు చిత్రకారులు, డాంటే అభిమానకవులు, ఆనాటి రాజకీయాలు, సాధారణపౌరుల ప్రేమకథలు, హత్యలు మోసాలు, యింకా ఎన్నో. వింటుంటే గుండె జారిపోతుంది. ఎన్ని పాత్రలు! ఒక్కొక లోకంలో ఎన్ని వలయాలు, మండలాలు, ప్రాంతాలు! ఏ వర్జిల్ లాంటివాడో 'సాహసం శాయరా డింభకా' అంటున్నా పాఠకుడు ముందుకు సాగలేడు. డాంటేను మెచ్చుకోనివారుండరు. సొంతం చదివినవారూ ఉండరు. ఇన్ఫెర్నోలో సుఖంగా ఆగిపోతారు. వాళ్ళ వర్జిల్ వాళ్ళను అక్కడే వదిలేసి వెళ్ళిపోతాడేమో, మీకిది చాలని! విక్టర్ హ్యూగో అంటాడు ది డివైన్ కామెడీ గురించి: మానవుడి కళ్ళు చూడగలిగిన దృశ్యాలు కావవి, చివరి రెండు భాగాలు. చీకటి విరిగేకొద్దీ వెలుగు పెరిగేకొద్దీ, పాఠకుడి కళ్ళు చదువలేవు, అలవాటు లేని ఆ కాంతికి కళ్ళు మూసుకుపోతాయి.

ది డివైన్ కామెడీ సొంతం చదవగలగడమెలా అనేదానిమీద అనేక సూచనలున్నాయి. పారడీసోతో మొదలుపెట్టి ఇన్ఫర్నో, ఆ తరువాత చివరగా పర్గటోరియో చదవాలి అంటాడు ఎలియట్. ది డివైన్ కామెడీలో వందల పాత్రలు ఉన్నమాట నిజమే. (కాని అవి మహాభారతంలోని పాత్రల్లో శతాంశం.) అందులో ఎన్ని వందల పాత్రలున్నా, ముఖ్యపాత్ర ఒక్కటే, డాంటే. తక్కిన పాత్రలు ఆ పాత్ర గతిచిత్రణకు ఉపకరణాలు మాత్రమే. ఉదాహరణకు, ఇన్ఫర్నోలో ఫ్రాన్చెస్కా, పాప్లోల అక్రమప్రేమకథ (5వ సర్గ) చాలా ప్రసిద్ధం. మన దృష్టి ప్రేమికులపై ఉండడం సహజం. కాని, డాంటేపై దృష్టి నిలిపి ఆ కథ చదవాలి. అలా చదివితే కాని ఆ కథ ప్రాముఖ్యం అర్థం కాదు.

ఆ సంగతి అలా ఉంచి, ఇప్పుడు మన మహాభారతానికి వద్దాం. ఒక విధంగా ఈ కావ్యం తెలుగునాట సదాశరత్తు. ఒక శారదరాత్రి, శరద్భయంతో నేలమీదకు దిగివచ్చిన

మహాభారతపర్వప్రావృట్పయోదాలు నీరవనీరదాలుగా, అరణ్యవాసము అజ్ఞాతవాసమూ చేస్తున్నాయి సుమారు వేయి సంవత్సరాలుగా. ఇది ఒక్క తెలుగునాట మాత్రమే సాధ్యం. కవిత్రయభారతాన్ని సాధారణ పాఠకుడికి చేరవేసే ప్రయత్నం జరగవలసినంత జరగలేదు. ఇదే భారతాన్ని మరో భాషలో యీ కవిత్రయం రాసి ఉంటే, యిప్పటికి వందల ప్రతులు, వ్యాఖ్యలు, విమర్శ వచ్చి ఉండేది. వారి పేరు, తెలియని ఊరు ఉండేదికాదు.

కవిత్రయరచనను మెచ్చుకోని వాడుండడు. సాంతం చదివినవాడూ...? 'శ్రీవాణీ' దగ్గర మొదలుపెట్టి 'శిక్షితచిత్తులార శుభసిద్ధులు పొందుననేక జన్మపాప క్షపణంబునన్ వెలుగు భారతసంహితకెల్ల వాసుదేవు ప్రకటార్థముగా గొని విన్న మానవుండు... శశ్వదుల్లాసముఖానుభూతినచలస్థితినొప్పునతండుదాత్తుడై' వరకు (భారతంలో చివరి రెండు పద్యాలు) ఎంతమంది చదివారు? చాలామంది చదివి ఉండరు. దీనికి కారణం లేకపోలేదు. ది డివైన్ కామెడీ భారతంలో శతాంశం ఉంటుంది. భారతంలో లేని శాస్త్రం లేదు. వ్యాసుడన్నాడు కదా: యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ (ఇందులో ఏది ఉందో అదే ఎక్కడైనా ఉంది. ఇందులో లేనిది మరెక్కడా లేదు) అని. అంతకాకున్నా, తెలుగులోని కవిత్రయభారతం కూడా డివైన్ కామెడీతో పోలిస్తే ఒక్క పరిమాణంలోనే కాదు చాలా విషయాలలో చాలా పెద్దది. కనుక సాంతం చదవడం సులభం కాదు అని ఒప్పుకోడంలో కష్టం లేదు.

ఇక, డివైన్ కామెడీ విషయంలో లాగా, భారతం ఎలా చదవాలి అన్న చర్చ జరగలేదు . ఆ చర్చ అవసరమా అనిపించవచ్చు. చేయడంవల్ల ప్రయోజనం ఉండవచ్చు. అయినా యిదే క్రమంలో చదవాలి అనడంలేదు. కాని ఒక సూచన. శాంతి పర్వంతో మొదలుపెట్టి, ఆనుశాసనిక, స్త్రీపర్వాలు ముగించి, ఆదిపర్వానికి రావడంలో కొంత ప్రయోజనం ఉంది. తిరిగి, చివరి పర్వాలతో ముగించవచ్చు. గత అధ్యాయంలో అదే చేశాం, స్త్రీపర్వంతో మొదలుపెట్టి శ్రీవాణీకి వెనక్కు నడిచాం. ఎందుకు?

భారతం కథకోసం చదవం. స్థూలంగా తెలిసిందే కనుక. దాని రచనలో సమగ్రవ్యూహం ఏమిటో తెలుసుకోడానికి చదువుతాం. వ్యాసమహర్షి ఏ సమగ్రదర్శనంతో రాశాడో, కవిత్రయం కూడా అదే దర్శించి ప్రదర్శించారా? ఆనాటి సామాజిక ప్రయోజనం కవిత్రయ యుగానికి అన్వయిస్తుందా? వీరేమైనా కాలానుగుణమైన మారినదృష్టితో రాశారా? గుణత్రయం మారదు, దాని ప్రకటన మారుతుంది. ఏ కాలంలోనైనా, మనం గ్రహించవలసింది మూలతత్త్వమే. నన్నయ అన్నట్టు భారతం ఒక డిపార్టుమెంటల్ స్టోర్. ఏది కావలసినవారికి అది దొరుకుతుంది. కాని యివన్నీ దేనిలో అంశలో ఆ అంశిని పట్టుకోవలె పాఠకుడు.

పురుషార్థసాధనం జీవితం. ఆ పురుషార్థాలు ఎలా సాధించాలి? పురుషార్థం వైయక్తికమా సామాజికమా అనేది తెగని చర్చ. ఈ చర్చకు అంతిమ నిర్ణయం ఆ రెండూ వేరు కావని, విశ్వమంతా ఒకే ప్రాణి అన్న వైశ్వానరతత్త్వదర్శనంలోనే సాధ్యం. అది కలిగే వరకు సంపూర్ణసమన్వయం సాధ్యంకాదు. అది కలిగేవరకు ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి, వ్యక్తిలో సమాజంలో ఘర్షణ ఉంటూనే ఉంటుంది. ఘర్షణ అంటే, రజస్తమస్సులతో సత్త్వం పెనగులాట. సత్త్వం సమస్య అయే స్థితివరకు చాలా కొద్దిమంది మాత్రమే ఎదుగుతారు.

ఏ కావ్యమైనా రజస్తమస్సులతో సత్త్వసంఘర్షణచిత్రణే. అదే ధర్మయుద్ధం. ధర్మం ప్రత్యేక పురుషార్థం కాదు. కామార్థాల ప్రకటనే ధర్మస్వరూపం. (ప్రస్తుతానికి మోక్షవిషయం పక్కన ఉంచుదాం.)

రామాయణం రంకు, భారతం బొంకు అని ఒక నానుడి. భారతం విషయం నిర్వివాదం, అది ధర్మరాజు బొంకు కనుక. కాని రామాయణం విషయంలో ఆ నానుడి యీనాడు ఏమాత్రము నిర్వివాదం కాదు. ఆనాడు కానీ యీనాడు కానీ అన్ని అనర్థాలకు మూలం కామం. అది లేంది సృష్టిలేదు. కనుక, దాన్ని అదుపులో ఉంచుకోవడమే పురుషార్థసాధన. ఏ కావ్యవిషయమైనా ఆ విషయమే, ప్రాచ్యంగాని పాశ్చాత్యంగాని.

భారతంలో ప్రధానంగా కథనునిండి కనిపించేవి రెండు. మొదటిది కామం. రామాయణంలోది మూలస్వరూపం, ఆదిమకామం, అత్యంతసహజం. డాంటే డివైన్ కామెడీలో యీ కామం అతి సహజం, అత్యంతమానవీయం, అధికక్షమార్హం. ఇంచుమించు నరకద్వారంలోనే (రెండవ వలయం), అంటే ప్రాథమికస్థాయిలో, ఉంచబడింది ఆ కావ్యంలో. అన్ని పాపాలకంటే కామం డాంటే దృష్టిలో దయనీయం. కామికులకు (ఫ్రాన్చెస్కా, పావ్లో) విధించబడిన శిక్షకు డాంటే కదిలిపోయి కూలిపోతాడు (I felt myself diminish, as if I were dying/ And fell down, as a dead body falls. –Canto 5:ll. 141-142.)

తనుకూడ ప్రేమలో పడినవాడే. తన గతి ఏమిటి అన్న ఆలోచన కలిగి ఉంటుంది వ్యక్తిగా డాంటేకు. (ఈ కావ్యంలో డాంటే రచయిత, పాత్ర కూడా.) నరకసందర్శనంలో డాంటే ముందుకు వెళ్ళేకొద్దీ, యితరపాపాలు చేసినవారిని కలుస్తూ వెళ్ళేకొద్దీ శిక్ష అనుభవిస్తున్నవారిపై ఈ సానుభూతి సన్నగిల్లి, ఆగ్రహం పెరుగుతూపోతుంది. అర్జెంటీ, ఫారినాటా, పోప్ నికొలస్, బొక్కా, ఆల్బెరిగోల పాపపు కథలు వింటున్నప్పుడు ఆగ్రహం క్రమంగా పెరుగుతూ తీవ్రస్థాయికి వచ్చినపుడు, అతడి ఆచార్యుడు వర్జిల్ పట్టరాని ఆనందంతో శిష్యుణ్ణి ఆలింగనం చేసుకుంటాడు (my master… kissed my face and said: Indignant soul/ blessed is she who bore you in her womb! –Inf. VIII, 34-42: tr. Sisson: Oxford World's Classics.) అంటే, కామం ఉపేక్షించదగిందే అని డాంటే అర్థం కాదు. అది అత్యంతబలమైనది, కనుక మనిషి అత్యంతబలహీనుడు. ఆ బలహీనతపట్ల సానుభూతి మానవీయలక్షణం. దాన్ని జయిస్తే యిక జయించవలసింది లేదు. ఈనాడు స్త్రీలపై అత్యాచారాలను అరిచి వీధుల్లో ఖండించేవారు ఎక్కువమంది వీధిలో రామయ్యలని మనకు తెలుసు.

కాని మహాభారతంలో కామం యిలా మూలరూపంలో లేదు. అది యిక్కడ కామరూపి, బహురూపి. ఇక్కడ దాని ప్రధానరూపం అహంభావం, దానివలన కలిగే పగ, దాని ప్రతీకారం. భారతంలో కథలన్నీ యీ పగతో కలిగినవే. విచిత్రమేమంటే యీ పగ పనికిరాదని చెప్పడానికి, నిలువెల్లా విషమైన పాము ప్రధానసాధనమయింది. పాము పట్లకూడా పగ పాపమే అని, విషసర్పాన్ని ప్రధానంగా గ్రహించడంలో ఒక ప్రత్యేకస్ఫూర్తి. భారతయుద్ధం ముగిసిన తరువాత కూడా, వారి సంతతిగాని, జనసామాన్యంగాని పగ వదలలేకపోవడం విచిత్రం అనిపించడం లేదు ఎవరికీ. పగ ఆరని సెగ.

ఈ పాపసంతానకథలు మహాభారతమంతా పెనవేసుకున్నాయి, సర్పసంతానంలాగే. ఆది పర్వంలో, భారతకథాప్రారంభంలోనే ఉదంకుడి కథ, వినతాకద్రువల పగ పాఠకుడికి స్వాగతం చెబుతుంది. అక్కడ బుసలుకొట్టే పద్యాలు చాలానే ఉన్నాయి. మనం శాంతి, అనుశాసనికపర్వాల దగ్గర మొదలుపెడుదామనుకున్నాం కదా! (అన్నట్టు యిదే ఆనుశాసనికపర్వంలో కూడా ఉంది మరొక సౌపర్ణాఖ్యానం. దానిని తరువాత చూద్దాం.) భారతంలోని చివరి పద్యం (ఫలశ్రుతి) హృదయస్థం చేసుకొని, ఆ తరువాత మహాభారతం చదవడం మొదలుపెట్టాలి. ఆ పద్యం ప్రసిద్ధమే.

శిక్షితచిత్తులార శుభసిద్ధులు పొందు ననేకజన్మపా
పక్షపణంబునన్ వెలుగు భారతసంహితకెల్ల పుండరీ
కాక్షుని వాసుదేవు ప్రకటార్థముగా గని విన్న మానవుం
డక్షయపుణ్యలోకములయందు రమించు నిరామయస్థితిన్.

పుణ్యలోకాలమాట ఎటున్నా ముందు యీ లోకం బాగుపడుతుంది, దానివల్ల మన పగలూ ప్రతీకారాలూ తగ్గితే. ఆ కథ, దానిలో తిక్కన కవిత్వపు లోతు చూద్దాం. ఈ పర్వాలన్నీ భీష్ముడు ధర్మరాజుకు చేసిన బోధ. ఈ కథ కూడా గౌతమి అనే బ్రాహ్మణస్త్రీ చెప్పే పాఠం. ఆ కథను భీష్ముడు ధర్మరాజుకు చెబుతున్నాడు. గౌతమి కుమారుడు పాము కరిచి చనిపోయాడు. ఆ తల్లి దుస్థితి చూసిన ఒక బోయ ఆ పామును పట్టితెచ్చి ఆమెకు చూపిస్తూ, అడుగుతాడు:

వగచుచుజూడ నయ్యురగవల్లభు రజ్జునగట్టి తెచ్చి య
మ్మగువకు జూపి దీని తల మ్రందగ మోదెద, కోల నొండె రెం
డుగ నెఱగత్తి వ్రేసెద, కడుం చెడుగీ పొడపాపపుర్వు నే
మి గతి వధింతు నంచు నొకమేటి కిరాతుడు రోషదీప్తుడై

ఉన్నగని యప్పుడతి యోయన్న విడువు భుజగనాథు ననవుడు నతడీ పిన్నాతని ప్రాణంబులు కొన్నది యిది, దీని యుసురు గొనియెద ననియెన్. అనిన నక్కోమలి యక్కిరాతుంజూచి విధివశమున వచ్చిన కీడధములు కొనియాడి వ్రేగులై విపులజలాంబుధి మునుగుదురు మునుంగరు సధర్ములగు నుత్తములు ప్రశాంతి జులుకనై. ఈ పాముజంప బ్రదుకునె నాపుత్రుడు విడువుమర్జునక... (అనుశాసనికపర్వం: 1: 6-10)

తన కొడుకు ప్రాణం తీసిన పాముపట్ల కూడా పగ సహించలేని తల్లిని చూస్తున్నాం యీ కథలో. ఆ తరువాత కథలో, బోయ ఎందుకు యీ పసివాడి ప్రాణాలు తీశావు అని పామును అడుగుతాడు. నేరం నాది కాదు, మృత్యువుది అంటుంది. మృత్యువునడిగితే, నేరం నాది కాదు కాలానిది అంటుంది, ఏడు చేపల కథలో లాగా. ఇంతకూ యీ కథ పగను గురించి, దాన్ని నిగ్రహించడం గురించి. (ఈ కథలోని తల్లి బ్రాహ్మణి అని చెప్పడం సామాజికదురన్యాయమనో దురహంకారమనో కొందరు అనవచ్చు. పగ పనికిరాదన్నదే యీ కథలోని బోధ. ద్రౌపది బ్రాహ్మణి కాదు. ఆమె బిడ్డలు

ఒకడు కాదు అయిదుగురు రాక్షసంగా నిద్రలో హత్యచేయబడ్డారు. హత్యలు చేసినవాడు ఒక బ్రాహ్మణుడు. ద్రౌపది కూడా ‘విడువుము’ అనే అన్నది, గౌతమి లాగ.)

ఇంతకూ, యీ కథ యిలా వదిలెయ్యడానికి తిక్కననే చదవక్కర్లేదు. ఆ మాటకొస్తే, ఏ కావ్యమైనా అందులోని రచనాశిల్పం కొరకు కదా చదవవలె? కవి పటుత్వమంటే శబ్దంపై అతని అధికారం. అది యిక్కడ ఎలా తెలుస్తుందో చూద్దాం. ‘విపులజలాంబుధి మునుగుదురు మునుంగరు సధర్ములగు నుత్తములు ప్రశాంతి జులుకనై.’ (‘విపులభవాంబుధి’ అని పాఠాంతరము.) మునుగుదురు అనడంలో, ఒక చెంబునో బిందెనో నీటిలో ముంచినపుడు నీరు క్రమంగా లోపలికి పోవడం స్ఫురిస్తుంది. మునుంగరు అన్నపుడు బిందెను తలకిందులుగ ముంచినపుడు కలిగే బుడుంగు శబ్దాన్ని స్ఫురింపచేస్తుంది. మునగదు, పైకి తన్నుకొస్తుంది. కాని యీ పద్యంలోని అసలైన అక్షరశిల్పం పద్యంలోని చివరి స్వరాక్షరం, చులుకనై- లోని చివర ఐత్వం. ఇక్కడ ఐత్వం మునుగకుండా పైకి లేస్తున్న ప్రయత్నాన్ని స్ఫురింపజేస్తుంది. అచ్చులు అర్థానికి అనురూపం వహించడం తిక్కన రచనావైశిష్ట్యం. అచ్చులను ప్రాణములు అని కూడా యిందుకేనేమో అంటారు! తిక్కన రచనలో యివి నిజంగా ప్రాణాలే. భీష్మపర్వంలోని ‘అంహోమర్దనుడా జనార్దనుడు ...సింహోల్లాసవిభాసియై...’ లోని ఓత్వం ‘కుప్పించి ఎగసిన’ అనకుండా ఆ అర్థాన్ని శబ్దంలో స్ఫురింపజేస్తుంది. తిక్కన శబ్దాన్ని శాసించడు. ఆ అవసరం లేదు. శబ్దం అతడికి అనుకూలవతి.

ఇటువంటి శబ్దసామరస్యం ఒక పరభాషలో కావ్యం చదివేటప్పుడు (డివైన్ కామెడీ అనుకోండి) తెలియదు. ఆ భాష నేర్చుకొని చదివినా కలగకపోవచ్చు. తిక్కనను ఇంగ్లీష్ లోనో, ఇటాలియన్ లోనో అనువాదం చేసినా తెలుగుమూలంలో కలిగే యీ రసస్ఫూర్తి కలగదు. కేవలం మాతృభాషలో మాత్రమే ఆస్వాదించగల స్వారస్యం అది.

ఇక, “చులుకనై” లో అర్థప్రాధాన్యం కూడా చూద్దాం. క్షమాగుణం కలిగినవాడిని లోకం చులుకన చేయడం సామాన్యమే. ఆ తృణీకారాన్ని సహించడానికి ఎంత ధృతి అవసరమో దాస్తావ్‌స్కీ నవలలోని ఫాదర్ జోసిమా పూర్వాశ్రమ కథలో తెలుస్తుంది. పూర్వాశ్రమంలో జోసిమా ఒక మిలిటరీ అధికారి. తన ప్రేమ విఫలమైనపుడు అతడు నిస్పృహతో కోపంతో నిండిపోతాడు. ఆ కోపంలో తన సేవకుణ్ణి ముఖం పగలగొడతాడు అకారణంగా. కాని తన పనికి తనపై తనకే అసహ్యమేస్తుంది. ఆ రాత్రి నిదురపోలేకపోతాడు. తెల్లవారగానే ఆ సేవకుడి పాదాలపై పడి క్షమించమని అడుగుతాడు. మిలిటరీ ఆఫీసర్లు ఒక సేవకుణ్ణి అలా కొట్టడం సాధారణమే. జోసిమా కొట్టినపుడు, ఆ పనివాడు కనీసం చేయికూడా అడ్డుపెట్టుకోడు. అధికారి తన పాదాలపై పడిపోయినపుడు ఆ అధికారికి మతిచెడిందేమోనన్న అనుమానం కలిగి ఉంటుంది ఆ సేవకుడికి. ఈ క్షమాభిక్ష విషయం తెలిస్తే మిలిటరీ సేవకే అవమానం. అయినా జోసిమా చేశాడు, వివేకం కలిగి. పగ పనికిరాదని, అది వివేకాన్ని హరిస్తుందని.

గౌతమీలుబ్ధకసర్పమృత్యుకాలసంవాదమనే యీ ఉపాఖ్యానం చదివిన తరువాత ఆదిపర్వంలోని ఉదంకుడి ఉగ్రవాదం మరింత స్పష్టంగా తెలుస్తుంది.

కాదనకిట్టిపాటి యపకారము తక్షకుడేకవిప్రసం
బోధనజేసి చేసె నృపపుంగవ నీవుననేక భూసురా
పాదితసర్పయాగమున భస్మము సేయుము తక్షకాదికా
కోదరసంహతిన్ హుతవహోగ్ర సమగ్రశిఖాచయంబులన్

‘ఉగ్ర’శబ్దం చాలదు, ‘సమగ్ర’ కావలె (మహోగ్ర అనే పాఠాంతరం కూడా ఉందేమో?); ‘తతి’ (కాకోదర ‘సంతతి’) పనికిరాదు, ‘హతి’ (సం‘హతి’) అవసరం. పగను రెచ్చగొట్టేవాడు, పగవాడికంటే ప్రమాదకారి. భారతకథను ఆద్యంతము నడిపింది యీ పగే. ఉదంకుడి ఉగ్రస్వభావం తెలియాలంటే, అతడి నాగకులస్తుతి పద్యాలలో కాదు (బహువనపాదపాబ్ధి-తో మొదలయ్యే నాలుగు పద్యాలు కావు). ఆ తరువాత అతడు సృష్టించిన బీభత్సంలో చూడవలె:

పాతాళైకనికేతనాంతరమునన్ పర్వెం తదశ్వాఖిల
స్రోతోమార్గవినిర్గతోగ్రదహనార్చుల్ పన్నగవ్రాతముల్
భీతిల్లెన్ భుజగాధినాథుమనమున్ భేదిల్లె కల్పాంతసం
జాతప్రోద్ధతబాడబానలశిఖాశంకాధికాతంకమై. (నన్నయ: ఆది: 1.112)

గురుదక్షిణ కోరకే కావచ్చు, యింత ఉగ్రత, కల్పాంతబీభత్సం అవసరమా? పగ అతడి స్వభావం. మహాభారతాన్ని నడిపించింది యీ పగ. గౌతమి కథను భీష్ముడు చెప్పడం యీ మాటలతో మొదలుపెడతాడు: ‘అనవుడు భీష్ముడిట్టులనునాతనితో నకటా వధింపగా మనుజుడు కర్తగాడు.’ ఇంతకుముందు శాంతిపర్వంలో వ్యాసుడిటువంటిమాటే అంటాడు ధర్మరాజుతో: ‘మనుజులు సేయనెవ్వరు సమస్తమునీశ్వరునాజ్ఞ సెల్లెడున్ వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నరుకంగ పాపమొందునొకొ కుఠారమున్ జనులు దోసము బొందరు…’ (ఇందులో ఒక చమత్కారం, ‘కుఠారమున్’ దగ్గర ఆపి చదవవలె. ఆపకుండా, కుఠారమున్ జనులు దోసము బొందరు… అనికూడా చదవచ్చు. కుఠారమెంతో కుఠారపాణి అంతే నిమిత్తమాత్రుడు.)

కర్త యీశ్వరుడని తెలిసినపుడు, కుఠారం పట్ల పగ ఎంత అవివేకమో, కుఠారపాణి యందు పగ అంతే అవివేకం.

***

## 1.3. మూడవఋషి ఎర్రన

అతిగాంభీర్యవిభూతి నేకముళికాహంకారనిశ్శేషశో
షితపాథోధిపయస్కుడైన ముని తోచెం పుణ్యతేజోమయా
కృతి నయ్యామ్యదిగంతవీథి ప్రకటక్రీడాగర్వగ
ర్జితమండూకకళంకితాంబుశుచితా సిద్ధిప్రదాచార్యుడై. (ఆరణ్య. 4.146.)

ఇది ఆరణ్యపర్వంలో ఎర్రన రాసిన నాలుగో పద్యం. మొదటి రెండు తెలిసినవే ( స్ఫురదరుణాంశు; దానాంభఃపటలంబునన్ . చంపకమాల, శార్దూలాల తరువాత, మూడవ పద్యం కందం. ప్రస్తుతం మనం ఎన్నుకున్న "అతిగాంభీర్య " మత్తేభం.) కథనంలో మనం కొంత వెనక్కు నడుద్దాం.

***

ఆంధ్రమహాభారతంలో తక్కిన పర్వాలకున్న పేరు ఆరణ్యపర్వానికి లేదు. దానికి కారణం ఒకటి, దానిలో ప్రధానకథ ముందుకు నడవదు, నడిచినట్టు కనిపించదు. రెండవకారణం అది ఎర్రన రచన కావడం. ఎర్రన మూడవ తరగతి కవి అని, కాకపోతే నన్నయ తిక్కనల తోవలు ఎరిగినవాడని ఒక సాధారణ అభిప్రాయం. కాని, ఆంధ్రమహాభారతం త్రయార్షేయం అనుకోవడంలో అనౌచిత్యమేమీ లేదు . ఋషివంటి నన్నయ ప్రసిద్ధమే. తిక్కనపేరులోనే సోమయాజి కలిసిపోయాడు. ఎర్రన ఋషి కాకపోతే, అనుకోకుండా ఆరణ్యపర్వరచన ఆయనవరకు ఎందుకు ఆగింది? ఇక పర్వప్రాధాన్యం. అరణ్యమంటేనే ఋషులకు ఋష్యాశ్రమాలకు ఆశ్రయం. ఇక మహాభారతంలో, ఆరణ్యపర్వమంతా మహర్షుల సందడి. రామాయణంలో అరణ్యకాండ అంతా ఋష్యాశ్రమాలు వెతుక్కుంటూ వెళ్ళాడు రాముడు. ఇక్కడ భారతంలో ఋషులు ధర్మరాజును కలవడానికి వచ్చారు. ఎంతమంది మహర్షులు! భార్యాసమేతుడై శ్రీకృష్ణభగవానుడినుండి మార్కండేయాదులు ఎంతమంది వచ్చారు! ఈ విషయమేనేమో నన్నయ తన చివరి పద్యానికి ("శారదరాత్రులు") ముందు ప్రస్తావించాడు, "మహర్షిమండలోపాసిత రాజహంస" ( ఆరణ్య: 4.141.) అని?ఎవరు రాజహంస? రాజ్యభ్రష్టుడై, అడవిలో ఒక బండ తన సింహాసనంగా "వనవాసము సేసియు త్రిభువనరాజ్యము సేయునట్టి వడువున సంతోషనిబద్ధబుద్ధి" తో ఉన్న ధర్మరాజా ? ( ఇవి అడవిలో ధర్మరాజును చూచివచ్చిన సంజయుడు ధృతరాష్ట్రుడితో అన్నమాటలు.) ఎర్రన యీ మహర్షిమండల

ప్రస్తావననే అందుకున్నాడు తన నాలుగో పద్యంలో, “అతిగాంభీర్యవిభూతి…” అన్న పద్యంలో అగస్త్యమహర్షిని పేరు చెప్పకుండా ఆహ్వానించాడు ఆరణ్యపర్వంలోకి.

మహర్షిప్రస్తావనకు ముందు నన్నయ ఆపిన అడవివానను ఎర్రన ఎలా అందుకొన్నాడో చూద్దాం. వర్షమంటే ఆదికవినుండి అందరికీ ఆనందమే, తడిసి పోతారు కవులు వానలో చిన్నపిల్లల్లా . ఎర్రన, వానలో అందుకున్న ఆరణ్యపర్వసందర్భాన్ని తలచుకోవలె కదా మనం ! ఈ వాన ఎందుకొచ్చింది, దీని సందర్భమేమిటి చూడవలె. నన్నయ కవిత, కథగా నహుషోపాఖ్యానంతో ముగిసింది. ఆ ఉపాఖ్యానంలో భీముడు చచ్చి బతికాడు.( ఆరణ్యపర్వం ముగింపులో యక్షప్రశ్నల సందర్భంలో ధర్మరాజ నలుగురు సోదరులు చచ్చి బతికారు.పాండవులు భారతకథలో ఎన్ని సార్లు చచ్చిబతికారో! అయినా ఒక్కరూ అయ్యో అనరు. కౌరవులకన్యాయం జరిగిందని మాత్రం ఆక్రోశిస్తారు.)

నహుషోపాఖ్యానంలో విముక్తుడు భీముడు మాత్రమే కాదు, నహుషుడు కూడా. ఇద్దరి విమోచనం కూడా ఏకకాలంలో జరిగింది ). “అతిగాంభీర్యవిభూతి…” అన్న పద్యం అర్థంచేసుకోవలెనంటే కథనంలోని వెనుకముందులు గమనించాలి. భారతమంత పెద్ద కావ్యంలో సాధారణంగా యిలా వెనుకముందులు కలుపుకుంటూ వెళ్ళడం అవసరం . ఏ పద్యానికి ఆ పద్యం సమగ్రం కాదు. భీష్మపర్వంలోని “అంహోమర్దనుడు” పద్యాన్ని కర్ణపర్వంలోని “అట్టిద లోకపర్యవసమా దురవస్థకు స్రుక్కనేర్తునే, కిట్టెద కర్ణశల్యులను కీటములం కరతాడనంబులన్” అన్న పద్యంతో కలుపుకుని చదివినపుడుగాని దాని పూర్తి అర్థం ఆవిష్కృతం కాదు. అట్లాగే యిక్కడ “ అతిగాంభీర్యవిభూతి…” అన్న పద్యం పూర్తి ప్రయోజనం అర్థం కాదు. మనం నహుషోపాఖ్యానానికి వెనక్కు నడవవలె. ఈ నహుషుడి శాపాన్ని గుర్తుచేస్తున్న అజగరోపాఖ్యానప్రాముఖ్యాన్ని యీ సందర్భంలో మనసులో ఉంచుకొని, నన్నయ ప్రారంభించిన అడవిని కాచిన, (కాపాడిన,) వెన్నెలను , ఎర్రన అందుకున్న ఆరణ్యపర్వగాంభీర్యాన్ని, అడవికి అందం తెచ్చిన వర్షాన్ని ఆనందించవలె. ఆ ఆనందస్వరూపం ఎటువంటిది? అది అందంలో ఆనందం కాదు. ఋషులు కేవలఋతువర్ణన చేయరు. కథలోని గతాగతాలను ధ్వనింపజేస్తారు.అందులోని “అతిగాంభీర్యవిభూతి”ని పట్టి యిస్తారు . నహుషుడు సాధారణవ్యక్తి కాడు. బ్రహ్మరథం పట్టించుకున్నవాడు, ( బ్రహ్మర్షులచేత రథం పట్టించుకున్నవాడు). రాజ్యమదంతో శప్తుడై, దేవేంద్రపదవినుండి భ్రష్టుడైనవాడు. శాపమిచ్చినవాడు అగస్త్యమహర్షి. ఆ అగస్త్యమహర్షి ప్రస్తావన, పేరు చెప్పకుండా చేశాడు నన్నయ, పేరుచెప్పకుండానే అందుకున్నాడు ఎర్రన, “అతిగాంభీర్యవిభూతి నేకచుళుకాహంకారనిశ్శేషశోషితపాథోధిపయస్కు డైన ముని” అంటూ. (ఆరణ్య. 4.145. ధర్మజుడు అజగరంనుండి భీముని విడిపించి అతనితో “నిజాశ్రమంబునకు వచ్చియున్నంత, ” అని వెంటనే మండిపోతున్న ఎండలవర్ణన చేశాడు నన్నయ:

ఖరకిరణతాపమున నురుతరదవదాహమునశోషితములైన వనాం
తరతరుతతి కాప్యాయనకరమై వర్షాగమంబు కడు బెడగయ్యెన్.ఆరణ్య. 4.133

నేల ఎలా మలమల మాడిపోయిందో నన్నయ చెబుతున్నాడు. అలా నోరెండిన నేలకు నీరు,("ఆప్యాయనకరమై వర్షాగమంబు") ! ఎటువంటి కష్టంలో నుండి బయటపడ్డారు ధర్మరాజు, భీముడు ! భీముణ్ణి విడిపించుకునే వరకు, మండే ఎండలో మాడినట్టున్నది . ఆ తాపం వదిలి "ఆప్యాయనకరమై వర్షాగమంబు". ఇది ఒక్క భీముడి శాపం మాత్రమే కాదు, సమస్తప్రకృతి ("వనాంతరతరుతతి") పడుతున్న తాపం కూడా ! అంతేనా, దుర్యోధనదుష్టపాలనలో "శోషితములైన" ప్రజను కూడా ధ్వనింపజేస్తున్నాడు . ఆ దుష్టపాలన కలకాలం సాగదు, దేవేంద్ర పదవిని అధిష్ఠించిన నహుషుడు అధికారమదంతో అగస్త్యశాపంవలన ఏ గతి పొందాడు! ఇదంతా యీ పద్యంలో స్ఫురణకు వస్తుంది.

నన్నయ వర్షాగమవర్ణనలోని తక్కిన పద్యాలుకూడా చూద్దాం:

నాలుగు వలకుల నవఘనజాలంబులు వ్రాలి కురిసె ఝుంఝూనిలవే
గాలోలములై బహులస్థూలపయోధారలోలి తుములంబులుగాన్. 134

దట్టమైన మబ్బులు వ్రాలి కురిశాయి. తీవ్రమైన గాలులు, " ఝుంఝూనిలవే గాలోలములై బహులస్థూలపయోధారలు " ఏమి దృశ్యం! ఏమి శ్రవణసుఖసమాసం!

ఘనతరధర్మనైశతమంబొకొ యనగ ఘనాఘనతమిస్రమవికలమై క
ప్పిన జనులకు వస్తువిభావన మొక్కొకయెడల కలిగె వైద్యుతరుచులన్.135

కన్నుపొడుచుకున్నా కనిపించని చీకటి. ఆకాశాన్ని కప్పిన మబ్బులు, వెలుగును అడ్డుకుంటాయి. "ఘనతరధర్మనైశతమంబొకొ యనగ". ఆ తమస్సులో మనిషికి ధర్మాధర్మవిషయవివేకం ఉండదు. ("ఘనతరధర్మనైశతమంబొకొ " లోని "ధర్మ" శబ్దానికి ధర్మాధర్మాలలోని అర్థం కాదు, నిజమే .అది "సర్వధర్మాన్ పరిత్యజ్య" లోని "ధర్మ"శబ్దం. (గుణం అని అర్థం, "క్లోరిన్ ధర్మములను వివరించుము" అన్నట్టు . వస్తువుల ధర్మాలను వదిలితే ("పరిత్యజ్య") మిగిలేది నిర్గుణమైన పరవస్తువే. అది పట్టుకో అంటాడు గీతలో భగవానుడు.). కాని, నన్నయ పద్యంలో, గుణమనే అర్థమొకటే కాక, ధర్మాధర్మాలలోని ధర్మధ్వని కూడా ఉన్నది.) ఆ "ఘనతరధర్మనైశతమం"లో వస్తువివేకం ఎలా కలుగుతుంది? అప్పుడప్పుడు మెరిసే మెరుపులో! ఎంత సహజోక్తి !

అరుదుగ తత్పయోదసమయంబున నొక్కట విస్తరిల్లు
బరముననంబుదధ్వనియు పల్వలభూముల భూరిదర్దురో
త్కరరవముల్ మహీరుహ శిఖండములందు శిఖండితాండవాం
తరమదమంజలస్వన ముదారతరంబగుచున్ వనంబునన్.136

ఇంతటి వర్షంలో నన్నయ కప్పల బెకబెకను కూడా వర్ణించాడు, "భూరిదర్దురో త్కరరవముల్." ఎర్రన యీ కప్పలనుకూడా మరచిపోలేదు. ఇక్కడ ఆ కప్పలవలన కేవలం శబ్దకాలుష్యం. ఎర్రన కప్పలు మరో కాలుష్యకారణాలు. వర్షాలు ఆగిపోయాయి.

భూసతికిన్ దివంబునకు బొల్పెసగంగ శరత్సమాగమం
బా సకల ప్రమోదకరమై విలసిల్లె మహర్షి మండలో
పాసిత రాజహంసగతి భాసి(తి) ప్రసన్న సరస్వతీక మ
బ్జాసన శోభితం బగుచు నబ్జజయానముతో సమానమై. 4.141.

( దీని తరువాతి పద్యం “శారదరాత్రులు”.)

“భూసతికిన్ దివంబునకు” అన్న పద్యంలో నన్నయ ఏం చేస్తున్నాడు? పృథివీతత్త్వంతో దివ్యత్వానికి శోభాకరమైన సంయోగం కల్పిస్తున్నాడు. ( “నేలయు నింగియు తాళముల్ గా జేసి యేపున రేగి వాయించియాడ”: విరాట.2.134; “నింగీ నేలా ఒకటాయెలే” అని దాశరథి ఒక సినిమా పాట. “నింగీనేలా తాళాలోయ్” అని వేటూరి మరో సినిమా పాట. ) ఎర్రన ఆరణ్యపర్వంలోని యీ ప్రధానవస్తువును అతిమెలకువగా నిర్వహించాడు. “భూసతి” అని దంపతుల్లో స్త్రీని చెప్పాడు, దానికి రూపం ఉంది కనుక . “దివంబు” అరూపదివ్యచైతన్యశక్తి , కనుక సతినే కాని పతిని  చెప్పలేదు. నింగికీ నేలకు సమాగమం అంటే, నేలను, లోకాన్ని,  దివ్యత్వంతో రీఛార్జి చేయడమే.( divinise the earth). ఆ పని మీదనే పరమాత్మ అప్పుడప్పుడూ అవతరిస్తానని చెప్పుకున్నాడు. అరవిందయోగి భాషలో Descent of the Divine.

ఇప్పుడు అగస్త్య ప్రశస్తి:

అతిగాంభీర్యవిభూతి నేకచుళికాహంకారనిశ్శేషశో
షితపాథోధిపయస్కుడైన ముని తోచెం పుణ్యతేజోమయా
కృతి నయ్యామ్యదిగంతవీథి ప్రకటక్రీడాగర్వగ
ర్జితమండూకకళంకితాంబుశుచితా సిద్ధిప్రదాచార్యుడై. (ఆరణ్య. 4.146.)

ఇక్కడ కప్పలు ( “మండూక”; నన్నయ “దర్దుర”మన్నాడు, “భూరిదర్దురోత్కరరవముల్”). ఎర్రన కప్పలు  వట్టి బెకబెకలు, స్వోత్కర్ష ,శబ్దకాలుష్యము  కాదు చేస్తున్నది . అవి జలకాలుష్యం కూడా చేస్తున్నాయి . “ప్రకటక్రీడాగర్వగర్జిత మండూకకళంకితాంబు”. ఆ కాలుష్యాన్ని తొలగించి “శుచితాసిద్ధిప్రదాచార్యులు” ఎప్పుడెపుడు అవసరమో అప్పుడపుడు అవతరిస్తారు. ఎప్పుడూ శంఖచక్రాలు ధరించి విష్ణువే అవతరించడు. మహర్షులు ఆ పని చేస్తూనే ఉంటారు. అవతరించి కాని, పైనుండి కాని, “తోచెం పుణ్యతేజోమయాకృతి నయ్యామ్యదిగంతవీథి”. దేహధారిగా దండకమండలాలతో  కాదు, అగస్త్యుడు “తోచెం పుణ్యతేజోమయాకృతి నయ్యామ్యదిగంతవీథి”. ఆ మహర్షిదివ్యతేజం పైనుండి  కిందనున్న వారి మనః క్లేశాన్ని తొలగించి, దారిచూపి నడిపిస్తుంది.

ఒక్క గుటకలో ( “ చుళుక ”పుక్కిలి,దోసిలి )  సముద్రజలాల గర్వమడచి,  చులకన చేయడం అంటే సామాన్యమా !  అటువంటి మహాత్ముడికి  కప్పలకాలుష్యాన్ని తొలగించి

“అంబుశుచితాసిద్ధిప్రదానం” చేయడం ఒక లెక్కా? కష్టాలలో కలుషితమైన మనసులకు ఊరట కలిగించి, పాండవులను ధర్మయుద్ధానికి సిద్ధం చేయడం యీ పర్వంలో మహర్షుల పని. ఆ మహర్షిమండలానికి మకుటం అగస్త్యుడు. అందుకే యీ ఆరణ్యపర్వం “మహర్షిమండలోపాసితం”. ధర్మరాజ “రాజహంస”. ఈ అంశాన్ని ఋషి అయిన ఎర్రన సమర్థంగా. నిర్వహించాడు.
ఆయన కవిత్వ "గాంభీర్యవిభూతి" ని ఋషిమార్గాన్ని దర్శించే ప్రయత్నం యిది.

నీలపయోదమండలము నిశ్చలలీల వెలుంగఁజేయుచుం
గ్రాలెడు వాలుఁ గ్రొమ్మెఱుఁగు కైవడిఁ దద్వనభూమి నెంతయున్
లాలితదేహకాంతిపటలంబునఁ జేసి వెలుంగఁజేయు న
బ్బాల వినీలకుంతలవిభాసినిఁ జూచి సవిస్మయాత్ముఁడై. 145

తే.మగువఁదగిలిన చూడ్కుల మగుడఁ దిగువ | నేర్పు సాలక యతఁడు కందర్పదర్ప
గోచరాత్ముఁ డై నిజసఖుఁ గోటికాస్యుఁ | డను నృపాత్మజుఁ జూచి యి ట్లనియెఁ బ్రీతి. 146

ఉ.‘ఇన్నలినాక్షి యెవ్వతియొ? యివ్విపినంబున నేకతంబ యి
ట్లున్న నిమిత్త మేమియొ? సురోత్తమకన్యయొ, యక్షకాంతయో,
పన్నగభామయో, మనుజభామిని గామి నిజంబ; యిట్టి చె
ల్వున్నదియే మహీతలము నుగ్మలు లెవ్వరియందు నారయన్. 147

ఉ.లీల యెలర్పఁగా నబల లేఁజిగురాకును బోలె నొప్పు కెం
గేలు కదంబశాఖతుదిఁ గీల్కొనఁ జేసి వసంతవిభ్రమో
న్మీలిత బాలవల్లిక్రియ మేలగుచూడ్కుల మించి పావక
జ్వాలయ పోలెఁ జిత్తము నిజం బెరియింపఁ దొడంగెఁ జూచితే. 148

ఉ.ఈ కమలాక్షి నాకు హృదయేశ్వరి యైనఁ ద్రిలోకరాజ్యముం
జేకుఱ నేలినట్లు విలసిల్లనె! దర్పకవీరు బంటుఁగాఁ
గైకొని సర్వభోగములుఁ గాంతు; నొడంబడఁ బల్కి దీనికిన్
నాకును బొందొనర్చి కరుణం జరితార్థునిఁ జేయవే ననున్.’

సైంధవుడు ద్రౌపదిని అపహరించిన సన్నివేశంలోని యీ పద్యాలు కీచకుడి అంధమోహాన్ని గుర్తుచేస్తున్నవి . ఇందులోని "నీలపయోదమండలము నిశ్చలలీల వెలుంగఁజేయుచుం గ్రాలెడు వాలుఁ గ్రొమ్మెఱుఁగు" స్పష్టంగా గుర్తించగలరు, నిత్యమూ పూజలో మంత్రపుష్పం చదివేవారు:

నీలతోయదమధ్యస్థాద్విద్యుల్లేఖేవ భాస్వరా |
నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా |

ఇందులోని "వనభూమి" "కదంబవనవాసిని" అని వర్ణించబడిన శ్రీలలిత (“లాలితదేహకాంతి".) ఇంకా స్పష్టత కొరకు "కదంబశాఖతుదిఁ గీల్కొనఁ జేసి వసంతవిభ్రమోన్మీలిత బాలవల్లిక్రియ మేలగుచూడ్కుల మించి పావకజ్వాలయ పోలెఁ ", అనికూడా అన్నాడు. ఇంత స్పష్టం చేశాడు ద్రౌపది నిజతత్త్వాన్ని ఋషి ఎఱ్ఱన.

***

ఇక నేను తరచు తలచుకొనే పద్యం. కొన్ని పద్యాలు గొప్పవని చెప్పక్కర్లేదు.అవే ప్రకటించుకుంటూ వస్తాయి, రవితేజములలరగ, "దానాంభఃపటలంబు" వంటివి. కాని కొన్ని పద్యాలు మునిలా మౌనగంభీరంగా ఉంటాయి. అటువంటిదొకటి :

ధీరుడు నిర్జితేంద్రియుడు తెల్లముగా తనుగాంచు భూతవి
స్తారనిరూఢమైన పరతత్త్వముగా తనయందు భూతవి
స్తారమునెల్ల గాంచు సతతస్ఫుటదర్శనుడై సమగ్రచి
త్త్వారముబొంది నిర్మలతపంబులయందు చలింపకెన్నడున్.
( ఆరణ్యపర్వం,5.89.ధర్మవ్యాధోపాఖ్యానం)

ఇందులోని అర్థం భగవద్గీత అంతటా చెప్పినదే,

“ సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని |
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః || (భగవద్గీత 6-29)

గీత తత్త్వం చెప్పింది.దాని అనుభావన చెబుతున్నది ఎఱ్ఱన పద్యం.ఈ పద్యంలో ప్రతిపదము ధ్యానవిషయము,ధ్యానసాధనం కూడా.ధర్మవ్యాధుడు అంతటా ఒకే ఆత్మను చూస్తున్నాడు, తత్త్వంగా కాదు, ప్రత్యక్షంగా. స్పష్టాస్పష్టంగా కాదు, "తెల్లముగా"; ఏదో మెరుపులా వచ్చిపోయే క్షణికానుభవం కాదు, “సతతస్ఫుటదర్శనుడై” ; యిక్కడ కలిగి అక్కడ తొలగే అనుభవం కాదు, ఎటుచూచినా ఎంతదూరం చూచినా, “సమగ్రచిత్త్వారముబొంది” . ఎలా పొందాడు ఆ పరతత్త్వానుభవం ? “నిర్మలతపంబులయందు చలింపకెన్నడున్”, మాంసం కోస్తున్నా , బేరాలు చేస్తున్నా, మనసు ఆత్మభావంనుండి చలించడం లేదు. ధర్మవ్యాధుడు సాధకుడు కాడు,సిద్ధుడు. తనలో, తన కత్తిలో , కత్తితో కోసి తాను అమ్ముతున్న మాంసంలో ఆత్మదర్శనం చేస్తున్నాడు.

***

ఎఱ్ఱన మరికొన్ని మంచి పద్యాలు:

భయము, భక్తి:

“He therefore who has learned rightly to be in dread has learned the most important thing”... " It is only human beings that can be in dread”.( Kierkegaard: The Concept of Dread)

“Dread reveals Nothing.” (Heidegger.)

యముడు ఎదురుగా నిలబడి ఉన్నప్పుడు భయం కలుగక పోవడం అవినయం, అవివేకం.

“కనియెంగోమలనీలమేఘవిలసత్కాలాంజనాకారు ఘో
ర నిశాతోత్కటదంష్ట్రనుజ్జ్వలచలద్రక్తాక్షు ప్రత్యగ్రకాం
చనవర్ణాంబరునంత్యకాలదహనజ్వాలాప్రచండున్ జగ
జ్జనసంత్రాసనునొక్క దివ్యు పటుపాశప్రౌఢహస్తోద్ధతున్.

...అయ్యింతి యెంతయు భయంబునం ...” ( ఆరణ్యపర్వం: 7. 217. )

[ ఈ పద్యం ఎర్రన రచించిన సావిత్రి ఉపాఖ్యానంలోనిది. ఇందులో “ కనియెం కోమల” అన్నదానికి, “ కనియెం కోమలి” అని పాఠాంతరం ఉన్నట్టున్నది, కొన్ని ప్రతులలో . ]

యముడు ఎదురుగా నిలబడి ఉన్నప్పుడు భయం కలుగక పోవడం అవినయం. కనుక సావిత్రి ,( ఆమె అసలే “కోమలి”, ) భయపడింది, “అయ్యింతి యెంతయు భయంబునం ...” ఆ తరువాత ఆమె మాటల్లో భయంలేదు, యింటికి వచ్చిన అతిథిని అడిగే కుశలప్రశ్న వంటి ఆదరం ఉంది. (“అయ్యా మీరెవ్వరు యియ్యెడకు ఎయ్యది సేయందలచి విజయంచేసితిరి...” సాధారణంగా భయము, భక్తి అన్న పదాలు అవి వేరు అన్న భావంతో వాడుతుంటాం. “ అతనిది భయం, భక్తి కాదు” అని ఎద్దేవా చేయడం సాధారణం. కాని యిక్కడి సందర్భంలో సావిత్రి భయంలో భక్తి అతిశయించింది. బహుశా అందుకు కారణం అరణ్యపర్వంలోని మరో ఎర్రని పద్యంలో వెదుక్కోవాలేమో?

“కనియెంగోమలనీలమేఘసుభగాకారున్ జటావల్కలా
జినధారున్...సత్కృపాభరణు రామున్ రాజచూడామణిన్.”

“నీలమేఘ” అన్న పదం సాధారణంగా కృష్ణుడితో కలిసి కనిపిస్తుంది పద్యాలలో. అంత తరచుగా కాకపోయినా, రాముడికి కూడా వాడుకలో ఉంది. ( అదేమిటో, మన దేవుళ్ళందరూ నలుపే! వర్ణవివక్ష! ) ఇక్కడ ఎర్రన శిల్పం ఆ నీలమేఘపదాన్ని ఎవ్వడూ ఊహించని విధంగా యముడికి అన్వయించడం. ఇప్పుడు కలగవలసింది భయమా? భయం, భక్తితో కలిసి వ్యక్తమవుతుంది. అందుకే, ఆ నీలవర్ణం కోమలం, “ కోమలనీలమేఘం” అన్న పాఠాంతరంలో.

***

“మమ యోనిర్మహద్భ్రమ”( గీతావాక్యాన్ని కొద్దిగా మార్చాను.గీతాచార్యుడు మన్నించుగాక)

శ్రీస్తనకుంకుమద్రవనిషక్తభుజాంతరభాగవిస్ఫుర
త్కౌస్తుభరత్ననూత్నరుచిగర్వితనాభిసరోజసౌరభ
ప్రస్తుతమత్తభృంగరవరాగరసోల్బణభోగిభోగత
ల్పాస్తరణుందలంచు సుకృతాత్ములపాస్తసమస్తకల్మషుల్.

(ఎర్రన: నృసింహ పురాణం.)

శ్రీదేవిస్తనముల కుంకుమద్రవం ఆయనకౌస్తుభానికి అంటుకొని, దానికి అసలే ఎర్రి, మరింత “ఎర్రెక్కిందట”. అరుణోదయమైందని నాభిసరోజం కళ్ళు తెరచింది. ఆ పరిమళాలందుకొని భృంగబృందం భూపాలరాగం అందుకున్నదట. “వేత్తిగానరసం ఫణిః.” మరి ఆదిశేషుడు ఊయలై ఊగడా! ( శేషశాయి నిద్రలోంచి లేచాడా, నిద్రలోకి జారాడా? అదీ మాయే, మాయానిద్ర.)

## 1.4.మౌళిస్రక్

స్రగ్ధర. మౌళిస్రక్సంగరంగన్ మధుకరపటలీ మానసాకృష్టివిద్యా

శాలిస్ఫారాబ్జరేఖాంజలిపుటఘటనాచారుఫాలస్థల క్ష్మా

పాలశ్రేణీవిశాలాంబకకుముదవనీబాంధవాయత్తచంద్ర

శ్రీలీలాగాఢకాంతిస్మితవదనరుచిస్ఫీతు నాగేంద్ర కేతున్. (విరాటపర్వం :3: 78.)

ప్రతిపదార్థంతెలియకముందే యిది గొప్ప పద్యమని, దుర్యోధనుడి ప్రాభవాన్ని గొప్పచేసి చెబుతున్న పద్యమని తెలుస్తుంది. అసలు ఆ పద్యాన్ని గురించిన యథార్థం తెలుసుకునే ముందు, ప్రతిపదార్థం చూద్దాం.

ఇది తిక్కన తన భారతరచనలో దుర్యోధనుడిని ప్రత్యక్షంగా ప్రవేశపెట్టిన మొదటి పద్యం. ఈ పద్యంలో మొదటి మూడు పాదాలు సామంతరాజుల వర్ణన.చివరి పాదం రారాజ వర్ణన. ఇది దుర్యోధనుడిపై చిన్నచూపు కాదు . అతడి ప్రాభవాన్ని పెంచడం. సామంతరాజులవైభవవిలాసం అంత ఘనంగా ఉన్నది అని చెప్పడం వలన రారాజ వైభవం యింకెంత గొప్పదే ఊహించుకోవచ్చు. ఆ సామంతరాజులంతా( క్ష్మాపాలశ్రేణీ) అంజలి ఘటించి వరుసగా నిలిచి ఉన్నారు. ఎలా? వారు పూలమాలలు జట్టుకు చుట్టుకున్నారు, ( మౌళిస్రక్: పద్యమే స్రగ్ధర కదా! ) ; ఆ పూలవాసనలకు,పూల తేనెల కొరకు, తుమ్మెదలు చెలరేగి ఆడుతున్నాయి; ఆ రాజులు నుదుట దొప్పలవలె చేతులు ముడిచి (అంజలిపుటఘటన) నిలిచి ఉన్నారు,ఆ ముడిచిన చేతులు ముడుచుకున్న పద్మముల వలె ఉన్నాయి,ఆ తుమ్మెదలు వాటిని చూసి పద్మములని భ్రమపడ్డవి; ( భ్రమ పెట్టగలిగిన ఆకర్షణ విద్యలో ఆరితేరినవి ఆ అంజలిపుటాలు (ఆకృష్టివిద్యాశాలి) ; వారి అంజలిపుటాలు పద్మములైతే,వారి కన్నులు కలువలు. కరములు ముకుళితపద్మములు, కన్నులు వికసితకుముదములు ( విశాలాంబక); ఆ కలువలకు బంధువు చంద్రుడు.ఆ కలువల వికసనానికి ( సామంతరాజులను సంతోషపెట్టడానికి ) ఆయత్తమైన రారాజ ముఖంలోని చిరునవ్వు (బాంధవాయత్త) చంద్రుడిలా వెలిగిపోతున్నది. (చంద్రశ్రీలీలాగాఢకాంతిస్మితవదనరుచి).రారాజ జెండాపై నాగేంద్రుడు.

ఒక ప్రశ్న. ఈ సభ పగలు జరిగినదా లేక ,అర్ధరాత్రి ఏర్పాటుచేసిన అత్యవసర సమావేశమా? ఒథెలో (షేక్స్ పియర్) నాటకంలో యిటువంటి అర్ధరాత్రి అత్యవసరసమావేశం వెనిస్ ప్రభువు ఏర్పాటుచేసిన దృశ్యం ఉన్నది .అది దేశంపై పరరాజ్యం దాడి చేసినపుడు ఏర్పాటుచేసిన సమావేశం. ఆ నాటకప్రారంభమే ఇయాగో, వీథిలో ఏర్పాటుచేసిన అర్ధరాత్రి అల్లరి. అది రాత్రి అని అతడు వేసిన, వేయించిన కేకల్లో స్పష్టమే అయినా, ఆ అర్ధరాత్రిని మరింత దృశ్యమానం చేశాడు షేక్స్ పియర్, ఒథెలో చేత పలికించిన మాటలతో. తనమీదికి కత్తులుదూసిన జనాలతో ఒథెలో అన్న మాటలు: “మీ మెరిసే కత్తులు ఒరలో పెట్టేసుకోండి.లేకుంటే అవి తుప్పుపడతాయి.” ( “Keep up your bright swords,or the dew will rust them.”) మెరిసే కత్తులు (Bright swords ) “చంద్రశ్రీలీలాగాఢకాంతి” ని స్ఫురింపచేస్తాయి. తుప్పు (rust) అది మంచుకురుస్తున్న రాత్రిని చెబుతుంది. ఆ తరవాతి దృశ్యంలో ఏర్పాటుచేయబడిన అత్యవసరమంత్రివర్గసమావేశాన్ని రెండు కాగడాలు వెలిగించి నాటకం నడిపాడు షేక్స్ పియర్. తిక్కనది నాటకీయ శిల్పం అంటారు కదా! ఈయన రారాజ వెలిగించిన చిరునవ్వుల చంద్రకాంతితో , పండువెన్నెలతో ,సభను నడిపిస్తున్నాడు.( బయట కాదు, సభలో వెన్నెల! ) సభకు సామంతరాజులు వచ్చి ఉన్నారు. వాళ్ళు నిత్యమూ రారాజ ఎదుట మోకరిల్లి ఉండరు కదా? అత్యవసరసమావేశానికి పిలిపించ బడినారా? ఏమిటి ఆ అత్యవసరపరిస్థితి? లేక, యిది రాజధానిలో రాజసమక్షంలో జరిగే నిశానిత్యోత్సవమా? పూలవాసనలు, భ్రమలు, భ్రమరాలు , సభలో వెన్నెల ( ! ). భ్రమ కలిగించడంలో “విద్యాశాలి” ఆ “స్ఫారాబ్జ”ములు. ఈ సభ జరిగింది యింతకూ రాత్రిపూటనా, పగలా? పద్మములు ముకుళించడము ,కుముదములు వికసించడము రాత్రిని సంకేతిస్తున్నాయి కదా? ఇది కేవలం కవిసమయమా, సమయమా? ఇక రాజసభవర్ణన. పూలవాసనల గుబాళింపు, తుమ్మెదల ఝుంకారం, సమ్మోహనవిద్య- యిటువంటి రాజసభావర్ణన మరొకటి ఏదైనా గుర్తున్నదా?

[“నాగేంద్ర కేతున్”: దుర్యోధనుడి కేతనం నాగేంద్రుడు. దీని వివరం తరువాత తెలుసుకుందాం. అందుకు చాలా వెనక్కు నడవవలె, అరణ్యపర్వంలోని ఘోషయాత్ర వరకు. దుర్యోధనుడు పాండవులు అతడిని గంధర్వులనుండి విడిపించిన అవమానం దుస్సహమై ప్రాయోపవేశం చేయబూనడం తెలిసినకథే.

(ప్రాయోపవేశం చేయబూనిన దుర్యోధనుడికి ఒక మహనీయమైన ఉపమానం వాడాడు ఎర్రన:

క్రమమున బాహ్యేంద్రియకర్మములెల్లను వదల విడిచి మహితసమాధి
క్రమదశనుండె నివాతస్తిమితంబై వెలుగుచున్న దీపము పోలెన్. ( ఆరణ్య. 6.40)

ఈ పాతాళవృత్తాంతం మనం వ్యాసం చివర మరొకసారి చూద్దాం, మన వెనుకడుగులలో. పద్యాలు కాదు, పర్వమే వెనక్కు నడవాలికదా! ]

ఈ పద్యం చదివితే పద్యం పూర్తిగా అర్థమైనట్టే కదా? అదేం ప్రశ్న, పద్యానికి అర్థం పద్యంలో కాక మరెక్కడ ఉంటుంది, అనవచ్చు. ఒక పద్యం ఎలా అర్థమౌతుంది? ఒక పద్యానికి మొత్తం అర్థం ఆ పద్యంలోనే ఉంటుందా , ప్రతిపదార్థం తాత్పర్యం తెలిస్తే, కవి ఉద్దేశించిన అర్థం తెలిసినట్టేనా?

[ఈ మధ్య “ మహాభారతం, పురుషార్థాలు” అన్న వ్యాసంలో అన్నాను, భారతం శాంతిపర్వంతో మొదలుపెట్టి, ఆ తరువాత ఆదిపర్వానికి రావలె అని. అటువంటిదే మరొక ప్రయోగం చేద్దామనిపించింది. (నాకు తెలుసు, “పీత నడక” అనే ముద్ర నా మీద వేస్తారని.ఆ నడకలో ఏదైనా గుణమున్నదేమో ప్రయోగించి చూడడంలో తప్పు లేదు.) ప్రస్తుతం, విరాటపర్వంలో తృతీయాశ్వాసంలో 78 వ పద్యంనుండి 73 వరకు వెనక్కు నడిచి చూద్దాం.] “మౌళిస్రక్ “నుండి ఒక పద్యం వెనక్కు నడుద్దాం.

తే. ద్రోణగాంగేయభానుమత్సూను కృపసుశర్మ దుశ్శాసనులు సర్వసైన్యపతులు
ఆర్యజనములు కొలువ మహార్హకాంచనోన్నతాసనమున కొలువున్న వాని. 77

సభ్యులలో మొదట చెప్పబడినవాడు ద్రోణుడు, సర్వసైన్యాధ్యక్షుడు. తరువాత భీష్మాదులు. తరువాత “సర్వసైన్యపతులు”. తిక్కన మన అయోమయాన్ని కొనసాగిస్తున్నాడు. అది నిశాచరసభ అని మనం తీర్మానించామని గ్రహించి, కాదు, అది అత్యవసరపరిస్థితిలో ఏర్పాటు చేయబడిన సభ అని గుర్తు చేస్తున్నాడు. ప్రమాదం ఏమిటో తెలియదు.కాని ఆసభలో యుద్ధసన్నద్ధత స్పష్టం. మరి, పూలవాసనలు తుమ్మెదలు మర్చిపోవద్దు. ఇది వైరుధ్యం కాదా?

మరో పద్యం వెనక్కు నడుద్దాం. “మౌళిస్రక్సంగ”లో సభ వర్ణన. ఇప్పుడు సభ వెలుపల దుర్యోధనుడి రాజభవన ప్రాంగణముఖద్వారం. ఇదీ ప్రసిద్ధమైన పద్యమే.

సీ. వరుసనేనుంగులు కురిసిన దానధారావలి తగు కలయంపి కాగ
రాజలసందడి రాసిన తొడవులు మురిసి రాలిన పొడి మ్రుగ్గు కాగ
కాంతలసంకులగతిద్రెస్సి తొరగిన హారముల్ పుష్పోపహారములుగ
ఏమేమ యని యొలి నెత్తిన పరదేశదొరలపావడములు తోరణముగ

సహజమైనయలంకారమహిమనతిశయిల్లి మహనీయ వైభవమెసకమెసగ
వరలు నరపతిమందిరద్వారభూమి నేరనరిగి యా వేగులవారు ప్రీతి. 75

(తొడవులు, నగలు ; మురిసి, [ ఒకదానితో ఒకటి ] రాచుకొని; త్రెస్సి, తెగి; తొరగిన, రాలిపడిన. )

ఇది ధర్మరాజ ప్రాభవం వర్ణించిన ద్రౌపది చెప్పిన పద్యానికి పోటీగా, ధర్మజుడికంటే దుర్యోధనుణ్ణి ఏమాత్రము తక్కువ చేయకుండా, అతడితో సమానమైన స్థాయిని కల్పించే పద్యమనిపిస్తుంది. ద్రౌపది చేత తిక్కన చెప్పించిన పద్యం ప్రసిద్ధమే (“ఎవ్వనివాకిటనిభమదపంకంబు రాజభూషణరజోరాశినడగు…” (విరాట.2.191). ఏమిటి తిక్కన ఆశయం, ధర్మరాజ వాకిట రాజుల సందడి గుర్తు చేస్తూ చెప్పిన యీ సీసపద్యంలో? దుర్యోధనుడు అంతటి మన్ననకు పాత్రుడు అని ప్రతిపాదించదలచాడా ?

ఇక యీపద్యంలో ఏమున్నదీ మరికొంత దగ్గరగా వెళ్ళి చూద్దాం. రారాజు దర్శనం కొరకు దేశపు రాజుల , "పరదేశ దొరల" తొక్కిసలాట జరుగుతోంది, ముఖద్వారం వద్ద . ( ఈ నాడు రాజకీయనాయకుల ముఖద్వారాల వద్ద బారులు తీరిన కారులు మనం చూస్తున్నాం. ) ఇది ప్రాభాతదృశ్యమే అనుకోవలె. కాని రాత్రి కాదు, అని నిశ్చయంగా చెప్పగలమా? సభలో, రాత్రిని సూచించే పదాలు చూచాము కదా? ఇక్కడ, మరోమాట అన్నాడు తిక్కన,"కాంతలసంకులగతిద్రెస్సి తొరగిన హారముల్ పుష్పోపహారములుగ". రాజద్వారం ముందు స్త్రీల తొక్కిసలాట, తెల్లవారి వారకముందే. మగమహారాజులగుంపులో, తొక్కిసలాటలో వారు వేసుకున్న పూలహారాలు తెగి రాలుతున్నాయి, వాకిట ముగ్గులపై చల్లిన పూలలాగా. రాజప్రాసాదం వాకిట యిటువంటి "కాంతలసంకులం" మరెక్కడైనా చదివామా?అతి ముఖ్యమైన మరో ప్రశ్న, "ఏమేమ యని యొలి నెత్తిన పరదేశిదొరలపావడములు తోరణముగ". పరదేశి దొరలు గోచికట్టు కట్టరు. పావడములు ధరిస్తారు. కనుక వారు తెచ్చిన "ఓలి" ( కానుక) కూడా పావడములే, అవి తొక్కిసలాటలో పైకెత్తి పట్టుకున్నారు, ఆ పైకెత్తిన కానుకలు తోరణంలాగా ఉన్నాయి అని అర్థం చెప్పుకుని తప్పుకుంటున్నాము. పరదేశవస్త్రాలకు ఆకర్షణ ఎక్కువ , హైదరాబాదులో తయారైన ఆలెన్ సాలీ, లూయీ ఫిలిప్ లాగా. ఓలినెత్తు అనే క్రియాపదం ( phrasal verb) ఉన్నదా, అని అడగం. అప్పుడు "ఎత్తి" లో అర్థం మారుతుంది.కానుకలు తెచ్చిన వారందరూ కూడబలుక్కుని హోల్ సేల్ గా పావడాలు కానుకలుగా తెచ్చారా? వజ్రాలు వైడూర్యాలు ఎత్తి పట్టడంలో లేని ప్రత్యేకార్థం యీ పావడములలో కవి ఆశించాడా? ( "ఎవ్వని వాకిట" అన్న ధర్మరాజు గురించిన పద్యంలో "మణిఘృణి" ఉంది కాని పావడాలు లేవు.) ఈ పాదానికి సంతృప్తికరమైన సమాధానం ఎవ్వరూ చెప్పలేదు. కల్పించుకున్న అర్థంతో సమాధానపడ్డారు అందరూ. ఇంతకూ ఆ సభలోపల ఏం జరుగుతోంది?

ఇంకొంత వెనక్కు నడుద్దాం.

ఉ.పాతకియై సుయోధనుడు పాండుతనూజులు సల్పుచున్న య
జ్ఞాత విధివ్రతంబు కలుషంబుగ చేయదలంచి పంచినన్
భూతలమెల్లజూచి ముసు పోయెడునప్పుడు చెప్పుకున్న సం
కేతపు చోట కూడబడి ఖేదము బొందుచు చారులందరున్. 73

తిక్కన తన భారతరచనలో దుర్యోధనుడికి వాడిన మొదటి పదం "పాతకి ". ఈ పదం చదివిన తరువాత "మౌళిస్రక్" పద్యం తిరిగి గుర్తు చేసుకున్నపుడు ఆ పద్యం వెనుక చదివిన అదే పద్యమూ ఒకటి కాగలవా ? ఆ సంపద, వైభవము యిప్పుడు "పాతకి " పదంతో కొత్తగా కనిపిస్తుంది. ఈ నాడు లేరా సంపన్నులు, బంగారపు పూత వేసిన డైనింగ్ టేబుల్స్ మీద బంగారు కంచాలలో తిని బంగారు మంచాలపై నిద్రించేవారు? అంటే మౌళిస్రక్ పద్యం వెనుక తప్పుగా అర్థం చేసుకున్నాం,యిప్పుడు దాని నిజార్థం తెలిసింది అని అర్థంకాదు. రెండు అర్థాలు కవి ఆశించినవే. రెంటిని కలిపి స్వీకరించవలె పాఠకుడు. ఇది శిల్పచాతుర్యం.

కాని మనలో కలిగిన ప్రశ్నలకు యింకా సమాధానాలు దొరకలేదు. సర్వసైన్యాధ్యక్షుడు, సర్వసైన్యపతులు, పూలవాసనలు, చెలరేగిన తుమ్మెదలు, కాంతలసంకులగతి, "ఓలినెత్తిన

పరదేశిపావడములు" - అన్నీ  అలాగే ఉండిపోయాయి. కాని "మౌళిస్రక్ " పద్యం అర్థం అలాగే ఉండిపోలేదు.

***

ఒక మహాకవికి అనేక నిర్వచనాలు చేశారు. మరొకటి మనం చేయవచ్చా? సమాధానాలు యివ్వకుండా ప్రశ్నలకు అవకాశం యివ్వడం మహాకవిలక్షణం అనవచ్చా? ఈ "మౌళిస్రక్సంగ" పద్యంలో కొన్ని ప్రశ్నలకు అవకాశాలను గుర్తించాము. ఆ ప్రశ్నలు కవి అయోమయానికి అస్పష్టదర్శనానికి నిదర్శనాలా? లేక, ఆ ప్రశ్నలే కవి ఉద్దేశించి కల్పించిన అర్థవిస్తృతికి అవకాశాలేమో? ఒక పద్యం  దానిలోని  సమస్తార్థసమర్థం కాదేమో? మరొక పద్యం వెనక్కు నడిచి నపుడు , బహుశా యీ పద్యార్థం మరింత ప్రస్ఫుటమవుతుందేమో? అంటే మరి కొన్ని ప్రశ్నలకు అవకాశం కల్పిస్తుందేమో? ప్రశ్నలుకూడా అర్థవిస్తృతికి దోహదం చేయగలవా  అన్న ప్రశ్నకు సమాధానం వెదకుతున్నాం.

***

( నోట్స్ : ఘోషయాత్రలో తనకు జరిగిన అవమానాన్ని సహించలేక దుర్యోధనుడు ప్రాయోపవేశ ఉద్యమం చేపట్టిన సందర్భంలో, ఆ ఉద్యమం  విరమింపజేయడం కొరకు రాక్షసులు ఒక కృత్య ను పంపి దుర్యోధనుడిని పాతాళలోకానికి పిలిపించి, నీవు మాకొరకు సృష్టించబడిన ఈశ్వరప్రసాదము ( "శితికంఠుడు నిన్ను సృజించి యిచ్చె") , "నిహతకంటకమైన యిద్ధరణీతలంబఖిలంబు నీ మహితశాసనగోచరంబగు", అని ఆశచూపి,  తిప్పి పంపారు యీ లోకానికి .ఆ ఘోషయాత్రకు గుర్తు "నాగేంద్రకేతున్" )

***

## 1.5.ద్వాసుపర్ణా, లేక రెండవకృష్ణుడు

ఆంధ్రమహాభారతం కవిత్రయకృతం. ఇందులో సంశయం ఉండకూడదు. కవిత్రయమంటే ఒక్కరే అని , యిద్దరని , ముగ్గురా ? అనీ అంటారు. నా మట్టుకు నాకు కవిత్రయమంటే త్రయం, ఒక్కరైన ముగ్గురు. ( " వేదత్రయమూర్తి") తెలుగువారికి వారొకవరం. వారిలో తారతమ్యాలు గణించడంలో నాకు ఆసక్తి లేదు. ప్రస్తుతవిషయం యిది కాదు.

ఆంధ్రమహాభారతంలో ఒక ప్రశ్న, సౌపర్ణాఖ్యానం రాయడంలో తిక్కన ఏ ప్రయోజనం ఆశించాడు? నన్నయ సౌపర్ణాఖ్యానం తిక్కనకాలానికి తెలుగువారికి కంఠస్థం అయిఉండవలె. అంతటి గొప్పపద్యాలు ఆయనవి, ఈ ఉపకథలో మరీను. మరి, తిక్కన "నేనూ రాయగలను" అని పోటిపడి రాశాడు అనుకోలేము . రెంటి ప్రయోజనాలు వేరు అయి ఉంటాయి, ఏమిటి ఆ వేరు అన్న ప్రశ్న చాలాకాలం నా వెంటపడింది. నేను కనిపెట్టానని అనుకోడం లేదు. దేని వైశిష్ట్యం దానిది అని సమాధానం చెప్పుకున్నాను. ఆ సమాధానమే యీ ప్రయత్నం.

నన్నయ "సౌపర్ణాఖ్యానశ్రవణకుతూహలపరులై " అని యీ ఉపకథకు పేరుపెట్టాడు. తిక్కన చెప్పిన కథలో ధర్మరాజ భీష్ముడిని అడిగాడు, " గరుత్మంతుండు మహానుభావుండని విందు అవ్విహగవిభుని వృత్తాంతంబు వినవలతు" అని.కథలో "సుపర్ణుడు పుట్టె" అంటాడు. ధర్మరాజ ఆ కథ వినాలని ఉంది అన్నప్పుడు భీష్ముడు పక్కనే ఉండిన కృష్ణునివైపు చూచి , "ఆ సుపర్ణుండు నీవకా వినియుండుదు" అంటాడు.అప్పుడు కృష్ణుడు "వికచవదదనుండై" నాడట! నీకు యిదికూడా తెలిసిపోయిందా, అన్నట్టు. కనుక, సుపర్ణుడు రెండవకృష్ణుడు, యీ జగన్నాటకంలో.

తిక్కన సౌపర్ణాఖ్యానంలో కొన్ని ముఖ్యమైన పద్యాలను గుర్తు చేసుకుందాం. నన్నయ పద్యాలను గుర్తుచేయవలసిన అవసరం ఉండదు.

ముందు సుపర్ణుడు పుట్టడం:

ఘనతరకంధరుండు దృఢకాయుడు దీప్తముఖుండు రక్తలో

చనుడు మహోత్తమాంగకుడు చారుసుసంగతపక్షసారమం
డనుడు పరిస్ఫురద్ద్యుతివిడంబితబాలదివాకరుండు లో
కనయనపర్వనిర్వహణకారి సుపర్ణుడు పుట్టె భూవరా. 177

తిక్కన చెప్పిన సువర్ణుడి గుణాలు: “ఘనతరకంధరుండు”, ఆయన భుజస్కంధాలపై మోయనున్న ఘనతరభారసూచన ; దృఢకాయుడు, శరీరదార్ఢ్యం, “ఘనకాయజవసత్వ గజకచ్ఛపముల ఒక్కెత్తున లీలమై నెత్తైనితడు”( 270) అంటాడు యింద్రుడు, కథ ముగింపులో; “దీప్తముఖుండు”, ముఖతేజస్సు చూడగానే తెలిసేది ; “రక్తలోచనుడు”, ఔజ్జ్వల్యం; “మహోత్తమాంగకుడు”, అన్న అనూరుడిలాగా వికలాంగుడు కాడు, ; “చారుసుసంగతపక్షసారమండనుడు”, రెక్కలుఎలా ఉన్నాయి? చారు, సుందరము: సుసంగతము, సౌష్ఠవము కలవి : సారం కలవి:పక్షీంద్రుడు కదా, శోభనిచ్చేపక్షాలు; పద్యంలో అన్నిటికన్నా పెద్దసమాసం ”పరిస్ఫురద్ద్యుతి విడంబిత బాలదివాకరుండు”: యిందులో “బాల” ముఖ్యం. రెండవకృష్ణుడి బాల్యలీలను నొక్కిచెబుతున్నాడు తిక్కన. ( నన్నయకథలో యీ బాల్యవర్ణన లేదు.) తిక్కన తరువాతి పద్యంలో యీ బాల్యం పరిస్ఫురిస్తుంది: “లోకనయనపర్వనిర్వహణకారి”: ఇది పద్యానికి ప్రాణభూతం. పుట్టిన బిడ్డను చూచి మొదట ప్రీతిచెందేది తల్లి. “దేవకీ పరమానందం” అన్నట్టు.అంతే కాక నీ దాస్యాన్ని తప్పించగల వాడు పుట్టబోతున్నాడు అని అనూరుడు అన్నాడు . కనుక నన్నయ “తల్లికిన్ మనఃప్రీతి యొనర్చుచున్” అన్నాడు. “ కాని తిక్కన సుపర్ణుడు తానుపుట్టింది తల్లి దాస్యం తొలగించడానికి కాదు. ఆమె దాస్యం అనుభవిస్తున్నది అని కూడా నారద మహర్షి చెప్పేవరకు అతనికి తెలియదు. కృష్ణుడు పుట్టింది తల్లితండ్రుల చెర వదిలించడానికి కాదు కదా! . కేవలం తల్లి చెర కాదు. తల్లికి మాత్రమే కన్నులపండుగ కాడు,(“తల్లికిన్ మనఃప్రీతి యొనర్చుచున్”) . లోకానికే దాస్యవిముక్తి కలిగించడానికి జన్మించాడు, “ముక్తిభాజాం నివాసో”( నారాయణీయం). కనుక తిక్కనసుపర్ణుడు “లోకనయనపర్వనిర్వహణకారి”. ( “ఛందాంసి యస్య పర్ణాని”: గీత).

వద్దన్నా గుర్తువస్తుంది నన్నయ “ ఆతతపక్ష...” పద్యం. అందులో లోకాలను గడగడలాడించే గరుడపురాణఘోష, తిక్కనసుపర్ణుడిలో రెండవకృష్ణుడి బాల్యలీల. అతడి ముద్దు మురిపెము,బాధ్యత ఎరుగని “క్రీడన లోలత్వము”: నన్నయ గరుడడు పుట్టీపుట్టగానే “ఎగసె భీమజవంబుననభ్రవీధికిన్”. తిక్కన సుపర్ణుడు ఎక్తడికి ఎగిరాడో చూద్దాం,అది చడీచప్పుడు లేకుండా:

జననింబాసి జనించునప్డ తన యిచ్చన్ పక్షినాథుండునుం
జని పద్మోద్భవకల్పితంబులగు భోజ్యంబుల్ శరీరంబు వ
ర్ధనమొందింపగ సిద్ధసాధ్యగణముల్ తన్ ముద్దుసేయంగ క్రీ
డనలోలత్వమునం జరించు పరితుష్టస్వాంతుడై ఎల్లెడన్. 179

నన్నయగారి సుపర్ణుడు అభ్రవీథికి ఎగసిపోయాడు “భీమజవం”తో. తిక్కన సుపర్ణుడు అభ్రవీథి ఏమిటి, నేరుగా బ్రహ్మలోకానికి ఎగిరాడు. (మేఘాలను వేటాడగలడు యితడు,( ...prince des nuées/Qui hante la tempête et se rit de l'archer: prince of the clouds, who chases

tempests: Baudelaire: L'albatros). నేరుగా  బ్రహ్మగారి డైనింగ్ టేబుల్ ముందు వాలాడు. ఆయన యితడికోసం స్పెషల్ గా అరిసెలు గారెలు చేయించి సిద్ధం చేసి ఉంటాడు. "పద్మోద్భవకల్పితంబులగు భోజ్యంబుల్" హాయిగా ఆరగిస్తూ. మధ్యమధ్య "సిద్ధసాధ్యగణముల" యిళ్ళకు వెళుతూ ఉండేవాడు. వాళ్ళు తనను ముద్దుచేసేవారు. మంత్రిగారబ్బాయి ఆడుకోడానికి కలెక్టరు గారింటికి వెడితే ముద్దుచేయరూ? ఆటపాటలతో , చీకుచింతాలేక బాధ్యతలు తెలియక ("పరితుష్టస్వాంతుడై") సుపర్ణుడి బాల్యం గడిచిపోతోంది, గోకులంలో బాలకృష్ణుడికి లాగా. ఉపాఖ్యానం ముగింపులో ఇంద్రుడు సుపర్ణుని మహత్త్వాన్ని చెప్పే పద్యంలో అంటాడు, "అజుడుపలాలింపనద్దేవుకావించు/వరభోజనంబుల పెరిగెనితడె..."270

ఈ గరుత్మంతుడి తల్లి దాస్యకథ flashback లో చెబుతాడు తిక్కన. (నన్నయ కథలో లాగా వరుసలో కాదు.) కద్రువ వినతల "గుర్రపుపందెం", దానికి కారణమైన కాలము, ఆ సమయంలో వారిద్దరి మనఃస్థితి:

చంచులచిగురాకు చించియాడుచు నలి నెలుగించు గండుకోయిలసొంపు
అలరుతేనియగ్రోలి అన్ను సోలంబుల మురియు తేటులనునుమ్రోతయింపు
తమి పండ్లరసమాని తమలోన చెలగుచు పలికెడురాచిల్కపటురవంబు
కొలకుల కెలకుల కూడి క్రీడించుచుండెడు అంచతండంబు నడబెడంగు

తరగతేలుచు పూదీవ తగులబడుచు
వచ్చు చిరుగాలిసోకును మెచ్చిమెచ్చి
తగిలికొనియాడుచును వినతయును కద్రు
వయును మున్నీటి చేరువ వనమునందు. 181

"చిగురాకు చించియాడుచు": అకలికి ఆకులు మేయడం వేరు. చిగురాకులను చించి వేయడం వేరు. కడుపునిండిన తరువాత పిల్లవాడు అన్నంతో ఆడుకున్నట్టు. కద్రూవినతల మనఃస్థితి కూడా అదే. జూదానికి కాలుదువ్వుతున్న మనసు. ( శకుని జూదం గుర్తు చేస్తుంది కూడా, దాని తరువాతి దాస్యం కూడా.) కద్రూవినతలు బీచ్ కి వెళ్ళారు, అప్పటి వాతావరణం యీ పద్యంలో వర్ణన. కోయిలలు, తుమ్మెదలు, చిలుకలు, హంసలు. ప్రకృతి ఉల్లాసంగా ఉంది. "పూదీవ తగులబడుచు": కాలికి చుట్టుకోబోతున్న తీవెను సూచిస్తోంది. జూదంలో దిగుతున్నవాడికి అది "పూదీవె", తరువాతగాని అది ముళ్ళతీగె అని, అందులో "తగులబడుచున్నా"ను ( చిక్కుపడు) అని తెలియదు.

నన్నయతిక్కనలు సుపర్ణుడి రెండు ముఖాలు చెబుతున్నారు. మనం చూడవలసినది ఆ ముఖాలు. నన్నయతిక్కనల కవిప్రతిభలతారతమ్యం కాదు.

***

## 1.6. తిక్కనదొక రసమార్గము

“నన్నయదొక ఋషిమార్గము, తిక్కనదొక రసమార్గము.”( వేటూరి ప్రభాకరశాస్త్రి: “తెలుగు వెలుగులు”.)

***

రష్యన్ సాహిత్యంలో టాల్ స్టాయ్ ఎక్కువా డోస్టోవ్ స్కీ ఎక్కువా అన్న చర్చ ఒక సాహిత్యవినోదం. నన్నయ గొప్ప అని, కాదు తిక్కన గొప్ప అని చర్చ తెలుగులో తెగని వివాదం.( పాపం ఎర్రననెవరూ తలచరు! ) ఇటువంటి వివాదాలంటే నాకు ఆనందం. ఇంతటి పోటీ పడుతున్న వివాదాస్పదమైన మహారచయితలున్న సాహిత్యం ఎంత ధన్యము !

***

సీ.మణిహేమపర్యంక మహితోపవేశను సురుచిరాభరణవిస్ఫురితగాత్రు
కౌస్తుభరత్నవికాసి వక్షస్థలు పీతకౌశేయసంవీతమూర్తి
మేరుతటీగత మేఘసంకాశు నక్షత్రగణావృతగగనసదృశు
నూతనోదితరవిద్యోతితోదయగిరినిభు రుక్మబద్ధేంద్రనీలతుల్యు

ఆ. నమ్మురారి గని కృతాంజలియై భక్తి చిత్తవృత్తి కరము జొత్తిలంగ
నంతకంతకాననాంబుజమలరంగ నిట్టులనియె తియ్యమెసక మెసగ.
(ఆం.మహాభారతం:శాంతి:2.3.)

తిక్కనను అవహేళనచేయడానికి ఒక కారణం ఆయన “ ఎసకమెసగ” అనే ప్రయోగం తరచు చేస్తాడని. ఈ పద్యం ముగింపులోనూ ఆ హాస్యాస్పదపదం ఉంది. మీ అవహేళన ముగించండి, తరువాత పద్యంలోకి చూద్దాం. నిజానికి యీ పద్యం “లోపలికి” చూడడం అంత సులభం కాదు. ఈ పద్యాన్ని చూడాలంటే మెడ నొప్పి పుట్టేటంత పైకెత్తి చూడాలి . ఆంధ్రమహాభారతంలో, నింగినీ నేలను చొచ్చుకొని ( “విగాహ్య”) నిలిచిన మేరుపర్వతం వంటిది యీ పద్యం. ఆంధ్రమహాభారతంలో పూర్వోత్తరభాగాలను, “పూర్వాపరౌ వారినిధీ విగాహ్య...అన్నట్టు, భారతభారతీసముద్రపు అంచులను తాకిన, మానదండమూ అనికూడా

అనవచ్చు. ఇంతకూ యీ పద్యం ఎందుకు చదవాలి ? మహాభారతకావ్యనిర్మాణశిల్పమనే కొండకు యిది అద్దం కనుక.

ఇక పద్యం చూద్దాం. యుద్ధం ముగిసింది. ( అసలు యుద్ధం ఎందుకు జరిగింది అని ఎవ్వరూ అడగరేం? అడగనక్కర లేదు. యుద్ధషట్కంలో ఒక్క పర్వానికైనా మేలుకున్న ఒక్క పాండవవీరుడి పేరు ఉన్నదా ? భీష్మ, ద్రోణ, కర్ణ, చివరకు శల్య, పర్వంకూడా కౌరవపక్షమే . ఇక అటువైపు, యుద్ధం చేయని, నిద్రపోతున్న ఉపపాండవులకు ఒక పర్వం. పాండవపక్షంలో మెలకువగా ఉన్న ఒక్కడి పేర ఒక్క పర్వం లేదు. ఇంకా అవసరమా, యుద్ధం ఎందుకు జరిగింది అని అడగడం ? యుద్ధం కౌరవులు కోరినది, కౌరవులు చేసినది.

పద్యసందర్భం. ధర్మరాజు పట్టాభిషిక్తుడైనాడు. ఒకనాడు తెల్లవారుతూండగా ( "రేపకడ") కృష్ణదర్శనం కొరకు ఆయన మందిరానికి వెళ్ళాడు. ధర్మరాజు లోపలికి వెళ్ళిన సమయానికి కృష్ణుడు ఎలా ఉన్నాడు? పక్క దిగలేదు . పక్కమీద ఆసీనుడై ( "మణిహేమపర్యంక మహితోపవేశను") ధ్యానం చేస్తున్నాడు. పరమాత్మను అందరూ పక్కపైనుండి లేవకుండానే ధ్యానం చేస్తారని తెలుసు. కాని, పరమాత్మకూడా ధ్యానం చేస్తాడని, పక్కదిగకుండా, ఎప్పుడూ వినలేదు, యీ తిక్కపద్యంలో తప్ప . ఆ కృష్ణుణ్ణి తిక్కన వర్ణిస్తున్నాడు. ధర్మరాజు అడిగాడు ఆ ధ్యానానికి కారణం. "నివాతనిశ్చలదీపప్రకారంబున నున్న యప్పరమపురుషుండు" చెప్పిన మరో తిక్క సమాధానం, తానుచేసిన "భీష్మస్తుతి" : " గంగ యెవ్వని తన గర్భమునందతిశ్లాఘాసమేతయై సంభరించె...అట్టి భీష్ముడు నన్నిప్పుడాత్మ దలచుచునికి తద్గతమయ్యె నా మనము నధిప." ( శాంతి: 2: 12.). భారతమంతటికీ ప్రకటార్థం వాసుదేవుడే అయినప్పటికీ ఆ అర్థాన్ని ప్రకటించినవాడు భీష్ముడు. వాస్తవానికి భారతంలో రెండే పర్వాలు. యుద్ధం ముగిసేవరకు ఒక భీష్మపర్వం. ఆ తరువాత శాంతి మరో భీష్మపర్వం.

మరి కర్ణుడు? అంటారు జనం. కర్ణుడు లేని భారతం లేదు అన్న నానుడి ప్రబలంగా ఉంది జనంలో . ( ఈ కర్ణుడిమీద ఒక వ్యాసం ఇంగ్లీషులో రాశాను నా fb గోడమీద వెనక ఎప్పుడో . ఓపిక ఉంటే వెదికి చదవండి.) ఇక భీష్ముడి పాత్ర కొరకరాని కొయ్య.దాచుకోని పాండవపక్షపాతి కౌరవపక్షంలో చేరి భీకరయుద్ధం చేయడమేమిటి? ఈ ప్రశ్న అనాదిగా వేధిస్తున్నది మనలను. ఇక ఆయన శౌర్యం ! భీష్మపర్వంలో భగవానుడికే చెమటలు పోయించి, పట్టనన్న ఆయుధం పట్టించాడు భీష్ముడు. కృష్ణుడికేమిటి, అంతకు ముందు భార్గవరాముడికీ చెమటలు పట్టించాడు. ఇక ఆయన చేసిన పది రోజులయుద్ధం కంటే పెద్ద కొలత ఏముంటుంది ఆయన శౌర్యానికి? అయినా, కర్ణుడు లేని భారతం లేదు అన్న భావం జనంలో నిలబడిపోయింది.

భీష్ముడికి కర్ణుడికి ఎంత వ్యత్యాసం ఉందో కొలతలు కావాలా? ఏనుగుకు దోమకు ఉన్నంత. మాటవరసకన్న మాట కాదు. తిక్కన నిజంగా అదే అన్నాడు. కాని యిలా కాదు, తిక్కనలా అన్నాడు, తిక్కన అనగలిగినట్టు అన్నాడు. ఆయన శిల్పి కదా ! రెండు పద్యాలు చూద్దాం.

అంహోమర్దనుడా జనార్దనుడు మాద్యద్భీష్మకుంభీంద్రుపై
సింహోల్లాసవిభాసియై కవియనుత్సేకంబునాటోపమున్

రంహస్ఫూర్తియు దీప్తమూర్తియును జూడన్ జగ
త్సంహారోన్ముఖుడైన రుద్రుగతి రౌద్రప్రక్రియం బొల్చినన్." ( భీష్మపర్వం.)

భీష్ముడిపైకి ఉరకడానికి జగత్సంహారోన్ముఖుడైన రుద్రరూపం ధరించవలసి వచ్చింది కృష్ణుడికి. ఇక కర్ణుడితో యుద్ధమా !

"అట్టిద లోకపర్యవసమా దురవస్థకు స్రాక్కనేర్తునే కిట్టెద కర్ణశల్యులను కీటములన్
కరతాడనంబులన్ ..." ( కర్ణపర్వం)

అరచేతులతో దోమలను చంపినట్లు చంపుతాడట కర్ణశల్యులను ! ఇంత చెప్పినా, యిలా చెప్పినా, యింకా "కర్ణుడు లేని భారతమా?" అంటారు జనం! అందుకేనేమో, కృష్ణపరమాత్మ స్వయంగా ఆ భీష్ముడి గొప్పతనం గురించి అంత గొప్పగా చెప్పాడు, శాంతిపర్వంలోని యీ సన్నివేశంలో.భీష్ముడు స్థితప్రజ్ఞుడు. శిశుపాలవధఘట్టంలో అతడి మానసిక స్థితి ఆ స్థితప్రజ్ఞకు మహోదాహరణం. ఆ ఘట్టంలో సభలోని అందరూ ఆందోళనలో ఉన్నారు, యీ యాగం నిర్విఘ్నంగా ముగుస్తుందా అని. ప్రశాంతంగా ఉండిన వారు యిద్దరే, కృష్ణుడు భీష్ముడు ("శిశుపాలుడు బాలుడు వానినేల భూపాలక నీకు పట్టువరుపన్ " అన్నవాడు భీష్ముడు ధర్మరాజుతో).

ఇక,అసలు పద్యాన్ని చూద్దాం. మొదటి రెండు పాదాలలో కృష్ణుడు పక్కపై కూర్చొని ఉన్నాడు.

"మణిహేమపర్యంక మహితోపవేశను సురుచిరాభరణవిస్ఫురితగాత్రు
కౌస్తుభరత్నవికాసి వక్షస్థలు పీతకౌశేయసంవీతమూర్తి..."

ఈ మొదటి రెండు పద్యపాదాలలో కృష్ణుడు ఎక్కడ ఉన్నాడు? ఆయన నిద్రలేచి పక్కదిగలేదు. పర్యంకంపై ఆసీనుడై ఉన్నాడు. తరువాత రెండుపాదాలలో ఎక్కడకు వెళ్ళిపోయాడు? చుక్కలమధ్య చేరిపోయాడు :

"మేరుతటీగత మేఘసంకాశు నక్షత్రగణావృతగగనసదృశు
నూతనోదితరవిద్యోతితోదయగిరినిభు రుక్మబద్ధేంద్రనీలతుల్యు "

మేరుతటీగత మేఘంలా, మేఘమండలాన్ని దాటి తారామండలంలా, ఉదయాద్రి పై మెరిసే బంగారంలో పొదగబడిన యింద్రనీలంలా ఉన్నాడట. ఇంతకూ, యీపద్యంలో వర్ణన కృష్ణుడిగురించేనా? భారతకథను సంకేతిస్తున్నాడా తిక్కన యీ పద్యంలో? ఇంతవరకు భారతకథ నేలమీద నడిచింది. ఇప్పుడు ఐహికం ముగిసి పారమార్థికం మొదలవుతుంది అని పూర్వోత్తరభారతభాగాలమధ్య నిలిచిన "నక్షత్రగణావృతగగనసదృశ" మైన కృష్ణరూప మేరునగాన్ని స్ఫురింపజేస్తున్నాడా? ఇప్పుడు కృష్ణుడు మరో ప్రయోజనం సాధించవలె. మరో అవతారం ధరించవలె. భీష్ముడిని ఆవేశించవలె. శాంతి, ఆనుశాసనిక పర్వాలు భీష్ముడి చేత పలికించవలె. అంటే, "మణిహేమపర్యంక " అన్న యీ పద్యం ఎవరి వర్ణన? కృష్ణుడి వర్ణన.

అవును.కాదు, లేదా, మరొకచోట ధ్యానంలో ఉన్న భీష్ముడి వర్ణన. అవును. కాదు. కృష్ణుడు కాదు, భీష్ముడు కాదు. ధ్యానం చేస్తున్నవాడు భీష్ముడు ("భీష్ముడు నన్నిప్పుడాత్మ దలచు" అనికదా ధర్మరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కృష్ణుడన్నాడు? ) అప్పుడు ధ్యానంలో ఉన్న భీష్ముడిని కదా తిక్కన వర్ణించనలె? పక్క దిగని కృష్ణుని వర్ణించడమేమిటి? దీనికి తిక్కన సమాధానం, కృష్ణుడి నోట :

క.శరతల్పగతుండతడే శరణంబుగ నాశ్రయించి సద్భావవ్యా
ప్తిరతుండగుటను విను తత్పరత నతనియందు నాదు భావంబెలసెన్.

[ "శరతల్పగతుండతడు, ఏ ( నేను) శరణంబుగ"]

వ. ఇది మదీయధ్యానంబు తెరంగు...( శాంతి: 2: 14-15.)

"ఇది మదీయధ్యానంబు తెరంగు", అని కృష్ణుడు అనడంలో, "మదీయ" మాత్రమే కాదు, "ధ్యానంబు తెరంగు" వివరించాడు. ధ్యానమంటే "సద్భావవ్యాప్తిరతి". సత్ అంటే "ఉన్నది", భావమన్నా అర్థమదే ( "భూ సత్తాయామ్"). ధ్యానమంటే ఉన్నదానినంతటినీ, అంటే సమస్తచరాచరజడచేతనసృష్టిని, భావంలో వ్యాపించడం."అట్టి భీష్ముడు" చేసే ధ్యానంలో ధ్యాని, ధ్యాత వేరు కారు. కనుక "తత్పరత నతనియందు నాదు భావంబెలసెన్", అన్నాడు కృష్ణుడు.

ధ్యానం ఎక్కడ మొదలవుతుంది? రూపంతో- మణిహేమపర్యంకము, సురుచిరాభరణవిస్ఫురితగాత్రము, కౌస్తుభరత్నవికాసి వక్షస్థలము, పీతకౌశేయ సంవీతమూర్తి- మూర్తితో మొదలవుతుంది.ఎక్కడ ఫలిస్తుంది? అమూర్తగగనంలో, "నక్షత్రగణావృతగగనసదృశ" మైన పరమాత్మదర్శనంతో . అంటే, "మణిహేమపర్యంక " అన్న పద్యంలో ధ్యానస్వరూపనిరూపణం వాస్తవవస్తువు . ఈ సందర్భంలోనే కదా భీష్ముడు "విశ్వం విష్ణుః" అని విష్ణుసహస్రనామస్తోత్రం చేశాడు ! ధ్యానం విశ్వంతో మొదలవుతుంది, విష్ణువుగా సాక్షాత్కరిస్తుంది. మహాభారతం ఫలశ్రుతిలో తిక్కన చెప్పినమాట తలచుకుందాం. "భారతసంహితకెల్ల పుండరీకాక్షుని వాసుదేవు ప్రకటార్థము ..." అంటే ఏమిటి అర్థం? భీష్ముణ్ణే ఆశ్రయిద్దాం. విష్ణుసహస్రనామస్తోత్రఫలశ్రుతిలో ఒక శ్లోకం:

నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే సహస్రపాదాక్షి శిరోరుబాహవే।
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే సహస్రకోటియుగధారిణే నమః ॥

ఏ మూర్తిని చూచినా నీకు అతడిలో కృష్ణమూర్తి కనిపిస్తుంది , (సహస్రమూర్తయే). ఏ పాదాలు చూచినా పరమాత్మ కనిపిస్తాడు, ఏ కళ్ళలోకి చూచినా వెలుగుతున్న విష్ణువు కనిపిస్తాడు, (సహస్రపాదాక్షి).ఏ శిరసు చూచినా, ఏ ఊరువు చూచినా ఏ చేతులు చూచినా వాసుదేవా, అంటావు,("శిరోరుబాహవే" ) . అదీ వాసుదేవు ప్రకటార్థమంటే. అది మహాభారతం చదవడం వల్ల కలిగే ఫలం, అంటున్నాడు తిక్కన.

మహాభారతంలోని  పూర్వోత్తరభాగాలను స్ఫురింపజేయడానికి, పద్యంలోని పూర్వోత్తరభాగాలమధ్య కనిపించని సరిహద్దు రేఖ గీయడం తిక్కన శిల్పం. మొత్తం సన్నివేశం తిక్కన భారతార్థసమగ్రదర్శనానికి నిదర్శనమైతే, యీ పద్యం తిక్కన పద్యశిల్పానికి ఓ మచ్చుమణి. ఈ పద్యం మహాభారతంలో మేరునగం అన్నాం, మేరుదండం కూడా. అవును,  "తిక్కనదొక రసమార్గము ". "రసో వై సః" అని కదా వేదవాక్కు. తిక్కనది వైదిక మార్గము.

***

## 1.7. కర్ణుడు లేని భారతమా?

ప్రతి ప్రపంచభాషలోనూ, గాథలు యితిహాసాలు మంచి చెడుల పోరాటము, అందులో మంచి విజయము చెడు ఓటమి కథావస్తువు. కాని కాలక్రమంలో మంచిచెడుల గురించిన మన అభిప్రాయాలు తారుమారవుతుంటాయి. ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా భావించబడుతున్నది. ఒకనాటి వీరుడు మరోనాటికి ప్రతివీరుడుగా కనిపిస్తున్నాడు. రాముడిలా వర్తించు, రావణుడిలా వద్దు అన్నదొకనాటి మాట. మరొకడి భార్యను అపహరించినవాడు ఒకప్పుడు ఖలుడు; యీ నాడు వాడు, అనుసరణీయుడు, ఆరాధ్యుడు, ఆదర్శప్రాయుడు. వేలమందిని హత్యచేసి, వారి భార్యలను లైంగికబానిసలుగా వాడినవాడు, యీనాడు అశేషజనాలనుండి పూజలందుకుంటున్నాడు. ఆ బానిసలకు విముక్తి కల్పించి పునరావాసం కల్పించినవాడు దుష్టుడు. కాలాన్ని వెనక్కు దొర్లించే ప్రయత్నం నిష్ఫలం అవుతుంది. ఈ ధర్మాధర్మవిపర్యయం సామాజికశాస్త్ర అధ్యయనవిషయం. సాహిత్యంగా యీ సమస్యను పరిశీలించే ప్రయత్నం చేద్దాం. కౌరవపాండవులవిషయంలో యీ విపర్యయం స్పష్టంగా తెలుస్తోంది. అక్కడ మొదలుపెట్టి, కర్ణపాత్రను ప్రత్యేకించి పరిశీలిద్దాం, వ్యాసభారతం ప్రధానంగా ఆధారం చేసుకుని.

కౌరవులు కర్మనిష్ఠులు, సనాతనవైదికధర్మానుష్ఠాతలు, విధ్యుక్తవేదకర్మలను తప్పక విరివిగా నిష్టతో ఆచరించినవారు. ధృతరాష్ట్రుడు ఆచరించినన్ని యజ్ఞాలు మరెవరూ చేసి ఉండరు. దుర్యోధనుడు, “అభిమత వినుతాధ్వరసంప్రయోగవిహితోద్యముడై” , రాజసూయంకంటే గొప్ప వైష్ణవయజ్ఞం ఆచరించాడు . దానగుణంలో కర్ణుడిని మించినవాడు లేడని లోక ప్రసిద్ధి. తనకున్నది యివ్వడం కాదు, తననే కోసి యిచ్చినవాడు, శిబిచక్రవర్తిలా.ఎవరో కాదు, సాక్షాత్తూ కృష్ణభగవానుడే కర్ణుడిని గురించి అంటాడు ,

ఉపాసితాస్తే రాధేయ బ్రాహ్మణా వేదపారగాః ।
తత్త్వార్థం పరిపృష్టాశ్చ నియతేనానసూయయా।
త్వమేవ కర్ణ జానాసి వేదవాదాన్ సనాతనాన్।
త్వమేవ ధర్మశాస్త్రేషు సూక్ష్మేషు పరినిష్ఠితః॥ ( వ్యాసభారతమ్: ఉద్యోగ. 140.6-7.)

‘నీవు వృద్ధజనోపసేవివి ధర్మసంవేదివి...’( తిక్కన: ఉద్యోగపర్వం.ఇది ,”వృద్ధజనోపసేవివి”, “ధర్మసంవేదివి” అని రెండు వాక్యాలు కావు . రెండూ ఒకే వాక్యం, “వృద్ధజనోపసేవివి కనుక ధర్మసంవేదివి”) ఒక్క కర్ణుడే కాదు, కౌరవులందరూ పెద్దలయెడ గౌరవం ఉన్నవారు. వివాహవ్యవస్థపై విశ్వాసం ఉన్నవారు. వారి వివాహాలన్నీ శాస్త్రసమ్మతంగా జరిగినవే. కౌరవస్త్రీలు పాతివ్రత్యధర్మాన్ని నిర్వర్తించినవారు. గాంధారికంటే కఠోరపతివ్రత ఎవరుంటారు?వీరు కౌరవులు.మరి, జన్మవలన కౌరవుడుకాని కర్ణుడి మాటేమిటి? కౌరవులను మించిన కర్మనిష్ఠుడు కర్ణుడు, కర్మసాక్షి అయిన సూర్యుని అంశతో పుట్టినవాడుకదా! అతడి యీ

సనాతనధర్మకర్మనిష్ఠనే కృష్ణుడు ప్రస్తుతించాడు, "త్వమేవ కర్ణ జానాసి వేదవాదాన్ సనాతనాన్" అని. కర్ణుడికి, తనను కన్నతల్లి కన్నవెంటనే గంగపాలు చేసింది అన్న బాధ కంటే, పుట్టినపుడు తనకు జరుగవలసిన కత్రియజాతకర్మలు జరగలేదు అని నిర్వేదం జీవితాంతం వెంటాడింది:

అహం చ క్షత్రియో జాతో న ప్రాప్తః క్షత్రసత్క్రియామ ॥144.6॥

కనుకనే అతని కర్మనిష్ఠాబుద్ధికి హత్తుకునే పరిభాష వాడాడు కృష్ణుడు:

కర్ణ శోభిష్యసే నూనం పంచభిర్భ్రాతృభిర్వృతః ।
వేదైః పరివృతో బ్రహ్మ యథా వేదాంగపంచమైః॥Ch. 143.11॥

వేదాంగపంచమపరివృతుడైన బ్రహ్మవలె, అయిదుగురు తమ్ములతో నీవు ప్రకాశిస్తావు, అన్నాడు.

ఈ కృష్ణప్రస్తుతికి అనుగుణంగానే కర్ణుడు సమాధానమిచ్చాడు, సనాతనధర్మపరిభాషలో

ధార్తరాష్ట్రస్య వార్ష్ణేయ శస్త్రయజ్ఞో భవిష్యతి।
అస్య యజ్ఞస్య వేత్తా త్వం భవిష్యసి జనార్దన॥

ఆధ్వర్యవం చ తే కృష్ణ క్రతావస్మిన్భవిష్యతి (28-29)

"కృష్ణా! నాకు తెలుసు దుర్యోధనుడి శస్త్రయజ్ఞవేత్తవు నీవని, యీ క్రతువు నీ ఆధ్వర్యవంలో జరుగుందని నాకు తెలుసు.")

ఈ సందర్భంలో కర్ణుడు వాడిన పదాలు కర్మానుష్ఠానపరిభాషలోవి- ఉపద్రష్ట, ఆధ్వర్యవం, ఉద్గాత. యుధిష్ఠిరుడు యీ యజ్ఞానికి బ్రహ్మ. కర్ణుడి జీవితమంతా యీ కర్మమార్గపరతకే నిదర్శనం.

కర్ణుడికి అతడి జన్మరహస్యం చెప్పి ( అప్పటివరకు తెలియదని పిచ్చితల్లి ఊహ! ) పాండవపక్షానికి రమ్మని చెప్పడానికి, వెళ్ళింది కుంతి.ఎక్కడ కలవడానికి ? భాగీరథీతీరాన. ఆమెకు కర్ణుడు ముందు వినిపించి, ఆ తరువాత కనిపించాడు. ప్రాతరర్ఘ్యప్రదానసమయంలో కొడుకు చదువుతున్న వేదమంత్రాలు వినిపించాయి ఆమెకు. అతడి స్వరంలో దయ, ("ఘృణినః"). కొడుకు ఆచరిస్తున్న ప్రాతఃప్రార్థన ముగిసే వరకు ఆగింది తల్లి.

ఆత్మజస్య తతస్తస్య ఘృణినః సత్యసంగినః
గంగాతీరే పృథాశ్రౌషీద్ వేదాధ్యయననిస్స్వనమ్
ప్రాంగ్ముఖస్యోర్ధ్వబాహోః సా పర్యతిష్ఠత పృష్ఠతః 144.27-28)

బ్రాహ్మణులు వేదమూర్తులని అతడి భావన. బ్రాహ్మణుడే కానక్కరలేదు, బ్రాహ్మణాకారంకూడా వేదస్వరూపమే అని మన్నించినవాడు కర్ణుడు. కనుకనే యింద్రుడు బ్రాహ్మణవేషంలో వచ్చాడు కర్ణుడిని యాచించడానికి, అతడి తేలువలవడానికి .

కౌరవులతో, కర్ణుడితో పోల్చినపుడు పాండవుల జీవితాలు ఎటువంటివి ? వారిజన్మలు, వివాహాలు, అవసరమైనపుడు అసత్యవాక్కు, వారి హైన్యము ( పండు ముసలి తాతను "నీవు ఎలా చచ్చిపోతావు", అని అడగగలిగినవారు! ) ఇవన్నీ వైదికకర్మమార్గపరత కాదు కదా, సభ్యసమాజవర్తనంకూడా కాదు. కనుక కౌరవుల ధర్మానికి,పాండవుల అధర్మానికి జరిగిన పోరాటమే మహాభారతకథ అనవచ్చా? స్థూలంగా అట్లాగే అనిపిస్తుంది. వైదికయజ్ఞకర్మలు, అనుబంధాలఆవశ్యకత, వివాహవ్యవస్థాపావిత్ర్యము, వృద్ధజనసేవనము, శౌర్యము, అవును సత్యసంధత, గొప్ప గుణాలు. పాండవులు కూడా యీ గుణాలను గుర్తించలేదనలేము . కాని యీ కర్మనిష్ఠను మించిన ధర్మం ఒకటున్నది.దీనినే కీర్క్ గార్డ్ "Is there a teleological suspension of the ethical?"( Fear and Trembling) అన్న ప్రశ్న వేసి చర్చించాడు. రాజ్యం కొరకో, కీర్తి కొరకో కాదు వీటికంటే అత్యవసరమైన పరిస్థితి వచ్చినపుడు, ఆ పిలుపుముందు యీ సర్వధర్మాలూ పరిత్యజించవలసినవే. దాని పిలుపు వినిపించినపుడు యీ లోకధర్మాలన్నీ భోగిమంటలలోకి విసిరేయవలసివస్తుంది, కృష్ణుని వేణువు వినిపించగానే గోపికల జారిపోతున్న చీరెల్లా, జారిపోతాయి లోకధర్మాలు, ( "సర్వధర్మాన్ పరిత్యజ్య"). ఆ పిలుపు వినపడినప్పుడు హింస కూడా "పరమో ధర్మః "

తిరిగి కర్ణుడి విషయానికి వద్దాం. కర్ణుడు లేని భారతమా, అన్నది జనవాక్యం. ఇది ఎంతవరకు నిజం? ఇందులో ఎక్కువభాగం అతడి పట్ల జాలి. భారతంలో మరి ఏ యితర పాత్ర కూడా యింతటి దురదృష్టవంతుడు లేడంటారు . ఇది వాస్తవమా? కర్ణుడు అనుభవించింది దయనీయమే. పుట్టగానే గంగపాలు కావడం కంటే దురదృష్టం ఏముంటుంది? రాజకుమారుడైయుండి సూతుడి యింట్లో పెరగడం అంతకంటే దౌర్భాగ్యం. విధివంచితుడు. నిజమే, కాని పాండవులకష్టాల కంటే అతడివి పెద్ద కష్టాలా! వారి కంటే అతడు ఎక్కువ దురదృష్టంవంతుడా ? పాండవులు చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నారు. కొండలు అడవులు ఆశ్రయాలుగా పెరిగారు కొంతకాలం. భర్త పోయి నిస్సహాయ అయిన కుంతి వారిని ఎలా పోషించిందో ? అక్కడి ఆశ్రమవాసులు కొందరు అనాథలైన ఆ పసివారిపై, విధవ అయిన తల్లిపై జాలిపడి, ఆ అనాథలను హస్తినకు తీసుకువెళ్ళి, ధృతరాష్ట్రుడి ముందు నిలబెట్టారు. దిక్కులేని ఆ పసివాళ్లు ఆ రాజసభలో దిక్కుతోచక బిక్కుబిక్కుమంటూ నిలబడ్డారు. వారు పసివారే కాని, ఒకప్పుడు వారి తండ్రి పాలించిన ఆ రాజ్యంలో వారి అభద్రత తెలియ లేనంత పసివారుకారు. పెదతండ్రి జాలివెనుక దాగిన వైరం తెలియనివారు కారు. హస్తినలో వారు క్షణక్షణము ప్రాణాంతకప్రమాదాలను ఎదుర్కొంటూ ఎదిగారు. ఆ పసితనంలోనే వారు ప్రవాసులుగా బతికారు. విషప్రయోగము, గృహదహనము మరెన్నో హత్యాప్రయత్నాలలో చచ్చి బతికారు. ప్రాణభయంతో బ్రాహ్మణవేషాలలో ఏ పూటకాపూట బిచ్చమెత్తుకుంటూ తిరిగారు.

ఇక వారి జన్మలా? చెప్పుకోలేనంత సిగ్గుచేటు. కర్ణుడి జన్మలా రహస్యం కాదు, వారివి లోకానికంతటికీ బట్టబయలు. ఎంత లోకువ వారి జన్మలు లోకంలో? కర్ణుడి జన్మ యింతకంటే అగౌరవప్రదమైనది కాదు. వారి వివాహాలు? లోకం యుగాలుగా ఎత్తిపొడుస్తున్నానే ఉంది, అపహాస్యం చేస్తుంది వారిని. వారి భార్యను- ఆమె ఒక్క క్షణం క్రితం మహాసామ్రాజ్యానికి పట్టమహిషి- నిండుసభలో దారుణంగా, చరిత్రలో ఏ స్త్రీ అనుభవించనంత అవమానం భరించింది. కర్ణుడు యింతకంటే ఎక్కువ విధివంచితుడా, ఏ విషయంలోనైనా ? కుంతి తక్కిన పిల్లలు అనుభవించని పేదరికము, ప్రమాదాలు, అవమానాలు భరించాడా కర్ణుడు? వారితో పోలిస్తే అతడి జీవితం సుఖంగా సాఫీగా వైభవంగా సాగింది. కాని ఎప్పుడూ కర్ణుడికి తాను విధివంచితుడనని, తనకు క్షత్రియోచితమైన జాతసంస్కారాలు జరగలేదని అభిజాత్యపు హీనభావం, కొరవ. తన జన్మగురించి నిర్వేదం. సూతపుత్రుడన్న పరితాపం. ( పెంచిన రాధపై, సూతుడిపై కృతజ్ఞత అయితే ఉంది, “ మూత్రపురీషాదులు తమ గాత్రములందింక నను సంవర్ధితగాత్రునిగా జేసిరి”.కాని కొరవ కొరవే.) కర్ణుడి బతుకంతా కొరవ, అనవసరమైన ప్రతీకారవాంఛ.

ఇక పాండవులను చూద్దాం. వారి జన్మల గురించి కాని, వారి విచిత్రవివాహం గురించి కాని వారెప్పుడూ అవమానభావన పొందలేదు. లోకాభిప్రాయాన్ని ఎన్నడూ లక్ష్యం చేయలేదు. దాన్ని గుర్తించనే లేదు. అది సిగ్గులేనితనం కాదు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న అహంభావం కాదు. అహంభావరాహిత్యం. కర్ణుడు ఎప్పుడూ తననుండి తాను పారిపోతూనే ఉన్నాడు, తన జన్మనుండి పేదరికంనుండి హీనకులంనుండి. అతడికి సమాజగౌరవం కావలె. రాజుగా బతకవలె, ఆ రాజ్యం బిచ్చంగా వచ్చినదైనా చాలు. అదే అంటాడు శల్యుడు, అతడి చివరిక్షణాల్లో, విసిరేసిన ఎంగిలిమెతుకులు తిని బలిసిన కాకివి నీవు అని. తననుంచి తాను పారిపోయే ప్రయత్నం చేస్తూనే ఉండిపోయాడు, ప్రతిప్రయత్నంలోనూ ఘోరంగా విఫలమవడమేకాక, మరో కొత్త శాపాన్ని కొని తెచ్చుకున్నాడు. కర్ణుడి శాపాలు అతడి చావుకు కారణాలు అంటాం. కాని, అతడి శాపాలకు కారణాలు? అతడి అసలు శాపం తనకు తానిచ్చుకున్నదే, పగలో తెచ్చుకున్న దుర్యోధనమైత్రి. అతడికి సామాజికగౌరవం కావలె. అతడి కవచకుండలాలు ఒలిచి యివ్వడం అతిలోకమైన దానమే. ( ఇది కూడా, ఒకవిధమైన అపరాధమే. తననే నమ్ముకున్న దుర్యోధనుణ్ణి మోసం చేయడమే, తన వ్రతం నిలుపుకోడానికి. భీష్ముడు కూడా యీ తప్పు చేసినవాడే. తన ప్రతిజ్ఞనిలుపుకోడం కోసం ఏ తప్పైనా చేస్తాడు.అందుకే “అది వారల చేటగుగాక” , అన్నాడు భగవానుడు. ఏనుగైనా కీటకమైనా తప్పు తప్పే. ) కర్ణుడికి శాపాలు తన పతనానికి కారణాలైతే, పాండవులకు వారి శాపాలు వరాలైనాయి. కర్ణుడు చేసిన వేల దానాలు దుర్యోధనుడు తనకు దానం చేసిన ఒక్క దానంలోనివే . కర్ణుడు ధరించింది పుట్టుకతో వచ్చిన మంటల అంగీ. దానిని వదిలించుకోడానికి అతడు పరుగులు తీసేకొద్దీ మంటలు పెరిగి వెంటపడతాయి.

కర్ణుడిని ఎవ్వరూ ఓడించలేదు, తనను తానే ఓడించుకున్నాడు. ( ఈ విషయమే తిక్కన చెప్పాడు, అతడి మరణాన్ని చెప్పిన రెండు ప్రసిద్ధమైన పద్యాలలో.) అతడికి ఏం జరుగబోతున్నదో కౌరవులలో మరెవరూ దర్శించనంత స్పష్టంగా దర్శించాడు కర్ణుడు. కాని, తనను కాపాడుకోడానికి ఏమీ చేయలేదు. అతడు కౌరవవినాశనాన్ని ఎంత స్పష్టంగా ఊహించాడో, కృష్ణుడితో అతడి మాటల్లో స్పష్టం, పైన ఉదాహరించిన వ్యాసభారతంలోని శ్లోకంలో, “ధార్తరాష్ట్రస్య

వార్ష్ణేయ శస్త్రయజ్ఞో భవిష్యతి।అస్య యజ్ఞస్య వేత్తా త్వం భవిష్యసి జనార్దన". ఈ మాటల్లో అతడు ఓడిపోకముందే ఓటమిని అంగీకరిస్తున్నాడు. పైగా అతడి "దర్జా" ఏమిటో తానే ఒప్పుకున్నాడు, " దుశ్శాసనుడు శకుని పాండవులతో కలిసిపోవడం వంటిదే తాను పాండవపక్షానికి మారడం అన్నాడు. అతన్ని దుష్టచతుష్టయంలో చేర్చింది లోకం కాదు, అతడే.

ఇక పాండవులపట్ల ఒక అసదభిప్రాయం పరిశీలిద్దాం. విచిత్రమేమంటే, పాండవుల ప్రవర్తనను హర్షించవలసిన వారే, వారిగురించి అసదభిప్రాయం కలిగిఉండడం. కౌరవులు అధికారపక్షం. ఈ నాడు అధికారపక్షాన్ని వ్యతిరేకించడం అభ్యుదయం, విప్లవం. ( వాళ్ళ అధికారం న్యాయమా అన్యాయమా అనే ప్రశ్న అటుంచుదాం. అధికారమే అన్యాయం.) ప్రపంచంలోని ప్రతిఅధికారపక్షము నయాన భయాన తన అధికారాన్ని మరింత బలపరచుకునే వ్యూహరచన చేస్తుంది. కుట్రలు పన్నుతుంది. ఏమైనా చేస్తుంది. పాండరాజుకు అతడి వారసులకు రాజ్యంపై ఎటువంటి చట్టసమ్మతమైన హక్కు లేదనేవారి వాదం అహేతుకంకాదా ! పాండువు రాజ్యాన్ని నిలిపినవాడు, విస్తరించినవాడు. అతడికి ఎటువంటి హక్కులు లేవా? అయిదు ఊళ్ళకు కూడా? దున్నేవాడిదే భూమి అనేవారు యీ విప్లవకారులేనా, ప్లీడర్లు గుమాస్తాలా ?

కౌరవులపాలన నిరంకుశప్రభుత్వం. గౌరవప్రదంగా ధార్మికంగా జీవించాలనుకునేవారి హక్కులను ఆస్తులను హరించి, వారిని అడవుల్లోకి అజ్ఞాతవాసంలోకి తరిమేసి, వీలైతే ఎన్ కౌంటర్లు చేయించేవారు కౌరవపక్షం యీనాడు . ప్రభుత్వం ఆడే జూదంలో ఓడిపోయయేదెప్పుడూ సాధారణప్రజలు. ( సందేహం ఉంటే, కారా కథ "యజ్ఞం" మరొకసారి చదవండి. ఆ గ్రామపంచాయతీసభలో పాండవులెక్కడ ఎలా ఉన్నారో గుర్తించండి.

***

తిరిగి కర్ణుడికథకు వద్దాం. కవులకు పక్షపాతం ఉండదు, చెప్పవలసిన మాట చెప్పిన తరువాత, చేయవలసినది చేస్తారు. వ్యాసుడు పుత్రమరణం కలచివేసిన తండ్రిని కర్మసాక్షిని , చెప్పాడు: " మందం మందం ప్రవిశ మందిరం మందరశ్మిః".

తిక్కన తండ్రి శోకానికి కర్మనిర్వహణను కలిపి చెప్పాడు.

దారుణాస్త్రజాలాంశుల వైరిసైన్యతాపమొనరించి యా సూతతనయతరణి
పార్థదుస్తరకాలవైభవము గడవననువు లేమినవ్విధముననస్తమించె.

నిర్గతప్రాణురాధేయు నిజకరముల కరుణపెంపుననంటుటకారణముగ
పావనస్నానమొనరింపబోవునట్టులపరజలనిధి లోనికి అరిగెనినుడు.

కర్ణుడిని ఓడించానని ఎవరూ గొప్పలు చెప్పుకోనవసరం లేదు, కాలమే అతడిని ఓడించింది, "పార్థదుస్తరకాలవైభవము". ఇది తిక్కన తీర్పు.

***

# 2.కాళిదాసు

2.1.కాళిదాసు:గంగాగౌరీసారూప్యం:మలార్మె.
2.2. నాందీశ్లోకాలు
2.3.కులగురువు కాళిదాసు-కౌళము

## 2. 1.కాళిదాసు:గంగాగౌరీసారూప్యం:మలార్మె.

“కుమారసంభవం” మరో సారి చదువుదామనిపించే కావ్యం. “రఘువంశం” picture gallery అయితే, “కుమారసంభవం” చలనచిత్రం. ఒకటి మనం కదులుతూ చూడవలసినది, మరొకటి కదులుతూ కనిపించేది.

కాళిదాసు “కుమారసంభవం” లోని యీ శ్లోకాలు ప్రసిద్ధమైనవి.

ఇతో గమిష్యామ్యథవేతి వాదినీ
చచాల బాలా స్తనభిన్నవల్కలా
స్వరూపమాస్థాయ చ తాం కృతస్మిత:
సమాలలంబే వృషరాజకేతన: .

తం వీక్ష్య వేపథుమతీ సరసాంగయష్టి:
నిక్షేపణాయ పదముద్ధృతముద్వహంతీ
మార్గాచలవ్యతికరాకులితేవ సింధు:
శైలాధిరాజతనయా న యయౌ న తస్థౌ.

(కుమారసంభవమ్.5: 84,85.)

శివుని భర్తగా పొందడానికి పార్వతి తపించింది. ఆ సందర్భంలో మాయావటువు రూపంలో శివుడు సరదాకు ఆమెను Eve teasing చేయడం, లోకంలో ప్రసిద్ధమైన సన్నివేశమే.తెలుగులో శ్రీనాథుడు కూడా తన “హరవిలాసం”లో యీ సన్నివేశాన్ని వర్ణించడం తెలిసిందే. మాయావటుడు శివనింద చాలా చేశాడు. పార్వతి అతని నోరు మూయించడానికి చెప్పవలసింది చెప్పింది.కాని,ఆయన మళ్ళీ నోరు తెరచే ప్రయత్నం చేయడం చూసింది.చెలితో చెప్పింది, 'తిరిగి నోరు తెరిచే ప్రయత్నం చేస్తున్నాడు.ఆపు",అని (“పునర్వివక్షు: స్ఫురితోత్తరాధర:”83.) “మహాత్ములను నిందించడమే కాదు, ఆ నిందవినడం కూడా పాపమే”, అని అక్కడనుండి వెళ్ళిపోవలెనని, విసురుగా లేచింది. ఆ విసురులో పైట జారింది. శివుని ఆట ఆగిపోయింది. ఆయన అసలు రూపం బయటపడింది. (“స్వరూపమాస్థాయ”)అప్పుడు ఆమె చేయి పట్టుకున్నాడు.పతికోసం తపించిన కన్నెపిల్లకు, హఠాత్తుగా తన తప:ఫలం సాక్షాత్కరించినపుడు, పెళ్లికొడుకు ఏకంగా పాణిగ్రహణం చేసినపుడు, ఆమె స్థితి ఎట్లా ఉంటుంది? కోపం, ఆశ్చర్యం , సంతోషం. ఆమె కోపవేగం ఆగలేదు.ఆశ్చర్యం నిలవనీదు.సంతోషం కదలనీయదు. ఆ కల్లోలస్థితిని వర్ణించగల ఉపమ కల్లోలినియే కావలె. పర్వతశిఖరంనుండి దూకుడుగా వస్తున్న నదికి మార్గంలో కొండ అడ్డం వస్తే, నదీవేగం వెంటనే ఆగదు, ముందుకు సాగనూ లేదు (“న యయౌ న తస్థౌ”.)అదీ పార్వతి స్థితి.ఇక్కడ పార్వతిని కవి “శైలాధిరాజతనయా” అనడం సార్థకం. పర్వతశిఖరాలలో పుట్టి ప్రవహించే గంగతో సారూప్యం చెబుతున్నాడు గౌరికి. గంగ, గౌరి యిద్దరూ శైలాధిరాజతనయలే కదా!“వేపథుమతీ” (కంపము),” సరసాంగయష్టి”(స్వేదము),ప్రియుని కరస్పర్శతో కలిగిన సాత్విక భావోదయాన్ని చెబుతాయి. నిజమే,

కాని అవి నది విషయంలో రసము(“సరసాంగయష్టి”),కల్లోలము (“ఆకులిత”)కూడా స్ఫురింపచేయడం మరింత సార్థకం.

(“శైలాధిరాజము,శైలము ఒకటి కావు.కాని యీ జడజంగమభేదం కాళిదాసుగాని తరువాతి కవులుగాని పాటించలేదు.కావ్యప్రారంభశ్లోకంలోనే “హిమాలయోనామనగాధిరాజ:”అన్నాడు కాని, ఆయన ఆ ప్రారంభశ్లోకాలలో వర్ణించింది, హిమాలయమే కాని, అధిష్ఠానదేవత నగాధిరాజను కాదు.పెద్దన ప్రయోగం “శైలతనయాస్తనదుగ్ధములానువేళ” ప్రసిద్ధమే.) “పదముద్ధృతం” (ఎత్తిన పాదం),శివశక్తుల సామరస్యంలో సృష్టికార్యోన్ముఖమైన శక్తి ఎత్తిన మొదటి అడుగు.

ప్రథమస్పందనలోని సంరంభాన్ని చెప్పే “మార్గాచలవ్యతికరాకులితేవ సింధు:, ... న యయౌ న తస్థౌ” అద్భుతమైన ఉపమ. ప్రమాణంలో (scale), ప్రాధాన్యంలో , ప్రభావంలో ”దీపశిఖ” కూడా దీనికి దీటు కాదనిపిస్తుంది.

మలార్మె:

సందర్భం వేరు, ప్రయోజనంవేరు.కాని, “న యయౌ న తస్థౌ” వంటి ఏకత్రస్థితవిరుద్ధస్థితులను అభివ్యక్తం చేస్తూ ఫ్రెంచి కవి మలార్మె ఒక కవిత రాశాడు,తన కూతురు
చేతిలో విసనకర్రపై, “మాద్ మ్వాసెల్ మలార్మె మరో విసనకర్ర”, ( Autre éventail de Mademoiselle Mallarmé" :Stéphane Mallarmé) . కవిత పేరు చూస్తే అదేదో ఆషామాషా కవిత అనిపిస్తుంది.కాని అసాధ్యమైన రచన. దాని వివరించే సందర్భం కాదు.కాని కొన్ని పోలికలు:

-“నా రెక్క (లు) నీ చేతిలో”(mon aile dans ta main , my wing in your hand);
-“స్తబ్ధస్ఫురణం”(le coup prisonnier , imprisoned flutter );
-“బద్దలవలేదు బద్ధపడలేదు”(Ne peut jaillir ni s'apaiser , can neither/Burst out or be soothed like this.ఇది “ న యయౌ న తస్థౌ” ను గుర్తు తెస్తుంది.)
-“ముడిచిన రెక్కలకదలిక”(“vol fermé , closed flight).

అనంతస్పందనశక్తిని అరచేతిలో ఆపి ఉంచిన స్ఫురణ యీ ఉపమలలో ఉన్నది .

ఈ మలార్మె కవితలోని విసనకర్ర సామాన్యమైనది అనుకోలేము.

à chaque battement
Dont le coup prisonnier recule
L'horizon délicatement.

at every beat,
Its captive stroke with delicate care
Drives the horizon to retreat. (-Tr.Blackmore:Oxford World Classics)

(“ ప్రతి వీవెన విసురులో
ఆ స్తబ్ధస్ఫురణ మృదువుగా సరిదిద్దు
దిగంతాల సరిహద్దు.”)

ఇది విసనకర్ర కాదు!

ఇక్కడ మలార్మెను వదిలేద్దాం.

పై కాళిదాసు పద్యాలకు నా ఆంగ్లానువాదం:

‘Or, hence I remove me’, saying, she rushed.
The cover from her breasts slipped.
The smiling Siva dismissed his disguise
And took her hand in his.

Seeing Him, she, born of the  Mountain King,
All sweat and trembling,
One foot in the air,stumbled
As a river rushing  down,
Stopped by a sudden rock, confused,
Neither stood nor moved.

***

## 2.2. నాందీశ్లోకాలు

మాళవికాగ్నిమిత్రమ్ నాంది

ఏకైశ్వర్యే స్థితోపి ప్రణతబహుఫలే యస్స్వయం కృత్తివాసా:

కాంతాసమ్మిశ్రదేహోపి అవిషయమనసాం
య: పరస్తాద్ యతీనామ్

అష్టాభిర్యస్య కృత్స్నం జగదపి తనుభిర్బిభ్రతో నాభిమాన:

సన్మార్గాలోకనాయ వ్యపనయతు స వస్తామసీం వృత్తిమీశ:.

(నాందీశ్లోకమ్ : మాళకాగ్నిమిత్రమ్: కాళిదాసు. )

ఏకేశ్వరుడు అయి ఉండికూడా ( ఐశ్వర్యమంతా తనదే అయి ఉండికూడా) చర్మమును ధరించువాడు; నిత్యమూ కాంతాదేహంతో కలిసి ఉండికూడా విషయములయందు మనసులేని యతిశ్రేష్ఠుడు; అష్టతనువై ( “భూరంభాంస్యనలోనిలోంబరమహర్నాథోహిమాంశుర్పుమాన్” దక్షిణామూర్తి.) సమస్తజగత్తును భరిస్తూకూడా (జగత్తును భరించడం ఎంత కష్టం! నేనే యింతప్రభుత్వభారం వహిస్తున్నాను అన్న) అభిమానం లేనివాడు; మీకు సన్మార్గాన్ని (ప్ర)దర్శింపచేయడానికి మీ తామసీ వృత్తులను తొలగించుగాక.

( కవిత, మార్గమని దేశి అని రెండు విధాలు. మార్గకవిత దుర్మార్గమనే వారు ఆనాడు కూడా ఉంటే ఉంటారు. కనుక సన్మార్గమంటున్నాడు దర్శకుడు, కాళిదాసు.) ఏకేశ్వరుడు అంటే సబ్ కా మాలిక్ ఏక్ . ఈ లోకంలో మరొకడు నేను ప్రభువును అనగలిగినవాడు లేడు.)

విక్రమోర్వశీయము నాంది

వేదాంతేషు యమాహురేకపురుషం వ్యాప్య స్థితం రోదసీ
అస్మిన్నీశ్వర ఇత్యనన్యవిషయః శబ్దో యథార్థాక్షరః।
అంతర్యశ్చ ముముక్షుభిర్నియమితప్రాణాదిభిర్గమ్యతే
స స్థాణుః స్థిరభక్తియోగసులభో నిశ్శ్రేయసాయాస్తు వః॥

నింగినీ నేలను ఆక్రమించియున్న ఏక పురుషుడు అని ఉపనిషత్తులు ఎవరిని అంటాయో; ఎవనియందు ఈశ్వరుడన్న శబ్దం, మరొకరికి అన్వయించరాని, అక్షరసత్యమో; వెలుపల యింతగా నిండియున్న ఆ యీశ్వరుని మోక్షకాములు ప్రాణాయామాదులచేత పొందగోరుతున్నారో,

అటువంటి యీశ్వరుడు స్థిరమైన భక్తితో సులభంగా పొందదగినవాడు;  మీకు నిశ్శ్రేయసమును అనుగ్రహించు గాక.

(నాందీశ్లోకము: విక్రమోర్వశీయము: కాళిదాసు.)

ఊర్వశి అనాదిగా కవులను ఆకర్షిస్తూనే ఉన్న విషయం తెలుసు. (కాళిదాస, రవీంద్ర, అరవింద, కృష్ణశాస్త్రి వంటివారు.) ఈ నాటకంలో నింగికి నేలకు సమాగమం చెబుతున్నాడు కాళిదాసు. (నన్నయ దీన్ని తలకిందులు చేశాడు: “భూసతికిం దివంబునకు  శరత్సమాగం”).ఊర్వశి దివ్యానందానికి ప్రతీక.)

కాళిదాసు శివాద్వైతి. వెనుక కాశ్మీరదేశంలో శివాద్వైతమని శాక్తాద్వైతమని రెండు ఉండేవి. అంతా శివమయం కాళిదాసుకు. అలా అని, ఆయన వీరశైవుడు కాదు. ఆయన రఘువంశం ( అందులో రామాయణము ప్రసిద్ధమే.

ఈ నాంది పద్యంలోని ఏకపురుషుడినే నన్నయ త్రిపురుషులనుగా చేశాడు. “త్రిపురుషాః”. ( వేదత్రయమూర్తయః ...పురుషోత్తమాంబుజభవశ్రీకంధరాః )

“మొదట, ఆత్మ ఒకటిగా ఉండెను. తనను రెండు చేసుకొని, పతిగా పత్నిగా అయ్యెను.” ( ఆత్మానం ద్వేధాపాతయత్ తతః పతిశ్చపత్నీ చ అభవతాం.బృహ. ఉ. 1.4.3.)

వేదాంతేషు అన్న ప్రారంభంలోని ఆశయం, ఆనాడు కొందరు శివాద్వైతం అవైదికం అని ఉండడం చేత.

అభిజ్ఞానశాకుంతలం నాంది.

యాసృష్టిస్రష్టురాద్యా యా వహతి విధిహుతం యా హవిర్యా చ హోత్రీ

యే ద్వే కాలం విధత్త: శ్రుతివిషయగుణా యా స్థితా వ్యాప్య విశ్వమ్

యమాహు: సర్వబీజప్రకృతిరితి యయా ప్రాణిన: ప్రాణవంత:

ప్రత్యక్షాభి: ప్రపన్నస్తనుభిరవతు వ: తాభిరష్టాభిరీశ:॥

( నాందీశ్లోకం:అభిజ్ఞానశాకుంతలం: కాళిదాసు)

ఈ నాందీశ్లోకం “యా” తో మొదలవుతుంది. మొదటి రెండునాటకాలనాందీశ్లోకాలలో “యః”(యస్స్వయం కృత్తివాసాః ) , “యమ్” ( యమాహురేకపురుషం) అని పుంలింగం వాడిన కాళిదాసు మతం మార్చుకున్నాడా? శివుని వదిలి శక్తిని పట్టుకున్నాడా అన్న శంక కలుగుతుంది,

నాలాంటి అరగోర సంస్కృతం తెలిసినవాడికి.  ఆ "యా", అష్టతనువైన ఈశ్వరుడి ఒక తనువు, యిక్కడ జలం అని అర్థం. ( అంతేనా? చూద్దాం.)

మొదట స్థూలంగా శ్లోకానికి అర్థం చూదాం:

" అష్టతనువైన ఈశ్వరుడు ప్రపన్నులైన మిమ్ము రక్షించుగాక. (అష్టతనువులు) : జలము , (యా స్రష్టుః ఆద్యా సృష్టిః) ; అగ్ని , (వహతి విధిహుతం) ; సూర్యుడు చంద్రుడు ( యే ద్వే కాలం విధత్తః); ఆకాశము (శ్రుతివిషయగుణా యా స్థితా వ్యాప్య విశ్వం); పృథివి ( యామాహుః సర్వబీజప్రకృతిరితి); వాయువు ( యయా ప్రాణినః ప్రాణవంతః).

ఈశ్వరుడు ఈశ్వరుడు అంటారు. ఎక్కడ ఉంటాడాయన, అసలున్నాడా,  అని నిలదీసేవారికి కాళిదాసు యిస్తున్న సమాధానం. నీవు పుట్టింది ఆయన తేజోరూపజలంతో. నీ దేహంలో వేడి ఆయన ( ఒళ్ళు చల్లబడడమంటే తెలుసు కదా!). నీవు నిలిచిన నేల యీశ్వరుడు. నీవు నిలవటానికి అవకాశం (ఆకాశం) ఆయన.  చూపునిచ్చే పగలు ఆయన. నిద్రనిచ్చే రాత్రి ఆయన. నీవు తీసుకునే ఊపిరి ఆయన. చెప్పు యీశ్వరుడెక్కడ ఉన్నాడో? ఇప్పుడు మీరు చూడబోయే శాకుంతలనాటకం ఆ నటరాజు ఆడించే నాటకం. ఈ జగన్నాటకం ప్రత్యక్షప్రదర్శన (" ప్రత్యక్షాభి:". ) ఈశ్వరుడు నిత్యప్రత్యక్షదర్శనం యిస్తుంటే ఈశ్వరుడెక్కడ అంటుంది లోకం. ఎవరికి ప్రత్యక్ష ప్రదర్శనం? ప్రపన్నులకు.

శ్లోకంలో  మన మొదటి శంకను మరోసారి చూదాం. "యా సృష్టిః స్రష్టురాద్యా": మొదట సృష్టి అయింది ఏది? మొదట ఆత్మ మాత్రమే ఉండెను. ఆ ఆత్మ స్త్రీని సృజించెను, తనకు పత్నిగా. (ఆత్మైవేదమగ్రఆసీత్ పురుషవిధః...స ద్వితీయమైక్షత్.) ఈ స్త్రీ పరమేశ్వరుని ప్రకృతి. "భిన్నా మే ప్రకృతిరష్టధా"( గీత. 7.4.)

ఈ నాందీశ్లోకంలో యజ్ఞ ధ్వని బలంగానే వినిపిస్తున్నది: "వహతి విధిహుతం యా హవిర్యాచ హోత్రీ" విన్నపుడు గీతలోని రెండు శ్లోకాలు గుర్తు రావలె:

బ్రహ్మార్పణం బ్రహ్మహవి: బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ |<br>
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా ||4.12.)

అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।<br>
మంత్రోఽహమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ ।। 9.16 ।।

అంటే ప్రకృతిని, పరమేశ్వర శక్తిని, నాందీశ్లోకంలో మొదట ఉంచాడు, ఉద్దేశించే   అనిపిస్తోంది. భగవద్గీతలోని శ్రీకృష్ణపరమాత్మ ఆదిశక్తి ఒకటే. ( "కదాచిదాద్యా లలితా పుంరూపా కృష్ణవిగ్రహా వంశగానవినోదేన కరోతి వివశం జగత్." అని లలితాత్రిశతికి శంకరభాష్యంలో .) కనుక కాళిదాసు "యా" తో ప్రారంభం చేశాడని కూడా భావించవచ్చు. ఎందుకు? కథానాయిక శకుంతల తల్లిలేని

పిల్ల.(మేనక స్వర్గస్థురాలు కదా!) కనుక కాళిదాసు "తల్లి"ని ( "యా") మొదట నిలిపాడు కావ్యానికి.

ఈ కావ్యం రెండు కొనల రెండు ఋష్యాశ్రమాలు. అంటే నిత్యయజ్ఞం. యజ్ఞమంటే యీ లోకానికి ఊపిరినివ్వడం, అష్టతనువులతో, యీశ్వరుడిలా.

ఇచ్చేవాడు ఈశ్వరుడు.

## 2.3.కులగురువు కాళిదాసు-శాక్తేయము

ఈ వ్యాసం కవికులగురువు కాళిదాసు కవిత్వమహత్త్వం గురించి కాదు.కులగురువు కాళిదాసు, ఆ నాటి కాళిఉపాసన గురించి. ముఖ్యంగా ఒకనాడు మనదేశంలో, ప్రధానంగా ప్రాచీన ఉత్తరభారతంలో హిమాలయరాజ్యాలలో , పడమర గాంధారం నుండి తూర్పున కామాఖ్యాదేవి ఆలయానికి ప్రసిద్ధిచెందిన గౌహతి వరకు, ప్రబలిన శాక్తేయవామాచారానికి కాళిదాసు దాసుడా, అన్నవిషయం గురించి. ( ఈ సందర్భంలో కాళీఘాట్ ( కోల్కతా) ను రామకృష్ణపరమహంసను ప్రత్యేకంగా చర్చించవలసి ఉంటుంది.ఆ ప్రస్తావన తరువాత చేద్దాం. ) వామాచారశాక్తేయానికి వైదికశాక్తేయానికి మధ్య ఒక మధ్యధరా ఉన్నది అని గుర్తించవలె. ప్రస్తుతవ్యాసంలో చెప్పదలచుకున్నది, కాళిదాసు పేరులో మాత్రమే కాళి, ఆయనవామాచారాన్ని అనుసరించినవాడు కాడు అని. కాళిదాసు జీవితాన్ని గురించి మనకు తెలిసినవి కొన్ని కథలు కొన్ని నిజాలు. ప్రస్తుతవ్యాసంలో నేను చెప్పదలచుకున్నది ఒకటి, ఆయన కేవలం కవికులగురువు కాదు,భారతజాతికి కులగురువు కూడా. ఆయన జాతిని పతనంనుండి కాపాడిన ద్రష్ట. కాళిని ఉంచవలసిన స్థానంలో ఉంచుతూ, గౌరిని ఏ స్థానంలో నిలపాలో ఆస్థానంలో ప్రతిష్ఠించాడు. కాళీ, గౌరీలు కేవలం వర్ణవివక్షా విషయాలు కావు. ధర్మసంస్థాపనవిషయాలు. భారతభూమిని శత్రువులనుండి హిమాలయాలు కాచినవి అంటాం. ఆ హిమాలయాలనే కాపాడినవాడు కులగురువు కాళిదాసు, హిమాలయసమానుడైన కవికులగురువు.ఆదిశంకరుల పూర్వావతారం కాళిదాసు అనవచ్చు.

వైదికధర్మం యీ నాటి సాంఘికదుర్వ్యవస్థకు దురాచారాలకుమూలకారణమని అదేపనిగా దానిని దుయ్యబడుతున్నాం. కాని, ఒక్కడూ ఆనాటి కాని యీనాటి కాని వామాచారశాక్తేయం వలన జాతికి కలుగగల కలుగుతున్న హానిని గుర్తించడం లేదు. ఈ నాడు ఎందరు “గురువులు”!వారి ఆశ్రమాలలో ఏమేమి ఆచారాలతో “క్రతువులు” చేస్తున్నారో అందరికీ తెలుసు. అజ్ఞానంలో జనసామాన్యం వాటికి వశమై పతనమవుతున్నారు.ఏ సమాజంలోనైనా దురాచారాలు సాగుతుంటాయి.వాటిని నివారించడానికి చట్టాలు చర్యలు ఉంటాయి. కాని ఆ దురాచారాలకు తాత్త్వికామోదము చట్టసమ్మతి ఉన్న సమాజం ఎలా పతనమవుతుందో ఊహించడం కష్టం కాదు.అదే జరుగుతూ ఉండింది ఆకాలంలో. ( ఆ నాటి హిమాలయరాజ్యాల చరిత్ర తెలుసుకోవలెనంటే కల్హణుడి “రాజతరంగిణి” ఆధారగ్రంథం.ఆంగ్లంలో అనేక అనువాదాలున్నాయి. వాటిలో ఒకటి, *Rajatarangini: The Saga of the Kings of Kashmir* by Ranjit Sitaram Pandit (The Indian Press, Allahabad; 1935 . మన ప్రస్తుత వ్యాసానికి యిది ప్రధానం కాదు.)

సాధారణంగా ఒక ధర్మం దాని సిద్ధాంతంపై, దర్శనంపై ఆధారపడిఉంటుందని అనుకుంటాం. ఇది తప్పు. ఏ ధర్మమైనా ధర్మమే, అధర్మం కాదు.సర్వధర్మాలు సరి అయినవే, హిందూధర్మమని పిలువబబడుతున్న సనాతనధర్మము, క్రైస్తవము, యిస్లామ్, అద్వైతము, ద్వైతము, విశిష్టాద్వైతము, శాక్తేయము, యింకా అనేకం.అన్నీ అనుసరించదగినవే.అవన్నీ మన జాతి ఆహ్వానించి అనాదిగా ఆదరించినవే. కాని, ధర్మం వాదంపై కాదు, ఆచారంపై ఆధారపడుతుంది.

“ధర్మం వద” కాదు, “ధర్మం చర” ప్రమాణం. “ఆచారప్రభవో ధర్మః”( విష్ణుసహస్రనామ స్తోత్రఫలశ్రుతి. ) మరి శాక్తేయంలో సిద్ధాంతదోషం లేదు కనుక , శాక్తేయం ఆదరణీయమైనదే అనడం అన్యాయం కదా? సమాజంపై దాని ప్రభావం చూడవద్దా? సనాతనధర్మాన్ని దాని సామాజికప్రభావకారణాలకే కదా దుయ్యబట్టడం? బుద్ధుని బోధనలను కాదనలేదు సమాజం. కాని బౌద్ధారామాలలోని భ్రష్టాచారాలుకూడా సదాచారాలనగలమా? కొన్ని శాక్తేయశాస్త్రగ్రంథాలు భ్రష్టాచారాలకు శాస్త్రప్రతిపత్తి కూడా కల్పించాయి.

“ అనిత్యం నిత్యమ్.అజ్ఞానం జ్ఞానమ్.ధర్మ విరుద్ధా కార్యాః. ధర్మవిహితా న కార్యాః. అన్యాయో న్యాయః. వ్రతమ్ నాచరేత్.న తిష్ఠేన్నియమేన....ప్రాకట్యమ్ నకుర్యాత్.” (కౌలోపనిషత్తు. అనువాదం అవసరం లేదు. పైగా చివరి వాక్యం “ప్రాకట్యమ్ న కుర్యాత్.” “ఇవేవీ పైకి చెప్పవద్దు.”! ) దీనిగురించే కదా గీతావాక్యం, “ అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా”(18. 32)

శాక్తేయం అవలంబించిన ముక్తులున్నారు, రామకృష్ణ వంటివారు కొందరు శాక్తేయసాధన కూడా చేశారంటారు . కాని వారు ఆ సాధనలో ముక్తులు కాలేదు, ముక్తులై సాధన చేశారు.ఆదిశంకరుల గురించి ఒక కథ. ఒకసారి ఆయన శిష్యులతో వెళుతుండగా దారిలో ఒక సారా కొట్టు కనిపించింది. ఆయన కొట్టులోపలికి వెళ్ళి, అడిగి తీసుకుని సారా తాగాడు. శిష్యులు నివ్వెరపోయారు. “మనమెందుకు తాగకూడదు”, అనుకున్నారు. గురువు గ్రహించాడు. మరికొంతదూరం వెళ్ళిన తరువాత, ఒకడు సీసం కరిగిస్తున్నాడు. ఆ కరిగిన సీసం అడిగి తీసుకుని తాగాడు! శిష్యులకు నిర్ఘాంతపోయారు. వారికి జ్ఞానోదయమైంది. పరమహంసల, అవధూతలవిషయం వేరు. వారి ఆచారం జనసామాన్యం ఆచరించడం ప్రమాదకరం, సమాజపతనసూచన. తరించడానికి దారులు అనేకం ఉండవచ్చు. కాని ఏ దారి సామాజికసువ్యవస్థకు శ్రేయస్కరమో దానిని కదా మనం ఎన్నుకోవలె? ఆ ఎన్నిక ఋషులు కవులు ఎప్పటికప్పుడు చేస్తూనే ఉన్నారు. ఒకనాడు వ్యాసమహర్షి తన మహాభారతంలో చేశాడు, ఆ తరువాత కాళిదాసు చేశాడు. సన్మార్గం వదిలిన జాతిని తిరిగి ఆ మార్గంలో నడిపించడానికి ప్రయత్నం చేశాడు, “సన్మార్గాలోకనాయ వ్యపనయతు స వస్తామసీం వృత్తిమీశః”( మాళవికాగ్నిమిత్రమ్, నాందీశ్లోకం) తామసికప్రవృత్తినుండి తప్పించి ( “వ్యపనయతు”) , కళ్ళు మూసుకుపోయిన జాతికి సన్మార్గం వైపుకళ్ళు తెరిపిస్తున్నాడు, “సన్మార్గాలోకనాయ” .

వామాచారంలో అభ్యంతరకరమైనది ప్రధానంగా దాని స్త్రీదృష్టి. ఆ ఆచారంలో స్త్రీ కులట. ఏ తంత్రశాస్త్రగ్రంథమైనా నిర్ద్వంద్వంగా ఘోషిస్తుంది. వైదికధర్మదృష్టిలో స్త్రీ వివాహవ్యవస్థకు ఆధారస్తంభం, ధర్మపత్ని.

కాళిదాసు కాశ్మీరశైవుడు, శివాద్వైతి అన్నది ప్రసిద్ధమే. ఆ నాడు కాశ్మీరమే కాదు హిమాలయరాజ్యాలన్నీ శైవమేకాక శాక్తేయవామాచారాలను కూడా విరివిగా అవలంబించాయి. దాని అధ్యయనం ప్రస్తుతవ్యాసవిషయం కాదు. కాళిదాసు వామాచారాలను తన కావ్యాలలో ఎక్కడైనా సమర్థించాడా? స్త్రీని వామాచారదృష్టితో ప్రదర్శించాడా? వామాచారాలను అనుసరించదగినవే, అవికూడా సమాజానికి శ్రేయస్కరమే అన్నాడా? ఒకవేళ కొంతకాలం తాను శాక్తేయావలంబి అయినా, తన కావ్యాలలో దాని నీడలున్నాయా? కావ్యరచనల కాలం నాటికి

అతడి దృష్టి మారిందా? ఈ చర్చ అప్రధానం. కాళిదాసు కాళిని ( వామాచార ఉగ్రదేవతగా) ఏ స్థానంలో ఉంచాలో ఆ స్థానంలోనే ఉంచాడు. ఆమె మనకు ఎక్కడ కనిపిస్తుంది? శివుడిపెళ్లికి వెళుతున్న దేవతలవరుసలో, " తాసాం చ పశ్చాత్ కనకప్రభాణాం, కాలీ కపాలాభరణా చకాసే." ( కుమారసంభవమ్: 7.39). ఆ దేవతలవరుసలో ఎక్కడో వెనక ( "పశ్చాత్" ) ఉంది, పిలవని పేరంటానికి వెళ్ళిన పెద్దముత్తైదువలా.

కాని హిమాలయశాక్తం కాళిదాసు భావనలో భాగమై ఉంది అనడానికి ఆయన ప్రత్యభిజ్ఞానశాకుంతల నాటకం పేరు చెరగని సాక్ష్యం. ప్రత్యభిజ్ఞ తంత్రశాస్త్రంలో అభినవగుప్తుని సిద్ధాంతంగా ప్రసిద్ధం . కాని అతడికి పూర్వం ఆ దర్శనం లేకపోలేదు, ఆదిశంకరునిముందు అద్వైతమున్నట్టే. ఆ పదాన్ని కణ్వుడు వాచ్యంగా
ఉచ్చరించాడు కూడా నాటకంలో, " యదినామ స రాజా ప్రత్యభిజ్ఞాన మంథరో భవేత్ తతః తస్యేదమాత్మనామధేయాంకితం అంగులీయకం దర్శయ." ( "ఒకవేళ ఆ రాజు నిన్ను గుర్తించడంలో బుద్ధిహీనుడైతే ("ప్రత్యభిజ్ఞాన మంథరః") ,అప్పుడు అతడి పేరు ముద్రించిన యీ ఉంగరం చూపించు.") కాశ్మీరశైవమనబడే శివశక్తుల అద్వైతం ఉపనిషత్తుల అద్వైతమే. ఉపనిషత్తులు చెప్పే ఆత్మబోధకూడా ప్రత్యభిజ్ఞే కదా? ఆత్మ జ్ఞానం అంటే, గుర్తించలేకపోయిన ఆత్మను గుర్తించడం కదా? కాశ్మీరశైవానికి అద్వైతానికి రెండు ప్రధాన భేదాలు. ఒకటి, కాశ్మీరశైవం శివుడితోపాటు శక్తిని కూడా ప్రతిపాదిస్తుంది.రెండు , అది మాయావాదాన్ని అంగీకరించదు. ఇవి అంత ప్రధానమైన భేదాలు కావు. ప్రధానం, రెండు దర్శనాలలోను స్త్రీకి యివ్వబడిన కేంద్రస్థానం. అంతకంటే ప్రధానం, వారి ఆచారంలో స్త్రీకిచ్చిన ప్రాధాన్యం, వామాచారానికి ఆ రెండు అద్వైతాలు ( అద్వైత, శివాద్వైతాలు) దూరం.

కాళిదాసు శివశక్తులకు ఐక్యం చెబుతాడన్నది ఆయన ప్రసిద్ధశ్లోకం "వాగర్థావివసంపృక్తౌ " ప్రకటిస్తున్నది. కుమారసంభవకావ్యంలో పార్వతిని శివుడికి కన్యాదానం చేస్తూ "తమర్థమివ భారత్యా సుతయా యోక్తుమర్హసి." ("అర్థమును వలె నా కుమార్తెను కలుపుకో "). స్త్రీ అర్థంలేని శబ్దం కాదు. ఆమె సార్థకం. కాళిదాసుకావ్యమంతటా పరచుకుని ఉన్నది యీ స్త్రీసార్థక్యం. హిమాలయరాజ్యాలలో వామాచారులు స్త్రీని ఎంత దిగజార్చారో, కాళిదాసు అంత ఎత్తున హిమాలయశిఖరాలలో నిలిపాడు. హిమాలయరాజ్యాలలో వామాచారాల పేర ఆనాడు దిగజారుతుండిన వివాహజీవితాన్ని తిరిగి సంస్థాపించవలెనని ప్రయత్నం చేశాడు కాళిదాసు. ఆ నాటి "కులట" ను ఉద్ధరించి, ఆమెను కులస్త్రీగా , ధర్మపత్నిగా నిలబెట్టాడు. (వామాచారంలో "కులట"కు అత్యున్నతస్థానం. ("కులయోషిత్ కులం త్యక్త్వా పరం పురుషమేతి సా": వామకేశ్వరతంత్రం : 4.14)
భారతజాతిని కాపాడవలసిన వివాహవ్యవస్థను,తిరిగి హిమాలయశిఖరాలకు చేర్చవలెనని కులగురువు కలకన్నాడు ఆనాడు.

స్త్రీని ఉన్నతస్థానంలో నిలపడమంటే పురుషుడిపై స్త్రీకి ఆధిపత్యం యిచ్చి , శివుడిపై శక్తిని నిలపడం కాదు. ("అస్యాం పరిణతాయాం తు న కశ్చిత్ పర ఇష్యతే." "ఈమెను శాసించువాడు మరొకడు లేడు". వామకేశ్వరతంత్రం: 4.5.)కాళిదాసుదృష్టిలో శివశక్తులసామరస్యం సృష్టితత్త్వం.

శివుడు సతి కొరకు తపించాడు. పార్వతి శక్తి కావడానికి తపించింది. ఏ స్త్రీపురుషులైనా అలా తపించవలసినదే. కాళిదాసు శకుంతల వివాహం కణ్వాశ్రమంలో , భువిలో, నేలమీద, జరిగింది. అది దివిలో కశ్యప మహర్షి ఆశ్రమంలో సార్థకం అయింది, ఎంతో సాధన తరువాత కలిగిన వివాహసిద్ధి, శుద్ధి అది . వివాహాలు దివిలో జరుగుతాయి అంటే యిదేనేమో? కాళిదాసు దృష్టిలో వివాహబంధం కేవలదైహికం కాదు, అది "భావబంధనం", ("భావబంధనం బభూవ యత్స్రేమ పరస్పరాశ్రయం": "శాకుంతలమ్").

వైదికతంత్రశాస్త్రపరిభాషలో శకుంతలాదుష్యంతుల ప్రథమసమాగమం మూలాధారంలో ( పృథివీతత్త్వం, భువి) జరిగింది, అది సాధనలో సహస్రారం చేరి (దివిలో ) సిద్ధి చెందింది. వైదికదృష్టిలో ధర్మసంస్థాపనమంటే ధర్మపత్నీసంస్థాపనం.భగవంతుడు అవతరించవలసి వచ్చేది ధర్మసంస్థాపనం చేయవలసినపుడే. నీకు మోక్షమే యివ్వవలసివస్తే ఆయన దిగిరానక్కరలేదు, నిన్ను వైకుంఠానికి రప్పించుకుంటాడు.

శాకుంతలనాటకం నాందీశ్లోకం "యా సృష్టిః స్రష్టురాద్యా" ("మొదటి సృష్టి ఎవరో ఆమె") తో మొదలవుతుంది.శాకుంతలనాటకం కూడా ఆదిసృష్టి , అప్పుడే పుట్టిన పుష్పం, అనాఘ్రాతం, స్వచ్ఛం, సుభగం. ఇన్ని శతాబ్దాలు గడిచినా.

ఇక దివినుండి దిగి, దైనందిన వివాహవ్యవస్థను కుటుంబజీవనాన్ని ఎంత సహజంగా సజీవంగా చిత్రించాడో కాళిదాసు చూద్దాం! ఆయన గీచిన హిమవంతుడి కుటుంబం చిత్రం చూద్దాం. ( హిమవంతుని యింటికి వెళ్ళాలంటే మనం కొండ ఎక్కవలెకదా!) తన యింటికి వచ్చిన సప్తర్షులతో హిమవంతుడు తమను పరిచయం చేసుకుంటున్నాడు, "ఏతే వయమ్ యిమే దారాః కన్యేయం కులజీవితం."( ఇదీ మేము. ( "కులజీవితం", మా కుటుంబం, మా కుటుంబజీవనం).ఇదిగో యీమె భార్య, యీమె కన్య (పెళ్ళికూతురు)." మహర్షులు శివుడి కొరకు కన్యను అడిగినపుడు ,ఆ యింటాయన ఏం చేశాడట? భార్యవైపు చూశాడట . ఆమె సలహా యిచ్చిందా? లేదు, ఒక్క చూపు చూసింది. ఆయనకు కావలసిన సమాధానం దొరికింది. కూతురి పెళ్ళి విషయాలలో నిర్ణయం ఎప్పుడూ గృహిణి చూపుల్లోనే ఉంటుంది. ( "ప్రాయేణ గృహిణీ నేత్రాః కన్యార్థేషు కుటుంబినః" )ఏ కుటుంబంలోనైనా అదే ఉంటుంది, ఉండవలె, అంటున్నాడు కాళిదాసు.

***

# 3. దివ్యలీల

(Dante's The Divine Comedy)

## "దివ్యలీల"( Dante's The Divine Comedy): ప్రారంభపద్యం

***

"మన బతుకుదారి మధ్యలో
కనుగొన్నాను ఎక్కడో దారి తప్పానని
దిక్కుతోచని ఒక గహనవనంలో చిక్కుకున్నానని."

(Nel mezzo del cammin di nostra vita
mi ritrovai per una selva oscura
che' la diritta via era smarrita. )

ఇది "ద డివైన్ కామెడీ" లో మొదటి పద్యం, నాందీ శ్లోకం అనవచ్చు, వస్తునిర్దేశం చేస్తూంది కనుక. ( ఆ కావ్యాన్ని ఎవరైనా తెలుగులోకి అనువదించారేమో తెలియదు. పేరుకు నా అనువాదం "దివ్యలీల")

ఈ ఉపమానం ఛాందోగ్యోపనిషత్తులో కూడా ఉంది. గాంధారదేశవాసిని ఒకనిని దొంగలు కళ్ళకు గంతలు కట్టి తీసుకెళ్లి ఒక నిర్జనమైన అడవిలో వదిలేశారు. దిక్కుతోచక తన స్వదేశానికి ఎలా వెళ్ళాలో తెలియక రక్షించండి అని ఆక్రోశించాడు. ఎవరో ఒక మహాపురుషుడు అతడి కళ్ళక కట్టిన గంత తొలగించి,యీ దిక్కుగా వెళ్లు , మీ గాంధారదేశం చేరుతావు అని దారి చూపినపుడు, అతడు ఊరూరు తిరిగి, దారి అడుగుతూ తన గాంధారదేశం చేరుకుంటాడు. అలాగే యీ లోకంలో ( "ఇహ" ) దారి చూపేవాడు దొరకాలి. క్షణంలో జ్ఞానం కలిగి ముక్తుడౌతాడు,"ఆచార్యవాన్ పురుషో వేద" .

( యథా సోమ్య పురుషం గాంధారేభ్యోఽభినద్ధాక్షమానీయ తం తతోతిజనే విసృజేత్ ...తస్య యథాభినహనం ప్రముచ్య ప్రబ్రూయాద్ ఏతాం దిశం గాంధారా ఏతాం దిశం వ్రజేతి స గ్రామాద్గ్రామం ప్రచ్ఛన్ పండితో మేధావీ గాంధారేనేవోపపద్యేత ఏవమేవ ఇహ ఆచార్యవాన్ పురుషో వేద... ( 6.14.1-2. )

***

డాంటే జీవితకాలరచన అయిన " దివ్యలీల" ( The Divine Comedy: La Divina Commedia) అతడి దేశబహిష్కారకాలంలో, ప్రవాసంలో జరిగింది. ఈ ప్రవాసం ఆ విధంగా సఫలమనే చెప్పాలి. ఈ ప్రవాసకాలంలో ఆయన అనేక రాజ్యాలు తిరిగాడు, అనేకదేశాధిపతుల, సంపన్నుల ఆతిథ్యము ఆదరసత్కారాలు పొందాడు. జీవితచరమదశలో రావెనా ( Ravenna) నగరాధీశుడు గీడో (Guido Novello da Polenta) కూడా ఆయనను ఆదరించి సత్కరించాడు. డాంటే మరణం (1321) రావెనా లోనే, "కామెడీ" రచన ముగిసిన కొద్దికాలంలో.తన జీవితానుభవం, ఒక దేశదుస్థికే ప్రతీక. దేశ దుస్థితి ఒక మనిషిది కాక మనిషి దుస్థితికి ప్రతీకగా కావ్యత్వం పొందుతుంది. బైబిల్ లో చెప్పిన ప్రవాసాన్ని ( బాబిలోనియా లో యూదుల బానిసప్రవాసం)

కేవలం ఒక జాతిదికాదు. అది మనిషి ప్రవాసం, యీ లోకమే మనిషి ప్రవాసం. ఇంత విస్తృతిని సంపాదిస్తాడు డాంటే, తన కావ్య ప్రారంభంలో.

ప్రవాసం:

ప్రపంచసాహిత్యంలో ప్రవాసం ఒక ప్రముఖ కావ్యవస్తువు. కాని అన్నిటి కావ్యప్రయోజనం ఒకటి ఉండదు. ఒక్కొక కావ్యంలో ప్రవాసం ఒక్కొక ముఖం ప్రదర్శిస్తుంది. రామాయణంలో పదునాలుగేళ్ళు, భారతంలో పన్నెండు సంవత్సరాల అరణ్యవాసం , అంతకంటే కష్టమైన ఒక సంవత్సరం అజ్ఞాతవాసము చెప్పబడినవి . కాని రామాయణంలో , భారతంలో "వనవాసం మంచిదే" అనిపించేంతగా చెప్పబడింది. సీతాదేవి తిరిగి వనవాసం కోరింది, ( తెలిసో తెలియకో, మంచికో చెడుకో ) . వనవాసం అంత ఆహ్లాదకరం! అరణ్యవాసం చేస్తున్న పాండవులను సంజయుడు చూచినపుడు ధర్మరాజు ఎట్లా ఉన్నాడట! "వనవాసము సేసియు త్రిభువనరాజ్యము చేయునట్టి వడువున సంతోషనిబద్ధబుద్ధి" ( ఆరణ్య.1.66). సంతోషనిబద్ధబుద్ధి అంటే సంతోషం స్వభావం అయినవాడు అని అర్థం. కారడవిలో ఉన్నా రాజప్రాసాదంలో ఉన్నా అతడికి తేడా లేదు. "వాసవలీలన్" (ఆరణ్య: 3.123) అనికూడా అంటారు. స్వర్గలోకాధిపతి అయిన దేవేంద్రుడిలా దివ్యంగా వెలిగిపోతూ కనిపించాడట ధర్మరాజు . అంటే అరణ్యరోదనం అన్న పదానికి అర్థం లేదని కాదు. రోదనమో మోదనమో మనిషి స్వభావం, "సంతోషనిబద్ధబుద్ధి". వనవాసస్వభావం మారదు. ఆత్మీయులకు, జనని జన్మభూమికి , దూరమైనామన్న దుఃఖం ప్రవాసలక్షణం.

ఈ సంతోషనిబద్ధబుద్ధి, కామ్యూ ( Albert Camus) కథ "అతిథి" కథానాయకుడు దారు ( Daru ) లో కూడా కనిపిస్తుంది.( "The Guest" : L'hôte, from ("The Exile and the Kingdom": L'Exile et le Royaume. ఫ్రెంచిలో L'hôte అనే పదానికి రెండర్థాలు, అతిథి, ఆతిథ్యం యిచ్చిన యజమాని.) నిర్జనారణ్యంలో ఒక సుదూరపు కొండచరియపై చిన్న బడిలో పంతులు. ఆ చిన్న బడిలో మరో చిన్న గదిలో తన నివాసం. ఒక మంచం, రంగు వెలిసిన బడిగోడలు, ఒక బావి. వారం వారం ప్రభుత్వం పంపించే రేషన్ మీద బతుకుతాడు .ఒక ఆశ్రమవాసి జీవితం . కాని తానొక దొరలాగా "సంతోషనిబద్ధబుద్ధి". (...s'etait senti un seigneur )

ప్రవాసంలో కూడా రెండువిధాలు. ఒకటి దేశబహిష్కారం, రెండు, పరదేశంలో బానిసబ్రతుకు. ఒక రాజు మరొక రాజ్యాన్ని ఆక్రమించి ఆ దేశప్రజలను బానిసలుగా తమ రాజ్యానికి తరలించడం.చరిత్రలో యిటువంటి బానిసప్రవాసం ప్రతిజాతి ఎప్పుడో ఒకప్పుడు అనుభవించిందే. ఈ విధమైన బానిసప్రవాసం యూదులు అనుభవించారు. బైబిల్ పాతనిబంధన (Old Testament) లోని ప్రవాసం ( Babylonian Exile ) ప్రాక్క్రైస్తవచరిత్రలో ప్రముఖ సంఘటన. ఆ తరువాత ఈజిప్టు నుండి ప్రవాసం ( Exodus) మరో ప్రముఖ ఘటన. మొదటిది, ఒక దేశపుప్రభువు ఆగ్రహఫలం; రెండవది,( Exodus : Bible) పైలోకపు ప్రభువు అనుగ్రహఫలం. ( మొదటిది, ఈజిప్టు రాజు యూదులను బానిసలుగా తన రాజ్యానికి తరలించడం; రెండవది, దైవం ఆ యూదులను బానిసత్వం తొలగించి తరలించడం.)

“దివ్యలీల” ( La Divina Commedia) కావ్యంలో డాంటే ( Dante) కు ఆచార్యుడై అతనిని దారి తెలియని కారడవిలో దారి చూపినవాడు వర్జిల్ ( Virgil). అతడు కవిగా , ఆధ్యాత్మిక ఆచార్యుడిగా కూడా డాంటేకు అనుసరణీయుడు . వర్జిల్ రాసిన ప్రసిద్ధకావ్యంలో ( Aeneid) కథానాయకుడు ఈనీస్ (Aeneas).అతడు కూడా ప్రవాసి. ధ్వంసమైన జన్మభూమి ట్రోయ్ ( Troy) వదిలి పరదేశం వలస వెళ్ళాడు. ( అక్కడ ఒక (రోమ్) సామ్రాజ్యాన్ని స్థాపించాడు కూడా. )

ఇక షేక్స్ పియరు వద్దకు వస్తే ప్రవాసం లేని నాటకం లేదేమో! As You Like It నుండి టెంపెస్ట్, పెరిక్లీసుల వరకు. ఎక్కువగాన రాజకీయమే ప్రవాసకారణం.

“Now, my co-mates and brothers in exile,
Hath not old custom made this life more sweet
Than that of painted pomp? Are not these woods
More free from peril than the envious court?
…
And this our life, exempt from public haunt,
Finds tongues in trees, books in the running brooks,
Sermons in stones, and good in everything.
(As You Like It: II.i.1–17)

ఇక్కడ, అడవులపాలైన ఒక ప్రభువు తన రాజ్యభ్రష్టతో రాజీపడడంలా ధ్వనిసోంది. ఆ రాజీ భావకవిత్వోద్యమస్ఫూర్తితో వ్యక్తం అవుతోంది. కృష్ణశాస్త్రి మాటల ప్రతిధ్వని (! ) లా వినిపిస్తోంది, “ ఈ అడవి దాగిపోనా, ఎటులైననిచటనే ఆగిపోనా .” అయితే, కృష్ణశాస్త్రి “ప్రవాసి”లో ప్రవాసదుఃఖమయం.

“తుఫాను”(The Tempest) లో, ప్రధానపాత్ర, సూత్రధారి ప్రోస్పెరో లో ద్వైవిధ్యం ఉన్నట్టు కనిపిస్తోంది ప్రవాసవిషయంలో. తన జన్మభూమిని చేరాలన్న తపన ఉన్నది, తాను కొంతకాలం ప్రవాసం చేసిన పాలించిన ద్వీపం వదిలి వెళ్ళడంలో కొంత నిర్వేదమూ ఉంది, “Our revels now have ended.”ప్రోస్పెరో కు స్వరాజ్యమంటే స్వేచ్ఛ కాదు, బాధ్యత. “ నా యిచ్ఛయే గాక నాకేట వెరపు” ( కృష్ణశాస్త్రి) . తిరిగి తన జన్మభూమికి వెళ్ళడంలో తొందరపడడు, దారిలో నేపుల్స్ లో ఆగుతానంటాడు, పెళ్లివిందుకోసం.

బోద్ లేర్ కవితల్లో ప్రముఖమైనది “ హంస” ( La Cygne) . దాని కవితావస్తువు ప్రవాసం. ఆ కవిత హ్యూగో ( Victor Hugo) కు అంకితం. మూడవ నెపోలియన్ ను దేశద్రోహి అన్నాడు హ్యూగో. ఒక దేశపు చక్రవర్తిని దేశద్రోహి అని ఎవడైనా బతకడమే ఆశ్చర్యం. దేశబహిష్కారం చేశాడు చక్రవర్తి. హ్యూగో అప్పుడు గెర్న్సీ ద్వీపానికి వలస వెళ్ళాడు. అతడి ప్రసిద్ధనవల Les Miserables ప్రవాసంలో రాశాడు. కాని అతడికి ఆ ద్వీపమే నచ్చింది. ఎనిమిది సంవత్సరాల తర్వాత నెపోలియన్ ఆంక్ష తొలగించినా హ్యూగో ఫ్రాన్సుకు తిరిగి రావడానికి యిష్టపడలేదు. ఫ్రాన్సులో పూర్తిగా ప్రజాపాలన ఏర్పడిన తరువాతనే స్వదేశానికి తిరిగి వెళ్ళాడు.

ఇక, బోద్లేర్ కవితలో ఆంద్రిమాక్ తన భర్తను పోగొట్టుకొని, స్వదేశం ( ట్రోయ్) వదిలి బందీగా విజేత భార్యగా ఎపైరస్ ( గ్రీసు ) లో ప్రవాసం అనుభవించింది.

"ఆంద్రిమాక్ , నీవు గుర్తొస్తున్నావు–
నీ నవవైధవ్యమహద్వ్యసనానికి దీనదర్పణం,
ఆ కుల్య, అసత్యసిమ్వా , నీ కన్నీటితో
పొంగి మహాప్రవాహమైన కాలం" ,

ఈ బోద్ లేర్ కవితలో ఒక్క ఆంద్రిమాక్ ప్రవాసమే కాదు, అన్నివిధాల ప్రవాసము కవితావస్తువు. తన పారిస్ నగరమే తనకు ప్రవాసంగా మారిపోయింది అంటున్నాడు బోద్ లేర్:

"ఒకనాటి పారిస్ యిక లేదు ( ఒక నగరరూపం మనిషి
మనసుకంటే, అయ్యో! త్వరగా మారుతుంది ;"

"చిక్కిశల్యమైన నీగ్రోవనిత గుర్తొస్తోంది,
బురదదారులు తొక్కుతూ, పొగమంచు వెనక
అదృశ్యమైన తనగొప్పఆఫ్రికా
కొబ్బరిచెట్లకోసం ఆబగా వెదకుతూ;"

బానిసప్రవాసం నీగ్రోవనితకు నిత్యనివాసం, చరిత్రలో ఆమె ఒక కన్నీటి అధ్యాయం.

అంతేకాదు, బోద్ లేర్ ప్రవాసపరిధిని యింకా విస్తృతం చేస్తాడు. కొత్త వలససామ్రాజ్యాలు స్థాపించే వారుకూడా, గొప్ప అన్వేషకులు. కాని వారికి తెలియకుండానే వారి కాంక్షాఫలంగా ప్రవాసజీవనం చేసినవారే. తమ జన్మభూమిని జ్ఞాపకాలలో సామ్రాజ్యకాంక్ష అడుగున సమాధి చేశారు.

"పురాస్మృతి ఒకటి కొమ్ము ఊదింది!
దూరద్వీపంలో విస్మృతనావికులు,
–బందీలు, పరాజితులు, ...యింకెందరో!"

ఈనీస్ ( Aeneas) కూడా ప్రవాసి. అలాటివారెందరో:

"ఎవరెవరు పోగొట్టుకున్నారో ఎన్నటికీ ఎన్నటికీ తిరిగిరానిదానిని,
ఎవరి కన్నీరు వారి సేచనమై , తోడేలు పాలు పాలనమై,
పూలలా వాడిపోతున్న అనాథులు!
వారందరూ వస్తున్నారు తలపుకు."

కామ్యూ ( Albert Camus) కథ అతిథి ( L'hôte ) ప్రవాస సరిహద్దులను చెరిపేస్తుంది. ఆ కథలో ఎవడు అతిథి, ఎవడు యజమాని? అరబ్బు నేలపై నివసించే ఫ్రెంచివాడా, అరబ్బా ? ఇద్దరూ. తన అవసరంలేని యీ భూమిపై మనిషి ప్రవాసి.

ప్రవాసి అనగానే  తెలుగువాకి యిష్టమైన కృష్ణశాస్త్రి రచన “ప్రవాసి” మరణశయ్య  గుర్తురాకుండా ఉంటుందా?

“నా కుగాదులు...

నా కుగాదులు లేవు
నా కుషస్సులు లేవు
నేను హేమంత కృ
ష్ణానంత శర్వరిని.

నాకు కాలమ్మొక్కటే
కారురూపు, నా
శోకమ్మువలెనె, నా
బ్రతుకువలె,
నా వలెనె.

ఏను మరణించుచున్నాను ...

ఏను మరణించుచున్నాను; ఇటు నశించు
నాకొరకు చెమ్మగిల నయనమ్ము లేదు;
పసిడివేకువపెండ్లిండ్ల పడిన యెవరు
కరగనేర్తురు జరఠాంధకారమృతికి?

నా మరణశయ్య పరచుకొన్నాను నేనె!
నేనె నాకు వీడ్కొలుపు విన్పించినాను!
నేనె నాపయి వాలినా, నేనె జాలి
నెదనెద గదించినాను, రోదించినాను!

బ్రతికియున్న మృత్యువునై ప్రవాస తిమిర
నీరవ సమాధి క్రుళ్ళి క్రుంగినపుడేని
నిను పిలిచినాన, నా మూల్గునీడ ముసిరి
కుములునేమొ నీ గానోత్సవముల ననుచు?”

ఈ “బ్రతికియున్న మృత్యువునై ప్రవాస తిమిరం” తో మొదలవుతుంది డాంటే కావ్యం “ దివ్యలీల” ( La Divina Commedia) :

“మన బతుకుదారి మధ్యలో  తెలుసుకున్నాను
ఎక్కడో దారి తప్పానని
దిక్కుతోచని  ఒక గహనవనంలో  చిక్కుకున్నానని.”( దివ్యలీల:ప్రస్తావన : 1-3.)

(Nel mezzo del cammin di nostra vita
mi ritrovai per una selva oscura
che' la diritta via era smarrita. )

(“ Midway our life’s path I found out that the direct way was lost  in an obscured wood.Inf :1.)

ఈ ప్రారంభపద్యంపై ఒక గ్రంథం రాయదగినంత విషయం ఉంది, “శ్రీవాణీగిరిజాః” పై రాయగలిగినంత . డాంటే “ దివ్యలీల” ( The Divine Comedy: La Divina Commedia) అతడి ప్రవాసంలో చేసిన రచన, అనేకనగరాలలో. అతడి ప్రవాసం ఒక మహాకావ్యరచనకు కారణమయింది . ఈ ప్రవాసకాలంలో ఆయన అనేక రాజ్యాలు తిరిగాడు, అనేకదేశాధిపతుల, సంపన్నుల ఆతిథ్యము ఆదరసత్కారాలు పొందాడు. జీవితచరమదశలో రావెనా ( Ravenna) నగరాధీశుడు గీడో (Guido Novello da Polenta) కూడా ఆయనను ఆదరించి సత్కరించాడు. డాంటే మరణం (1321) రావెనా లోనే, “కామెడీ” రచన ముగిసిన కొద్దికాలానికే .తన జీవితానుభవమైన ప్రవాసం , ఒక దేశదుస్థితికే ప్రతీక. దేశ దుస్థితి ఒక మనిషిది కాక మనిషి దుస్థితికి ప్రతీకగా కావ్యత్వం పొందుతుంది. బైబిల్ లో చెప్పిన ప్రవాసాన్ని ( బాబిలోనియా లో యూదుల బానిసప్రవాసం) కేవలం ఒక జాతిదికాదు. అది మనిషి ప్రవాసం, యీ లోకమే మనిషి ప్రవాసం. ఇంత విస్తృతిని సంపాదిస్తాడు డాంటే, తన కావ్య ప్రారంభంలో.కారడవిలో దారి తప్పిన మనిషి తన స్వస్థలం చేరుకోవలెనని తపిస్తాడు. ఆ తపనతో ప్రారంభం అవుతుంది “దివ్యలీల”.

***

డాంటే “ దివ్యలీల” లో ఆచార్యులు ముగ్గురు. మొదటి మార్గదర్శి వర్జిల్ ( Virgil). డాంటే యీ ప్రారంభశ్లోకంలోని ( terza rima, త్రిపద ) కారడవి ( “ una selva oscura”) ఉపనిషదర్థం ఒక్కటే కాదు. యూరపులో ఉండిన ఒక కాల్పనిక, గ్రామీణ ( romantic, pastoral ) సాహిత్యసంప్రదాయసూచన కూడా ఉన్నది. మనకు సుపరిచితమైన కృష్ణశాస్త్రి కవితాపంక్తులు:

“ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై యీ యడవి దాగిపోనా,ఎటులైన యిచటనే ఆగిపోనా”.( “ఎటులైన” లోని ప్రత్యేక స్ఫూర్తి గురించి తరువాత చెప్పుకుందాం.)

ఇటువంటి కాల్పనికతను స్ఫురింపజేస్తుంది డాంటే “selva” పదప్రయోగం. ఇటాలియన్ భాషలో అడవి అన్న పదానికి అనేక పదాలున్నాయి ,la foresta,la legna, il bosco. కాని selva అన్నపదం వాడాడు. ఈ పదంలో కాల్పనిక స్ఫూర్తి ఉంది. ఆంగ్లంలో pleasantly rural or pastoral, vistas of sylvan charm అంటారు. ఈ సందర్భంలో ఆ స్ఫూర్తి ప్రయోజనం ఏమిటి?

***

ప్రారంభపద్యంలోని "గహనవనం" (una selva oscura ) లో రెండు విరుద్ధాలను జత చేశాడు డాంటే . గహనాటవి, కారడవి మొదలైన ఎన్నో పదాలున్నాయి. అనువాదంలో “గహనవనం”

అన్న పదాన్ని ఎన్నుకోడంలో ప్రయోజనమేమిటి? వనం అన్న పదం రెండర్థాలలో వాడవచ్చు, నందనవనం అనవచ్చు, దండకవనం అనవచ్చు. ఇక్కడ డాంటే రెంటినీ ఉద్దేశిస్తున్నాడు. కనుకనే, selva (sylvan,pastoral ), oscura ( obscure, shadowed) అన్న విరుద్ధపదాలను జత చేశాడు. ఒక అర్థంలో డాంటే దిక్కుతోచని కారడవిని చెబుతున్నాడు (oscura) , మరో అర్థంలో ప్రకృతిరామణీయకతను పల్లె ప్రాంత సౌందర్యాన్ని ( selva, sylvan), చెబుతున్నాడు.నందనవనానికి చోటు చూసుకుంటున్నాడు డాంటే యీ సమాసంలో.

నందనవనానికి తరువాత వద్దాం. ముందు, sylvan, pastoral సాహిత్యసంప్రదాయం గుర్తుచేసుకుందాం. ఇంగ్లీషులో మనకు వెంటనే స్ఫురించే కవులు మార్లో ( Christopher Marlowe, The Passionate Shepherd to His Love (1599); ఎడ్మండ్ స్పెన్సర్ ( EdmundSpenser, The Shepheardes Calender, 1579; ఫిలిప్ సిడ్నీ (Philip Sidney, Arcadia,The Nightingale, The Twenty-Third Psalm ). ఈ పాస్టొరల్ సంప్రదాయం కూడా రెండు పాయలుగా సాగింది, ఒక పాయ, పల్లెపిల్లలను పట్టణ సుఖజీవనభావనలతో ఆకర్షించడం (మార్లో); రెండవ పాయ, పల్లెప్రాంతాల ప్రకృతిరామణీయకత, అమాయకత, స్వచ్ఛత. ఫిలిప్ సిడ్నీలో రెండు పాయలూ ప్రవహించాయి. ఆర్కేడియా (Arcadia) లో ప్రకృతిరామణీయకత కావ్యవస్తువు. The Twenty-Third Psalm లో ప్రకృతిపట్ల మనిషి అప్రమత్తంగా ఉండవలె, తనను కాపాడుకోవలసిన అవసరం ఉన్నది అని గుర్తు చేస్తాడు సిడ్నీ. డాంటే యీ రెంటినీ జోడించాడు,ఒక సమాసంలో .

పాస్టొరల్ కవితలో వస్తువు, కాలుష్యం లేని పల్లెప్రాంతము, కల్మషంలేని మనుషులు. గొర్రెలుకాచే (shepherds), ప్రేమజంటలు . గొర్రెలను గాలికీ మేతకూ వదిలేసి, ప్రేమగీతాలు పాడుతూ ఒకరి వెంట ఒకరు పడడం యీ సంప్రదాయంలో ప్రధానం. ( ఈ కాల్పనిక కవిత ఎంత "కాల్పనికమో" మనకు తెలియదు. ఈ కవితను ఆనందించేవారెవరూ గొర్రెలమందను కాని , గొర్రెలకాపరిని కాని చూచి ఉండరు. అది వేరే విషయం.) తెలుగు సాహిత్యంలో యీ పాస్టొరల్ కవితకు ప్రాచుర్యం భావకవులతో వచ్చింది. భావకవితలో ( కొందరు బావ కవిత అనికూడా ఎద్దేవా చేశారు!) ముందు గుర్తు వచ్చేది "ఎంకి పాటలు" ( నండూరి సుబ్బారావు. భావకవితోద్యమం జల్లెడలో మిగిలేది బహుశా నండూరి, కృష్ణశాస్త్రి మాత్రమే కావచ్చు.) పాస్టొరల్ కవితల్లో ప్రధానలక్షణం పల్లీయుల ఆత్మీయత, స్వేచ్ఛ, స్వచ్ఛత,( "ఎలతెలా పోయింది ఎర్రి నా ఎంకి". "ఎంకెవ్వరని ఎవ్వరైనా అడిగితే వెలుగునీడలవైపు వేలు చూపింతు".) వెలుగునీడల ప్రకృతికి ప్రతీక ఎంకి . నీడ లేని వెలుగు లేదు. అదే కృష్ణశాస్త్రి కవితాపంక్తి లోని "ఎటులైన" పరమార్థం. ( " ఈ యడవి దాగిపోనా, ఎటులైననిచటనే ఆగిపోనా? ") ఉండి పోవలెనని నిశ్చయించుకున్నవాడు "ఎటులైన" అనడం ఎందుకు? అడవిలో కేవలం ఆకులు, కొమ్మలు, నునులేత రెమ్మలు, ఉండవు. ముళ్ళు కూడా ఉంటాయి. వెలుగుతో నీడ ఉండక పోదు, ("వెలుగునీడలవైపు వేలు చూపింతు"). ఆ నీడలనే గుర్తిస్తూ "ఎటులైన", అన్నాడు కృష్ణశాస్త్రి. ఆ వెలుగు నీడలనే స్ఫురింపజేస్తున్నాడు డాంటే, "గహనవనం" ( una selva oscura ) లో. ఇది డాంటేపద్యంలో పై అర్థం.
కావ్యంలో దీనిపరమార్థం ఏమిటి? ఇక్కడ మనం కొంత సేపు పక్కకు జరిగి నడవాలి.

***

ఈ కావ్యంలో ప్రధానపాత్రలు రెండు, డాంటే, వర్జిల్. గహనవనంలో దిక్కుతోచని పథికుడు డాంటే, దారిజూపే ఆచార్యుడు వర్జిల్ . రెండు రంగాలలో ఆచార్యుడు వర్జిల్, కవిగా , ఆధ్యాత్మికవేత్తగా. కవిగా వర్జిల్ పట్ల అపారగౌరవం డాంటేకు.

“You are the honor and light of all other poets, may my long study and the great love that made me read your  poems serve me now. You are my master and my author.”  (Inferno 1.82–85: ).

వర్జిల్  కేవలం “ఈనీడ్” ( Aeneid ) కావ్యకర్త  కాదు, పాస్టొరల్ కవి కూడా. అతడి ఎక్లొగ్స్ (Eclogues) పాస్టొరల్ సాహిత్యసంప్రదాయంలో ప్రముఖ రచనలు. ఆ గురువుగారి పాస్టొరల్ సంప్రదాయాన్నే స్ఫురింపజేస్తున్నాడు డాంటే తన “వన” (selva ) పదప్రయోగంలో. కాని, అతడి పరమప్రయోజనం అది కాదు. ఇది ఆచార్యుడి పాదాలపై గురిపెట్టిన నమస్కారబాణం.తరువాతి బాణంతో  ఆ సంప్రదాయాన్ని గుట్టుగా తలకిందులు చేయబోతున్నాడు. ఆ తరువాత బాణం కొరకు పర్గటోరియో వరకు వేచి ఉండాలి. ( డాంటే కావ్యరచన  అల్లిక అట్లా ఉంటుంది. అల్లిక (structure) విషయం మరో అధ్యాయంలో.) ఇంతకూ ఎందుకు తలకిందులు చేయడం? క్రైస్తవధర్మంలో ప్రకృతి దానికదే ఆరాధనీయం కాదు.“ నేను గొర్రెలకాపరిని” అనలేదు క్రీస్తు;  “నేను మంచి గొర్రెలకాపరిని “ (“I am a good shepherd “) అన్నాడు. ప్రకృతిలో బైబిల్ కవులు చూచింది రామణీయకతను, కాదు. రాక్షసకంటకాలనూ కాదు. ( పాస్టొరల్ సంప్రదాయానికి ఆద్యుడని డాంటే సంభావించిన వర్జిల్ కూడా యీరాక్షసకంటకాలనూ, వెలుగునీడలలోని నీడలనూ, గుర్తించాడు (“this wood of wilderness, savage and stubborn.”:  Inf. 1.93.) అన్నవాడు వర్జిల్,  “దివ్యలీల”లో . బైబిల్ కవులు  ప్రకృతిలో దివ్యలీల దర్శించారు, రామణీయకతను రాక్షసత్వాన్ని , ముళ్ళను  పూలను తనలో లీనం చేసుకున్న దివ్యలీల .

“The sea looked and fled,
Jordan turned back.
The mountains skipped like rams,
the hills like lambs.”( Psalm: 114)

ప్రకృతి అంటే, ఆకులు కొమ్మలు నునులేత రెమ్మలు మాత్రమే కాదు. అందమైన గొర్రెపిల్లలు ముద్దుగా గంతులేయడం కాదు. పర్వతాలు, కొండలు గంతులేయడం దర్శించారు బైబిల్ కవులు, “The mountains skipped like rams,/the hills like lambs.” ఎంకి నాయుడుబావ ప్రేమలు దాని పరమావధి కాదు. పాస్టొరల్ సంప్రదాయాన్ని, ఆ సంప్రదాయంలో ఆదికవి అనదగిన వర్జిల్ ను వాచ్యార్థంలో గ్రహించిన డాంటే, పరమార్థంలో ఆ పాస్టొరల్ సంప్రదాయాన్ని తలకిందులు చేశాడు. గొర్రెల కాపరిలో  ( shepherd) మంచి గొర్రెల కాపరిని “I am a good shepherd”) దర్శించాడు. )

క్రైస్తవధర్మదృష్టితో చూచినపుడు డాంటే “గహనవనం” (una selva oscura)  ప్రయోగంలో oscura పదం  ( obscure, shadowy) ప్రధానం. కాకులు దూరని కారడవి ఆధ్యాత్మికపథంలో మొదటి దశ, అవసరమైన దశ. “I am the way, I am the truth and I am life”:(Jesus:

John: 14.6.) మనిషిని మృత్యువునుండి అమృతత్త్వం (“I am life”) వైపు నడిపించే “ బతుకుదారి” (nostra vita) . ఆ దారి కారడవిలో మొదలవుతుంది.ముందు మృత్యువేమిటో తెలియాలి. మృత్యువును అనుభవించినవాడే “మృత్యోర్మామృతం” గమయ అన్న ఆర్తనాదం చేస్తాడు. కనుక డాంటే కావ్యం కారడవిలోనే మొదటి అడుగు వేయాలి.అది అమృతత్వం వైపు మొదటి అడుగు. డాంటే యీ కారడవిని ” (una selva oscura) ఎలా మార్చేస్తాడో చూద్దాం.

***

పర్గటోరియో (Purgatoryio) లో ప్రధానవిషయాలు రెండు. ఒకటి వర్జిల్ డాంటేకు జ్ఞానస్నానం (baptism) చేయించడం. రెండు, గురుశిష్యుల భూలోకస్వర్గప్రవేశం ( The Earthly Paradise, The Garden of Eden). జ్ఞానస్నానం క్రైస్తవ పూజారులే చేస్తారు. కాని డాంటేకు, యీ జ్ఞానస్నానం (baptism) అనే ధర్మదీక్షను వర్జిల్ యిస్తాడు. వర్జిల్ క్రీస్తు పూర్వం వాడు. ఆచార్యుడై డాంటేను క్రైస్తవమార్గంలో నడిపించగల అర్హత అతడికి లేదు. కాని స్వర్గంలోని బియాట్రిస్ అతడికి అలా మౌంజీధారణ చేయమని ఆదేశించింది.

“ కనుక వెళ్ళు తక్షణం , చుట్టు అతడి నడుముకు
నమ్రగ్రాసరశన, మురికిని కడుగుతూ
చెయ్యి ముఖప్రక్షాళన.”

( “ Therefore, go now, and around his waist tie a belt of simple grass, and wash the filth off his face.” ) ( Purg: 1:94-96)

మౌంజీధారణ వంటి క్రతుస్ఫురణ కలిగే సందర్భం:

“ రెండు చేతులు చాపి నా స్వామి
నునులేత గ్రాసాన్ని గ్రహించాడు;
గ్రహించాను నేను గురుసంకల్పం.

అశ్రుసిక్త కపోలాలతో తన్ముఖమైనాను;
నరకంలో నలుపెక్కిన నా ముఖం
ప్రక్షాళితధూళియై ప్రకాశించింది.
...
అప్పుడతడా నమ్రగ్రాసపాశంతో
చేశాడు నా మౌంజీధారణ.
పెరికిన గడ్డి తత్క్షణమే, ఆశ్చర్యంగా !
పెరిగింది పచ్చగా, పెరికినచోటనే . “ ( ( Purg: canto 1: 124-136)

(“ఆశ్చర్యంగా !” “oh maraviglia !” )

“My master stretched out his hands and picked the fresh grass. I knew what he meant and offered my tear stained cheeks to him. He washed away the infernal

filth.Then he gave me the girdle, as was ordained by another.And , miraculously ( oh maraviglia!), the grass grew again where it was plucked.” ( Purg: canto 1: 124-136)

పర్గటోరియోలో పర్వతారోహణకు యీ ప్రక్షాళనం పథికుడికి అర్హత కలిగిస్తుంది .పర్గటోరియో 27 వ సర్గాంతంలో డాంటేకు వర్జిల్ క్రైస్తవ దీక్షను యిచ్చాడు .ఈ అర్హతను యివ్వడంలో మరొక ప్రాముఖ్యం ఉంది . ఆపై డాంటేకు పథనిర్దేశం చేసే అర్హత వర్జిల్ కు లేదు. తన ఆచార్యత్వాన్ని వదిలేసి, డాంటేను ఆధ్యాత్మికమార్గంలో ప్రభువును చేశాడు.

“ఇకపై, నా మాటకై సూచనకై ఎదురుచూడవద్దు;
ఇపుడు నీ బుద్ధి ఆర్జవస్వస్థం ముక్తం;
దానిని అనుసరించడం నీ ధర్మం.

ఆత్మసామ్రాజ్యానికి ప్రభువును చేస్తున్నా, ఇది ముకుటం యిది దండం.”

( Do not anymore look for my word or gesture. Your will is free, true, and steady. Here is your crown and the rod. (Virgil, Canto: 27.139-142)

***

మొదటి పర్వం (Canto ) లోని మొదటి పద్యంలో “గహనవనం” (una selva oscura) దండకారణ్యం,(“ this wood of wilderness, savage and stubborn.” అంటాడు వర్జిల్. Inf. 1.93 ). పర్గటోరియోలో యీ , క్రూరారణ్యం ఎలా మారింది?

పర్గటోరియో 28 వ సర్గ “ ఆ దివ్యవనం ( la divina foresta: Purg: 28.1) కలయతిరగాలని ఆతురత” అంటూ మొదలవుతుంది. రాక్షసాటవి (“ this wood of wilderness, savage and stubborn ”) “దివ్యవనం” (la divina foresta) గా మారిపోయింది . ఇక “గహనవనం” (una selva oscura) ఏమయింది?

నా మందగమనం కూడా అప్పుడే
చేర్చేసింది పురావనంలోకి నన్ను,
ఎక్కడ ప్రవేశించానో తెలియనంత.( Purg. 28.22-25)

(Gia` m'avean trasportato i lenti passi
dentro a la selva antica tanto, ch'io
non potea rivedere ond'io mi 'ntrassi;) (Purg. 28.22-25)

( Already my slow steps had carried me into the ancient wood,so that I could not look back to the point at which I had entered it.” )

“ గహనవనం” ( (una selva oscura) “పురావనం” ( la selva antica ) గా మారిపోయింది. ఈ పురావనం భూలోక స్వర్గం, ఈడెన్ తోట ( The Earhly Paradise, Garden of Eden) అన్నది స్పష్టమే. ఈ “పురావనం” (la selva antica’)  గొర్రెలకాపర్లు ప్రేమగీతాలు పాడుకునే వనం కాదు. ఇది కామస్పృహలేని పతనపూర్వ (prelapsarian ) యీడెన్ వనం ( Garden of Eden). “పురా” ( antica) వాడడం వలన ఆనాడు  పోగొట్టుకున్న స్వర్గం ( Paradise Lost) తిరిగి పొందడమన్న Paradise  Regained) స్ఫురణ కలుగుతోంది. (మిల్టన్ కు మార్గదర్శి అయినాడు డాంటే. ఇంతవరకూ తనను నడిపించిన వర్జిల్ నే ఒక నమస్కారబాణంతో యింటికి పంపించాడు ! ) అలా రెంటినీ (oscura,antica) అనుసంధించడానికి సాధనం selva పదం . ఆ పదం మారలేదు, oscura మారింది, antica వచ్చిచేరింది. గహనవనాన్ని ( dark wood:una selva oscura)   దివ్యవనంగా (la divina foresta: Purg: 28.1),ఈడెన్ వనంగా ( “la selva antica” :Purg. 28.22-25) మార్చాడు డాంటే . పాస్టొరల్ సాహిత్యసంప్రదాయాన్ని తలకిందులు చేసి దాన్ని బైబిల్ (క్రైస్తవ) సాహిత్యసంప్రాయదాయంలో నిలబెట్టాడు.

మొట్టమొదటి త్రిపద లోని “una selva oscura” ను సుమారు* నాలుగువేల చరణాల తరువాత “la selva antica” తో కలిపి ముడివేయడం డాంటేకు మాత్రమే సాధ్యం.

ఇదే డాంటే అల్లిక జిగిబిగి.

ఈ ప్రారంభపద్యంలోని పదప్రయోగంలో  చూడవలసింది యింకా ఉంది.

***

“…la diritta via era smarrita”: (“ the direct way was lost ”)

“స్మరిత” (“smarrita”) అన్న ఇటాలియన్ పదానికి సంస్కృతపదం “(వి)స్మరిత”. ఈ  సాదృశ్యం, విపరీతార్థంలోనే అయినా, యాదృచ్ఛికం కావచ్చు. ( “స్మృతి భ్రంశాత్ బుద్ధినాశః బుద్ధినాశాత్ ప్రణశ్యతి.” గీత. 2.63.). విచిత్రమేమంటే, డాంటే రెండు విరుద్ధార్థాలూ  (స్మరిత, విస్మరిత) ఉద్దేశించినట్టే ఉన్నాడు. పథికుడు అడవిలో దారితప్పలేదు,  దారితప్పి  అడవిలో అడుగు పెట్టాడు.  ఋజుమార్గం (“la diritta via”) వదిలి, తప్పుదారి పట్టాడు కనుక గహనవనంలో ఉన్నాడు .("I am the way and truth and the life." John:14.6) అతడు దారితప్పక ముందు అది దండకారణ్యం కాదు, దివ్యవనమే,  (“ la Divina foresta”:  Purg: 27.1.1-3; భూతలస్వర్గమైన పురావనమే ( “ la selva antica”: Purg: 27.22-24. Gaden Of Eden ).  అంటే ఆ వనాన్ని దండకవనంగా  మార్చింది మనిషి, అపమార్గం పట్టిన మనిషి. ఈ కావ్యంలో డాంటే ప్రతి మనిషికి ప్రతీక (Everyman).అలా , కథానాయకుడు.

అపమార్గం పట్టిన మనిషితో, అంటే ఆదిమానవపతనంతో , కావ్యం మొదలవుతుంది.  (Adam’s Fall, Original sin).కవి మనిషి  పోగొట్టుకున్న స్వర్గం ( Paradise Lost) చెప్పాడు (“smarrita” లో). తిరిగి స్వర్గం పొందడం కూడా సూచించాడా (Paradise Regained) యీ నాందీపద్యంలో ? ఇందులో ఒక పదంలో అటువంటి సూచన ఉండవచ్చుననిపిస్తోంది .అది “ritrovai” . ఇటాలియన్ లో ritrovai  అన్నా,  trovai అన్నా ఒకటే అర్థం, “కనుగొన్నాను”. మరి trovai

అనవచ్చుగదా? దారి తెలియడం లేదు అని చెప్పవలసిన సందర్భంలో , కనిపించింది (ritrovai :found again) అనడం ఎందుకు ? ఇంతకూ యీ పదంలో డాంటే ఏం చెబుతున్నాడు, స్మరణమా విస్మరణమా? స్మృతి భ్రంశమా, స్మృతిలాభమా? ( “ నష్టో మోహః స్మృతిర్లబ్ధా”( గీత. 18.73). అడవిలో దారి తప్పిపోయిందా , దారి దొరికిందా ? రెండు విరుద్ధాలూ చెబుతున్నాడా? చెబితే, ఆ విరుద్ధాలను ఎలా సమన్వయించుకోవలె. “...mi ritrovai” ( I found me) ని రెండు విధాలుగ విరుద్ధాలుగా అనువాదం చేయవచ్చు, “నాకు దారి దొరికింది”, “నేను దారితప్పాను”! “ ...mi ritrovai per una selva oscura” ( I found myself again in a dark wood. ) ఇక్కడ ritrovai బదులు trovai అనవచ్చు. కాని డాంటే రెండర్థాలు స్ఫురించాలనే “ri “ ( “ తిరిగి, మళ్లీ ” ) చేర్చి ఆ పదం వాడాడు, mi ritrovai అని .అంటే, మనిషి పతనం ఎప్పుడో ఆదిలో బైబిల్ జరిగిపోయింది కాదు, నిత్యమూ జరిగేదే. మనిషి మళ్లీ మళ్లీ పతనమవుతుంటాడు. ఆ తప్పు దారి మళ్ళీ మళ్ళీ కనిపిస్తుంది, చిత్తభ్రమణకారణమై ఎదురు తగులుతూనే ఉంటుంది. అందుకే ritrovai. మనిషి దారి తప్పడం యిది మొదటిసారి కాదు. నేనొక గహనవనం “కనుగొన్నాను’ అన్నా ( “లబ్ధా” ) , నేను దారి “మర్చిపోయాను” ( ho perso , I lost, “నష్టః“ ) అన్నా ఒకటే . అటువంటపుడు, ఆ రెంటిలో “ లబ్ధా” అన్న లాభాన్ని స్ఫురింజేసే ritrovai పదాన్ని ఎన్నుకోడంలో కవిత్వప్రయోజనమేమిటి? నష్టస్వర్గప్రాప్తి స్ఫురణ కొరకు, ( Paradise Regained). పతనోత్థానాల పౌనఃపున్యార్థాన్ని స్ఫురింపజేయడానికే ritrovai. ఒక్క పదంలో రెండర్థాలు, రెండు వ్యతిరేకార్థాలు స్ఫురింపజేస్తున్నాడు కవి. మనిషి దారి తప్పుతూంటాడు, దారిలోకి వస్తూ ఉంటాడు.

ఇక్కడ సాధారణంగా వాడిఉండవలసిన పదం “ కనుగొన్నాను ” కాదు,( travai , found కాదు), “పోగొట్టుకున్నాను” (ho perso , I lost ) . అటువంటపుడు యీ వాక్యనిర్మాణం యిలా చేయడంలో ప్రయోజనం ఏమిటి? పతనం ( Fall) శాశ్వతం కాదని, ‘ఇన్ ఫెర్ నో’తరువాత ‘ పర్గటోరియో’ ఉంటుందని , యీ క్రూరారణ్యం ( una selva oscura ) ముందు ముందు దివ్యవనంగా ( la divina foresta : Purg: 27.1. ) మారబోతుందని సూచించడానికి.

ఆ దివ్యవనానికి చేరి వెనక్కు తిరిగి చూస్తే యీ వనంలోకి ఎక్కడ ప్రవేశించానో కనిపించదు. నరకానికి దారి మూసుకుపోతుంది. “ ( io / non potea rivedere ond’ io mi ‘ intrassi “: “ I could not see back where I had entered it: Purg: 28.24-25).” ( ritrovai ...rivedere)

తప్పినదారే తప్పనిసరి దారి. కనుక “...trovai, ritrovai యీ రెంటి అర్థం ఒకటే. నరకాన్ని (Inferno) గడవనిదే, పర్గటోరియో లేదు, ఆపై పారడీసో కూడా లేదు.

***

ఈ ప్రారంభపద్యంలో మరొకముఖ్యమైన భావం చెబుతున్నాడు డాంటే. పాపము పాపఫలము వేరుకావు అంటున్నాడు. పాపానికి ప్రతిఫలం మృత్యువు (“The wages of sin is death”) అంటుంది బైబిల్. డాంటే అంటున్నాడు, మృత్యువు పాపఫలం కాదు, పాపమే మృత్యువు, (“death itself is little more so!”: Inf.1: 4) ఈ భావమే “చెలియలికట్ట” ( విశ్వనాథ సత్యనారాయణ )లో వ్యక్తమయింది:

ప్రళయకాలమహోగ్రవిభావరీమహ
ఝురీపాత ఘోరనదీఝరాభ
వారిధారావిధంబున వచ్చి వచ్చి
హద్దులనుద్రెంచి పూర్వమర్యాదలురలి
బద్దెలను దాటి ధర్మసంబంధమెడలి
నిర్దయస్వాంతమగు ఘోర
కర్దమాభీలజలపాతకంబు లేచి.

పద్యంతో, అసమాపక క్రియతో ( " లేచి" ) సమాప్తమవుతుంది యీ వచననవల . పాపఫలంగా లేచింది జలపాతం కాదు, జలపాతకమే. అది ఒక్కసారి లేచి పడిపోయేది కాదు. అలా "లేచి" ఉంటుంది, అప్పుడప్పుడూ విరుచుకుపడుతుంది, (యదా యదా హి) . అందుకే అసమాపకక్రియతో నవల సమాప్తం. మానవపతనం ఆదిమానవుడితో ( Adam's Fall ) ఆగిపోలేదు. అది అసమాపకం.

***

ఏ పదం ఎందుకు ఎన్నుకోవాలి, ఏ వాక్యం ఎలా నిర్మించాలి, యిలా తెలిసి కావ్యరచన చేస్తాడు డాంటే. ఇది పదవాక్యప్రమాణపారీణత కాదనగలమా? "ఉభయకావ్యప్రౌఢిపాటించు శిల్పమునన్ పారగుడు" డాంటే. డాంటేకు మనమేమీ బిరుదులివ్వనవసరం లేదు. ఆయనకు బోలెడంత ఆత్మవిశ్వాసం. తిక్కనకేమీ తీసిపోడు. హోమర్, వర్జిల్, ఓవిడ్, హోరెస్, ల్యూకన్ ల తరువాత ఆరవవాడిని అని చెప్పుకున్నాడు: "they made me one of their own band;/So that the sixth was I, 'mid so much wit.( Inferno: canto 4: 100-103). ఏదో బాగుండదని ఆరవవాడిని అన్నాడు కాని, అంతకంటే ఓ పిసరు ఎక్కువే అనుకుని ఉండొచ్చు. గ్రీకు, లాటిన్, ఇటాలియన్ మూడు భాషలలోముచ్చటగా మేమె కవీంద్రులము ( హోమర్, వర్జిల్ , డాంటే) అన్నంత ధీమా ఉన్నది డాంటేకు. ఆ ముగ్గురిలో కూడా , తన స్థానం కొంచెం ఎక్కువ అనికూడా అనుకుని ఉండవచ్చు. గురువును మించిన శిష్యుడు అన్న విషయం La Da Divina Commedia లోనే ధ్వనిప్రాయంగా ఉన్నది. వర్జిల్ స్వయంగా డాంటేకు కిరీటం పెట్టి , ప్రభుదండం చేతికిచ్చాడు. (" ఇది ముకుటం, యిది దండం" : Here is your crown and the rod. (Virgil, Canto: 27.139-142). ఆధ్యాత్మిక గురువుగా మాత్రమే కాదు, కవికులగురువుగా కూడా వర్జిల్ పదవీత్యాగం చేశాడని, తన తరువాత ఆ పదవికి అర్హుడని సూచన చేశాడు డాంటే యీ సందర్భంలో.

***

( ఈ వ్యాసరచనలో డాంటే భాష్యకారులు అనేకులకు ( ఓవర్ బాక్ (Auerbach) , సింగిల్ టన్ (Singleton), ఫ్రెచిరో (Freccero), కేటీ ఫ్రాన్ కోమ్( Katie Francom) వంటివారికి ) నేను అప్పుపడి ఉన్నాను.రాధాకృష్ణమూర్తి.)

***

# 4. పునరుత్థానము

('The Resurrection' by Tolstoy.)

# 4. పునరుత్థానము
('The Resurrection' by Tolstoy.)

ఈ నవల 1889లో రాశాడు టాల్స్టాయ్.ఇది చదువుతున్నపుడు అనిపిస్తుంది,ముఖ్యంగా కొన్ని ఘట్టాలలో,రష్యన్ విప్లవం ( 1917 ) దూరంలో లేదని.అగ్నికిరీటపు ధగధగలు కనబడడం లేదు.యజ్ఞహోమం భగభగలు లేవు.కాని సమిధల సమీకరణ కనిపిస్తుంది. ఈ నవలలో ప్రధాన విషయం విప్లవం కాదు. ఇద్దరు వ్యక్తులు వారి గమ్యాలు వెదుక్కొంటున్నారు. వారి కథ ప్రధానం.వారి కథతో విప్లవకారణాలు పెనవేసుకొని, రెండు కథలు కలిసి నడుస్తాయి. ఆ యిద్దరూ వ్యక్తులుగా ఎదగడమే నవలలో ప్రధానవిషయం. ఎటువంటి అవ్యవస్థలో అణచివేతలో కూడా,మనిషి ఎదగవచ్చు, మనిషిని నిలుపవచ్చు,అని చూపగలిగేది సాహిత్యమే. సాహిత్యప్రయోజనమే అది.

మన దేశంలోను 1917 లో విప్లవం కాదు కాని,విప్లవాత్మకమైన ఉద్యమం( చంపారన్ సత్యాగ్రహం) నడిచింది. దాని వెనుక ముందు ఏదైనా గొప్ప నవల వచ్చినట్టు తెలియదు. రచయితలు విప్లవాలను రచించ గలరు.విప్లవాలు రచయితలను సృష్టించలేవు. ఉద్యమాలు, విప్లవాలు వస్తాయి పోతాయి. నిలిచిపోయేది సాహిత్యం.]

"ఆనా కెరినినా", "యుద్ధము, శాంతి" తరువాత టాల్స్టాయ్ సుమారు పాతిక సంవత్సరాలకు రాసిన మరో నవల , అతని చివరి నవల, "పునరుత్థానము" ("Resurrection") .సైబీరియాలో మగ్గుతుండిన 'దుఖోబోర్' అనే ఒక క్రైస్తవ తెగవారిని పునరావాసం కొరకు కెనడాకు పంపడానికి అవసరమైన నిధిసేకరణకొరకు రాశాడు ఈ నవల. కాని వాస్తవంలో ఇది ఆయన ఎవరి కొరకో రాసిన నవల కాదు. తన కొరకు రాసుకొన్నది.రాయకుండా ఉండలేక రాసినది. తన జీవితాన్ని, తన అసదృశమైన రచనాశక్తిని, సార్థకం చేసుకోవలెనని రాసిన నవల. తనను ప్రపంచసాహిత్యంలో అగ్రశ్రేణిలో నిలబెట్టిన తన మొదటి నవలలు రెండు తనకు సంతృప్తినివ్వలేదు. అంటే ఈ చివరి నవల రాయడం రచయితగా వ్యక్తిగా ఆయనకు ఎంత అవసరమైందో తెలుస్తున్నది. దీనిని రాయడానికి టాల్స్టాయ్ కి పదకొండు సంవత్సరాలు పట్టిందట. ఆయననుండి మరో నవలకోసం పాతికేళ్ళు ఎదురుచూచిన పాఠకులు మహదానందంతో దాన్ని ఆదరించారు. మొదటి రెండు నవలలను మించి కాపీలు అమ్ముడుపోయాయి. 'టాల్స్టాయ్ రచనలలో అన్నిటికంటే ఉత్కృష్ట మైనది', అన్నారు అందరూ ఆనాడు. ఈ నాడు దానికి అంత ఆదరణ లేదు. మొదటి రెండు నవలలతో పోల్చదగిన సాహిత్యగుణాలు యిందులో లేవని అంటారు, చదివిన కొందరు. టాల్స్టాయ్ కూడా ఈ నవల గూర్చి పూర్తి సంతృప్తి చెందలేదు. "ఆ నవల సంతృప్తికరమైన సంపూర్ణరూపం సంతరించుకొనే లోపలే బయటపడింది",అన్నాడు ఆయన స్వయంగా. రచయిత భావాన్నే బహుశా Percy Lubbock ప్రతిధ్వనించాడు: "అది ఒక బృహద్రచనలోని శకలం",('the fragment of an epic')అని.("The Craft of Fiction" by Percy Lubbock:Jonathan Cape,1921)

ఇంతకూ ఈ నవలాశిల్పం గురించిన నిజం ఏమిటి? వయసుపైబడి, టాల్స్టాయ్ రచనాపటిమ జవసత్త్వాలుడిగిన కారణంగా ఈ నవల అతని మొదటి రచనల స్థాయిని అందుకో లేక

పోయిందా? లేక, వయసుతో పొందిన మన:పరిపాకానికి అనుగుణంగా పరిణతమైన ఆయన శిల్పం మనం అర్థం చేసుకోలేకపోతున్నామా? కొందరు రచయితలు, వారి మొదటి రచనలలో చూపిన ప్రతిభ తరువాతి రచనలలో చూపలేకపోయారు. కాని, షేక్స్పియరు "The Tempest " రాసినప్పుడు ఆయన మంత్రశక్తి మందగించింది అనగలమా? టాల్స్టాయ్ చివరి రచన కూడా అటువంటిది కాదా? (ఇక్కడ సామ్యం, రచయిత పరిణతశిల్పంలో. షేక్స్పియరు వయసు పైబడక ముందే తన మంత్రదండాన్ని విసిరిపడేశాడు.అది వేరే విషయం.) గొప్పరచయితలు రచనల ప్రారంభదశలో సాధారణంగా శిల్పానికే పెద్దపీట వేస్తారు. 'వస్తువు కూడా శిల్పంలో అంతర్భవిస్తుంది, దానికి ప్రత్యేకమైన అస్తిత్వం లేదు' అంటారు. కాని ఈ వాదము యీ కావ్యదృష్టి వయసు గడిచే కొద్దీ మారుతుంది. వస్తువు ప్రాధాన్యం పెరుగుతుంది. ఇది రచనాపాటవం ఉడిగిన కారణంగా కాదు. జీవితానుభవంలో జీవితదృక్పథంలో కలిగిన మార్పు దీనికి కారణం. అయినా తమలో కలిగిన ఈ మార్పును చాలామంది రచయితలు ఒప్పుకోలేరు. తమ రచనా శక్తి తగ్గడం కారణమని లోకం అనుకుంటుందేమోనన్న సంకోచము, శిల్పప్రాధాన్యాన్ని తక్కువ చేస్తున్నామేమోనన్న సంశయము ఒప్పుకోనివ్వవు. ప్రస్తుత నవలలో ("The Resurrection") టాల్స్టాయి మొదటి రచనలలోని శిల్పం లోపించిందని, వస్తువు ప్రధానమై, రచయిత తన ధర్మాగ్రహం వ్యక్తం చేయడానికి నవలను సాధనంగా వాడుకున్నాడని, ఒక సాధారణభావం ఏర్పడింది. ఈ భావం ఎంతవరకు సరి అయినది పరిశీలించవలె.

ఈ నవలలో రెండు ప్రధాన పాత్రలు,కథానాయకుడు నెఖ్లుడోఫ్, కథానాయిక మేస్లోవా. మూడవ పాత్ర, నవలను నిండి వ్యాపించిన రచయిత ధర్మాగ్రహం. ఆ నాటి రాచరికపు అరాచకం, న్యాయవ్యవస్థను నిండిపోయిన అన్యాయం, అధికారుల అమానుషత్వం, మనిషిని మనిషిగా చూడని చూడనివ్వని రాజ్యం, మతిలేని మతం--వీటన్నిటిపై రచయిత ఆగ్రహం మరో ప్రధానపాత్ర. బైబిల్ లోని శామ్సన్ తానున్న మొత్తం భవనాన్ని ఒక ఊపు ఊపి కూలగొట్టి, అందులోని వారినందరిని సర్వనాశనం చేస్తాడు, తానూ ఆ కుప్పలో కలిసిపోతాడు. అటువంటి ధర్మాగ్రహమే ఈ నవలనంతా వ్యాపించి ఉంటుంది. నిజమే, ఈ ఆగ్రహం కథను కావ్యం కాకుండా చేసిందా? కాని ఈ ధర్మాగ్రహమే, దాని పర్యవసాయమే కావ్యవస్తువు ఎందుకు కారాదు?

కథానాయకుడు,నెఖ్లుడోఫ్:

నవల ఒక న్యాయస్థానంలో ఒక హత్యానేరవిచారణ సన్నివేశంతో మొదలవుతుంది. మేస్లోవా ప్రధాననిందితురాలు. ఆమె ఒక వేశ్య. ఆమె వద్దకు వస్తూ ఉండే ఒక వ్యక్తిని అతడి డబ్బుకోసం ఆమె విషమిచ్చి చంపిందని ఆమెపై నేరం. జూరీసభ్యులలో ఒక రాకుమారుడు, నెఖ్లుడోఫ్, కూడా ఉన్నాడు. అతడు ఖైదీని గుర్తుపడతాడు. సుమారు పది సంవత్సరాల వెనుక ఆమెను తన ఆంటీల యింట్లో కలిశాడు.వారు ఆమెను ఒక నిరుపేదకుటుంబంనుండి తెచ్చుకొని తోడుకోసం పెంచుకున్నారు. ఆ యింట్లో ఆమె పనిపిల్లకంటే ఎక్కువ, కూతురుకంటే తక్కువ.అక్కడ నెఖ్లుడోఫ్ ఆమెను గర్భవతిని చేసి, వంద రూబుల్స్ చేతిలో పెట్టి చేతులు తుడుచుకొని వెళ్ళిపోయాడు. మళ్ళీ ఆమెను చూడడం ఇప్పుడు ఈ స్థితిలో. విచారణలో తెలిసింది, ఆమె ఆనాటి కటూషా,( "కేటరీనా"ను కుదించిన పేరు) అని, ఆ తరువాత ఆమె వేశ్యావృత్తిలో జీవితం గడిపిందని.ఆమె ఈ దుస్స్థితికి తను ఆమెకు ఆనాడు చేసిన అన్యాయమే కారణమని,ఆమెను ఆ పాపకూపం నుండి బయటకు తెచ్చి ఆమెకు న్యాయం చేయవలె, అవసరమైతే ఆమెను పెళ్ళికూడా చేసుకోవలె,

అనుకుంటాడు, నెఖ్లుడోఫ్. అంటే, ప్రధానపాత్రలో పరివర్తన కథాప్రారంభంలోనే జరిగిపోయింది.అతని అపరాధకారణంగా అతనిలో కలిగిన అంతస్సంఘర్షణ, సంక్షోభము, వాటి ఫలితంగా అతనిలో కలిగిన మార్పు, కథా వస్తువు కాదు, దోస్తోవ్ స్కీ నవలలోలాగా. ఈ టాల్స్టాయ్ నవలలో వస్తువు , నేరము శిక్ష కాదు, పాపము పశ్చాత్తాపము కాదు. ఇందులో ఇతివృత్తము, పరివర్తన ప్రవర్తన. తన బాధ్యతారహితమైన జీవనవిధానంమీద అతనికి విరక్తి కలుగుతుంది. తన సుఖజీవనము,దానికి ఆధారమైన తన ఆస్తులు, సమాజంలో తన అంతస్తు అన్నీ వదిలివేయవలె అని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయానికి అనుగుణంగా వెంటనే చర్యలు మొదలుపెడతాడుకూడా.

మేస్లోవాకు సైబీరియాలో ప్రవాసము, నాలుగు సంవత్సరాల కఠినశిక్ష విధించింది న్యాయస్థానం. నెఖ్లుడోఫ్ మేస్లోవాని కలిశాడు జైలులో. తన తప్పును క్షమించమని, తనను పెళ్ళిచేసుకుంటానని అంటాడు. అతన్ని గుర్తుపట్టిన వెంటనే ఆమె, ' వెళ్ళిపో,నేనో ఖైదీని.నీవు రాకుమారుడివి. నీకిక్కడేం పని. ..ఈ లోకంలో నీ అవసరానికి వాడుకున్నావు అప్పుడు .ఇప్పుడు పైలోకంలో నీ అవసరానికి నేను కావాలి నీకు. నీ ముఖం చూస్తే అసహ్యమేస్తుంది నాకు...నీ కళ్ళజోడు, నీ దిబ్బముఖం!', అంటుంది.(తన జీవితాన్ని నాశనంచేసిన మనిషి, కనిపించడనుకున్నవాడు, ఇంత కాలానికి కనిపిస్తే, ఆమె అలా అనకపోవడం అసహజం.)

ఇక్కడే మొదలు, అతని పరివర్తనకు పరీక్ష. అతడి త్యాగబుద్ధిని ప్రతి ఒక్కరు శంకిస్తారు, ప్రతి త్యాగాన్ని ప్రతి ఒక్కరూ తిరస్కరిస్తారు, ఒక్కొకరు ఒక్కొక కారణంగా. మొదటి తిరస్కారం తన పరివర్తనకు నిమిత్తమైన మేస్లోవానుంచే కావడం విశేషం.కాని ఆ తిరస్కారంలో అతడు తన నిర్ణయాన్ని నిశ్చయాన్ని సడలనివ్వడు. అలా అని అతని పరివర్తన ఒక సరళరేఖలా సాగిందని అర్థం కాదు. తనలోను వెలుపలకూడా ఘర్షణను ఎదుర్కొన్నాడు. రాకుమార్తెలు, సంపన్నకుటుంబాల స్త్రీలు,పెళ్ళి అయినవాళ్ళు కావలసినవాళ్ళు, అతన్ని పెళ్ళిచేసుకోవలె అని ఆరాటపడుతున్నారు. 'ఆ చెడిపోయినదాన్ని చేసుకొని ఏం సుఖపడతావు', అని అక్క అడుగుతుంది నెఖ్లుడోఫ్ ను. ' ఇప్పుడు విషయం సుఖం కాదు' , అంటాడు.అతని మొదటి పని, మేస్లోవాకు న్యాయస్థానం అన్యాయంగా విధించిన శిక్షను తగ్గించడం. ఆ ప్రయత్నంలో అతడు తాను దూరమవాలనుకొన్న సమాజసభ్యులను, సమాజవ్యవస్థను ఆశ్రయించవలసి వచ్చింది. అతనికి యిష్టంలేని పని అయినా , ఆమె కొరకు తనకు నచ్చని వారిని ఎందరినో సహాయం అడిగి తీసుకొనేనాడు. అతని ప్రయత్నం ఒకవైపు సాగుతూ ఉంటుంది.మరొకవైపు ప్రభుత్వం మేస్లోవాను, ఆమెతోపాటు అసంఖ్యాకమైన ఖైదీలను, సైబీరియాకు తరలించే ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది.నెఖ్లుడోఫ్ మేస్లోవాకు తోడుగా ఉండడానికి సైబీరియా వెళ్ళవలె అని నిశ్చయించుకుంటాడు. అది తనకు తాను విధించుకొన్న శిక్ష. వెళ్ళేలోపల యిక్కడ తనకు సాధారణజీవనానికి అవసరమైనంత మాత్రమే ఉంచుకొని, తక్కిన ఆస్తులు దానం చేసెయ్యాలనుకొంటాడు. తన భూములున్న గ్రామాలకు వెళుతాడు. తన పొలాలు వ్యవసాయంచేసుకునే రైతులకు ఉచితంగా యిచ్చేస్తాను అంటే, వారు నమ్మరు. ఇందులో ఏదో దురుద్దేశం ఉండి ఉంటుంది అని అనుమానిస్తారు. ఈ విధంగా అడుగడుగునా తన త్యాగబుద్ధిని శంకిస్తూనే ఉన్నా, త్యాగాన్ని తిరస్కరిస్తూనే ఉన్నా, అతడు తన త్యాగబుద్ధిని, త్యాగాలను మానుకోడు.ఇది నిజమైన త్యాగానికి నికషం. త్యాగం ఒకరిని

ఉద్ధరించడానికో, వారి మెప్పు కొరకో చేసేదికాదు. ఒకరి ఆమోదంపై ఆధారపడేదీ కాదు. ఆత్మోద్ధరణకొరకు చేసేది.

మేస్లోవాను కలవడానికి తను తరచు జైలుకు వెళ్లడం, అక్కడి దుర్గంధం దుర్మార్గం దుస్థితి , యివి నవలలో సమాంతరంగా సాగే కథావస్తువులు. నిజానికి ఈ రెంటినీ పడుగుపేకగా అల్లిన రచయిత నైపుణ్యం అద్భుతం. ఖైదీలను సైబీరియాకు తరలించడం నవలలో చాలాభాగం ఆక్రమిస్తుంది.వివిధ జైళ్ళనుండి ఖైదీలను ఒకచోట చేర్చారు.అందులో చాలామంది ఏ నేరము చేయని వారే, మేస్లోవా వలె. న్యాయనిర్ణయంలో నిర్లక్ష్యం వల్ల, విచారణలో లోపం వల్ల, ఎందరో జైళ్ళలో ఏళ్ళతరబడి మగ్గుతున్నారు- యువకులు,ముసళ్ళు, స్త్రీలు, తల్లులవెంట పసిపిల్లలు, రోగులు. అందరికీ కాళ్ళకు గొలుసులు. ఆ గొలుసులు ఈడ్చుకొంటూ వారిని రైలుస్టేషనుకు మండే ఎండలో నడిపిస్తారు. నడవలేని వాళ్ళు నడుమనే రాలిపోతారు, "నీళ్ళటాంకరునుండి నీళ్ళు దారి పొడుగునా ఒలికి పోయినట్టు." స్టేషనులో పధ్నాలుగు పెట్టెల ట్రెయిన్ సిద్ధంగా ఉంది. ఒక పెట్టె పోలీసులకు. పదమూడు పెట్టెలలో ఖైదీలు. కాళ్లకు గొలుసులు, ఎండకు పెనంలా కాలిపోతున్న పెట్టెలు, మైళ్ళు నడిచి చెమటలు. ఆ ట్రెయిన్ కదులుతుంటే చూచినవారికి ‘ రష్యన్ విప్లవం ఎంతో దూరంలేదు’, అనిపిస్తుంది. ఈ ఖైదీల దుస్స్థితి , మేస్లోవాతో కలిసి, నెఖ్లుడోఫ్ జీవితగమనంలో భాగమవుతుంది.

నెఖ్లుడోఫ్ ఖైదీ కాడు.కనుక ఖైదీల ట్రెయిన్లో వెళ్ళనివ్వరు. మరో రెండు గంటలలో వేరే ట్రెయిన్లో మేస్లోవాను అనుసరిస్తాడు. పెర్మ్ అనే స్టేషన్ సైబీరియా చేరడానికి ముందు, చివర ఆగవలసిన ప్రదేశం. అక్కడ మేస్లోవాను కలుస్తాడు.ప్రయాణంలో ఆమెకు కొత్త స్నేహాలు ఏర్పడ్డాయి. సిమన్సన్ ఆమెకు దగ్గరవుతాడు,పెళ్ళి చేసుకుంటాననంటాడు. మేస్లోవా కాదనదు.సిమన్సన్ నెఖ్లుడోఫ్ అభిప్రాయం అడుగుతాడు. ‘ఆమెకు స్వేచ్ఛ ఉంది. నాకు లేదు’,అంటాడు నెఖ్లుడోఫ్. అంటే, ఆమె తన త్యాగాన్ని స్వీకరించినా తిరస్కరించినా, తన పరివర్తనలో ప్రవర్తనలో మార్పు ఉండదు, అని. మేస్లోవా కఠిన శిక్షను తగ్గించడానికి అతడు చేసిన ప్రయత్నాలు వాళ్ళు సైబీరియా దారిలో చివరి దశలో ఉండగా ఫలించాయి. కాని మేస్లోవా సైబీరియాలో సిమన్సన్ తో ఉండడానికే నిర్ణయించుకుంటుంది. నెఖ్లుడోఫ్ కు సంతోషాన్నిచ్చే పరిణామం కాదు.కాని అతని జీవితలక్ష్యం యిప్పుడు సంతోషం కాదు,పరమార్థసాధన. కథానాయకుడి సుదీర్ఘమైన ధర్మచింతనతో, బైబిల్ లోని దశనిర్దేశాల మననంలో, ఆ దిశలో తన జీవితాన్ని నడిపించవలె అన్న అతడి సంకల్పంతో నవల ముగుస్తుంది.

నెఖ్లుడోఫ్ పరివర్తన త్యాగము, నవల ముగిసినప్పటి అతని మన:పరిపాకము అతనిని చాలా ఎత్తులో నిలుపుతాయి. ‘తనది’(’మమ’) త్యాగం చెయ్యడం నవలలో ఆద్యంతము ప్రధాన కథావస్తువు.ఇక, ‘తనను’(‘అహం’) త్యాగం చేసే దారిలో నడిచే సంకల్పంతో, నవల ముగుస్తుంది.మరి ‘చెడిపోయిన’ మేస్లోవా కథ?

మేస్లోవా

మేస్లోవా అసలు పేరు కేటరీనా. పెంచిన వారు అంత గొప్ప పేరుతో పిలవడం యిష్టంలేక, కటూషా అనేవాళ్ళు. ఆమె తల్లి బానిస(serf),అవివాహిత. అయిదుగురు పిల్లలను కనవలసివచ్చింది,తన

యిష్టానిష్టాలతో సంబంధం లేకుండా. కన్నపిల్లల్ని పెంచలేక వదిలేసింది. వాళ్ళు చనిపోయారు.ఆరవపిల్ల కేటరీనా. ఈమెకూడా వారిలాగే పోవలసిందే. కాని, ఊరిలోని యిద్దరు సంపన్నస్త్రీలు, (మేరీ, సోఫియా) ఆ పిల్ల పోషణకు తల్లికి సహాయం చేశారు. ఆ పిల్ల మూడో ఏట, తల్లి పోయింది. మేరీ, సోఫియాలు ఆ పిల్లను యింటికి తెచ్చుకుంటారు.ఆ యిద్దరిలో ఒకరు ఆ పిల్లను కూతురుగా చూస్తే, రెండవ ఆమె పనిపిల్లగా పెంచింది. వాళ్ళిద్దరూ కథానాయకుడికి ఆంటీలు. నెఖ్లుడోఫ్ ఒకసారి వాళ్ళ యింటికి వస్తాడు, సెలవులు గడపడానికి. అప్పుడు కటూషాను చూస్తాడు, ప్రేమిస్తాడు.అప్పటికి అతడికి ప్రేమ అంటే ఒక స్వచ్ఛమైన భావమే.ముద్దుతో ఆగిపోతారిద్దరు. మూడు సంవత్సరాల తరువాత మళ్ళీ వస్తాడు.ఈ సారి ముద్దుతో ఆగడు. మరో అడుగు ముందుకు వేస్తాడు. (అతని మొదటి ముద్దుకు రెండవ ముద్దుకు మధ్య, నవలలో ఒక అధ్యాయం అంతరాయం ఉంది. ఆ రెండు ముద్దులకు అంతరం ఆ అధ్యాయంలో ఉంది. ఆ అధ్యాయం పేరు, 'సైన్యంలో జీవితం'.'Life in the Army'. దీని చర్చ తరువాత చేద్దాం.)కథానాయకుడు తిరిగివెళ్ళేలోపు ఆమెను గర్భవతిని చేస్తాడు.(అదే కథకు బీజం.) వెళ్ళిపోతూ ఆమె చేతిలో బలవంతంగా వంద రూబుల్స్ పెట్టి వెడతాడు. (అతడు రాకుమారుడు.అంతకంటే తక్కువ యివ్వలేడు!). ఆ తరువాత పది సంవత్సరాలకు ఆమెను చూడడం కోర్టులో.ఈ మధ్య పది సంవత్సరాలలో ఆమె బిడ్డ పుట్టి పోవడం, బతుకు గడవడంకోసం ఆమె వేశ్యగా మారడం, చేయని హత్యకు జైలుకు వెళ్లడం,యిప్పుడు ఈ హత్యానేరవిచారణ-- యివన్నీ జరిగిపోయాయి. ఇక్కడ అసలు కథ మొదలవుతుంది.

నెఖ్లుడోఫ్ తన తప్పును సరిదిద్దుకోవాలనుకొంటాడు.మేస్లోవాను క్షమించమంటాడు. ఆమె హేయమైన గతాన్ని తెలిసికూడా, ఆమెకిష్టమైతే ఆమెను పెళ్ళి చేసుకొంటానంటాడు. అతడు రాకుమారుడు.మేస్లోవా తను జన్మలో ఊహించని స్థాయి అతడు కల్పిస్తానంటే ఎగిరి గంతేసిందా?లేదు.ఆమె తిరస్కరించింది. ఆ క్షణంలో అది ఆపుకోలేని ఉద్వేగం కావచ్చు. ఉద్వేగం క్షణికమే, కాని నిర్ణయం చివరి వరకు, నవల ముగిసే వరకు, మారదు. కాలం గడిచి ఉద్వేగం ఉడిగి, అతని త్యాగతత్త్వం అర్థం చేసుకొన్నది మేస్లోవా. కాని నిర్ణయం మార్చుకోలేదు. అతడూ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.అతడు 'ఒక సారి అడిగాను, చాలు.ఇంక ఎన్ని సార్లు అడగాలి?', అనుకోలేదు. ఆమెను జైలులో చాలా సార్లు కలిశాడు, ఆమెకు ఊరట కలిగించడానికి, అవసరమైన సహాయం చేద్దామని. జైలులో ఆమెను కలవడం అంత సులభం కాదు. అనుమతి కొరకు ఎంత మందినో ఆశ్రయించాలి. ఇంత కష్టపడి ఆమెను కలిస్తే, ఆమె తన కొరకు ఏమీ కోరేది కాదు. తోటి ఖైదీల కష్టాలు చెప్పి, అతడికి ఈ సహాయం చేయగలరా, ఆమెకు ఆ సహాయం చేయగలరా, అని అడిగేది. నెఖ్లుడోఫ్ ప్రిన్స్ అని, పలుకుబడిగలవాడని తెలిసి, ఖైదీలు మేస్లోవాను తమ తరఫున అడగమనేవారు. అతడు చేయగలిగినది చేసేవాడు కూడా. నెఖ్లుడోఫ్ , మేస్లోవా ఇద్దరూ ఒకే దిశలో ఎదుగుతున్నారు. ఆ ఎదుగుదలలో యిద్దరూ ఒకరికొకరు దూరమైపోతున్నారు. వైముఖ్యంతో కాదు,అనాసక్తతతో. ప్రేమ విలువ తెలియక కాదు,ప్రేమ పరిధులు విశాలమై.

అతడు చాలామార్లు ఆమెను చేసుకొంటానంటాడు. అడిగినప్పుడల్లా ఆమె తిరస్కరిస్తూనే ఉంది. కాని ఆ తిరస్కారస్వరూపం కాలక్రమంలో మారుతూంటుంది. మొదటి తిరస్కారం కోపంలో ఉద్వేగంలో కలిగింది. తరువాతి తిరస్కారం అతని త్యాగము ప్రేమతత్త్వము తెలిసి, అతని జీవితాన్ని తన గతంతో మలినం చేయలేక, కృతజ్ఞతతో ప్రేమతో చేసిన తిరస్కారం. నెఖ్లుడోఫ్ ఆమె

శిక్షను తగ్గించే ప్రయత్నాలు పట్టువిడవక చేస్తూనే పోయాడు. చివరకు, ప్రయాణపు చివరి దశలో, సైబీరియా  సరిహద్దులు చేరుకొన్నాక, అతని ప్రయత్నం ఫలించి, ఆమె కఠినశిక్షను సాధారణశిక్షగా తగ్గిస్తూ ఉత్తరువు వచ్చింది. ఆమె సైబీరియా వెళ్ళనవసరం లేదు. నెఖ్లుడోఫ్  మళ్ళీ అడిగాడు పెళ్ళిచేసుకొంటానని. ఆమె మళ్ళీ కాదన్నది.కాని అప్పటి కారణం, ఆమెకు పెళ్ళిపై కోరిక రాలిపోయింది. సిమన్సన్ అనే ఒక ఖైదీ ఆమెను చేసుకొంటానన్నాడు. ఆమె అతనితో సైబీరియా వెళ్ళిపోవలెనని నిశ్చయించుకొన్నది. నెఖ్లుడోఫ్  మేస్లోవాను ప్రేమించడం అతని కొరకు, ఆత్మార్థం. సిమన్సన్   ఆమెను  ఆమె  కొరకు యిష్టపడుతున్నాడు.ఆమెకు తెలుసు,తనను చేసుకున్నవాడికి జీవితంలో సంతోషం ఉండదని. నెఖ్లుడోఫ్  ఆమెను అడిగాడు, 'సిమన్సన్ ను పెళ్ళిచేసుకోడం నీకు యిష్టమేనా?' అని. ఆమె అన్నది, 'నా  గతంతో,  నేనతనికి  ఎటువంటి భార్యగా ఉండగలను?'   సిమన్సన్ ను పెళ్ళి చేసుకోవాలి అనుకోలేదు,  సైబీరియాలో అతనికి తోడుగా ఉండాలనుకొన్నది, అతడు తనను కోరుకొంటున్నాడు కనుక.

ఆమె శిక్షను  తగ్గించినా, ఆమె శిక్ష పూర్తిగా అనుభవించదలచుకుంది. తాను చేయని హత్యకు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వినిపించినపుడు ఆమె బాధపడలేదా?  ‘అవును.నాకు శిక్ష పడినప్పుడు నేను ఏడ్చాను.మరి? ఆ శిక్షకు భగవంతుడికి నేను బతికున్నంతకాలము దణ్ణం పెట్టుకోవాలి.’ ఆ తీర్పు తాను చేయని హత్యకు విధించిన అన్యాయమైన శిక్ష అనుకోలేదు ఆమె. తాను జీవించిన హేయమైన బతుకుకు భగవంతుడు విధించిన న్యాయమైన  శిక్ష అనుకుంది. ఆమె దృష్టిలో ఇన్నాళ్ళు ఆమె బతికిన బతుకు నిజమైన శిక్ష. న్యాయస్థానం విధించిన శిక్ష యథార్థమైన విముక్తి. ఆమె తన జీవితాన్ని శిక్షలో ప్రక్షాళనం చేయాలనుకొంది. సైబీరియా, ఆమెకు విధించిన శిక్ష కాదు,ఆమె ఎన్నుకున్న purgatorio.

చివరి సారి నెఖ్లుడోఫ్ పెళ్ళి ప్రస్తావన తెచ్చినపుడు ఆమె అంది: ‘ప్రిన్స్ ! నన్ను క్షమించు. నీవు కోరింది నేను చేయలేదు. నా కోసం ఎంతో చేశావు.నాకు తెలుసు.కాని,  నీకూ ఒక జీవితం కావాలి...’, అంతకంటే ఏమీ అనలేకపోయింది, మరో విధమైన ఉద్వేగంలో. ‘నీకూ ఒక జీవితం కావాలి’, అదీ ఆమె చివరి తిరస్కారస్వరూపం.  అది ఆ "పతిత" ఎదిగిన ఎత్తు. ఇద్దరి త్యాగాలలో ఎవరి త్యాగం గొప్పది? ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగారు? ఇద్దరూ కలిసి ఎదిగారు, కలవలేనంత ఎత్తుకు ఎదిగారు.

మూడవ పాత్ర

ఇప్పుడు కథలో మూడవ ప్రధానపాత్ర, కథను ఆద్యంతము నడిపించిన కనిపించని పాత్ర, రచయిత ధర్మాగ్రహం. ఈ ఆగ్రహం  టాల్స్టాయ్ కి  సహజమైన వ్యంగ్యంలో వ్యక్తమవుతుంది. వ్యంగ్యం (satire) సహజగుణమైన రచయితకు, దాన్ని అధిగమించడం కష్టం. ఈ కష్టానికి ఉదాహరణగా  మన రావి శాస్త్రిని చెప్పుకోవచ్చు. హాస్యం నుండి విషాదంలోకి నడిపించడం సులభమనిపిస్తుంది, షేక్స్పియరుకులాగా.  టాల్స్టాయ్ అనాయాసంగా  వ్యంగ్యంలోనుండి విషాదాన్ని అందుకోగలడు.

మొదటి  కోర్టుసీనులోనే  వ్యంగ్య విషాదం ఉంది. చేయని హత్యకు మేస్లోవాకు శిక్షవిధించడంలోనే న్యాయవ్యవస్థ పనితీరుపై తన ఆగ్రహం వ్యంగ్యరూపంలో వ్యక్తం చేస్తాడు టాల్స్టాయ్.

నిందితురాలికి అది జీవన్మరణసమస్య.కాని, జూరీసభ్యులకు, ప్రధానన్యాయమూర్తికి, అది ఆ రోజు మూసేయవలసిన మరొక కోర్ట్ ఫైల్.జూరీసభ్యులు హాజరుకాక తప్పదు కనుక, ఆ రోజు వాళ్ళవాళ్ళ పనులు మానుకోవలసినందుకు తిట్టుకుంటూ కోర్టుకు వచ్చారు.విచారణ ప్రారంభం అయే లోపు వాళ్ళు దేనిని గురించి ఆలోచిస్తున్నారు? జూరీలలో యిద్దరు వ్యాపారస్థులు, ఉన్ని ధర ఎలా ఉంది అని మాట్లాడుకొంటున్నారు. కొందరు వాతావరణం గురించి మాట్లాడుకొంటున్నారు.ఒక జూరీ సభ్యుడు మరొకణ్ణి పలకరిస్తూ, 'నీవూ యిరక్కపోయావా? తప్పించకోడం వీలుకాలేదా?', అని అడుగుతాడు హేళనగా. ప్రధానన్యాయమూర్తి ఆ రోజు విచారణ త్వరగా ముగించి వెళ్ళిపోయే తొందరలో ఉన్నాడు.ఆయనకు ప్రియురాలినుండి పిలుపు వచ్చింది, సాయంత్రం ఆరు లోపల కలుసుకొమ్మని. మరో జూరీసభ్యుడు, రావడం ఆలస్యమైంది. ఆ రోజు ఆయన భార్య యింటి ఖర్చుకు మరి కొంత డబ్బు కావాలంది. ఇవ్వకపోతే ఈ రోజుకు వంట లేదు అన్నది. ఇదీ, ఒక హత్యానేరవిచారణ చేయడానికి వచ్చినవారి శ్రద్ధ, ప్రధాననిందితురాలి జీవన్మరణ నిర్ణయసమయంలో వారి మనస్స్థితి. జడ్జి తీర్పులో రాయవలసిన ఒక మాటను వదిలివేశాడు. 'నిందితురాలు నేరం చేసినట్టు ఋజువయింది'. కాని "ఆ నేరం బుద్ధిపూర్వకంగా చేసినదికాదు" అన్నమాట చేర్చనందువలన , ఆ లోపాన్ని ఆమె లాయరుగాని, జూరీగాని గమనించనందున, సామాన్యమైన శిక్ష కఠినశిక్షగా మారింది!

ఏ సమాజవ్యవస్థ కూడా మనిషిని మనిషిగా చూడడంలేదు, సహానుభూతి చచ్చిపోయింది, అన్న ఆవేదన వ్యంగ్యంలో దాచి ప్రదర్శిస్తాడు టాల్స్టాయ్. ప్రభుత్వయంత్రాంగమంతా ఒకే పనిలో తత్పరమై పనిచేస్తుంది.ఏమిటా పని? మనిషిలోని మనిషిని చంపడం, వేతనాలిచ్చి చంపించడం. నవల ప్రారంభంలో చెప్పుకున్న రెండు ముద్దుల ముచ్చట యిక్కడ ప్రస్తుతం. మొదటి ముద్దు నెఖ్లుడోఫ్ సహజస్వచ్ఛభావాలు గల వయసులో,స్థితిలో జరిగింది. రెండవ ముద్దు అతడు ఆర్మీలో మూడుసంవత్సరాలు పనిచేసిన తరువాత. మిలిటరీసర్వీసులో అతడు 'ఆరోగ్యవంతమైన పశువు'గా తీర్చి దిద్దబడ్డాడు. అదీ, మిలిటరీ సర్వీస్ ప్రభావం. మనిషిని పశువుగా మార్చేది ఒక్క మిలిటరీసర్వీసు మాత్రమే కాదు. అన్ని రాజ్యవ్యవస్థలు చేసేది అదే పని. రచయిత ఆవేదన క్రమంగా ఆగ్రహంగా మారి సమాజవ్యవస్థలనన్నిటిని ఆక్రమిస్తుంది--.జైళ్ళు, పోలీసు,సైన్యం, ప్రభుత్వపరిపాలనానిర్వహణ, చివరకు రాజు. రాజ్యాంగంతో ఆగదు.మతము, మతాధిపతుల హైన్యము వంచన కూడా టాల్స్టాయ్ ఆవేదనకు ఆగ్రహానికి గురి అవుతాయి. జైళ్ళలో దుర్గంధము, అధికారుల అమానుషత్వము అవినీతి నెఖ్లుడోఫ్ ప్రత్యక్షంగా అనుభవించాడు. చిన్నచిన్న నేరాలకు ( ఒక భూస్వామి పొలంలో ఎవడిదో పశువు మేస్తుండినదని, వాడికి ఏళ్ళతరబడి జైలుశిక్ష. ) మేస్లోవాను సైబీరియాకు తీసుకుపోతున్నపుడు, ఆమెను అనుసరిస్తూ నెఖ్లుడోఫ్ చూచిన దృశ్యాలు, వాటిని టాల్స్టాయ్ వర్ణించిన విధం ఆయన ఆవేదనను ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తాయి. ముఖ్యంగా, వేలమంది ఖైదీలను సైబీరియాకు తరలించే దృశ్యం, మరచిపోలేని విధంగా, అసదృశంగా వర్ణిస్తాడు. టాల్స్టాయ్ వర్ణన అంటే తన మాటలలో చెప్పడం ఉండదు. ఆయన దృశ్యాన్ని మన ముందుంచుతాడు.దీనిని గురించి పైన చెప్పుకొన్నాం.

పశువులలా ఖైదీలు. పశువులలా పోలీసులు.ఎవరిని చూసి జాలిపడవలె?(అందుకే అన్నారేమో, సమజమని!) ఈ ఆగ్రహప్రయాణవర్ణన ప్రయోజనం? టాల్స్టాయ్ రష్యన్ ప్రజలలో విప్లవజ్వాలలు రేకెత్తించవలె అని రాసిన నవలా యిది?

టాల్స్టాయ్ ఆగ్రహం లౌకికవ్యవస్థలతో ఆగిపోదు. పారలౌకికాన్ని కూడా ఆవహిస్తుంది. చర్చిని, క్రైస్తవమతప్రచారంలోని ఆత్మవంచనను కూడా ఎండగడతాడు, నవల చివరిభాగంలో ఒక అధ్యాయంలో. ఒక ఆంగ్లక్రైస్తవప్రచారకుడు, గవర్నర్ ను తాను అక్కడి జైళ్ళలోని స్థితిగతులను అధ్యయనం చేయడానికి వచ్చానని, అనుమతించవలె అని అడిగి, అనుమతిపొందుతాడు.కాని జైలులో అతడు రహస్యంగా బైబిల్ కాపీలు పంచుతాడు ఖైదీలకు. క్రీస్తుసందేశాన్ని ప్రచారం చేయడానికి, అసత్యాన్ని కాపట్యాన్ని అవలంబిస్తాడు. అంటే రాజ్యవ్యవస్థలే కాదు, చర్చి కూడా కుళ్ళుతో కాపట్యంతో నిండిపోయింది. అన్ని వ్యవస్థలపై అసహ్యము ఆగ్రహము కలుగుతోంది నెఖ్లుడోఫ్ కు. టాల్స్టాయ్ ని "క్రైస్తవ అరాచకవాది" (“Christian Anarchist”,) అనడానికి, ఈ ఆగ్రహమే కారణం.

నవలలో వెనుక ఒక అధ్యాయంలో ( “JUST A WORTHLESS TRAMP”)ఇటువంటి "క్రైస్తవ అరాచకవాది" పాత్రను ప్రవేశపెడతాడు టాల్స్టాయ్.సమస్త రాజ్యవ్యవస్థలనే కాదు, మతవ్యవస్థను కూడా “నేతినేతి” అనుకొంటూ సర్వావస్థావర్జితుడైన “ఒక క్రైస్తవసూఫీ” లేక ఒక సిద్ధుడు ఆ Tramp పాత్ర. ఇక్కడ ఒక ప్రశ్న.టాల్స్టాయ్ “అరాచకవాదే” అయితే, ఆయన ఈ నవలలో ఉద్దేశించింది అదే అయితే, ఈ “క్రైస్తవసూఫీ” (Tramp) అధ్యాయంతో నవల ముగించిఉండవలె కదా? కాని, నవలను యిక్కడ ముగించలేదు.

ముగింపు

నవల చివరి అధ్యాయం. నెఖ్లుడోఫ్ ఆరోజు జైలునుండి తన గదికి వచ్చాడు. కోటు విప్పుతూ, కోటుజేబులోని బైబిల్ కాపీ, ఆ ఆంగ్లక్రైస్తవప్రచారకుడు జైలులో యిచ్చినది, విసుగుగా విసిరి టేబుల్ మీద పడేశాడు. కటూషాతో తన కథ ముగిసింది. ఆమె నిరాకరణ అతనికి బాధగాను అవమానంగాను కూడా ఉంది. అది ఒక వైపు. ఈ మధ్య జైళ్ళలో, ఖైదీల కష్టాలు, అధికారుల అమానుషత్వం అతని మనసును మథిస్తున్నాయి. సమాజంలో చెడు విర్రవీగుతోంది. దానిని ఎలా అణచాలి? అసలు వీలవుతుందా? తన జీవితంలో ఒక అధ్యాయం ముగిసింది. ఇప్పుడు అతడి జీవితంలో ఎటు వెళ్ళాలో నిర్ణయించుకోవలసిన క్షణం.టేబుల్ మీద ఉన్న బైబిల్ ను అందుకున్నాడు.దానిలో Sermon on the Mount భాగం తీసి అందులో క్రీస్తు బోధలను చదివి, వాటికి అనుగుణంగా నడచుకోవడం ఒక్కటే మార్గమని, ఆమార్గంలో నడవాలని నిశ్చయించుకుంటాడు. క్రైస్తవమతాన్ని, మతప్రచారంలోని కాపట్యాన్ని అసహ్యించి అవహేళన చేసిన టాల్స్టాయ్, నవలను ఈ సుదీర్ఘమైన బైబిల్ పాఠంతో ముగించడంలో పరమార్థమేమిటి?ఆయన “క్రైస్తవ అరాచకం”లో క్రైస్తవమెంత, అరాచకమెంత? ఏమిటి ఈ నవల ముగింపులోని సందేశం?

నెఖ్లుడోఫ్ టేబుల్ మీద ఉన్న ఆ బైబిల్ కాపీని అందుకోడంలో ఒక కీలకమైన, నవలకు ప్రాణభూతమైన, సంకేతం ఉంది. ఆ బైబిల్ ఆంగ్లక్రైస్తవప్రచారకుడు జైలులో ఖైదీలకు పంచుతూ తనకూ యిచ్చిన కాపీ. తన గదికి వస్తూనే,కోటువిప్పుతూ తన కోటు జేబులోనుండి తీసి టేబుల్ మీదికి విసుగుగా విసిరి వేసిన కాపీ. ఆ బైబిల్ కాపీనే నెఖ్లుడోఫ్ తన చేతిలోకి తీసుకోవడం ఒక సంకేతం.ఆ తీసుకోవడం, తాను వెనుక "విసిగి విసిరివేసిన" చర్చిని క్రైస్తవాన్ని స్వీకరించడానికి

మాత్రమే సంకేతం కాదు. ఆ కాపీ తాను తన మనసులో ఒక క్షణం క్రితం వరకు తిరస్కరించిన సమస్తసామాజికవ్యవస్థలకు ఉపలక్షకం. అంటే, వెనుక తిరస్కరించినవాటినన్నిటినీ స్వీకరిస్తున్నాడని సంకేతమా? వెనుక ఆగ్రహకారణాలైన అన్యాయాలకన్నిటికీ తలవొగ్గమనే అర్థమా? కాదు.అన్యాయంపట్ల అమానుషత్వం పట్ల అసహ్యాము ఆగ్రహాము కలగకపోవడం అసహజం. మానవత లోపించడమే. కాని,ఏ సమాజంలోనూ ఏ కాలంలోనూ అవ్యవస్థ అన్యాయం అమానుషత్వం ఉంటూనే ఉంటాయి.వ్యక్తి వాటిపై ఆగ్రహిస్తూ వాటిని ఎదురిస్తూ ఉండవలసిందే. పోలీసు, కోర్టులు, సైన్యము, పరిపాలనాయంత్రాంగము, ఈ వ్యవస్థలనన్నిటినీ నడిపించే అమానవత, యివన్నీ ఏదో ఒక రూపంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి."హుష్ కాకి" అంటే ఎగిరి పోయేవి కావు. మనిషిలోని మానవతకు పరీక్షగా నిలిచిఉంటాయి. కాని, ఎటువంటి అవ్యవస్థలోనూ వ్యక్తి వ్యక్తిగా ఎదగగలడు, ఎదగవలె. ముక్తి వ్యక్తికే గాని, వ్యవస్థకు లేదు.సృష్టిలో ద్వైవిధ్యం వదలదు, వదిలిపోవలసింది ద్వైధీభావం. వ్యక్తికి ఈ ఎరుక ఎలా కలుగుతుందో ఎప్పుడు కలుగుతుందో తెలీదు. అది ఒక్క క్షణంలో, మెరుపులాగా కలుగుతుంది. నెఖ్లుడోఫ్ కు ఆ "ఎరుకమెరుపు" మెరిసింది.("అది అయింది","It happened ") ఆ తరువాత జీవితం మరో జీవితమే, పునరుత్థానమే."Resurrection."

నవల:రూపము, వస్తువు (Form and Content)

ఈ నవల గురించి సాధారణ అభిప్రాయం, ఇది రచయిత తన అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ఒక పాత్రను సృష్టించుకొన్నాడు, కనుక నవల ఒక ఉపన్యాసంగా ఒక సామాజికకరపత్రంగా తయారైంది అని. ఇది సరి అయిన అభిప్రాయం కాదు. నిజానికి, ఈ నవలలో ప్రసిద్ధమైన తక్కిన రెండు నవలలో వలె ఉపన్యాసాలు లేవనే చెప్పాలి. ఈ నవలలో రచయిత అభిప్రాయాలు వాస్తవంలో కథానాయకుడి అంతర్మథనంలో అంతర్భాగమే.పాత్ర ఎదుగుదలలో భాగం. ఇక, ఈ నవల రాసేనాటికి టాల్స్టాయ్ సృజనాత్మకప్రజ్ఞ మందగించిందని, కళాత్మకంగా వస్తువును ఆవిష్కరించలేకపోయాడని కూడా సాధారణ అభిప్రాయం. ఇది కూడా,పాఠకుడు రచనలోని శిల్పాన్ని, ముగింపులోని ప్రాణభూతమైన సంకేతాన్ని , గుర్తించలేకపోవడమేగాని,రచయిత ప్రజ్ఞ మందగించడం కాదనిపిస్తుంది. రచయిత అనుకున్నట్టు నవల నెలలు నిండకముందే బయటపడలేదు, విమర్శకులన్నట్టు అది ఒక బృహద్గ్రంథంలోని శకలము కాదు. అది సకలము సంపూర్ణము.

టాల్స్టాయ్ ప్రజ్ఞ ఏమాత్రము తరగలేదు.వయ:పరిపాకంతో జీవితదృక్పథం పరిణతమై, అనుగుణంగా శిల్పం పదునైంది. మేస్లోవా నెఖ్లుడోఫ్ ల ముగ్ధప్రథమప్రణయసన్నివేశవర్ణనలలో టాల్స్టాయ్ పాటవం ఏ మాత్రము తగ్గలేదు.ఆ పాత్రలవలె , ప్రేమలో ఎదిగి ఒదిగినవారు సాహిత్యంలో అరుదు.జార్ ప్రభుత్వంలోని అమానుషత్వాన్ని, ఆ పరిస్థితులలో పాత్రలు ఎలా నలిగారు, ఎలా ఎదిగారో, ఈ రెంటినీ పడుగుపేకలలాగా అల్లడంలో అద్భుతమైన రచనా శిల్పాన్ని ప్రదర్శించాడు టాల్స్టాయ్. రూపము వస్తువు కలిసి ఎదిగిన అపురూపరచన టాల్స్టాయ్ నవల.

టాల్స్టాయ్ పై దోస్తోవ్ స్కీ ప్రభావం  ఈ నవలలో బలంగా కనిపిస్తుంది. ( కథలో, నెఖ్లుడోఫ్ మొదటిసారి కటూషాను కలిసినపుడు ఆమెకు దోస్తోవ్ స్కీ నవలలు యిస్తాడు.) కాని ఎవరి శైలి వారిదే. నెఖ్లుడోఫ్  రాస్కోల్నికోఫ్ కాడు, డిమిట్రి కాడు. ఇతనిలో వారిలో వలె తీవ్రమైన అంతర్మథనం ఉండదు. క్రమంగా బుద్ధిని శిక్షించి తనను తాను మలచుకుంటాడు.

ఖైదీల కష్టాలను మరీ దీర్ఘంగా వివరిస్తున్నాడు అనిపించ వచ్చు, అక్కడక్కడా.చివరి బైబిల్ పాఠం మరీ స్కూలుపిల్లల పాఠంలా అనిపించవచ్చు. మొదటి సారి నవల చదివేటప్పుడు ఆ భాగాలను దాటెయ్యవచ్చు. మహాభారతం మొదటిసారి చదినప్పుడు శాంతిసప్తకం ఎంతమంది చదువుతారు? కాని భారతంలో ఆ శాంతిని తొలగించగలమా? "" యుద్ధషట్కము శాంతిసప్తకము పడుగుపేకగా అల్లిన నవల "పునరుత్థానం",(The Resurrection )

కావ్యానికి పరమప్రయోజనం పాఠకుడి శిక్షితచిత్తం. ( మహాభారతాన్ని ముగిస్తూ తిక్కన యిదే అంటాడు, "శిక్షితచిత్తులార!", అని.) టాల్స్టాయ్  నవలకు  ఫలం ఆ శిక్షితచిత్తమే. శిక్షలో ప్రక్షాళనమై చిత్తం శాంతస్స్థితిని పొందుతుంది. ఆ శాంతంలోనే పర్యవసిస్తుంది  ఈ నవల.” యుద్ధము శాంతి" కంటే ఈ నవల ఎక్కువ కష్టంకాదు,చదవడం.  చదవకపోవడం గొప్ప నష్టం.

***

# 5. అమృతసంతానం

# 5. అమృతసంతానం

ముందుగా నేరం ఒప్పుకొని మరీ మొదలుపెడతాను. ఇది 1947లో వచ్చిన నవల.తెలుగు అనువాదం వచ్చికూడా దాదాపు నలభైసంవత్సరాలవుతున్నది. ఇంతకాలం ఈనవల చదవకపోవడం తప్పకుండా నేరమే.అది నేరమయితే, యిప్పుడు దీనిని పరిచయంచేయబూనడం పరిహాసాస్పదం. 'నవ్విపోదురుగాక' అనుకుని నా అనుభవాన్ని పంచుకునే ప్రయత్నం చేస్తాను. (ఆ భావకవిని తలచుకోడానికి మరో కారణం కూడా ఉంది.)'అమృతసంతానం' నేను యిప్పుడైనా చదవడానికి కారకులు వాడ్రేవు చినవీరభద్రుడు గారు.ఈ నవలకు ఇటీవల వచ్చిన (ఇన్నాళ్ళు రాకపోవడం నా నేరం కాదు.) ఆంగ్లానువాదం ఆయనకు  అనుకోకుండా అగుపించినపుడు తను పొందిన ఆశ్చర్యానందాభివ్యక్తి నాచేత  యీ నవల చదివించింది.నైజీరియా నవలలు,లాటిన్ అమెరికా నవలలు, ఆల్జీరియా రచయితలు తెలుసు, కాని పొరుగు రాష్ట్రంలో రచయితలను చదవలేదు అంటే ఎక్కడో  ఏదో పొరపాటు జరిగింది. అందులో, గోపీనాథ్ మొహంతి వంటి రచయిత! భారతీయభాషాసాహిత్యాలలో కాదు, ప్రపంచంలోని అగ్రశ్రేణి నవలారచయితలలో యితనితోపాటు నిలువగలిగినవారు చాలా తక్కువమంది. 'ప్రపంచస్థాయి రచన.ప్రపంచమంతా చదివితీరవలసిన రచన...రామాయణభారతాల వారసుడుమాత్రమే రాయగలిగిన నవల': వీరభద్రుడుగారి యీ మాటలలో అణుమాత్రం అతిశయం లేదు.

కొండజాతి తెగలవారు యిందులోని ప్రధానపాత్రలు.  ఒడియారాష్ట్రంలోని కోరాపుట్ లోని వారు జీవనం చేసే వేలఅడుగుల ఎత్తుకొండలు అక్కడి అడవులు యీకథకు కాన్వాస్.అలాగని,యిది ఆదివాసుల ప్రాంతాలగురించి, వారి ఆచారవ్యవహారాల గురించి తెలిపే యాత్రికుల హస్తపుస్తకం కాదు. ఈ అరవై ఏండ్లలో ఆ ప్రాంతాలు,  ఆ ఆదివాసులు చాలా మారిపోయి ఉండవచ్చు. నవల విలువ మారదు. అంతే  కాదు,కొండజాతులవారి జీవనవిధానం గురించికాని, వారి ఆర్థిక పరిస్థితుల అభివృద్ధి గురించికాని రచయిత అభిప్రాయాలకోసంకూడా చదవవలసిన నవల కాదు. 'వారి జీవనవిధానం, వారి ప్రత్యేకత భద్రపరచవలెనా? మన నాగరికతలో వారిని కరగదీయవలెనా? ' ఇటు వంటి ప్రశ్నలకు జవాబులకోసం చదవవలసిన పుస్తకం కాదు. ఇది నవల కనుక చదవవలసిన నవల. ఈనవల గురించి ముందు, చివర చెప్పుకోవలసిన మాట, ఇది నవల, నవల మాత్రమే, నవలకానిదేదీ యిందులో లేదు.  తత్త్వం, వేదాంతం, సామాజికస్పృహ, రాజకీయ చైతన్యం, వలసవచ్చిన దోపిడీ దౌర్జన్యం,యింకా ఏమైనా ఉంటే అవీ--అన్నిటిని కరిగించి కళగా మార్చుకున్న నవల.

 'అమృతసంతానం' లోని  ప్రకృతి ,అందమైన అడవులు ఆకాశమంటుకునే కొండలు మాత్రమే కాదు.అవి మనిషి వెలుపలి ప్రకృతి, మనిషి ప్రకృతి కూడా.మనిషి అక్కడి ఆకులో ఆకు, కొమ్మలో

కొమ్మ. అతడి రూపం రెండంగుళాల గోచి, బుజాన గొడ్డలి. నునులేత రెమ్మ! అక్కడి ఆడవారికి ఆచ్ఛాదన  మొలవరకే.పై సగం పూసలపేర్లు. అవి ఆభరణము ఆవరణము కూడా'అమృతసంతానం' ఆదిమానవుల  గురించి కాదు. మానవుడి ఆదిమూలాల గురించి.)( 'శృణ్వన్తు విశ్వే అమృతస్య పుత్రా/ ఆ యే ధామాని దివ్యాని తస్థు:।శ్వేత.ఉప.2.5.)ఈ నవలను రచయిత మూడు పార్శ్వాలనుండి దర్శించాడు: మనిషి -ప్రకృతి,మనిషి -రాజ్యము,మనిషి -మనిషి.దర్శనంలో మనిషి కేంద్రం.ఏ రచనకైనా వస్తువు మనిషే కదా?(  'తేనెటీగ జీవితచరిత్ర' The Life of the Bee' by Maeterlinck) కూడా మనిషి గురించే.)

నవలగురించి  ముందు చెప్పుకోవలసింది అందులోని శైలి.మొహంతి  కవి.( నవలకు కవితాశైలి పడదు. ఖరీదైన బంగారుబురఖాలా ఒంటిని కప్పేస్తుంది.కథకాళ్లకు అడుగడుగునా అడ్డం వస్తుంది.అందంగా ఉన్నది ఆభరణం  కాదు.అందమిచ్చేది ఆభరణం.)  కాని,మొహంతి కవితాశైలిలో కవిత్వం కనిపించదు.భావంలో కలిసిపోయి  నడిపిస్తుంది. అంటే భావరూపం పొంది కనిపిస్తుంది. ( రూపకం,metaphor).  ఆయనకు యీ శైలి ఒక అద్భుతమైన సాధనం, ఆయన రచనాశిల్పంలో ప్రధానగుణం. చాలావరకు  నాలుగయిదు మాటలు మించని చిన్నచిన్న వాక్యాలు.రెండవ పాదంలోకి సాగిన వాక్యం అరుదు.

అనువాదరచనను బట్టి మూలంలోని శైలిగురించి యింత చెప్పడం సాధ్యమా అనిపించవచ్చు.   పురిపండా అప్పలస్వామి అనువాదం అనువాదంలా లేదు. మూలరచన అనువాదానికి అనువైనది అయిఉంటుంది. ఇలా అనడం అనువాదప్రతిభను ఏమాత్రం తక్కువ చేయడం కాదు. ఆయనది అరుదైన అనువాదప్రతిభ.

అమృతసంతానం: అధ్యాయం “ఒకటి”

ఈ నవలలో నూటొక్క అధ్యాయాలు.అధ్యాయాలకు పేర్లు లేవు.సంఖ్యలే. పేర్లు ఎందుకు పెట్టలేదు? సాధారణంగా ఒక అధ్యాయంలోని కథాభాగాన్ని అనుసరించి లేక పాత్రప్రాధాన్యాన్ని బట్టి ఆ అధ్యాయానికి పేరు ఉంటుంది.ఈ నవలలో అటువంటి మలుపులు లేవా? ఎందుకు లేవు? ఉన్నాయి.కాని అవి కథలో భాగాలుగా, కథాగమనంలో మజిలీలుగాఉంటూనే, దేనికది ఒక పూర్ణరూపంతో ఉన్నాయి.ప్రతి అధ్యాయానికి ఒక సమగ్రత ఒక నిండుదనం ఉన్నది.అలాగని, ఒక అధ్యాయం తొలగించినా నవల సమగ్రతకు కొరత ఉండదా?( ‘పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే’అన్నట్టు)

కొరత ఉంటుంది.నవల నిండుతనానికి ప్రతి అధ్యాయము అవసరమే.అదే మొహంతి రచనానైపుణ్యం.( అటువంటి నైపుణ్యం ప్రసుత నవలకు అత్యంతభిన్నమైన మరో నవలలో చూచాను.( The Brothers Karamazov by Dostoevskyలో.అయితే ఆ నవలలో అధ్యాయాలకు పేర్లున్నాయి.అది వేరే విషయం.)

‘అమృతసంతానం’ లోని ఈ వైశిష్ట్యాన్ని అధ్యాయం “ఒకటి” లో పరిశీలిద్దాం.

‘ కోదుజాతి పెద్దపండుగనాడు సరుబు సావొతా చచ్చిపోయాడు.’

ఈ మరణవార్త మొదటి అధ్యాయం చివరివాక్యం.కథాప్రారంభం.నాలుగువేల అడుగుల ఎత్తున కొండలలో, కోదులనే కొండజాతివారి వూరు.ఎనభైఏళ్ళ సరుబు సావొతా (సామంత?)కులవృద్ధు. అయిదువందలమంది కోదులకు కులపెద్ద,పెద్దబుర్ర, నాయకుడు.కథ ఎక్కడ మొదలవుతున్నది? .

‘పుష్యమాసం చివరిదినాల ఎండ.’

“పుష్యమాసం.” ప్రకృతి ఈ కొండజాతులవారికి జీవం.ఋతువులు వారి జీవనంలో భాగం.ఆకాశం వాళ్ళ గడియారం.ప్రకృతి  వారి పంచాంగం.వారి జీవితాలు జీవనవిధానం ఋతుక్రమంతో ముడిపడి వుంటాయి. ఎండ అంటే సరిపోదు.పుష్యమాసం అంటే చాలదు.తొలిపుష్యం ఎండ,మలిపుష్యం ఎండ.ఈ నవల అంతటా ఋతువులు పరచుకొని వుంటాయి.(ఇందులో ఋతువర్ణనలు రామాయణాన్ని గుర్తు చేస్తాయి.) కథాగమనంతో నడిచే ఋతువర్ణనలు అనడం కంటే ఋతువులతో నడిచే కథ అనడం సరి అయిన మాట.ఋతువులు నడిపించే కథ అనడం ఇంకా సరి కావచ్చు.

‘మాఘమాసం సంజ.చలీ చీకటీను.చలీ చీకటీ అంతా తొక్కేసుకుంటూ సడిచిపోతారు.’

‘ఫాల్గుణం చివరి చీకటిరాత్రి.రైంయి రైంయిమని తుఫానుగాలి. ఊగుతూ ఊపేస్తూ నడిచింది.’

‘ఫాల్గుణంగాడు చావనీ...చైత్రం పండుగ ఆరంభమయి పోయింది.’ ‘ఫాల్గుణంగాడు’ ! ఫాల్గుణం ఒక ఋతువు, ఒక భావం  కాదు.  అది ఒక ప్రాణి.ఋతువులన్నీ సప్రాణాలే, ఒక్కొక్క వ్యక్తిత్వంతో. కొండజాతులకు ఋతువులు శరీరంలోనే ప్రకటమవుతాయి.
కొండల్లో  నదుల్లో  పూలతీగల్లో  పండ్లచెట్లల్లో ప్రకటమైనట్టు.

సరుబు సావొతాకు  యిది  తన చివరిరోజని తెలిసింది.

‘పుష్యమాసం ఎండలో ఇప్పసారా రుచిగా ఉంటుంది. నిషా పడుతుంది. ఎండవెచ్చదనంలో కునుకుపడుతుంది...ఆలోచనలలో ముసలాడికళ్ళు మూతలుపడిపోతున్నాయి.’

తన చివరిక్షణాలలో సరుబుసావొతాకు తన గతం తన కుటుంబం తనవూరు తన కోదుజాతి దాని ప్రాచీనఘనచరిత్ర–అంతా ఒక్కసారి,చివరిసారి, మనసుకళ్ళముందు కదిలిపోతున్నాయి. మరణక్షణాలలో తనఆదివాసుల ఆదికాలాలు స్మరణకు వస్తున్నాయి అతనికి. చరిత్ర పుట్టకముందే పుట్టిన కొండజాతి. యుగాలు గడిచిపోయాయి.

‘ఆకాలం ముసిలాళ్ళు చెప్పేవాళ్ళు.ఎప్పుడో ఏ కాలంలోనో రాముడని ఎవరో రాజకొడుకట.తన భార్యనీ తమ్ముణ్ణీ వెంటబెట్టుకుని ఈ అడివికి వచ్చాడట!...పెట్టుబడిదార్ల అన్యాయాలు ఎదిరించడానికి,కత్తి కట్టడానికి కోదులకి తగిన సర్దారు దొరికాడు.రాముడు హనూకోదు,జాంబాకా, జాంబవంతకోదూ అతడికి సాయంచేశారు.ఇతరగోత్రాలవాళ్ళు
సైనికులైనారు.చెదురుమదురుగావున్న కోదుగోష్ఠిని వొక్కదగ్గర చేర్చాడు రామచంద్రుడు. దీనులు దరిద్రులు కూలీలు రైతులు సైనికులైనారు. ఈటెలు కత్తులు రాళ్ళు వెదుళ్ళు పట్టుకొని

పెట్టుబడిదారీ సభ్యతను ఎదిరించి యుద్ధం చేశారు.తిరిగి ఆ దరిద్రనాయకులే రాజులయ్యారు.తిరిగి అదే పెట్టుబడిదారీ సభ్యత...ఎక్కడి పేదాసాదా అక్కడే.'

(అన్ని విప్లవాలలో జరిగేదిదే కదా!)

ఎనభై ఏళ్ల సావొతాకు చివరిక్షణాల్లో గతం తలపుకురావడం సహజమే. కాని ముందుగా అతనికి గుర్తువచ్చింది తన గతంకాదు. తనకోదుజాతి ఘనచరిత్ర.దాని ఆదిమూలాలు.సరుబు కోదులప్రభువు.జాతిఘనత స్మరణకురావడం సహజం.కాని, ఈ కోదులజాతికి రామాయణంతో సంబంధం ఎంతవరకు నమ్మదగింది? రాముని పాదం తాకనిచోటు సీతమ్మ చీరె ఆరేసుకోని బండ లేదంటారు.ఇదీ అటువంటిదేనా? నవల ఈ గాథను చరిత్రగా చెబుతోందా? ఈ ముసలి తన చివరిక్షణాల్లో గుర్తు చేసుకున్నది, తాను చిన్ననాడు విన్నానని చెప్పింది, చారిత్రకసత్యమా? కథలో కొన్ని వాక్యాలు వెనుకకు వెళితే రచయితపరమార్థమేమిటో తెలుస్తుంది.

'పుష్యమాసం ఎండలో ఇప్పసారా రుచిగా వుంటుంది.నిషా పడుతుంది.పొగమంచులో నీడలు తేలిపోయేవి.ముసలాడి కళ్ళు మూతలు పడుతున్నాయి.'

కొండజాతిగాని, కొండంతజాతిగాని,తనకొక కాల్పనికచరిత్ర ఘనంగా రాసుకుంటుంది.ఆ చరిత్రలో,ఏ చరిత్రలోనైనా, నిజమెంత నిషా ఎంత? ఇక్కడ రచయిత కథ చెబుతూనే, చరిత్రరచనాప్రక్రియపై ఒక ప్రవచనం (statement) చేస్తున్నాడు.అంటే, ఈ రామాయణప్రసంగం కథకు అతకని, అవసరంకాని, అధికప్రసంగమేనా? ఎంత మాత్రము కాదు. ముసలాడు నెమరువేసుకోడం కథలో భాగం.చరిత్రరచనపై చురకగా కూడా కథకు అవసరం.సరుబు స్మరణలో జాతి వ్యక్తిలో కలిసి వ్యక్తిగా వ్యక్తమవుతున్నది. కోదుజాతి సరుబు నోట పలుకుతోంది.ఇది కథకు అవసరమైన సన్నివేశం. కదిలించే సన్నివేశం. సరుబుసావొతా చచ్చిపోయాడు. కోదుచరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది.నవలలో మొదటి అధ్యాయం ముగిసింది.కథ మొదలవుతుంది.

'పుష్యమాసం చివరి దినాల ఎండ.' మూడు పొడి మాటలు.ఈ నిరలంకారనగ్న వాక్యం రెండు జానల గోచి పెట్టిన కోదులాగే ఉంది. అంత బలమూ ఉన్నది. అంత బరువు మోస్తున్నది. మనిషి-ప్రకృతి,మనిషి-మనిషి(సమాజం),అనే రెండు పార్శ్వాలు ప్రదర్శిస్తున్నది. ( ఈ పొడిమాటల పని యింతటితో అయిపోలేదు.)

ప్రవచనంలో అంతర్భూతమై మరో సత్యంకూడా ఉంది.రాముణ్ణి కొండజాతివారు అర్థం చేసుకున్న తీరు. వారికి రాముడు విప్లవవీరుడు. పెట్టుబడీదారీసభ్యతను ఎదిరించి పోరాడడానికి కూలీజనాలను సమీకరించి సైనికులుగా సిద్ధం చేసి పోరాడి పేదలరాజ్యం స్థాపించినవాడు. ఇందుకు విరుద్ధంగా 'సభ్య' సమాజం రాముణ్ణి అర్థం చేసుకున్నది. వీరికి రాముడు పెట్టుబడిదారుల ప్రతినిధి.( ఇక్కడ 'సభ్యత' అన్న పదం ప్రత్యేకంగా చర్చించదగింది.సాధారణంగా ఈ అర్థంలో 'వ్యవస్థ' 'సంస్కృతి'పదాలు వాడతాం.)

అధ్యాయం "ఒకటి" లో మరో పార్శ్వంకూడా ఉంది. నవల మొదటే, మొదటి పది లైన్లలోపే, ఒక కీలకమైన అంశం ప్రస్తావించబడింది, మనిషి-రాజ్యము.దీని ప్రస్తావన తరువాతనే, పైన చెప్పుకున్న తక్కిన రెండు అంశాలు, మనిషి-ప్రకృతి, మనిషి-మనిషి (సమాజం) వస్తాయి.

‘ కోదుల నమ్మకం ప్రకారం రైతు దరిద్రుడే అవుగాక,రాజకంటే అతడి అభిజాత్యం అధికం. రాజ తమ్ముడు. కోదు అన్న.అన్న గుర్రం ఎక్కడం కోసం రువ్వ విరిచి తేడానికి వెళ్లాడు. ఇంతలో తమ్ముడు గుర్రం ఎక్కి వుడాయించాడు.అవేళనుంచీ అతడు రాజయ్యాడు. తమ్ముడు దగాకోరు. అన్న సరుబు సావొతా. రాజైన తమ్ముడి విరోధం క్షమించడం నేర్చుకున్నాడు కోదు..మన్యం కొండలాగా ఉన్నతమైనవాడు కోదన్న.ఆకాశంలాగా ఉదారుడు.’

ముందు వచ్చిన చెవులకనన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి. కొమ్ములు తిరిగిన రాజ ఎక్కినగుర్రం ఎప్పటికీ దిగడు.

అధ్యాయం “ఒకటి” లో మరో ముఖ్య పార్శ్వం కడా ఉంది.ఆదివాసుల క్రతువులు,ఆర్షసంస్కృతి.

‘సరుబు కళ్ళు మూతలు పడుతున్నాయి ఆలోచనలో. ఊరిమొగన ఝూకరదేవత తోటలో డోలు వినపడుతోంది డుమ్ డుమ్ డుమ్.జాని ( పురోహితుడు) మంత్రాలు చదువుతున్నాడు.’

మంత్రాలు! కోదులేమన్నా ఋషులా? వేదాలు చదువుకున్నారా? ఏమిటా మంత్రాలు? అవి కోదుభాషలో మంత్రాలు.

‘ఎవరూ నష్టం కాకుండా వుండాలి. పులి లేకుండా వుండాలి.కరువు రాకుండా వుండాలి.అందరూ సుఖంగా శాంతిగా వుండాలి.ఉల్లి సాగు బాగుండాలి.వెల్లుల్లి సాగు బాగుండాలి.’

వేదసూక్తాలు శాంతిమంత్రాలు స్తోత్రాలు కోదుభాషలో లేవు.కాని అవీ యిదేగదా చేయడం.దేవతలను స్తోత్రం చేయడం, ఇదివ్వు అదివ్వు అని అడగడమే కదా? రాళ్ళివ్వు ఇసుకయివ్వు మట్టివ్వు ( ఆకాలంలో సిమెంటు లేదు) ఆయుస్సు యివ్వు ఆరోగ్యమివ్వు భార్యనివ్వు పశువులివ్వు పంటలివ్వు (ఇడ్లీ చ  మే దోశాశ్చమే. courtesy కన్యాశుల్కం).ఆదివాసుల మంత్రాలలో అత్యాశ యింతగా లేదేమో!ఘనాపాఠి పాఠం ఇంతకంటే ఘనమా?

ఇక ఆదివాసుల క్రతువులు. వాళ్ళు  మొదట నరబలి ఇచ్చేవారు.తరువాత బర్రెలు.ఆ తరువాత కోడి. ఇప్పుడు ఎలుకలైనా చాలు. నరబలి వారికి సంతోషం కాదు. విధిగా చేసేవారు.పైన ధర్మదేవత కింద ధరిత్రి సంతోషిస్తారని కష్టాలనుండి కాపాడుతారని చేసేవారు. ‘ఈ పాపం మాదికాదు ఈ పాపం మాది కాదు’  అని పదే పదే ఒడ్డుకుంటూ బాధతో దు:ఖంతో బలి యిచ్చేవారు. వేదకాలంలో ఋషులుకూడా నరబలుల దగ్గర మొదలుపెట్టిన వారే కదా? మరి ఒక సంస్కృతి సభ్యము మరొకటి అసభ్యము ఎలా అయ్యాయో? అలాగని రచయిత  కోదుసంస్కృతిని ఆదర్శసంస్కృతి అని ఆకాశానికెత్తేయడం లేదు. సాహిత్యకారుడిగా వాస్తవాన్ని చిత్రిస్తున్నాడు.

‘ వాళ్ళది అసభ్యత. అక్కడా అరిషడ్వర్గాలున్నాయి.అక్కడా కంపుంది.మైలా వుంది.అన్నిచోట్ల ఏముందో అక్కడా అదే ఉంది.కాని అక్కడ అడివి కెరటాలలో మానవహృదయంలోని మూలస్వరూపం నాట్యం చేస్తుంది...వేదన నిమ్మళిస్తుంది.’

ఈ నవల సామాజికశాస్త్రచర్చ కాదు.సరుబుసావొతా నవలలో పాత్ర, ఒకతరానికి ప్రతినిధి.తన చివరిక్షణాలలో తన గతాన్ని జాతిచరిత్రను నెమరువేసుకోడం కథలో భాగం.నవలలో .నడవబోయే కథకు భూమిక అధ్యాయం “ఒకటి”.

చివరగా కోదుల జీవితదృక్పథం.ఇదికూడా పూర్తిగా వేదం దర్శించినదే.అంత్యకాలంలో సరుబు చింతన:

“‘గతజన్మలో బాగుండేవాణ్ణి .ఈ జన్మలో బాగున్నాను.దీని తరువాత మళ్ళీ మరొక జన్మ తప్పదు.’ ఇలా అనుకుని ఆనందించేవాడు. ‘పోతేపోతుంది.ఇది పాతబడిపోయిన పనికిరాని శరీరం.దీన్ని పారేసి మరొకసారి పుట్టడం మంచిది....ఎంత అందంగా ఉంది మన్యం! రంగురంగుల కొండలకింద స్ఫటికంలాగ స్వచ్ఛమైన సెలయేళ్ళు.నాలుగువైపులా పసుపుపచ్చని ఒలిసి పువ్వులు.ఒలిసి తేనెపట్లు.’

ఇంత అందాన్ని ఆనందాన్ని మనసులో నింపుకుని వెళుతున్నాడు సరుబుసావొతా.ఆ అందమూ ఆనందమే ‘పుష్యమాసం చివరిదినాల ఎండ’. ఫాల్గుణం కాకూడదా? కాదు.సరుబుసావొతా చావుతో ఒకతరం, కోదుచరిత్రలో ఒక దశ, ముగుస్తుంది. మరో దశకు మాఘఫాల్గుణాలు సంధియుగం.( నవల కాలం రెండునెలలని అర్థంకాదు.)

‘పుష్యమాసం చివరిదినాల ఎండ.’మూడు పొడిమాటలు! ఎంత అలవోకగా ఎన్ని బాధ్యతలు నిర్వహించింది! ఇదీ మొహంతి కనిపించని కవితాశైలి!

***

అమృతసంతానం- నవలలో వూళ్ళు:మిణి అపాయు;బందికార;మిటిం.

ప్రధానపాత్రలు:

సరుబు: (మిణి అపాయు సావొతా.ఇతని చావుతో కథ మొదలు)

దివుడు: సరుబు కొడుకు, సరుబు తరువాత వూరి సావొతా

హొర్గుణా:బందికార సావొతా

బేశు: మిటిం సావొతా రఘు కొడుకు

లెంజు :సరుబు తమ్ముడు

పుయు: దివుడు భార్య

పుబులి:దివుడు చెల్లెలు.బేశు ఈమెను 'ఉదులియా' తీసుకెళ్లి ( రాక్షస వివాహం) పెళ్లి చేసుకుంటాడు.

పియొటి: కథ చివర, దివుడు తన రెండవ భార్యగా యింటికి తెచ్చుకుంటాడు

సోనాదేయి: ( డొంబు జాతి) భుర్షాముండా కోడలు

వర్గము-అరిషడ్వర్గము-ఆడామగా.

ప్రపంచంలోని ఏ భాషాసాహిత్యంలోనైనా ఏ కథ అయినా ఏ కవిత అయినా ఈ మూడింటిచట్రంలో ఇమిడిపోవలసిందే.ఈ చట్రానికి వెలుపల రాయడానికేమీ లేదు.(Structuralists, వారికంటే ముందు Northrop Frye, ప్రపంచంలో ఏ కథ అయినా ఇమిడిపోవలసిన ఒక మాతృక (Matrix)వంటిది తయారుచేశారు. అవన్నీ పై మూడిటిలో ఇమిడిపోతాయి,'అమృతసంతానం' లో కూడా.)

ఏ నవలలోనైనా ముఖ్యమైన రెండు అంశాలు పాత్రచిత్రణ, కథానిర్మాణం.ఈ నవలలో యీ రెండూ కూడా విశిష్టంగా నిర్వహించాడు మొహంతి. ఈ నవలలో కథానాయకులనదగినవారు ముగ్గురు: దివుడు, హార్గుణా, బేశు. ఇద్దరు సావొతాలు, మూడవవాడు సావొతా కొడుకు. కాని నవలలో ప్రధానపాత్రలు స్త్రీలనవచ్చు:పుయు,పుబులి,పియొటి.వీరిలో చేర్చలేని మరో స్త్రీ పాత్ర సోనాదేయి. నవలలో పాత్రలను సాధారణంగా సంక్లిష్టపాత్రలని (round),సీదాసాదా (flat)పాత్రలనీ వర్గీకరిస్తారు.ఈ నవలలో స్త్రీపురుషపాత్రలనన్నిటినీ స్పష్టమైన వ్యక్తిత్వంతో పూర్ణరూపంతో సజీవంగా చిత్రించడం నవల విశిష్టత. ముగ్గురుకథానాయకులవి మూడు విభిన్నవ్యక్తిత్వాలు. దివుడుది ముగ్గురిలోను సంక్లిష్టపాత్ర. బేశు తాను సీదాసాదా అని తనే చెప్పుకుంటాడు. ( సీదా పాత్ర సీదా పాత్రచిత్రణ ఒకటికావు.సీదాపాత్రలోని సీదాతనం సజీవంగా చిత్రించబడవలె.)ఇక రెండవ అంశం కథనం. బిగువైన అల్లిక ఈ నవలలోని ప్రధానగుణం. నవలను ఉత్తమస్థాయికి చేర్చినవి ఈ రెండు అంశాలు.ఇక కథలోకి వెళుదాం.సంఘటనలకంటె సంబంధాలు అనుబంధాలు, ఆ బంధాలు వారి వ్యక్తిత్వాలను ఎట్లా చూపుతాయి అన్నది ఏ నవలలో అయినా చూడవలసిన విషయం.

సరుబు సావొతా చచ్చిపోయాడు. కుటుంబం దు:ఖంలో ఉంది.ఊరు బాధపడుతోంది.అందరి దు:ఖమూ బాధా ఒకటిగా ఉండదు.కోడలు పుయు, పెళ్లి కావలసిన కూతురు పుబులి, ఏడ్చారు.పుయుకు తల్లితండ్రులు లేరు. మామలో తండ్రిని చూచుకున్నది.('తండ్రి కంటే హెచ్చు.')మామ ఆమెను అంతే ప్రేమతో చూచేవాడు. పుయుకిప్పుడు తొమ్మిదో నెల. మామ ఎక్కువ మాట్లాడేవాడు కాడు. పుయుకడుపులో పెరుగుతున్న మనవణ్ణి తలచుకుంటూ సంతోషంతో కోడలివైపు చూచి, ఒక నవ్వుతో వెళ్ళిపోయేవాడు. కొడుకు అప్పుడప్పుడు కోడలిపై కోపం చూపించబోతాడు.ముసలాడు పొడిదగ్గు దగ్గుతాడు. కొడుకు కోపం మింగేసుకుంటాడు.( ముసలాడి 'పొడిదగ్గు' కుర్రకోపానికి సరిహద్దు,ఇంట్లోను ఊళ్ళోనూ.)పుబులి ఏడ్చింది.పుబులి ఏడుపు మనిషి ఏడుపులా లేదు. 'జంతువు ఏడ్చినట్టుంది.గుండుదెబ్బతిని పారిపోయిన

అడివిపంది ఏటివొడ్డు బురదలోపడి పొర్లుతూ ఏడ్చినట్టుంది.' ( రావిశాస్త్రి శైలిని, ముఖ్యంగా 'గోవులొస్తున్నాయి జాగ్రత్త'లోని ఉపమానాలను, గుర్తు చేస్తుంది మొహంతి శైలి. కాని ఈ ఉపమానం అంతటితో ఆగిపోతుంది.రావిశాస్త్రి శైలి ఉన్న కొద్ది కథనాన్ని మింగేస్తుంది అన్నది ఎరిగిన సత్యమే.) పుయు ఏడ్చింది.పుబులి ఏడ్చింది. ఇద్దరి దు:ఖమూ ఒకటి కాదు. ఎవరి దు:ఖం ఎక్కువ అని చెప్పడం కష్టం. ఈ కష్టం సాధారణంగా కలగకూడనిది.పుయు బంధం మామతో ఆ కుటుంబంతో అంత గాఢమైంది.

పుయు పుబులిల అనుబంధం నవలలో ఒక ప్రధాన అంశం. పుయుకు పుబులి తల్లి, చెల్లెలు, స్నేహితురాలు, ఆడబడుచు. పుయు పుబులిని అందంగా ముస్తాబై ఉండమంటుంది. పెళ్లి కాని ఆడపిల్లలతో కలిసి బయటకువెళ్ళి తిరగమంటుంది. కొండజాతుల్లో వివాహవిషయంలో ఆడపిల్లలదే నిర్ణయం.ఆమె ఊ అంటేనే అతడు ముందడుగు వేయగలడు.ముసలాడుండగా పుబులి గురించి అంటుండేవాడు,'బందికార హార్గుణా దీన్ని చేసుకుంటా'డని.

పుయు అడివిలో కన్న కాన్పు వర్ణన ఆశ్చర్యం కలిగిస్తుంది.పుయుకు నిండు నెలలు.అందరి ఆడవాళ్ళతో కలిసి అడివిలోకి వెళ్ళింది, రోజూలాగే, దుంపాదుట్రా కొరకు.వెళ్ళినవాళ్ళు తలా ఒక దిక్కైనారు.పుయు ఒక్కతే అయింది.బాగా అలిసిపోయింది. ఉన్నట్టుండి నొప్పులొచ్చినాయి,తుఫానులాగా తెరలుతెరలుగా.పుయు అరిచింది,ఏడ్చింది.ఎండ తీవ్రంగా ఉంది.ఎక్కడలేని సత్తువతో ఒక మద్దిచెట్టు రెండుచేతులతోను బిగించిపట్టుకుంది. హఠాత్తుగా తుఫాను ఆగిపోనట్టయింది.ఎర్రటి చిన్న కందు కిందపడి అరుస్తున్నాడు.ఉదయసూర్యుడిలా వాడి కళ్ళు. పుయు చేతులుచాపి కొడుకును తీసుకుంది.నీరసంగా ఉంది.చాలాసేపు అయింతర్వాత, బిడ్డను గుండెలకద్దుకుని లేచింది.ఒంటిమీదనుంచి మురికి నీళ్ళు వరదలు కడుతున్నాయి.ఒక రాతిముక్క తీసుకొని బిడ్డ బొడ్డు కోసింది.కోసినచోట పసరు పూసింది.బిడ్డకు పసరు నాకించింది.తను ఒక వేరు నమిలింది.ఊరిదారిలో ఏరుంది. జారకుండా ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ దిగింది.అడ్డాకులు పరిచి పిల్లాణ్ణి పడుకోబెట్టింది.ఏటిలో దిగి మునిగి స్నానం చేసింది.ఒంటిబట్ట ఉతుక్కుంది.కొడుకుని ఎత్తుకుని ఊళ్ళోకి నడిచింది. తన తొలి కానుపు, తన కన్న బిడ్డను గుండెలకు హత్తుకొని. ఇది అమృతసంతానం అవతరించే విధానం.

నవలలో నాయికానాయకులుండాలంటే, ఈ నవలలో వాళ్ళు దివుడు, పుయు. కాని కథ మొదలయేటప్పటికే వారిద్దరి మధ్య దూరం ఏర్పడింది.ఈ నవలలో కథానిర్మాణంలో ఏదైనా అసంతృప్తి కారణం ఉన్నదంటే అది ఈ యిద్దరి దూరం విషయంలో.దూరానికి యిద్దరూ కారణమే. అయినా వ్యక్తులుగా ఇద్దరిలో ఎవరినీ తప్పుపట్టలేని విధంగా నిర్వహించాడు మొహంతి. ఎంత ఆలోచించినా పుయుకు తన తప్పేమిటో తెలియలేదు. దివుడికీ తెలియడంలేదు.ఒకప్పుడు దివుడు పుయును యిష్టపడి వెంటపడి మనసు గెల్చుకుని యింటికి తెచ్చుకున్నాడు. కాని యిప్పుడు తన మనసు పక్కతోవల పోతోంది. తప్పు తనది కాదు.పుయు కడుపుతో ఉన్నప్పుడు తను దగ్గరవబోతే పుయు అగ్గిలా చూచేది. పిల్లాడు పుట్టిన తరువాత ఎప్పుడూ తండ్రిగా తన బాధ్యతలు పనులు గుర్తుచేస్తుండేది. దివుడు అడివి మనిషి. ఎన్నాళ్ళని ఆగుతాడు? తరువాత ఒకసారి పుయును మన్యజ్వరం పట్టిపీడించింది.కాన్పుతో కాంతి తరిగింది.జ్వరంతో ఎముకలగూడైంది.ఆమె ఈ స్థితి దివుడు దూరం అయిన ఫలితమా ? దూరానికి కారణమా?

అటువంటి స్థితిలో సోనాదేయి అతణ్ని ఆకర్షిస్తుంది. సోనాదేయికి అందం ఉంది. వయసుంది. బిగువుంది.వయ్యారముంది. కోరిక ఉంది.ఇన్నీ ఉండీ వృథా.ఆమె భర్త బాలాముండా 'చేతకాని చచ్చు.' ఆమెకు ఆశ్రయం లేదు.ఆమెది కేలార్ గ్రామం. డొంబుజాతి.డొంబులవృత్తి దొంగతనాలు చేయడం. (ఈ డొంబులు ఒకప్పుడు కాశ్మీరాన్ని ఏలినట్టు చరిత్ర చెబుతుంది. కల్హణుడి "రాజతరంగిణి" లో ఒక డొంబుజాతి స్త్రీ రాజ్యం చేసినట్టు ఉంది.ఇక్కడ అది అప్రస్తుతం.) సోనాదేయికి వయసొస్తున్న సమయంలో ఆమెకు జరిగిన ఒక ఘటన జీవితాంతం ఆమెను వెంటాడేది.ఒక రోజు ఒక పోలీసు అధికారి ఆమె యింటికి వచ్చాడు, ఎక్కడో ఏదో దొంగతనం జరిగింది, సోదా చేయాలంటూ.పోలీసెందుకు వచ్చాడో యింటిముందు గుమిగూడిన వారందరికి తెలుసు. సోనాదేయి తండ్రి చేతులెత్తి మొక్కాడు.'మహా ప్రభో! ఆ పిల్లనేం చేయకండి.అదే దొంగతనం చెయ్య లేదు." ఆ సంగతి పోలీసు అధికారికీ తెలుసు. సోదా చెయ్యాలన్నాడు. నలుగురెదుటా పిల్ల ఒళ్ళంతా తవిడాడు, 'చెప్పు ఎక్కడ దాచావ్ దొంగముండా' అంటూ. 'పద లోపలికి ఏ వంటచేసే చోటో దాచి ఉంటావు,' అంటూ పిల్లను లోపలికి తోసుకుంటూ వెళ్లాడు.కొంతసేపటికి పోలీసు బయటికి వచ్చి ' ఏం దొరకలేదు. ఈ సారికి వదిలేస్తున్నా', అంటూ వెళ్ళిపోయాడు.వెనకనుంచి సోనాదేయి కళ్ళనీరు కారుతూ వచ్చింది.ఇది ఒక్క సోనాదేయికి మాత్రమే జరిగేది కాదు. అక్కడ ఆడపిల్లలకు సాధారణంగా జరిగేదే.పాలితులు నోరెత్తకుండా తలెత్తుకోకుండా పడిఉండడానికి పాలకుల ఆదిమసాధనం ఈ పౌరుషం. ( వాడ్రేవు చినవీరభద్రుడు: "ప్రశ్నభూమి" లో వస్తువిదే.) ఇది సోనా పూర్వచరిత్ర.

ప్రస్తుతం సోనాపై దివుడు అతడి చినతండ్రి లెంజ ఇద్దరు కన్ను వేశారు. కాని వారి అంతస్తుకు అంటరాని సోనాతో సంబంధం అవమానకరం. ఊళ్ళో తెలియకూడదు. ఒకరికి తెలియకుండా ఒకరు ఇద్దరూ సోనా ఇంటిచుట్టూ దాగుడుమూతలు ఆడుతున్నారు. కాని ఒక్కడూ తన దాహం తీర్చడంలేదు. ఒక్కొకసారి "మరో 'ప్రభుత్వాధికారి అయినా తారసపడలేదు" అనుకునేది . ఆ అంటరాని దాని ఆర్తి అంతటిది.(కాళీపట్నం "ఆర్తి" లో కంటే సోనా ఆర్తి ఎక్కువ అనిపించింది.)

లెంజ భార్య పోయింది. అన్నపోయిన తరువాత అతనికి ఆదరం తగ్గింది. దివుడు అతన్ని మన్నన చేయడంలేదని అతని భావం. దివుణ్ణి దించి లెంజను సావొతా చేయాలని కొందరి యత్నం.

పుయుకు కొడుకు పుట్టాడని ఆమె వూరి వాళ్ళకు తెలిసింది.పుయు పుట్టింటి వాళ్ళెవరూ లేరు. లేరని ఊరు ఊరుకుంటుందా?కావళ్ళతో కానుకలు తీసుకుని వచ్చారు. కొండజాతుల్లో ఊరే ఒక కుటుంబం.బేశుకోదు మిటిం సావొతా కొడుకు. ఉత్సవం. సారా. పాటలు. ఆటలు. ఆ ఉత్సవంలో బేశుకి పుబులికి మనసులు కలిశాయి. తరువాత కొన్నాళ్ళకు బేశు పుబులిని ఎవరికీ చెప్పకుండా తీసుకుని తనవూరికి పారిపోయాడు. ఆ పారిపోవడంలోని ప్రేమ సాహసము నవలలో ఒక గొప్ప వర్ణన.( వాల్టర్ స్కాట్ నవలలలో, కవితలలో ప్రేమ సాహసాలు దీనిముందు చిన్నబాలశిక్ష. కీట్స్ The Eve of St.Agnes వంటి కవితలకు సాటివచ్చే

వర్ణన. )దివుడు మండిపడ్డాడు.ఊళ్ళోవాళ్ళంతా ఆగ్రహించారు.కాని వాళ్ళలో ఆడపిల్ల అలా నచ్చినవాడితో పారిపోవడం చేయకూడని పనేమీ కాదు. వాళ్ళకు సమ్మతమే. కొన్ని రోజులకు కోపాలు తగ్గి, దివుడు చెల్లెలిని చూడడానికి వెళతాడు. ఆ సందర్భంలో ఆ అన్నాచెల్లెలి కలయిక నవల మొత్తంలో ఒక ఆర్ద్రమైన సన్నివేశం. ముందు అతిథులందరూ కొత్త పెళ్ళికొడుకుని కుమ్మి

పెడతారు (ragging).బేశు నవ్వుతూ, 'చాలా , యింకా కొడతారా?' అంటాడు. పుబులి ఒంటరిగా ఉన్నప్పుడు దివుడు  చెల్లెలిని కలిశాడు.చెల్లెలు ఆనందం చెప్పలేనంత. ఆట పట్టించాడు. ' ఏం, వీడెవడో వచ్చి నన్ను అల్లరి చేస్తున్నాడని  మీ ఆయనకు చెప్పి కొట్టిస్తావా నన్ను' , అంటాడు.  ఈ మాత్రం మాటతో ఆమెకు చింతరువ్వతో మొహంమీద చెళ్ళుమనిపించినట్లయింది.భోరున ఏడ్చేసింది. అన్న దగ్గరతీసుకుని  తల తడివాడు.అతని కళ్ళు బరువెక్కాయి.

ఈ నవలలో ముగ్గురు నాయకులవి మూడు విశిష్టవ్యక్తిత్వాలు.పుబులికి తప్పిపోయిన వరుడు హార్గుణాకు,సంపాదన ప్రధానం.ఎప్పుడూ వ్యవసాయం, పంటలు, సావుకార్లతో బేరాలు, లాభాలు. స్త్రీ అవసరమే.కాని ప్రధానం సంపాదన.పుబులి విషయంలో ఏమాత్రము తొందరపడలేదు.పుబులి తనదే.తనకోసం ఎన్నాళ్ళైనా కాచుకుంటుంది అనుకున్నాడు.పుబులి బేశుతో పారిపోయినపుడు అతడికి పట్టలేని కోపం రాలేదు.బాధ కలగలేదు. ఆలస్యం చేసినందుకు పశ్చాత్తాపం లేదు. అతడికి పుబులి కాకపోతే మరో  పిల్ల.  పుబులి భర్త బేశుకోదు ఇతడికి పూర్తిగా విరుద్ధం.అతడిది కుర్రతనం. ప్రేమ, శృంగారం, సాహసం,వేట అతని జీవితం. దివుడు  ఈ ముగ్గురిలో సంక్లిష్ట పాత్ర. ధీరనాయకుడు.ధీమా.ఆరోగ్యవంతమైన శరీరం.దాని అవసరాలు గుర్తుచేసుకుంటాడు.ఊగిసలాడుతాడు.

దివుడు సోనాదేయితో తన పినతండ్రి సంబంధం కోరుకోడం సహించడు.ఆ అంటరానిదాని తగులు కుటుంబానికీ ఊరికీ   చిన్నతనం. ఒక రోజు సోనా యింటిలో లెంజను తిట్టి ఊరినుంచి తరిమేస్తాడు. లెంజ బందికారా వెళ్ళిపోతాడు. హార్గుణా అతడికి ఆశ్రయం యిస్తాడు.

మరో ముఖ్యమైన పాత్ర ప్రవేశిస్తుంది.పియొటి.( ఈ నవలలో దుష్టపాత్ర లేదు.ఉంటే అది తెలుగుదేశం. తెలుగుల 'సభ్యత'  అమృతపాత్రలో విషబిందువు.తెలుగుదేశం వ్యాపారులు కోదుల అడవుల్ని  పెద్ద వలవేసి కప్పేశారు.కోదుల కష్టమంతా పంటరాకముందే  పావో పరకో యిచ్చి కొనేస్తారు. పంటరాగానే లారీలెక్కించి కొండకిందికి జారేస్తారు.తెలుగుదేశం నుంచి సవాయిరోగం, కొరుకురోగం,కొండలెక్కి  వచ్చాయి. ఈ దుష్టపాత్రలో తెలుగుదేశం ఆగ్రహించవలసిందేమీ లేదు.కోరాపుట్ పల్లపుప్రాంతం తెలుగుదేశం కావడం భౌగోళిక ప్రమాదం.geographical accident. మరో కొండప్రాంతంతంలో మరో పల్లపుదేశం.)పియొటి ఒకప్పుడు కోదులమనిషి.ఆమె  తల్లి బతుకు మెరుగు పడుతుందని పల్లపు ప్రాంతాలకు వెళ్లింది.కూతురు అక్కడి సభ్యతలో సభ్యతతో పెరిగింది. అక్కడ బతుకు గడవక తిరిగి కొండలెక్కింది ముసలిది, కూతురితో. హార్గుణా బాగా గడించాడు. సావొతా తన కూతురు పియొటి హార్గుణాను వలలో వేసుకోవాలి అని ముసలిదాని కోరిక.అది అంత సులభం కాదు.పైగా పియొటిది తెలుగు ఆకారం ఆహారం ఆహార్యం.అన్నిటికంటే తెలుగు సభ్యత.డొంబులు తాగినట్టు ఏ  యితర కోదు ఆడది తాగదు. పియొటి తాగినట్టు ఏ డొంబు ఆడది తాగదు.

దివుడు  పనిమీద ఒకసారి బందికార వెళతాడు. పియొటిని చూస్తాడు.ఇక ఆమెను మరవలేడు.కాని భార్య పియు? ఘర్షణ తనలో చాలాకాలం సాగుతుంది. పుయును తానేమైనా తరిమేస్తానన్నాడా? ఇష్టమైతే తనతోనే వుండొచ్చు.పుయుకు భర్త దూరమవుతున్నాడు. సోనాదేయి కోసం వెళుతుంటాడని తెలుస్తుంది.బాధ పడుతుంది.తన తప్పేమిటో?  ఒకరోజు దివుడు యింటికి తిరిగిరాలేదు. ఎక్కడికి వెళ్లాడో? పుయు సోనాదేయి యింటికి వెళ్లింది.సోనా మామకు తెలిసి ఉంటుంది దివుడు ఎక్కడికి వెళ్లాడో. సావొతా భార్య అంటరానిదాని యింటికి

వచ్చింది. సోనాకు లోపల సంతోషం. పుయుకు మర్యాద చేసింది.ఆ మర్యాదలో అవహేళన ఉంది.మొగుణ్ణి వెతుక్కుంటూ తనింటికి వచ్చింది ఊరి రాణి!

ఒకరోజ దివుడు సారా కోసం సోనాదేవి మామకు కబురు చేశాడు. ఆ రోజ స్వయంగ సోనానే సారా తీసుకు వచ్చింది. మామకు జ్వరం అంది. సారా అందించింది.చేయి తాకించింది.దివుడు మొగం చీకటిలో కనిపించడంలేదు. తిరిగి వెళ్ళిపోతోంది సోనాదేయి. నాలుగడుగులు వెళ్లి పెద్దగా అరిచింది.ఏమైందో తెలియలేదు దివుడికి. పామో ? కటిక చీకటి. వెళ్లి ఆమెను రెండుచేతుల్లోకి తీసుకుని యింట్లోకి తెచ్చి పడుకోబెట్టాడు. దీపం తెచ్చి వొళ్ళంతా చూశాడు.ఏమైందో తెలియలేదు. దీపం ఆరిపోయింది.అర్ధరాత్రి గడిచిపోయింద. సోనాదేయి తన యింటితోవ పట్టింది.

ఎటువంటి శృంగారసన్నివేశంలో కూడా మొహంతి గడపకు యివతలే నిలబడిపోతాడు.

సోనాదేయికి అది విజయం.'డొంబుముండతో సంబంధమా నీకు' అని చినతండ్రిని తన్నితరిమేసిన దివుణ్ణి వొంచింది.కాని దివుడికి అది రాత్రి గాథ. రాత్రితో గడిచిపోయింది.తెల్లారి పియొటి ఆలోచన.

చివరకు ఒకరోజ పియొటి తల్లి పెట్టిన షరతులకన్నిటికీ ఒప్పుకుని దివుడు పియొటిని ఇంటికి తెచ్చేశాడు. పుయు ఇల్లు వదిలి వెళ్ళిపోయింది, చంకలో బిడ్డతో. పుయును వెళ్ళిపొమ్మనలేదు దివుడు. 'ఉండిపోవచ్చు కదా' అనుకున్నాడు. ఉండిపోవలెననే అనుకుని ఉండవచ్చు. కాని అనలేక పోయాడు.అనుకోడానికి అనగలగడానికి చాలా అంతరం ఉంది.'ఉండిపో' అనగలిగిన ధైర్యం లేకపోయింది దివుడికి. అనలేకపోవడం పుయు వ్యక్తిత్వపు ఎత్తుకు లోతుకు కొలత.

పుయు ఎక్కడికి వెళ్లాలి? తన పుట్టినవూరు మిటిం.అక్కడ తన వాళ్ళెవరూ లేరు.మరి అక్కడికే ఎందుకు?

రామాయణసీత ఎక్కడికి వెళ్లింది? తను పుట్టిన మట్టిని చీల్చుకుని మట్టిలోకే వెళ్లిపోయింది.అలాగే పుయు తను పుట్టిన చోటికే వెళ్ళాలనుకుంది.

పుయు అంటే కోదుభాషలో పూవు. పూవు కంటే మృదువు పుయు.పుయు తను పుట్టిపెరిగిన కొండలకంటే కఠోరమైనది. కొండంత ఎత్తు ఎదిగింది స్వాభిమానంలో, నిశ్చయంలో. తన నీడ తాను తొక్కుతూ కదిలిపోయింది.

'అమృతసంతానం' సభ్యతకు మరో నిర్వచనం. మరో 'సీతాయాశ్చరితం మహత్'.

***

# 6.చెఖోవ్ కథ: హోమ్

( At Home)

## 6.చెఖోవ్ కథ: హోమ్

( At Home)

కథకు ప్రపంచసాహిత్యంలో ఒక విశిష్టరూపం కల్పించి దానిని ఉత్కృష్టస్థానంలో నిలిపినవారిలో చెఖోవ్ ప్రథముడు అంటారు. కథ రాయడం కవిత రాయడం వంటిదే.ప్రతిపదము సార్థకము సప్రయోజనము అయి ఉండవలె.అంటే, ఒక వాక్యమే కాదు, ఏ ఒక్క పదము తొలగించలేనిదిగా ఉంటుంది. ఒక శిల్పంలో, శిల్పం కాని రాతిని చెక్కి పడేసినట్లే, కథ చెక్కడంకూడా.ఆ శిల్పం చెఖోవ్ కథలలో పూర్ణరూపంలో చూడవచ్చు. సన్నివేశంలోగాని,పాత్రలవర్ణనలలోగాని, వస్తుప్రతిపాదనలోగాని ఏది అవసరమో అది మాత్రమే,ఎంత అవసరమో అంతమాత్రమే ఉంటుంది అతని కథలలో. కథలో “ “గోడకు తుపాకి ఉన్నది” అని కథలో ఉంటే , కథ ముగిసేలోపల ఆ తుపాకి పేలవలె “ అన్నది చెఖోవ్ ప్రసిద్ధ వాక్యం. ప్రస్తుతం 'హోమ్' అన్న కథను చూద్దాం.

ఒక కథను కాని,కవితను కాని మరో సాహిత్యప్రక్రియను కాని ఆస్వాదించడమంటే సరి అయిన ప్రశ్నలడగడమే. ప్రతి వర్ణనను, ప్రతి వాక్యాన్ని, ప్రతి పదాన్ని 'ఇది కథలో ఏం చేస్తున్నది? దీని కథాప్రయోజనం ఏమిటి?' అని అడుగుతూ పోవడమే. వాటికి దొరికే సమాధానాలే కథార్థం.       కథ మూడు భాగాలుగా చూద్దాం:ప్రవేశం, వస్తువు, ముగింపు, చిన్న మార్పులతో.

ప్రవేశం:

ప్రాసిక్యూటర్ సాయంకాలం యింటికిరాగానే, ఆయా, ఆ రోజు వచ్చిన ఉత్తరము, న్యూస్ పేపరు ఇస్తూ, ఆయనతో 'మీ పిల్లవాడు సిగరెట్టు తాగుతున్నాడు, ఈ రోజు చూశాను, మొన్న చూశాను.అతనితో మాట్లాడండి' అంటుంది. అది వినగానే ఆయనకు నవ్వు వచ్చింది.ఆ దివ్యశిశువు పెదాలపై సిగరెట్ ఎట్లా ఉంటుందో ఊహించుకుంటున్నాడు. 'ఎన్నేళ్ళు వాడికి?', అంటాడు. 'ఏడేళ్ళు, ఇదేం పెద్దవిషయం కాదనుకుంటున్నారు. అంత చిన్న వయసులో పొగతాగడం మంచిది కాదు.ఆరోగ్యం చెడిపోతుంది. ఇట్లాంటి చెడు అలవాట్లు చిన్నవయసులోనే వదిలించాలి', అన్నది.'వాడికి సిగరెట్లు ఎక్కడివి',అని అడిగాడు .'మీ టేబుల్ సొరుగులో ', అంటుంది. 'అయితే, వాణ్ణి నా గదికి పంపు' అంటాడు.

[ఈ భాగం, కథలోని పాత్రలను సన్నివేశాన్ని పరిచయం చేస్తుంది. ఈ భాగంలో ఎంత సమాచారం యివ్వవలెనో అంతే యిస్తాడు రచయిత.పిల్లవాడికి తల్లి లేదు.వాణ్ణి ఆయా చూచుకొంటోంది. తల్లి ఏమైంది? ఆ సమాచారం ఈ కథా భాగంలో అవసరం కాదు.మరో కథాభాగంలో దాని ఉపయోగం ఇక్కడికంటే ఎక్కువ.కనుక అక్కడే చెబుతాడు. అక్కడ కూడా ఎంత అవసరమో అంతే, ఒక వాక్యభాగంలో, పూర్తి వాక్యం కూడా ఉండదు. తల్లిలేని పిల్లవాడు, అన్నవరకే ఈ ప్రవేశ కథాభాగంలో అవసరం. పిల్లవాణ్ణి ఆయా చూచుకొంటోంది. తన కొడుకుకు ఎన్నేళ్ళు అని ఆయాను అడుగుతాడు. ఈ ప్రశ్న కథాప్రయోజనం ఏమిటి? ఆయా చెప్పిన మాటకు తండ్రికి

కోపం రాలేదు, నవ్వు వచ్చింది.  ప్రాసిక్యూటర్ దృష్టిలో,పిల్లవాడు సిగరెట్ తాగడం ఎక్కువ తప్పుగా అనిపిస్తుందా, తన టేబుల్ సొరుగులోనుండి తనకు తెలియకుండా తన సిగరెట్ దొంగిలించడం  ఎక్కువ తప్పనిపిస్తోందా? ఈ ఎక్కువ తక్కువల  ఆలోచన ఆయనకు ఎందుకు కలిగింది?కథలో దాని ప్రయోజనం ఏమిటి? ఆ ఆలోచన  కలిగింది అనడానికి కథలో ఏ పదం ఆధారం?  పిల్లవాడు దొంగతనానికి అలవాటు పడుతున్నాడు, మందలించండి అని చెప్ప లేదు ఆయా. ఇద్దరి దృష్టిలో ఈ భేదానికి ఏమిటి ప్రాధాన్యం?]

ఆయా వెళ్లిన తరువాత, ఆయన  కొడుకును ఊహించుకుంటాడు.పెదాలమధ్య మూడడుగుల పొడుగు చుట్ట.వాడు పీల్చి వదిలిన పొగ మబ్బులై , వాడు ఆ మబ్బులపై కూర్చుని ఉన్నట్టు , కొడుకును తన ఊహలలో చూసుకుని  మురిసిపోతున్నాడు.

కాని వెంటనే ఆయా  ముఖం గుర్తొచ్చింది. ఆమె ఈ విషయం ఏమాత్రము తేలికగా తీసుకోవడంలేదు . నిజమే వెనుకటి రోజులలో సిగరెట్ తాగడం తెలిసి తల్లిదండ్రులు   హాహాకారాలు చేసేవారు. టీచర్లు ఒళ్ళు వాతలు పడేటట్టు కొట్టి స్కూలునుండి తరిమేసేవారు. ' కాని ఎవరికీ పొగతాగడంలో హాని ఏమిటో అది ఎందుకు తప్పో తెలియదు. అర్థంకాని దానిపై ఆగ్రహం ఉండడమన్నది సామాజికజీవనలక్షణమేమో? ఎంత అర్థం కాదో అంత ఆగ్రహం,అంత క్రూరమైన శిక్ష. మనుషులు ఎటువంటి పరిస్థితికి కూడా అలవాటుపడిపోతారు, అర్థంలేని ఆగ్రహానికి,అవసరంలేని అపరాధభావానికి, అపరాధాన్ని మించిన శిక్షకు.'

[ ప్రాసిక్యూటర్ తన పిల్లవాడిని విచారణకు పిలిచి, వాడు వచ్చేలోపల  ఈ విధంగా ఆలోచించడానికి కథలో ఏం ప్రాముఖ్యం? ఈ ఆలోచనలు తండ్రివా, ప్రాసిక్యూటర్ వా? ]

వస్తువు:

రాత్రి ఎనిమిదవుతోంది. పై ఫ్లోర్ లో ఎవరో గదిలో ఇటునుంచి అటు, అటునుంచి ఇటూ, నడుస్తున్నారు.ఆ పై ఫ్లోర్ లో ఇద్దరు పియానో నేర్చుకుంటున్నారు. గది బయట పిల్లవాడు   ఆడుకుంటూ,'నాన్న వచ్చాడు నాన్న వచ్చాడు' అని వాడిలో వాడు  పాడుకుంటున్నాడు.  ' మీ  నాన్న పిలుస్తున్నాడు, వెళ్ళు.నీకే చెప్పడం', అని అరుస్తోంది ఆయా. లోపల,
తండ్రి ' ఏం చెప్పాలి వీడికి? ', అని ఆలోచిస్తున్నాడు. కొడుకు 'గుడ్ ఈవినింగ్, నానా', అంటూ వచ్చి తండ్రి ఒడిలో ఎక్కి కూర్చుని, ఒక తొందరముద్దు ఇచ్చాడు.ఆయన వాణ్ణి ఎత్తి పక్కన కూర్చోపెట్టి, '  నేను నీతో ఒక సీరియస్ విషయం మాట్లాడాలి. తరువాతే ముద్దులు.నీవంటే నాకు ఇష్టం లేదు.నీ మీద నాకు చాలా కోపంగా ఉంది.నీవు నా కొడుకువు కాదు', అన్నాడు.పిల్లవాడు కాసేపు నాన్న ముఖంలోకి  చూచాడు.చూపు టేబుల్ మీదికి మళ్ళించి,' ఏం చేశాను? ఈ రోజ నీ గదిలోకే రాలేదు నేను', అన్నాడు. ' ఆయా చెప్పింది, నీవు సిగరెట్ తాగుతున్నావని.అవునా?' 'ఒక్కసారి తాగాను...అవును.' '  రెండు సార్లు చూశానన్నది, ఆయా'. 'ఊ...అవును.ఈ రోజ, మొన్ననొకరోజ.' ' చూశావా!  ఒకసారి కాదు, రెండు సార్లు. మంచి పిల్లవాడివి అనుకుంటూ ఉన్నాను.ఎందుకు యిట్లా పాడయిపోతున్నావు?'  కొడుకు వెల్వెట్ జాకెట్ కాలర్

సవరిస్తూ  ప్రాసిక్యూటర్, యింక తరువాత ఏం చెప్పాలి అని ఆలోచిస్తున్నాడు. ' అసలు నీవు నాటేబుల్ సొరుగు తెరిచి, నా వస్తువు తీయడం మొదటి తప్పు. ఇతరుల వస్తువులు వాళ్ళకు చెప్పకుండా తీసుకోడం తప్పు కదా? ("ఫరవా లేదు, కేసు  బాగానే వాదిస్తున్నట్టున్నాను!")అసలు, ఒకరి వస్తువులు ఒకరు తీసుకోకూడదు.ఇప్పుడు, ఆయాకు ఒక పెట్టె ఉంది.ఆ పెట్టెలో ఆమె బట్టలు పెట్టుకుంటుంది.ఆ పెట్టె తెరిచి అందులో వస్తువులు మనం, అదే నీవుగాని నేను గాని, తీసుకోవచ్చా? (నేను చెప్పదలచుకున్నది ఇది కాదేమో? ) కొడుకు అందుకొని అన్నాడు:'ఏమవుతుంది, నానా! నీ టేబుల్ మీది పచ్చకుక్క నాదే! ఉంచేసుకో.నేనేమీ అనుకోను.' 'అది కాదు.(వీడికి అర్థం కావడం లేదు, నేనేం చెబుతున్నానో.ఎలా చెప్పాలి?)

 కొడుకు తన పొడుగు గడ్డంపై వాడి ముఖం  తాకిస్తూ , తల తిప్పుతూ ఉన్నాడు.

' అనుమతి లేకుండా వేరేవాళ్ళ  సిగరెట్ తీసేసుకొని తాగకూడదు. ఒకరి సొమ్ము ఒకరు తీసుకోవడం తప్పు.' పిల్లవాడి దృష్టి టేబుల్ మీద ఉన్న బంకసీసా మీదికి వెళ్లింది. దాన్ని చేతిలోకి తీసుకుని కంటిదగ్గర పెట్టుకొని చూస్తూ,' పాపా, బంక దేంతో చేస్తారు?' అన్నాడు. తండ్రి వాడిచేతిలో సీసా లాగేసి, మళ్ళీ టేబుల్ మీద పెట్టి,  ఆస్తి, ఆస్తిపై హక్కులు, వీటి గురించి వాడికి అర్థమయేటట్టు  పిల్లల భాషలో వివరించే ప్రయత్నం చేస్తున్నాడు. ( వాదన సరిగా సాగుతున్నట్టు  లేదే!) నేను సిగరెట్ తాగుతాను.నేను పెద్దవాణ్ణి.అలా చేయకూడదని తెలుసు, ఆరోగ్యానికి మంచిది కాదని తెలుసు. ( నేను మంచి టీచర్నే!)

' చూడు,పొగతాగడం వల్ల క్షయ, యింకా అనేక రోగాలు వస్తాయి. పదేళ్ళ తరువాత చనిపోయేవాడు ఇవేళే పోతాడు. మీ మామయ్య చూడు! సిగరెట్లు తాగకపోతే యింకో పదేళ్ళుండేవాడు.'

పిల్లవాడి ముఖంలో ఒక మబ్బు తెర, ' మామయ్య వయొలిన్ బాగా వాయించేవాడు.' ఈ మధ్యనే చనిపోయిన వాడి తల్లి గుర్తు వచ్చి ఉంటుంది. ' అమ్మను మామయ్యను చావు పైకి తీసుకెళ్ళి పోయింది.చనిపోయిన వాళ్ళందరూ పైకి ఆకాశంలోకి వెళ్ళిపోతారు. వాళ్ళ వయొలిన్ లు, వాళ్ళ పిల్లలు కింద ఉండిపోతారు.పోయినవాళ్ళు ఏ చుక్కల మధ్యనో ఉండి మనలను చూస్తూ ఉంటారు.'

తండ్రికి  ఆ తరువాత ఏం చెప్పాలో తెలీలేదు. లేచి నిలబడ్డాడు.గదిలో అటునుంచి యిటు యిటునుంచి అటు తిరుగుతున్నాడు.  ' మా చిన్నతనంలో ఇంత కష్టం ఉండేది కాదు.ఈ విషయాలు సులభంగా పరిష్కారమయ్యేవి. పిల్లలు  ఏదైనా తప్పుచేస్తే, నాలుగు పీకడమే. అంతటితో అయిపోయేది. నా చిన్నతనంలో నేనేదైనా తప్పు చేస్తే, అమ్మ  మిఠాయిలు యిచ్చేది, 'యింకెప్పుడూ చేయకురా'   అంటూ. ఈకాలంలో అవేవీ పనికిరావంటారు.అంతా వాదమే.న్యాయము తర్కము హేతువాదము.

పిల్లవాడు ఎప్పుడో  టేబుల్ ఎక్కి కూర్చుని, దాని మీద ఉన్న కాగితము కలము తీసుకొని ఏదో బొమ్మగీసుకుంటున్నాడు.గీస్తూ మాట్లాడుతున్నాడు.'ఈ వేళ , పాపా, వంటావిడ కాబేజి తరుగుతూ

చెయ్యి కోసుకుంది.పెద్ద కేక వేసింది.భయపడి వెళ్ళి చూశాం. వేలు నీళ్ళలో ముంచమంది ఆయా. ఆమేమో వేలు నోట్లో పెట్టేసుకుంది.చేతికి ఎంత మురికి ఉంటుంది! నోట్లో పెట్టుకోవచ్చా?' పిల్లవాడు ఏదేదో చెప్పుకు పోతున్నాడు, తలెత్తకుండా, బొమ్మ గీస్తూ.

'వీడు వినడం లేదు. నేనేదో చెబుతున్నాను, వీడేదో ఆలోచిస్తున్నాడు.వాడి బుర్రలో వేరే లోకం ఉంది. వాడి లోకమే వేరు. వాడు చేసిన తప్పుగాని, నా వాదనలుగాని, వాడు ఏమీ సీరియస్ విషయాలు అనుకోడంలేదు.ఏం చెయ్యాలి? వాడు నా మాటలు పట్టించుకోవలె అంటే నర్సరీ భాషలో మాట్లాడితే చాలదు. భాష కాదు, భావం పట్టుకోవాలి. వాడి మనసును పట్టుకోవాలి. నా సిగరెట్ నష్టమైనందుకు నాకు కష్టం కలిగితే, నేనేడిస్తే వాడికి అర్థం అవుతుంది.అందుకే మరెవ్వడూ తల్లిస్థానాన్ని తీసుకోలేడు.వాడితో కలిసి ఏడవాలి, కలిసి నవ్వాలి.తర్కము నీతి అవినీతి, ఇవేవీ పనిచేయవు. కోర్టులో యింతకాలంగా ఎందరితోనో వాదించి గెలిచాడు. ఒక పిల్లవాడిముందు ఏం మాట్లాడాలో తెలియక నిలబడిపోయాడు.

చివరగా అన్నాడు, ' ప్రమాణం చేసి చెప్పు, ఇంకెప్పుడూ చేయనని'. "ప్రమాణం"? అంటే? ప్రాసిక్యూటరుకు విసుగొచ్చేసింది. మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు. కొడుకు గీస్తున్న బొమ్మ లాక్కున్నాడు.ఒక యిల్లు, చిమ్నీలోంచి పొగ.ఇంటి పక్కన నిలబడిన ఒక మనిషి. వాడి కళ్ళు రెండు ఫుల్ స్టాపులు. వాడి చేతిలో తుపాకి.

' ఇంటికంటే మనిషి ఎత్తుగా ఉంటాడురా , ఎక్కడైనా?'

'నానా, మనిషి అంతకంటే చిన్నగా ఉంటే వాడి కళ్ళు యింకా చిన్నగా గీయాలి. కనిపించవు.'

ప్రాసిక్యూటర్ అనుకున్నాడు, తనది తర్కం, వాడిది కళ. ఇళ్ళు, కళ్ళు కాదు. రూపంలేని భావాలను, సంగీతస్వరాలను కూడా బొమ్మలుగా గీస్తాడు చిత్రకారుడు.

పిల్లవాడు మళ్ళీ దిగివచ్చి వాళ్ళ నాయన గడ్డంతో ఆడుకుంటున్నాడు. దాన్ని దువ్వాడు.రెండు పాయలుగా చేశాడు.మళ్ళీ ఒకటి చేశాడు. తండ్రి ముఖంలోకి చూస్తున్నాడు. అంతా వాళ్ళ అమ్మచూపులాగే ఉంది వాడిచూపు. వీణ్ణి కొట్టడమా? ప్రాసిక్యూటర్ ఈ రోజుకు సెషన్స్ ముగించి పిల్లవాణ్ణి వెళ్ళి పడుకోమన్నాడు.వాడు కథ చెప్పు, అన్నాడు .

ముగింపు:

పిల్లవాడు కథ చెప్పమన్నాడు. ప్రాసిక్యూటర్ కు క్లాజులు సబ్ క్లాజులు కంఠస్థమైనట్టు కథలు కథల పాటలు కావు. కాని ఆయనకు తీరిక ఉన్న రోజున కొడుకుకు కథ చెప్పడం అలవాటు. అన్ని కథలలాగే అనగనగా ఒక రాజుతో మొదలవుతుంది కథ. కాని కథలో తరువాత ఏం జరుగుతుందో తెలియదు. ఏదో కల్పించవలె. మొదలుపెట్టి నపుడు కథ ఎలా ముగుస్తుందో తెలియదు. ప్రతి వాక్యము దాని తరువాత వాక్యం ఎలా ఉండబోతుందో తెలియకుండానే వచ్చేస్తుంది. ఈ పద్ధతి

పిల్లవాడికి నచ్చింది. అప్పటికప్పుడు తన కళ్ళముందే పుట్టిపెరుగుతున్న కథ వినడంలో వాడికి రెండువిధాల ఆనందం, కథ, కథావిర్భావము. ప్రాసిక్యూటర్ కథ చెబుతున్నాడు.
' ఒక పేద్ద అందమైన తోట.రకరకాల చెట్లు.పూలు కాయలు పండ్లు. ఆ చెట్లకు గాజుగంటలు పూలు! అవును.గాలి వీచినప్పుడల్లా ఆ గంటలు ఊగి మోగుతాయి. గాజుగంటల మోత, లోహగంటలమోతలా ఉండదు. నాజూగ్గా ఉంటుంది. పూలమొక్కలు.రంగురంగుల పూలు.రంగురంగుల పక్షులు, రెక్కలాడిస్తూ తోటలో ఎగురుతుంటాయి. రకరకాల కూతలు. ఊః...ఇంకా...? ఆః. ఫౌంటెన్ లు! ఆంటీ యింట్లో చూచావు చూడు? అట్లాంటివి. అయితే యింకా పేద్దవి. ఆ తోటలో ఒక రాజభవనం.అంతా గాజుతో కట్టిందే. ఆ భవనంలో ఒక రాజు.పెద్దవాడైపోయాడు.తలా గడ్డమూ తెల్లగా అయిపోయాయి. ఆయనకు ఒకే ఒక్క కొడుకు.చిన్న పిల్లవాడు, నీ లాగే. తన తరువాత రాజ్యం.చేయవలసినవాడు.మంచి పిల్లవాడు.అల్లరి చేసేవాడు కాదు. బుద్ధిగా వేళకు తిని వేళకు నిద్ర పోయేవాడు.ఏ చెడ్డ అలవాట్లు లేవు.ఒక్కటి మాత్రం ఉండేది. పొగతాగేవాడు. దాంతో పాపం వాడికి క్షయవ్యాధి పట్టుకుని చిన్నతనంలోనే చనిపోయాడు. ముసలిరాజు పాపం దిగులుతో మంచంపట్టాడు.
శత్రురాజులు దాడిచేసి, రాజును చంపేశారు.రాజభవనం ధ్వంసం చేశారు. తోటనంతా చిందరవందర చేసేశారు.పక్షులకూతలు లేవు. గాజుగంటల మోతలు లేవు. ...అదీ జరిగింది.'

కథ ముగించాడు.కాని ప్రాసిక్యూటర్ కు తన కథ మరీ చిన్నపిల్లల కథలా, అసంబద్ధంగా అనిపించింది.పిల్లవాడి మనసుపై మాత్రం కథ బలమైన ముద్ర వేసింది.' నేనిక పొగ తాగను', అని, గుడ్ నైట్ చెప్పి వెళ్ళి పోయాడు.

ప్రాసిక్యూటర్ కు నవ్వు వచ్చింది. ' కళ , సౌందర్యము వాటి ప్రభావము అంటారు.కావచ్చు.కాని దాని వల్ల ఏం లాభం లేదు. అది సరి అయిన పద్ధతి కాదు. నీతి నిజాయితీ ఉన్నదున్నట్టు ఎందుకు చెప్పకూడదు? దాన్ని అందంగా అలంకరించాలి, మెరుగులు దిద్దాలి, చక్కెరపూతపూసిన మందులలాగా చేసి యివ్వాలి అంటారు. కాదు.అది భ్రమ పెట్టడం.మోసం చేయడం ..గారడి ...'
ఆయన ఆలోచించాడు.కోర్టులో ఆయన తర్కమే పనిచేస్తుంది.కాని తాను జీవితంలో నేర్చుకున్నదంతా న్యాయశాస్త్రగ్రంథాలనుండి కాదు,నీతికథలనుండి,కథలనుండి, కవితలనుండి.ఏమిటో?

జీవితంలో భ్రమలకు కూడా స్థానం ఉంది. వాటికి ఒక ప్రయోజనం ఉంది.'
ప్రాసిక్యూటర్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. రేపటి కోర్టుపనికి చూసుకోవలసినది ఉంది. కాని ఆయన మనసులో ఏవో కదలికలు.

ఆ పై ఫ్లోర్ లో సంగీతం ప్రాక్టీసు ముగిసింది. కాని, పై ఫ్లోర్ లో అడుగుల చప్పుడు ఆగలేదు.

***

[ ఇదీ కథ. ఇది పూర్తి అనువాదం కాదు. ]

ఇక "హోమ్" వర్క్:
-"హోమ్" కు సరి అయిన తెలుగుపదం ఉందా?
-ఈ కథకు " హోమ్" అన్న పేరే ఎందుకు?
-పిల్లవాడి వయసు ప్రస్తావన ప్రాధాన్యం ఏమిటి? వయసు ఏడు కాక పదిహేడు కావచ్చా?
-ప్రాసిక్యూటర్ చెప్పిన కథ పిల్లవాడిని ఉద్దేశించినది మాత్రమేనా? కథాకారులనుకూడా ఉద్దేశించినదా?
-కథ ముగింపులో, పై రెండు ఫ్లోర్ లలో ఏం జరుగుతుందో, ఏమి ఆగి పోయిందో చెబుతాడు.వాటి ప్రాధాన్యం ఏమిటి?
కథ ప్రాసిక్యూటర్ మనసులోని మథనతో ముగుస్తుంది.ఏమిటా మథన? వ్యక్తిలో సమాజంలో నిత్యము జరిగే మథన.బుద్ధికి మనసుకు,తర్కానికి కళకు,న్యాయానికి ప్రేమకు  నిరంతరాయంగా జరిగే ఘర్షణ.చట్టము దయ ఈ రెంటిలో దేనినీ  వదిలి సమాజం నడవలేదు. క్రోధాన్ని  శోకాన్ని సమన్వయం చేయడంలో జరిగే మథన ఏ రచనకైనా వస్తువు. క్రోధము శోకము శ్లోకత్వం పొందడమే కావ్యావిర్భవం. చట్టాన్ని  గంగలో కలిపి, కేవలం ప్రేమతో సమాజం నడవగలదు అని చెఖోవ్ చెప్పడంలేదు.ఏ రచయిత  చెప్పలేడు చెప్పడు. ప్రేమ కరువైతే ఏ సమస్యకు పరిష్కారం లేదన్నదీ అంతే సత్యం. ఈ సమన్వయకార్యమే కావ్యవస్తువు. ఈ కథ కేవలం పిల్లల కథ కాదు.ఇందులో వ్యక్తి, కుటుంబం, సమాజం అనే మూడు వృత్తాలు ఒకదానికంటే మరొకటి విస్తృతమై ఒకదానిలో ఒకటి యిమిడి ఉన్నాయి.కథార్థం అన్ని వలయాలుగా విస్తరిస్తుంది.

ధర్మము దయ ఈ రెంటి సమన్వయమే ఏ కావ్యమైనా. ఏ ఋషి అయినా అదే చెబుతాడు, ఏ కవి అయినా అదే చెబుతాడు.'కలం పట్టిన ప్రతివాడు కవి కాకపోవచ్చు, కాని ఋషి కాక తప్పదు.పట్టిన కలం ఏదైనా,  పుట్టిన కులం  ఏదైనా.' చెఖోవ్ ఆర్షభూమిపై పుట్టినవాడు కాడు. ఆస్తికుడు అసలే కాడు. మరి ఋషి ఎట్లా? దీనికి వివరణ యివ్వవలసిన అవసరం ఉంది. దానికి ముందు, అడిగిన ప్రశ్నలకు కొన్నిటికైనా సమాధానాలు చెప్పాలిగా?

వస్తువు-శిల్పము

సమాధానాలు కథాశిల్పంతో కలిసిపోయి ఉంటాయి.శిల్పము వస్తువు వేరు కావు.కథాప్రయోజనాన్ని సఫలం చేసేది, వస్తువును ఆవిష్కరించేది శిల్పం. శిల్పినైపుణ్యాన్ని శిల్పంలోనే కదా చూడగలం?  వేరుచేసి చూడలేము కదా? కథా వస్తువు కథాప్రయోజనము శిల్పంలో భాగమే.(Content? That is also part of the form.) "చెఖోవ్ తుపాకి" అనేది ప్రసిద్ధవాక్యం.కథలో గోడమీద ఒక తుపాకీ వేలాడుతోంది అన్నావంటే, కథ ముగిసేలోపల ఆ తుపాకీ పేలాలి.అంటే కథాప్రయోజనానికి పనికిరాని ఒక్క మాట కూడా ఉండకూడదు. ఈ కథలో ఏదైనా తొలగించగలమేమో  ప్రయత్నించి చూద్దాం.

ప్రాసిక్యూటర్ నవ్వు

' నీ కొడుకు సిగరెట్ తాగుతున్నాడు' అని చెప్పగానే, తండ్రికి కోపం వస్తుందా,నవ్వు వస్తుందా?  కథలో తండ్రికి నవ్వు వచ్చింది.నెలల పిల్లవాడు మొదటిసారి నడిచే ప్రయత్నం చేస్తూ

రెండడుగులు వేసి మూడో అడుగు వేస్తూ  చతికిలపడ్డాడు.చూస్తున్న తండ్రికి నవ్వు వస్తుందా కోపం వస్తుందా? నవ్వు రావడం అసహజం కాదు ,రాకపోవడం అసహజం.లోకంలో ఇలాగే జరుగుతుంది.మంచి లోకానుశీలనం. నిజమే.కాని, లోకంలో జరిగేవన్నీ కథలో చెబుతారా? ఈ అనుశీలనం కథకు అవసరమా? దాన్ని తొలగించి చూద్దామా? ఎవడైనా తప్పు చేస్తే మనకు మొదట,  చివర వచ్చేది కోపం. 'ఏదో తెలియక చేశాడు పాపం!'అని  అనడం లేదు.మనిషికి సహజమైన నవ్వు,  నాగరికతలో(చట్టము న్యాయము) మరుగునపడిపోయింది. తండ్రి అలా నవ్వుతూ ఉండిపోడు.చతికిలపడ్డ పసివాణ్ణి  ఎత్తుకొని ఎగరేసి,  పట్టుకుని,తిరిగి నేలమీద నిలబెట్టి, వేలు అందించి నడిపిస్తాడు.కథ గుర్తుచేస్తున్నది మనిషి మరిచిపోయిన ఆ మొదటినవ్వును. పసివాడి తప్పటడుగులు మనకు "తప్పుటడుగులు" గా కనిపిస్తున్నాయి. అది కథలో ఆ నవ్వు ప్రయోజనం.కనుక, కథలో ఆ నవ్వును తొలగిస్తే ఏమవుతుంది? పునాదిరాయిని పీకేస్తే ఏమవుతుంది? కథ కుప్పకూలుతుంది.

అయితే, నవ్వు సమస్యలనన్నిటికీ పరిష్కారమా? అలా అన్నాడా చెఖోవ్ కథలో ఎక్కడైనా? పరిష్కారం కాదు. కాని, మనం తప్పటడుగును తప్పుటడుగుగా మాత్రమే చూస్తున్నాము అన్నదే కథలో విషయం.కథకుడి పని ప్రశ్న లడగడమే, సమాధానాలు పరిష్కారాలు సూచించడం కాదు.(అలాగని ప్రశ్నలు మాయమవవు.) సాహిత్యం,ఉత్తమసాహిత్యం, యిచ్చే సమాధానం ఒకటే.జీవితంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరకవు.ఈ జ్ఞానంలో కలిగే చిత్తసమాధానమే నిజమైన సమాధానం.ఈ సమాధానమే అలంకారికులనే  శాంతరసం (tranquility).

' ఎన్నేళ్ళు వాడికి?!'

 తండ్రి ఈ ప్రశ్న ప్రాసిక్యూటర్ గా అడగలేదు. నవ్వుతూ అడిగాడు. తనకు పిల్లవాడి వయసుకూడా తెలియనంతగా తన లోకవ్యవహారాలలో మునిగిపోయాడు, అది తల్లులకు తెలిసేది, అన్నది ప్రశ్నకు ఒక కోణం. మరో కోణం, తను నవ్వుతూ అడగగలగడం. ఇది తప్పు అన్న భావం కంటె, ఇది ఈ వయసులో సహజం అన్న భావన అతనికి కలిగింది.

అయితే ఈ ప్రశ్న కేవలం తండ్రి  వేసిన ప్రశ్న మాత్రమేనా? కాదు. ఇది యిద్దరి ప్రశ్న.నేరస్థుణ్ణి  కోర్టులో ప్రవేశపెట్టగానే ప్రాసిక్యూటర్, తనకు సమాధానం తెలిసి, అడిగే ప్రశ్నలలో ఇది ఒకటి. కోర్టు  ఏడేళ్ళపిల్లవాడికి ( juvenile), పదిహేడేళ్ళు దాటిన పిల్లవాడికి ఒకే తీర్పు చెప్పదు. అక్కడ వయసు ప్రశ్నకు ప్రాధాన్యం ఉంది.అక్కడే కాదు, న్యాయశాస్త్రవికాసంలో కూడా , 'కాలం వయసు' కు తేడా ఉంటుంది. ఏడేళ్ళ మానవనాగరికతకు  ఏడువేల ఏళ్ల మానవనాగరికతకు  ఒకే చట్టం పనికిరాదు.కృతయుగపు మనుస్మృతి కలియుగంలో చెల్లదు.

కనుక ఈ వయసుప్రశ్నకు రెండు ముఖాలు.

 సమస్య ఎప్పుడూ ఒకటే. ఈకాలంలో dots,shots సమస్య . పిల్లల సిగరెట్టు అలవాటు ఇప్పుడు తల్లితండ్రులకు పెద్ద సమస్య కాదు, పెద్దగీత కింద చిన్నగీత లాగా. (నిజానికి అది చిన్న గీత ఏమీకాదు. )150 సంవత్సరాల కింద ఈ సమస్య మీద యీ కథ.

ఇది బాలసాహిత్యమా?  ఇదీ ఒక కథేనా, అనిపిస్తుంది. ఎవరు రాసిన కథ ? షేక్స్పియరు తరువాత  పాఠకులు ఎక్కువగా యిష్టపడి చదివే రచయిత అట! ప్రపంచసాహిత్యంలోనే గొప్ప  స్థానం. ఇంతగా పాఠకుల అభిమానం పొందిన ఈ కథకుడు ఎవరు? ఏంటన్ చెఖోవ్. ఇంగ్లీషు అనువాదంలో కథ పేరు, " హోమ్ ".  ఈ కథను ఇక్కడ కథాశిల్పదృష్టితో విశ్లేషణ చేయడం లేదు. అది వేరే సందర్భంలో చేయదగింది. దానికొక ప్రత్యేక వ్యాసమే రాయవలసి ఉంటుంది. ఇక్కడ కేవలం కథా ప్రయోజనమే విషయం.

కథలో తండ్రి ప్రాసిక్యూటర్. నేరస్థులతో ప్రాసిక్యూటర్ వ్యవహరించే విధానం- న్యాయము, చట్టము, తర్కము, భయము,బెదిరింపు- యివేవీ పిల్లవాడిపై పనిచేయలేదు. కాకమ్మ కథ  పనిచేసింది. ఇదే కథలో సందేశం. సమాజాన్ని సరిదిద్దగలది చట్టాలు ప్రాసిక్యూషన్లు కావు.ఒక కవి మాత్రమే ఆ పని చేయగలడు.  ఈ కథలో పిల్లవాడికి తల్లి లేదు. ప్రాసిక్యూటర్  అన్నదిదే, 'ఇది తండ్రి పనికాదు, తల్లి ఉండాలి', అని. తల్లిలా,  కాంతలా మరేదీ మనసును ప్రభావితం చేయలేదు. 'The poet is the  unacknowledged legislator of mankind', అన్నాడు షెలీ.అంటే కావ్యం శాసనంలా రాయమని  కాదు,  శాసనాన్ని కావ్యంలా రాయమని  అర్థం. (ఈ నాటి రచనలు, శాపాలు  శాసనాలు. శోకం   ఎక్కువ, శ్లోకం తక్కువ .)  జాతిని నడిపించేది, ఋషి చేసిన కావ్యమే . మనుస్మృతి,  మార్క్స్ స్మృతి  కాదు.

***

# 7. కా.రా.
# (కాళీపట్నం రామారావు)

7.1. కా.రా.కథనశిల్పం
7. 2.భయం

(కా.రా ముఖ్య కథలు:

యజ్ఞం-1-1- 1966
హింస- 7-11-68
నో రూమ్- 13-12-68
స్నేహం- 1-4-69
ఆర్తి - మే, జూన్ 69
భయం-1-11-70
చావు - 1-3-71
కుట్ర- 15-8-72 )

***

## 7.1. కా.రా.కథనశిల్పం

ఈనాటి అభ్యుదయరచయితలు - యీనాడు చయితలందరూ అభ్యుదయరచయతలే, కాదని చెప్పుకునే ధైర్యం చాలామందికి లేదు- మనుషులను ఉన్నవారు లేనివారు అని రెండు వర్గాలుగ విభజించారు. ఉన్నవారు ఒక్క మంచిగుణమూ లేనివారుగా, లేనివారు సద్గుణలమూటగా చిత్రించడ యీనాటి పరిపాటి. మంచివాడై ఉండవలనంటే వాడు పేదవాడే అయిఉండవలననేనమ్మకం యీనాటి రచనలకు మూలమనిపిస్తుంది. పేదలు మంచివారైనపుడు నిరుపేదలు మరీ మంచివారై ఉండకతప్పదు కదా! కా.రా. కథలపద్ధతి వేరు. కా.రా.పేదలకంటే నిరుపేదలగురించి కథలు రాస్తాడు. అయితే మనుషులను మంచివారిగాగాని చెడ్డవారిగాను చూపడం అతడి కథాప్రయోజనం కాదు. మనిషి మంచివాడుగా గాని చెడ్డవాడుగా గాని ఎలా మలచబడుతున్నాడు మారుతున్నాడు అన్నది అతని కథావస్తువు. అతని కథల్లోకి మంచికి చెడుకి వ్యక్తులు కాక సమజవ్యవస్థ బాధ్యత వహిస్తుంది. ఇతని కథల్లో ఏ పాత్రనూ దుష్టపాత్రగా చెప్పడం కష్టం. సమాజదౌష్ట్యానిదే ప్రాధాన్యం.

ఒక దృష్టితో చూచినపుడు మొత్తం సాహిత్యంలో రెండు విధానాలు కనిపిస్తాయి.ఒక విధానం మంచికి చెడుకీ జరిగే సంఘర్షణను చిత్రించడం. రెండవది మంచికీ మంచికీ జరిగే సంఘర్షణను చిత్రించడం. మొదటిది జీవితంలో దొరకదు. ( అంటే, కల్తీలేని మంచి చెడూ జీవితంలో దొరకవు.) సాహిత్యంలో పుష్కలంగా దొరుకుతాయి.) రెండవది జీవితం. కాని దాన్ని జీవితంలో గుర్తించడం కష్టం.చూపించడం చాలా కష్టం. అందుకే సాహిత్యంలో ఎప్పుడోకాని కనిపించదు. అన్యాయం అధర్మం క్రౌర్యం స్పష్టంగా కనిపిస్తుంటే వాటితో పోరాడడం సులభమే కావచ్చు. అసలు కష్టం వాటిని గుర్తుపట్టడమే.న్యాయం అన్యాయంగా, ధర్మం అధర్మంగా, కరుణ కరడుగట్టిన క్రౌర్యంగా మారే సరిహద్దులవరకు వెడతాడు కా.రా.అక్కడ చిక్కించుకుంటాడు వాటిని. "యజ్ఞం"లో అప్పల్రాముడిది అప్పేనని లెక్కలు ఒప్పుకుంటుంటే అప్పుకాదనే వాడి వాదన అన్యాయంగా కనిపించే న్యాయం. అప్పలరాముడు ఉన్న కొంచెం మడిచెక్కనీ అమ్మి తన వంశాన్ని తరతరాలకు బానిసవంశంగా చేసైనా అప్పుతీర్చవలసిందే అనే శ్రీరాములునాయుడి వాదం ధర్మపక్షపాతంగా కనిపించే అధర్మం. అప్లారాముడు ఆ అప్పుతీర్చకపోతే, ఆ అప్పు తనే తీరుస్తానని శ్రీరాములునాయుడు అనడం, కరుణ కప్పువేసిన క్రౌర్యం. సీతారాముడు తన కొడుకు బానిసగా పెరిగి బతకడం చూడలేనని వాణ్ణి నరకడం రాక్షసత్వంగా కనిపించే పుత్రవాత్సల్యం.

సమాజదౌష్ట్యంపై వెలుగును గుప్పించి దాన్ని స్పష్టంగా చూపడంకోసం కా.రా. తన పాత్రలను అన్నివర్గాలవారిని ఆదర్శమూర్తులుగా తప్పుపట్టలేనివారిగా చిత్రిస్తాడు. "యజ్ఞం"లో మనం ఎవరినీ వ్యక్తులుగా తప్పుపట్టలేం. అందరూ ఆదర్శవ్యక్తులే. మంచితనం మారుపేరైనవారే. గోపన్నకు అప్పల్రాముడు వడ్డీతోసహా రెండువేల అయిదువందలు అప్పు యివ్వతేలాడు. ఇద్దరూ పరమసాత్వికులు. కలిసి వ్యాపారంచేశారు కొన్నాళ్ళు. గోపన్న పూర్తిగా చితికిపోయాడు.అతడి కొడుకులే అతన్ని దగా చేశారు. అతడిపై పాఠకుల సానుభూతిని ఏమాత్రము తగ్గించే

ప్రయత్నంచేయడు కథకుడు. అప్పల్రాముడు ఆ ఊరి పంచాయతి హరిజన మెంబరు. మాలలకే కాక ఆ ఊరిలోని ముప్పాతికమందికి అతడంటే సదభిప్రాయం. మాటకు నిలబడేవాడూ మర్యాదగా బతకాలనుకునేవాడూ మాలల్లో అతడొకడే అని అందరూ చెబుతారు. వీరిద్దరిమధ్య తీర్పుచెప్పవచ్చిన శ్రీరాములునాయుడు ఆ ఊరి ప్రెసిడెంట్. ఊరందరికీ "దరమరాజు". ఈ ముగ్గురిలో ఏ ఒక్కరినీ వ్యక్తులుగా మనం వేలెత్తి చూపలేము. అంతకన్నా మనుషుల్లో మంచితనం మనం ఊహించలేం. "భయం" కథలో సత్తెయ్య పాత్ర మరొక ఆదర్శపాత్ర. సత్తెయ్యకు పాములను పట్టిచంపడం ఒక దీక్ష. అయితే మహాభారతకథలో వలె తండ్రి మరణానికి ప్రతీకారంగా కొడుకు చేసిన సర్పయాగం కాదు. అది సమాజశ్రేయస్సుకొరకు చేసింది. సత్తెయ్యలోని సహానుభూతి పాఠకులను ఆర్ద్రం చేస్తుంది. "చావు" లోని అప్పారావు పాత్ర యిటువంటిదే. అయితే మంచితనం పెంచిన పాత్రలు ఒక్కోచోట అసహజమనిపిస్తాయి. "యజ్ఞం"లో సీతారాముడు తనను చంపవచ్చిన ఊరి పెద్దలతో చంపవద్దంటాడు. ఎందుకు? ప్రాణంమీది ప్రేమతో కాదు. "నాకు సావో నెక్క కాదు. కొడితే మీరు ఉరిలో పడతారు. మీ బిడ్డపాపల ఉసురు నాకేల తగలాల?" అట్లాగే అప్పల్రాముడి అమాయకత్వమూ ఒక్కోచోట దొంగముసుగులా కనిపిస్తుంది.

సూరెంబాబు యిరవైఏల యిరాలం యిచ్చినాడు- పున్నానికే యిచ్చినాడు. అందుకు మెచ్చి బగమంతుడు రైసుమిల్లెట్టించినాడు. ఇపుడు డబ్బొస్తన్నదంటే ఆ బాబేం సేయగలడు?

అదే మాదిరి లచ్చుంనాయుడు బాబున్నూ పున్నానికే బూవిచ్చినాడు. అయిస్కూలెట్టినాక సుట్టూ బూవులు దరలు పెరిగిపోనాయి. ఇళ్ళజాగాలకమ్మితే నస్టం పూడి లాబవొచ్చినాది.ఆ జాగాలు కొనుక్కున్నోడికి బలవంతానగాని అంటగట్టినాడా?"

అలాగని కూకలేసినాను. దానికోగుంటపాపడన్నాడుకదా-

" ఓరి తాతోయ్ మనవూ యిచ్చినాం శమదానం. మన పున్నేనికి బవుమతేది", అన్నాడు.

"నీక్కూల్లు దొరకనేదా, అన్నాను."

"నీక్కూల్లు దొరకనేదా"అన్న మాటలో వ్యంగ్యం తోచకుండా ఉండడం కష్టం. తోచడం కథనంలో లోపం. అప్పల్రాముడి మాటల్లో ఒక అంతస్సంఘర్షణ కనిపిస్తుంది.అతడు యిన్నాళ్ళూ మన్నించిన పాతకాలపు విలువలకు యీనాడు తను ఎదుర్కొంటున్న వాస్తవానికి మధ్య జరుగుతున్న సంఘర్షణ అది.

కా.రా. కథల్లోని శిల్పపరిణతిని పరిశీలించవలెనంటే అతని పెద్ద కథలను చూడవలసి ఉంటుంది. అతని చిన్నకథలు శిల్పదృష్టిలో కూడా చిన్నవే. ఈ చిన్నకథల్లో కా.రా. సాధారణంగా అలిగరీ (Allegory: అర్థాంతరం) ని ఆశ్రయిస్తాడు. "యజ్ఞం" కథలసంపుటిలో రెండు పెద్దకథల మధ్య యిరుక్కుపోయిన చిన్న కథ "తీర్పు". అది వాస్తవకథనంగా మనల్ని ఆకట్టుకోదు. ఒక సమస్యను సూచించి ఆ సమస్యను పరిష్కరించడానికి కథకుడు ఊహించిన పాత్రలు ఆ కథలోవి. పాత్రలు వ్యక్తులుగా కాక సమస్యలుగా కనిపిస్తారు. వారి ప్రతి మాటా మరేదో అర్థం వైపు (

“అర్థాంతరం”)  మన దృష్టిని పక్కకు తిప్పుతుంది. ఇటువంటివే “జీవధార” , “వీరుడు-ప్రతివీరుడు” వంటి కథలు. అనేక భారతీయభాషల్లోకి అనువాదమై అతనికి అఖిలభారతఖ్యాతిని తెచ్చిన “నో రూమ్” కథ కా.రా. అతని ప్రాథమిక దశలో వ్రాసింది అయిఉండవలె. ఆ కథ కా.రా.యే రాయనక్కరలేదు. ఓ.హెన్రీ కథకు పేలవమైన అనుకరణ అనిపిస్తుంది. కా.రా.కథనశిల్పం క్రమంగా పరిశీలించడానికి అయిదు పెద్ద కథలు చాలు- ఆర్తి, యజ్ఞం, భయం, చావు, కుట్ర. ఈ అయిదు కథల్లో కా.రా. అయిదు ప్రధానసమస్యలను ఆవిష్కరించడమే కాక అయిదు విధాలుగా కథ చెప్పాడు. “ఆర్తి” నిరుపేదల నికృష్టజీవితాలను డాక్యుమెంటరీ  లాగా చూపిస్తుంది. ఆ పేదల్లో సద్గుణాలు ఉండడానికి ఎట్లా వీలులేదో కూడా చూపుతుంది. పేదరికం యిట్లా ఉంటుందని చూపడం మాత్రమే “ఆర్తి” చేయగలిగింది. “యజ్ఞం” లో సమస్యను ఆవిష్కరించడమే ప్రధానం. అందుకు కా.రా. అలిగరీ ని (Allegory, అర్థాంతరం) ఆశ్రయించాడు. అయితే వాస్తవికతకు ఎక్కడా దెబ్బతగలకుండా , పాత్రలు సంఘటనలు వాస్తవంగా కనిపిస్తూనే ఒక సమస్యావిష్కారానికి సూక్ష్మీకరణాలుగా నిలుస్తాయి. ఈ కథలో ఆలోచనకు అనుభవానికి మధ్యనున్న అగాధాన్ని స్పష్టం చేస్తాడు కా.రా. కంబారిగా జీవితాంతం బతకడమంటే క్షణక్షణమరణమన్న ఆలోచన అందరెరిగినదే.  కాని ఆ ఆలోచనను అనుభవించడం సామాన్యంగా జరగదు. ఆలోచనవేరు, అనుభవంవేరు. కనుకనే సీతారాముడు తన పసికూనను నరికి చూపవలసివచ్చింది. (2) ఈ అనుభవమే ప్రధానం “ భయం”లో. “భయం” అలిగరీ నుండి సింబలిజమ్ వైపుకు సాగింది. పాములెన్ని రకాలో భయాలన్ని రకాలు. పాములన్నిటిని ఏరిపారెయ్యడమే, లోకంలో పాపభయం లేకుండా చేయడమే సత్తెయ్య దీక్ష. పాములను పాపమనస్తత్వాన్ని అర్థంచేసుకోడంలో సత్తెయ్యకు గురవడికి ఎదురైన అనుభవాలు వారి జీవితాలలో మార్పు తెస్తాయి. యుగాల ఆలోచన కన్నా క్షణకాలపు అనుభవం మనిషిని మారుస్తుంది. “చావు” లో కా.రా.అలిగరీనిగాని ప్రతీకలనుగాని ఆశ్రయించలేదు .ఈ రెంటి అవసరం లేకుండానే మనల్ని నేరుగా కథలో నిలబెడతాడు. కథ చదివినంతసేపూ మనల్ని ఎముకలు కొరికే చలిగాలిమధ్యలో నిలబడతాం మనం. “చావు”లో జీవితాన్ని అనుభవంగా అందిస్తాడు కా.రా. తల్లి శవం తగులబడుతుంటే ఆ మంటలకాంతుల్లో ఎరకయ్య ముఖం ఒక అపూర్వ ఆనందంతో వెలిగిపోతుంది. అది ఒక గొప్ప జీవచిత్రం.

“కుట్ర” యీ నాలుగు కథలలో చేరదు.అతని కథలలో అన్నిటికంటే వేగంగా సాగే కథ.కా.రా. సామాన్యంగా శైలితో ఆకట్టుకోడు. ఆ ప్రయత్నమూ చేయడు. కాని, “ కుట్ర”లో అతని శైలి పాఠకుణ్ణి అతనికి తెలియకుండానే ముందుకు లాక్కెడుతుంది. కా.రా. రావిశాస్త్రిశైలిని అనుకరిస్తున్నాడనిపిస్తుంది.కా.రా.కథల్లో కెల్లా “కుట్ర” లోనే కోట్స్ ( quotes) ఎక్కువ.”కుట్ర”ను కథ అనడం కష్టమే. కరపత్రం అనడమూ అంత కష్టం. ఇందులో కథ చెప్పడం కంటే, ఆ నాటి సాంఘిక ఆర్థిక పరిస్థితులు విశ్లేషించడం ప్రధానం. కా.రా.మొదటినుండి సమస్యను వివరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. తన కథలోని చిక్కులన్నీ తనే విప్పుతాడు. అస్పష్టత, అనిర్వాచ్యత అతని సాహిత్యగుణాలు కావు.స్పష్టమైన అభిప్రాయాలతో విస్పష్టమైన వివరణతో కథ చెప్పడం అతని పద్ధతి. కథనంలో బిగువుకోసం అవివక్షితంగా వదిలేసిన చిక్కులుకూడా కథ ముగిసేలోపల వివరించక మానడు. ఈ వివరణే అతని ప్రధానలక్ష్యం.”ఆర్తి”లో యియ్యపురాళ్ళ తగాదా, “యజ్ఞం” లో అప్పల్రాముడి అప్పు, “భయం”లో పాము కరిచిన గౌరేసు చనిపోకపోవడానికి కారణం- యివన్నీ సహేతుకంగా స్పష్టంగా వివరిస్తాడు. వీటి అతుకులు ఎక్స్ రే

ఫోటోలోలాగా చూపిస్తాడు.ఈ విధమైన వివరణాత్మక కథనవిధానం కథలో ప్రధానమై కథను మింగేసింది. మన దేశంలోని ఆర్థికవ్యవస్థకు పట్టిన జబ్బును చూపే ఎక్స్ రే అది, పోర్ట్రైట్ ఫోటోగ్రఫీ కాదు.

ఒక ప్రత్యేకమైన సందేశం యివ్వాలని, ఒక ప్రబోధం చేయాలని పాఠకులలో కార్యోన్ముఖత కలిగించాలని కా.రా.కథలు రాస్తాడన్నది స్పష్టమే. ఈ సందేశం తన కథల్లో ఎట్లా చేస్తూవచ్చాడో చూస్తే అతని కథనంలో మరొక విధమైన క్రమపరిణామం తెలుస్తుంది. అతని కథల ముగింపులు సందేశాత్మకంగా హెచ్చరిస్తూ ఉంటాయి. ఆర్తిలో యీ సందేశం వాచ్యం చేయడు. మోచేతికూడు అనే ఎంచితే ఎంచడానికి లేనిదేవుందా గుడిసెలో? సన్ని కంచం తెచ్చి పక్కన పెట్టింది. పైడయ్య చెయ్యి కడిగేసుకున్నాడు." కథలో యీ మోచేయి ఎక్కువగా కనిపించదు. కాని కథ చివరి యీ మాటలు చదివింతర్వాత కథ మొత్తం కొత్తగా మన కళ్ళముందు తిరుగుతుంది. ఆ అదృశ్యహస్తం నీడ కథలో స్పష్టంగా కనిపిస్తుంది. "యజ్ఞం"లో చివరి మాటలు , " యీ ధర్మపన్నాలెంత కాలం? అంతా నీమాట వినేవరకూ.ఆ తర్వాత...."ఇవి కథకుని మాటలు. రచయితగా తాను చేస్తున్న హెచ్చరిక. కథకు ఏమాత్రము అవసరంలేని, కథలో ఏమాత్రము అతకని, కనుకనే కథను ఏ మాత్రమూ చెడగొట్టలేని మాటలు. "భయం" చివరి మాటలు: ఆ పాపపు ఆలోచనలు, ఊహలు, అతను కోరి తెచ్చుకున్నవి కావు, యితరులు తన తల్లోకి ఎక్కించినవీ కావు. జీవితం మనిషిలో మార్పు తెస్తుంది. ఆ మార్పుకు అనుభవం కారణమవుతుంది." మెదడును ఉతకడం ( brain washing, indoctrination ) వల్ల కాదని, అనుభవం వల్ల జీవితంలో కొన్ని కంటిపొరలు తొలగి, మనిషి మరో మనిషి అవుతాడని కా.రా.అంటున్నాడు. కథలో తాను చూపింది యీ అనుభవమే కాని అనుభావం కాదని తాను వివరించుకున్న మాటలు కూడా. "చావు"లో కథకుని యీ ప్రబోధం కథను ఎక్కువగానే ఆక్రమించింది. సూరయ్య, కన్నయ్య, కరనం బామ్మరిది, అందరూ తమ భాషలోనే అయినా కథకుని గొంతుతో మాట్లాడుతున్నట్టు కనిపిస్తుంది. " ప్రళయం తప్ప యీ బూమ్మీది మురికిని కడగనేదు. పోతే అన్నీ పోతాయి. మనుషులవూ పోతాం." "చావు"లో ప్రబోధం కథలో ఎంత పరచుకున్నా, కథ మొదటినుండి గుండెలో నిలిచిపోతుంది.కథలో చివరి మాటలు హెచ్చరికాకాదు సందేశమూ కాదు. అనుభూతి. " ముసిల్ది నిన్న పోయింది. నిన్నపోతే యివాల్టికి రెండు. కాని సంధికాలంలో తెలవేసిఉన్నవాళ్ళకి అలా అనిపించదు. నిన్న నేడు అంతా ఒక్కలాగే అలికేసి ఉంటుంది." కాటేసి జారుకునే చావు కాదు, బతుకునంతా "అలికేసి"నట్టున్న చావు.

"కుట్ర" మొత్తం ప్రబోధమే. అందులోనూ చివరిమాటలు హెచ్చరిస్తూనే ఉన్నాయి.అయితే అవహేళనస్వరంలో. " ప్రెస్సూ ప్లాట్ ఫామ్ చేతిలోఉంటే ఎన్ని బుకాయింపులైనా బుకాయించొచ్చు. కాని నిజం ఎప్పటికీ నిజమే. గాంధీగారి కోతులు కళ్ళూ చెవులూ నోరూ మూసేసుకావాలని మూసేసుకోండని చెప్పి— యింకా యినప్పోతే బలవంతాన మూసేడానికి ప్రయత్నించొచ్చు.కాని— ???

కా.రా. ఒక్కొక కథలో ఒక్కొక్క ప్రాథమిక ప్రశ్నను ఆవిష్కరిస్తాడు. చివరకు తేలే ప్రశ్న ఒకటే అయినా ఆ ప్రశ్న విభిన్నరూపాలు వివిధకథల్లో కనిపిస్తాయి. " ఆర్తి" లో మాత్రం ప్రశ్నలున్నా ఏది ప్రధానమైన ప్రశ్న అనేది చెప్పడం కష్టం. ఈ కథలో ప్రశ్నను రూపించడం కంటే మాలల నికృష్టజీవితానికి అద్దం

పట్టడమే ప్రధానం అనిపిస్తుంది. ఈ కథ మూడు పేటల గొలుసు. ఒకటి ఎర్రెమ్మ, బంగారిల యియ్యపురాళ్ళ తగాదా. పండక్కు కూతుర్ని పుట్టింటికి తీసుకెళుతానంటుంది ఎర్రెమ్మ.కోడల్ని పండక్కు పుట్టింటికి పంపను, పండగెళ్ళాక తీసుకెళ్ళమంటుంది బంగారి.ఇద్దరిదీ ఒకే ఊరు.ఒకతె కన్నతల్లి, యింకొకతె కడుపులో పెట్టుకోవలసిన అత్త.ఎవరిని తప్పు పట్టడం? ఇద్దరిదీ తప్పు కాదు. “ పండుగ ముందు నెల్లాళ్ళు ముమ్మరంగా వరికోతలు.పండగెళ్ళాక తొలకరిస్తేగాని బతుకుల్లేవు.అందుకే పండుగముందు తీసుకెళ్తానని తల్లి, పండగెళ్ళాక తీసుకెళ్లమని అత్త.కోడలైనా కూతురైనా సన్ని అంటే ఒక మనిషి కూలి.

కథలో మరో పేట, సన్ని మొగుడు పైడయ్య పండక్కని ఊరికొచ్చాడు. పెళ్ళాన్ని కలుసుకునే వీలులేదు. పక్క ఊరెళితే రావయ్య కోడలి కన్ను పట్నంనుచి దిగిన తనపై పడిందని పైడయ్య అనుమానం. ఆశ ఊగింది. కాని మనిషి అట్లాటిదిగాదని తెలిసింది. నిరాశగా ఊరి ముఖం పట్టాడు. రహస్యంగా కలుసుకోమని పెళ్ళానికి కబురు పెట్టాడు. చాటుగా కలుసుకోమని పెళ్ళానికి కబురుపంపాడు. దొంగచాటుగా మొగుణ్ణి కలియడానికి సన్నికి అభిమానం అడ్డొచ్చింది. పైడయ్య దాహంతో దెయ్యాల గంగమ్మ పాకలో ప్రవేశించాడు. రెండేళ్ళక్రితం ఒకసారి యిలానే వచ్చాడు. అప్పటికి సన్ని కాపరానికి రాలేదు.”ఇంకోసారి అడగనంటే అలాగే కాని”మ్మంది. మళ్ళీ యిప్పుడొచ్చాడు. పైడయ్య అన్న నారాయుడు భార్య పోయినప్పటినుండి దాహానికి గంగమ్మ దగ్గరకొస్తాడు. “ నానిప్పుడు నీకు ఒదిన్నవుతాను” అని అతని అసహాయస్థితికని చూచి తల్లిలా జాలిపడి దగ్గరున్న సారాసీసా ముందు పెట్టింది. తాగి తన వమనంలోనే పడ్డాడు పైడయ్య.

కథలో మూడవపేట, యియ్యపురాళ్ళ తగవు తీర్పు. నాయుడు తీర్పు చెప్పాడు, అల్లుణ్ణి అత్తగారింటికి పంపమని. తీర్పుకు అనుపానంగా తనింట్లో మిగిలిపోయిన కూరా కూడా పంపుతాడు నాయుడు. సన్ని ఆ రాత్రి పైడయ్యకు అన్నం పెడుతున్నది. “ ఆ రాత్రి తొమ్మిదిగంటలకు యీడ్చి యీడ్చి తన్నిన పశువులా ఉన్నాడు పైడయ్య.”నాయుడి తీర్పుతో కలిగిన సంసారంలో అతనికి సారం తోచలేదు. తినకపోతే ఆకలి. తిందామంటే ఆ మోచేతికూడు దిగదు.

ఈ వ్యాసంలో ఎన్నుకున్న తక్కిన నాలుగు కథలూ గొప్పకథలని ఎవరూ చెప్పక్కరలేదు. వాటి మొహంమీద స్పష్టంగా రాసి ఉంది . అయితే “ఆర్తి” మాత్రం అలా కనిపించదు. కనిపించే ప్రయత్నమూ చేయదు. అందుకు కారణం కా.రా. అందులో కథ చెప్పే ప్రయత్నం చేయడు. తక్కిన కథల్లోలాగా యిందులో ఒక ప్రధానసమస్య , దాన్ని ఉత్సుకతను రేకెత్తించే విధంగా ”

ఆవిష్కరించడమూ, ఒక పతాకస్థాయికి నడిపించడమూ ఒక భయంకరమైన తీర్మానము యివేవీ లేవు. ఒక ఉప్పెననో భూకంపన్నో అగ్నిపర్వతం బద్దలవడాన్నో చూపడం లేదు. నేలలో గాలిలో తేమకూడా క్రమంగా ఆరిపోతున్న కరువుప్రాంతంలో ఆరినపెదాలపై , ఎండిన కళ్ళపై మూవీకెమెరాను మూగగా తిప్పుతూ వెళతాడు కా.రా.దేహమంతా దహిస్తూ నిలిచే ఆ దాహం చెప్పలేనిది. చెప్పుకోలేనిది. ప్రాణం తీసేదీ కాదు, బ్రతుకనిచ్చేదీ కాదు. మరణమృదంగం మూగగా పడిఉన్న దృశ్యం అది.

"యజ్ఞం" లో కథ చెప్పడం కంటే సమస్యను ఆవిష్కరించడం ప్రధానం.ఇందులో ప్రశ్న "కల్నీ ఏవడు సెప్పిన దరమం ? ఏటా దరమం ? చితికిపోయిన గోపన్న అప్పల్రాముడు తన బాకీ తీర్చాలనడం అధర్మమా? లెక్కలన్నీ సరిచూసి అన్యాయపు వడ్డీని కాదని, ప్రభుత్వపు వడ్డీరేటుకు అప్పు మొత్తం నిర్ణయించి , అప్పు తీర్చడానికి మూడేళ్ళల గడువిచ్చిన పెద్దమనిషి శ్రీరాములునాయుడిది అధర్మమా? లెక్కలను ఒప్పుకుంటూనే అప్పు తీర్చవలసిన అవసరం లేదనే తీర్పును ఆశించిన అప్పల్రాముడిది అధర్మమా? ఎవరిదీ కాదు. అధర్మం ఆర్థికవ్యవస్థలో ఉంది. అప్పల్రాముణ్ణి గోపన్న, గోపన్నను పట్నంలో షావుకారు, వాణ్ణి పై షావుకారు, యిట్లా చిన్నచేపను పెద్దచేప దిగమింగే ఆర్థికవ్యవస్థలో ఉంది అన్యాయం. ఇటువంటి వ్యవస్థలో సాధించిన అభివృద్ధి అంతా ఉన్నవాళ్ళకే అభివృద్ధి. లేని వాళ్ళు యింకా లోనికి వెళ్ళే గొయ్యి. ఊళ్ళకు విద్యుత్తు వచ్చింది. " దేశమంతటా చిక్కంలా పరచుకొంటున్న తీగెలు" అంటాడు. కా.రా. దేశం పచ్చగానే ఉంది. పేదల నోటికి "చిక్కం" మాత్రం విడదు.ప్రగతికై సాగే యజ్ఞంలో బలిపశువులే పేదలు. యజ్ఞఫలం యజమానులదే.

ఈ కథలో సాగిన ధర్మతత్త్వ విచారము రాజ్యధర్మంకంటే సమాజధర్మం ఎంత కఠోరమైనదో చూపుతుంది. గుడికెదురుగా, తలుపులన్నీ తెరిస్తే దేవుడు కనిపించేటట్టుగా న్యాయమండపం కట్టుకున్నారు ఊరివారు. "ఏనాడైతే యీ మండపంలో న్యాయం దొరక్క , దానికోసం యీ ఊరివాడు పైవూరు పోతాడో, ఆనాడు దాన్ని కట్టిన మన యీచేతులతోనే దాన్ని కూల్చివేతాం", అని నిర్ణయించుకున్నారు ఊరివారు ఊరి పెద్దలు. న్యాయం కొరకు కోర్టులకెళ్ళడాన్ని కూడా సహించరన్నమాట ఊరివారు. కోర్టుకెళితే పేదవాడికి పొరపాటున న్యాయం జరిగే అవకాశమున్నది. మీరు కోర్టుకు వెళ్ళి వాదించి గెలవ్వచ్చు. అంతమాత్రాన మీరు ఆ రుణాన్నుండి తప్పించుకో గలరనుకోడం కల్ల.ఈ జన్మలో కాకపోతే యింకో జన్మలోనైనా మీరు దాన్ని తీర్చడం తప్పదు",అంటాడు శ్రీరాములు నాయుడు.

ఈ కథలో కా.రా. సమాజంలోని తక్కిన అంగాలను రాజ్యం ఎట్లా తెలివిగా వాడుకుంటుందో చూపుతాడు. మతము, పంచాయతీపరిపాలన మొదలైనవి రాజ్యం చేతికి అందకుండా స్వేచ్ఛగా వ్యవహరించగలవు అనే ఆభాసను తొలగిస్తాడు కా.రా. యీకథలో.మునసబు కరణము రాజ్యంయొక్క ప్రతినిధులు.శ్రీరాములు నాయుడు పంచాయతీపాలనకు ప్రతినిధి. గ్రామంలోని గుడి, ఆ గుడికెదురుగా నిలబెట్టబడ్డ న్యాయమండపం మమతా మానవతాలేని రాజ్యానికి చట్టానికంటె మనిషికి దగ్గరి వ్యవస్థలుగా కనిపిస్తాయి. కాని రాజ్యము, చట్టము తమకుగా తాము చేసుకోలేని పనులను పంచాయతీపాలన ద్వారా, మత ప్రవచనాల ద్వారా చేయించుకుంటాయి. అంటే "చట్టం" పనిచేయలేనపుడు "ధర్మ"సహాయం కావాలి దానికి. ఈ ధర్మం ఆ చట్టానికి దాని పని చేసిపెడుతూ తానేదో వెలగబెట్టినట్టు సంబరపడిపోతుంది. తను వాడుకోబడుతున్నట్టు ఆ "ఎర్రిపీరు" కు తెలీదు. మునసబు, కరణము, కోర్టులు అప్పలరాముడిది అప్పేననలేనపుడు వారికి శ్రీరాములునాయుడి న్యాయస్థానపు అవసరం కలిగింది. అదే అంటాడు సీతారాముడు నాయుడితో:

" ఈ రాజ్యాన్నీ నిన్నూ ఏలే దొరలెవరో యెరుగుదువా—అదిగో ఆ బాబులిద్దరు. అదిగో ఆ కరణమయ్య. అదిగో ఆ మునసబయ్య.ఆళ్ళకు ఆళ్ళు సేసుకోలేని మంచిని నువ్ సేసినంతకాలమే నీ రాజ్యం—ఆ తరవాత ఆళెవరో , నువ్వెవరో."

" భయం" లో పాములు, మనిషిలో అర్థం లేని భయాలు కల్పించే వివిధశక్తులకు ప్రతీక. పేదల బ్రతుకులు గుప్పిట్లో ఉంచుకుని ఆడించే ధనికులు, పేదల అజ్ఞానాన్ని డబ్బుగా అధికారంగా మార్చుకునే మతాచార్యులు, ప్రజల మూఢవిశ్వాసాలను వాడుకుని వాళ్ళప్రాణాలు ఆస్తులు కాజేసే నాటు వైద్యులు వీళ్ళందరు ప్రజలపాలిటి పాములు. ఇలాంటి

పాముల్ని చంపడానికి ఏ విధంగా చంపడానికి ఎటువంటి మీమాంస పనిలేదు.వాటిని దయతలచేవాళ్ళూ ఉంటారు. " అయ్యో పాపం ఎరమింగిన పాఁవర్రా ! అలాంటి పాఁవుని చంపకూడదు! అన్నారు భూతదయాపరులు. పావుఁలంటే సత్తెయ్యకు ద్వేషం లేదు. అసలు పాములే లేవు. లేనిదానిని ద్వేషించడమెట్లా. "పూర్తిగా తెలివొచ్చి చూస్తే ఏ పామూ కనిపించదు. ఏ మాయా అగుపించదు."

"భయం"లో మూడు పేటలున్నాయి. గౌరేసు పారెమ్మల చావు; సత్తెయ్య "సర్పయాగం"; గురవడికి జీవితం తెలియడం. మొదటిది మూఢనమ్మకాలలోని ప్రమాదాన్ని చూపడానికి . కాని తరువాతి కథతో దీని అతుకు సరిగా చేయలేదనిపిస్తుంది. సత్తెయ్య సర్పయాగం అతని తల్లిదండ్రుల చావుకు ఒక పాము కారణమవడం చేత అని చెప్పడానికైతే గౌరేసు పారెమ్మల కథ అవసరం కాకున్నా కొంతవరకైనా సార్థకమయేది. కాని కా.రా. అటువంటి ప్రయోజనాన్ని ఉద్దేశించలేదు. సత్తెయ్య సర్పయాగం ప్రతీకారవాంఛాదుష్టం కాదు, లోకకళ్యాణకారకం. అయినప్పుడు గౌరేసు, పారెమ్మల కథ ఎందుకు? పాము కరచిన గౌరేసు చావలేదు. కరవని పారెమ్మ చచ్చింది. పాము కంటే పాముభయం ప్రాణాంతకమని చెప్పదలచాడా? కాదు పారెమ్మ చనిపోయింది భర్తను పాము కరచిందన్న షాకువల్ల కాదు. ఆ షాకువల్ల జరిగిన గర్భస్రావంలో " నాటుమంత్రసాని మోటు సుళువులు వికటించి" చనిపోయింది. అట్లాగే పావుఁల రావులయ్య నాటుమందులు – పాముకాటు కాదు—గౌరేసు ప్రాణము ఆస్తి కాజేశాయి. కనుక గౌరేసు పారెమ్మల చావుకథ నాటుమందుల యొక్క ప్రమాదాన్ని చెప్పడానికి, దాని వలన సత్తెయ్యలో కలిగిన హేతువాదదృష్టిని ప్రతిపాదించడానికి అనుకోవలె. కాని తరువాతికథలో యీ హేతువాదం కథావస్తువుగా మళ్ళీ కనిపించదు. తరువాత కనిపించే మానవతావాదానికి యిది ఎట్లా పునాది అవుతుందో కూడా స్పష్టం కాదు. " తన భయం ఎలా తలగిందో ఏ చైతన్యం అందుకు కారణమో గ్రహించగలిగే ఊహ సత్తెయ్యకు లేదు." తరువాతి కథలో వస్తువు భయాన్ని జయించడమెట్లా ? " జనఁవేటనుకుంటారంటే అప్పుడెప్పుడో మాయయ్యని పాఁవు కురిసిందని -ఆ కసికొద్దీ పావుల్ని సంపుతాననుకుంటారు. పాఁవంటే నాకు పగ కాదు. ..పాఁవు మనిసిని కుడతాది. మనిసికి సావంటే బయం. పావుఁని సూస్తే సావును సూసినంత బయం. సావుకు బయపణ్ణోడు ఒక్కడే పాఁవుకి బయపడ్డు. సిన్నప్పుడు కండసీవఁని సూసి బయపడినావు. పెద్దైనాక పాఁవు...సీవైనా పాఁవైనా సావైనా నాకొక్కటే.అదెప్పుడో కాటేస్తదో యెయ్యదో, దాని బయ్యం మనిసిని తినేస్తుంటది పురుగునాగ! ఎదురు తిరిగితే ఏటీ నేదు." చావుకు భయపడకపోవడం తనకి చావులేదని తెలుసుకున్నప్పుడే సాధ్యం. " ద్వితీయాద్వై భయం భవతి" అన్న ఉపనిషద్వాక్యాన్ని గుర్తుకు

తెస్తాయి సత్తెయ్య మాటలు. లోకమంతా తననే చూచుకుంటున్న సత్తెయ్యకు చావులేదు, భయమూ లేదు. ఈ ఆత్మీయత ఎంత భయంకరమైనదో రత్నాలు అడిగిన ప్రశ్నకు సత్తెయ్య చెప్పిన సమాధానంలో తెలుస్తుంది. ఆమె అడిగిన ప్రశ్న, " నువ్ – మీరంతా నాక్కైనట్టు ఈ లోకవంతా నీకౌద్దా?" అతడి జవాబు " అవుద్ది."అంత తడువు(కేకుండా వచ్చిన జవాబుకు రత్తాలువద్ద ఎదురుమాట లేదు. "అయితే సరే! " అంటూ తల తిప్పేసింది. ఆమెకు కళ్ళంబడి నీళ్ళెందుకు వచ్చేయో వాటిని ఆపడమెలాగో అతనికి కాని ఆమెక్కాని తెలీలేదు. " నీవే నాలోకం.లోకం ఏమైతే" నాకేం అని సత్తెయ్య అనలేకపోవడం రత్నాలు కన్నీళ్ళకు కారణం. భర్త పరస్త్రీలోలుడైనా భార్య సహించగలదు కాని జ్ఞానియై ఆత్మవత్ సర్వభూతాని అనడం ఏ భార్యా భరించలేదు. మానవతావాదాన్ని దాని అంచులవరకు వూహించాడు కా.రా.అది అక్కడ అద్వైతపు అంచులను తాకుతుంది.

"చావు" కథ మనసును తాకదు. మనసుద్వారా తాకదు.సూటిగా హృదయాన్ని తాకుతుంది. దీన్ని కథలా చదవలేం. జీవితంలా అనుభవిస్తాం.అంటే యీ కథలో వాస్తవికము ప్రతీక విడిగా తెలియలేనంతగా కలిసిపోయాయి. కథాశిల్పం చేరుకోవాలని కోరుకున శిఖరం యిది. ఈ కథలో యితివృత్తం యింమించు లేనట్టే. మాలవాడలో ఒక ముసలిది కన్ను మూసింది, బతికినంతకాలం చలితో తీసుకున్నది ముసలిది. దాన్ని కాలచడానికి కావడికట్టెలు ఎక్కువ. అరవై పేజీలు మించిన యీ కథ ఆ కాసిన్న కట్టెలకోసం ఆ మాలలు పడే పాట్లు. అంత చలిలో ఆ రాత్రివేళ ఊరిలో ఏ పెద్దమనిషి నిద్రాభంగం సహిస్తాడు. సహించవచ్చు సహించకపోవచ్చు. అసలు లేపడానికి ఎవరు సాహసించగలరు? కొనడానికి ఊళ్ళో ఎవరూ అమ్మరు.ఊరికే యివ్వరు. శవాన్ని పాతెయ్యొచ్చు. కాని దయ్యమవుతుందన్న భయం. మాలపెద్దలంతా పాతెయ్యడమే దారి అని అనుకుంటుంటే కుర్రకారు కొందరు ఎక్కణ్ణుంచో ఆరు కట్టెలమోపులు తెచ్చి పడేశారు. పాతెయ్యడమే దారి అనుకంటున్న పెద్దలంతా అదిరిపడ్డారు. కుర్రవాళ్ల యీ అఘాయిత్యం తెల్లారితే ఎట్లా సమర్థించడం, కాల్చడమా కాదా అన్న మీమాంసలో ఉంటే ఒక కుర్రగొంతు అన్నది: "శవాన్ని అందల ఏసి కాలుస్తారో నేప్పొతే ఆల్లనే కాల్సీమన్నారో అడగండి." కుర్రవాళ్ల పట్టుదల వల్ల శవం కట్టెలపైకెక్కింది. చచ్చినదాని కొడుకు ఎరకయ్యకు ఎంతగానో బాధగా ఉండింది , తల్లిని పాతెయ్యవలసి వస్తుందేమోనని. " ఒక్కోసారి మా యమ్మ అనీది. అయ్యా నానెప్పుడైనా యీ సలికే సచ్చిపోతాన్రా. ఈ సలిసంకటం తోనే సచ్చిపోతాను. సీతాకాలం కర్రలెక్కడా దొరకవు. కర్రల్దొరకవని కప్పెట్టేకేమి–ఎక్కడేనా కసింత అడుక్కొని సివరికి దొంగతనవేసేనా సరే నన్ను కాల్సేయాల.బండెడు కర్రల్తెచ్చి కాల్సి, నా యిన్నాళ్ళ సలీ కాష్టమ్మైనైనా కాలిపోవాల", అనీది మా యమ్మ...తరువాత ఏటన్నా కానీ యిప్పిడీ కర్రలు తెచ్చినారా–ముందీ శవాన్ని కాల్చడమైపోనాది. నేప్పొతే నాను బతికున్నంతకాలం కుల్లుతూనే ఉందును. బైటకి అన్లేను. అయినా కుల్లుతాను."

బతికున్నంతకాలం కుల్లుతూనే బతకవలసిన బతుకులు "చావు" కథావస్తువు. "చావు" ముసలిదాని చావు కాదు.బతికున్నవారి చావు. "నా ఏడుపల్ల బతికున్న శవాలగురించే" అంటాడు అప్పారావు.ఈ కథలోని చలి, చలిలోని శవజాగరణ, ఆ నికృష్టుల చావని చావు వంటిదే. "జీవుడికి ఎండా కాన్దే, ఒనా కాన్దే...అయితే ఆటి దెబ్బ ఎదురుగా కనబడతాది. మంచూ సలీ అలాక్కాదు. సల్లసల్లగా జీవుడిని తినేస్తాయి" అనే రాజయ్య మాటలు , "ఒక్కసారి సావడమంటే మనకి బెదురు. కసింత కసింత సావడం మనకి శ(వానగుంటది", అన్న అప్పారావు

మాటలు, యీ చలివంటి చావును చెప్పేవే.మనిషి బతికున్నపుడు వాళ్ళమనిషి వీళ్ళ మనిషి . చనిపోయిన తరువాత ఆ శవం అందరిదీ. దాన్ని సాగనంపే బాధ్యత సంఘానిది. మనిషి ప్రాణంపోయినా చలించని సంఘం "చావు" కథలోని సంఘం. చలించనిది అంటే ప్రాణం లేనిది. " చావు సంఘానిది.

కొన్ని కథలు కమ్మగా కప్పురపు విడెం లాగా బుగ్గన గుబాళిస్తుంటాయి. కా.రా.కథలు గుండెలో ముల్లులా ఉండి పోతాయి.

కా.రా.సూచించే పరిష్కారాన్ని పాఠకుడు ఒప్పుకున్నా లేకున్నా అతని సమస్యావిష్కారాన్ని ఒప్పుకోక తప్పదు. మార్క్సిజమైనా మరో తత్త్వమైనా రచయితకు గుడ్డిగా నమ్మవలసిన సిద్ధాంతం కారాదు. ఆ తత్త్వం జీవితసత్యాన్ని దర్శింపజేయగలిగేదిగా ఉండాలి. ఆ దర్శనమే రచనలో ప్రతిబింబించాలి. కా.రా. కేవలం తాత్త్వికుడు కాడు. అతడు ఋషి. అందుకే అతని కథలు కావ్యాలు కాగలిగినాయి.

కా.రా.తన కథల్లో ఆదర్శసమాజాన్ని కలగంటాడు. లోకమంతా తనను, తనలో లోకమంతటిని చూడగలిగినవాడే అటువంటి సమాజంలోని వ్యక్తులు. విడిగా వికసించరు, సమాజసుమంగా వికసిస్తారు. ఆర్చిబాల్డ్ మెక్ లీష్ కు పద్యమెట్లానో కా.రా.కు సమాజమట్లా. "A poem should be wordless" , అంటాడు మెక్లీష్. పద్యంలో పదాలు కనిపించవు. పద్యమే కనిపిస్తుంది. నేను అన్నది పూర్తిగా రూపరి , రేకులు రేకులుగా ఆకర్షించని ప్రపంచాబ్జం కా.రా.కల. అది ఎన్నటికీ కలగానే ఉండవచ్చు. కానీ ప్రతివాడూ కనవలసిన కల.సమాజాన్ని ముందుకు నడిపించే కల.

***

[ రచయిత మాట. ఇది ఆగస్టు 1978,  భారతి లో ప్రచురించినవ్యాసం. అది రాసిన తరువాత మూడు సంవత్సరాలు ప్రచురణ కాలేదు. 1975 కు ముందు నేను కా.రా. పేరు విని ఉండలేదు.పేరు వినడం,  విన్న వెంటనే చదవడం,  చదివిన వెంటనే ఆయన కథలపైన యీ వ్యాసం రాయడం,  రాసిన వెంటనే ఒక పత్రికకు పంపడం, అక్కడ  వెంటనే సంపాదకుల చెత్తబుట్టలోకి వెళ్ళిపోవడం చకచకా జరిగిపోయాయి. వ్యాసం తిప్పి పంపలేదు పత్రిక.("స్టాంపులు జతచేయనిచో మీ రచనలు తిప్పి పంపబడవు." కొన్ని పత్రికలు యింకొంత ముందడుగు వేశాయి. "మీ రచనలు  తిప్పి పంపబడవు. మీ వద్ద ఒక కాపీ ఉంచుకొనండి.) అంటే యీ వ్యాసం సుమారు 45  సంవత్సరాలవెనక రాసినది . కనుక యిందులో నేను చేసిన విమర్శతో యిప్పుడు నేను పూర్తిగా ఏకీభవిస్తానని చెప్పలేను. ఏకీభవించలేనివి కొన్ని అభిప్రాయాలు:

"అతని చిన్నకథలు శిల్పదృష్టిలో కూడా చిన్నవే."

"నో రూమ్" కథ కా.రా. అతని ప్రాథమిక దశలో వ్రాసింది అయిఉండవలె. ( కాదు. చాలా లోతైనదృష్టితో రాసింది.)

“ఆర్తి” నిరుపేదల నికృష్టజీవితాలను డాక్యుమెంటరీ లాగా చూపిస్తుంది.” ( ఇప్పటి నా దృష్టిలో “ఆర్తి” డాక్యుమెంటరీ కాదు. అది చాలా గొప్ప కథ, అతని అగ్రశ్రేణి కథలలో ఒకటి.)

కాని వీటిని సరిదిద్ది వివరించడం యిప్పుడు చేయలేను. ]

## 7.2. భయం

“భయం” కథలో  ఏది ప్రధానపాత్ర ?సత్తెయ్య పాత్ర ప్రధానం అన్న దానిలో సందేహం లేదు, ఉండదు, ఉండకూడదు, సాధారణంగా. కాని ఆ ప్రశ్న అడగందే, దానికి సమాధానం పొందందే ఆ కథ మనం సరిగా అర్థం చేసుకున్నట్టు కాదు.

ఆ ప్రశ్న అడగడం అవసరమనిపించడమే కథ అర్థమవుతున్నదని అర్థం . ఎందుకంటే కథ మొత్తం సత్తెయ్య కథ. వాడి నాయన గౌరేసు, తల్లి పారమ్మ, చనిపోయేనాటికి “సత్తిగాడికి తొమ్మిదేళ్లు”. “ఆ సత్తిగాడు ఇప్పుడు సత్తె(వై సత్య(వై సత్తెయ్య అయ్యాడు.” ( ఎలా ఎదిగాడో ! ఇంతింతై అన్నట్టు! పేరు తెచ్చుకోడంలో క్రమవృద్ధి పేరులో సూచించడం కా.రా. కథనశిల్పం. కా.రా.కథనశిల్పంలో కాకువు కీలకం.)

కథ ప్రారంభంలో, కథకుడు అశాస్త్రీయమైన ఆలోచనలు , జీవనవిధానమూ మూఢలోకానికి ఎట్లా ప్రాణాంతకమో నిరూపించే ప్రయత్నం చేస్తాడు. పాముల్ని చంపడానికి ఏఏ ధర్మసూత్రాలు చెప్పబడ్డాయో వాటినన్నిటినీ ప్రస్తావించాడు కథకుడు:

“ అయ్యో పాపం ఎరమింగిన పాఁవర్రా ! అలాంటి పాఁవుని చంపకూడదు!”

“పొద్దోయి పావు(ని కొట్టకూడదురా!”

“భార్య గర్భిణి. ఆ అడ్డు గౌరేసుకూడా దాటలేడు.”

పాపజాతిని ప్రసన్నం చేసుకోడానికి ఏమేమి చెయ్యాలని మూఢలోకం అనుకుంటుందో కూడా చెప్పించాడు పాత్రల నోట:

“నాగులచవితి గుడ్లు మొక్కుకున్న. పిల్ల నెల తప్పింది,ఏ బిడ్డ పుట్టిన నీ పేరు యెడతానన్నాను....”

మూడవ మూఢనమ్మకం పాముమంత్రం. సారాపాకలో వున్న పావు(ల రావులయ్యకు సారామత్తు వదలగొట్టి తెస్తే, అతడంటాడు “...యెంత మంతరవైనా దానికీ ఓ టైవుంటది.ఆ టైవుకి పడితేనే అది "టక్" న పనిసేస్తది.టయాం దాటి పోనాక, ఆబగమంతుడేసినా మర్నాబం నేదు.”

ఆ కథాకాలంలో, యీ మాత్రం అభ్యుదయం , విప్లవం కథలో ఉండాలి. నిజమే. విరసం రచయితగా పేరుపొందిన కా.రా. కథలు  విప్లవతత్త్వసారంలో ముంచి తీసినవి అని ఆసించడం సహజం.కాని కా.రా.కథల్లో కేవలపురాణవైరం, ఉపనిషద్విషవృక్షాలు ఉంటాయి, ఉండవలె అని అనుకోనక్కరలేదు. మెలకువగా చదివితే కా.రా. కథల్లో పురాణాల నీడలు స్పష్టంగా కనిపిస్తాయి. “యజ్ఞం”లో :

“అప్పల్రాముడు మండపం ముందు ఎప్పుడూ కూర్చునే చోటుకు కాస్త ఎడంగా కూర్చున్నాడు. ...శరీరం కొంచెం ముడుతలు పడ్డా , యీ నాటికీ ఎండలో తళతళ మెరుస్తున్నది.అతడొక పెద్ద గావంచా కట్టుకుని ఒక మాసిన చింకిగుడ్డ భుజాన పడేసుకున్నాడు. అతడికి దగ్గర్లోనూ ఎడంగా ...మధ్యవయస్కులు –అతడి కొడుకులూ మనవల్లో పెద్దవాళ్ళూ...”

ద్యూతసభలో , జూదంలో ఓడిన ధర్మరాజును ( “మాసిన చింకిగుడ్డ భుజాన” ) అతని తమ్ముళ్ళను తలపించదా యీ వర్ణన? “యజ్ఞం” లో యితిహాసపు ఛాయలైతే, “భయం” ఉపనిషద్భాష్యం.( నా ఈశోపనిషద్వ్యాఖ్య ఆద్యంతాలలో “భయం” కథ విస్తృతంగా ప్రస్తావించాను.)

“భయం” కథలో సత్తెయ్య కనిపించిన పామును వదలక పట్టి చంపుతాడు. భారతంలో ఉదంకుడు చేయించిన సర్పయాగంలా అనిపిస్తుంది కథ, “కాదనకిట్టియపకారము తక్షకుడేకవిప్రసంబోధన చేసి చేసె, నీవు ననేకభూసురాపాదితసర్పయాగమున భస్మము సేయుము తక్షకాది కాకోదర సంహతిన్ హుతవహోగ్రసమగ్ర శిఖాచయంబులన్.”( ఆంధ్రమహాభారతం: ఆదిపర్వం) “ హుతవహోగ్ర” దగ్గర ఆగదు సమాసం. “ఉగ్రసమగ్ర” అని ఉగ్రవాదాన్ని పూరిస్తాడు ఉదంకుడు “సమగ్ర”తో. . కాని యీ కా.రా. కథలో సత్తెయ్యది ఉగ్రవాదం కాదని, భారతకథలోలాగా సత్తెయ్య సర్పయాగం తన తండ్రి చావుకు ఒక పాము కారణం కనుక , పాములపై పగతో వాటిని పట్టి చంపుతున్నాడని పాఠకుడు అనుకునే అవకాశం ఉంటుందని, దాన్ని కాదనడానికి చాలా ప్రయత్నం చేశాడు కథకుడు:

“ జనఁవేటనుకుంటారంటే అప్పుడెప్పుడో మాయయ్యని పాఁవు కరిసిందని -ఆ కసికొద్దీ పావుల్ని సంపుతాననుకుంటారు. పాఁవంటే నాకు పగ కాదు. ..పాఁవు మనిసిని కుడతాది. మనిసికి సావంటే బయం. పావుఁని సూస్తే సావును సూసినంత బయం. సావుకు బయపణ్ణోడు ఒక్కడే పాఁవుకి బయపడ్డు. సిన్నప్పుడు కండసీవఁని సూసి బయపడినావు. పెద్దైనాక పాఁవు...సీవైనా పాఁవైనా సావైనా నాకొక్కటే.అదెప్పుడో కాటేస్తదో యెయ్యదో, దాని బయ్యం మనిసిని తినేస్తుంటది పురుగునాగ! ఎదురు తిరిగితే ఏటీ నేదు.”

కనుక, నక్సలైట్ల ఉగ్రవాదాన్ని సమగ్రంగా సమర్థిస్తూ రాసిన కథ “భయం” అన్న అపోహను ఊహించి, ఆ అర్థాన్ని తొలగించడానికి కా.రా. కథలోనే స్పష్టం చేశాడు. “ సీవైనా పాఁవైనా సావైనా నాకొక్కటే.అదెప్పుడో కాటేస్తదో యెయ్యదో,...” కథలో వస్తువు పాము కాదు, పాము భయం.భయం ఎలా తొలగుతుంది ? ఓసారి మాగన్నులో 'దుభీ'మని ఆమెగుండెలమీదికి దూకింది.ఇంకోసారి ఒత్తిగిలితే పక్క కింద మెత్తగా ,చల్లగా తగిలింది.పూర్తిగా తెలివొచ్చి చూస్తే,ఏ పామూ కనిపించదు; ఏమాయా అగుపించదు." రజ్జువు కూడా లేని సర్పభ్రాంతి!

ఈ భయాన్ని దానికంటే మహత్తరమైన భయంతోనే తొలగించగలం. ఏమిటది?

[ఈ కథలో అతి కీలకమైన సంభాషణ భార్యాభర్తల ( రత్నాలు, సత్తెయ్య) మధ్య జరిగినది. అది చూద్దాం ]

ఈ కథలో సత్తెయ్య , ఊళ్ళో ఎవరింట్లోకి పాము వచ్చినా వెళ్ళి చంపుతూ ఉంటాడు. ఒక రోజు అట్లాగే ఎవరింట్లోనో పామును చంపడానికి వెళుతున్న భర్తను అడ్డుకోబోయింది రత్తాలు.

" రత్తాలంటే సత్తెయ్యకు చాలా అభిమానం. అయినా కొన్ని విషయాల్లో ఆమె మాట ఒక్క అక్షరం కూడా పట్టించుకోడు.

రత్తాలు ఓ రోజు ...

"పోనీ, యీ యింట్ల దూరిన పావుని నువ్ సంపు. నాను కాదన్ను. ఎవళ అటకమీదో వున్న పాఁవుని నువ్వేల సంపాల?

రత్నాలు భయానికి ఓ అర్థముంది. అతను చేసే పనివల్ల వొరిగేదేమీ ఉండదు. పోతే, పోయేవి అణా బేడా, అడ్డెడు బియ్యమో, పాతగుడ్డో కాదు. నూరేళ్ళు బతకవలసిన నిండు ప్రాణాలు.

అయితే, ఎలా చెప్తే ఏం చెప్తే ఆమె భయం తొలిగిపోతుందో సత్తెయ్యకు తెలీదు. తన భయం ఎలా తొలగిందో ఏ చైతన్యం అందుకు కారణమో గ్రహిచగలిగే ఊహ సత్తెయ్యకు లేదు. చివరికిలా అన్నాడు.

"ఒకలాగనుకుందావుఁ. ఇప్పుడు నానే ఉన్నాను. మా నాయినున్నాడు. ముసిల్ది, ముసిలోడూ నీ కొడుకూ మాఁవందరం ఒక్కడ తొంగున్నాం.పాఁవొచ్చింది. పాఁవు సూర్లొంచి దిగింది...నువ్ గడపట్ల ఉన్నావ్....కర్రకూడా నీ సేతికందువిడిగుంది. పాఁవు నీకాసి సూణ్ణేదు. మా మీదికి పారొస్తోంది.నువ్వేటి సేస్తావ్.నీ మీదికి రాడం నేదుకదా. మా మీదిక్కదా పారొస్తోంది. సస్తే మాఁవు కదా సస్తాం.అలాగని నువ్వూరుకుంటావా? నీ పాణవేన వొదిలి మమ్మల్ని కాపాడతావా? "

రత్నాలు సులువుగానే జవాబిచ్చింది, మరో ప్రశ్నతో.

"నువ్వు- మీరంతా నాకైనట్టు యీ లోకమంతా నీకౌద్దా?"

"అవుద్ది."

"ఆత్మవత్సర్వభూతాని", " ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి", "వసుధైకకుటుంబకం" వంటి వాక్యాలు వల్లె వేస్తాం. కాని, "అవుద్ది" అని సత్తెయ్యలాగా మనలో ఎంతమందిమి అనగలం? ఏ ఉపనిషద్భాష్యం యింత "తెల్లముగా" "అవుద్ది" అని చెప్పింది? తన భర్త, భార్య, కొడుకు, కూతురు మాత్రమే తన కుటుంబం అనుకుంటుంది లోకం, రత్తాలు లాగా. సత్తెయ్యకు లోకమంతా తన కుటుంబం.

[ “తెల్లముగా” అన్న పదం భారతంలోని ధర్మవ్యాధోపాఖ్యానం లోది, (ఎర్రన: “ధీరుడు నిర్జితేంద్రియుడు తెల్లముగా తనుగాంచు భూతవిస్తారనిరూఢమైన పరతత్త్వముగాగ...”తెల్లముగా అంటే తత్వంగా కాదు,అనుభవంలో తెలియడం,స్పష్టంగా .ప్రత్యక్షంగా అని అర్థం.)

సత్తెయ్య సన్యాసి అయిన గృహస్థు. వైదికభాషలో చెప్పాలంటే అతడు శుకమహర్షి వంటివాడు,“సముడై ఎవ్వడు ముక్తకర్మచయుడై సన్యాసియై యొంటి బోవ” ( భాగవతం).

సత్తెయ్య భయాన్ని జయించాడు. చావుకు భయపడకపోవడం తనకి చావులేదని తెలుసుకున్నప్పుడే సాధ్యం. “ ద్వితీయాద్వై భయం భవతి” అన్న ఉపనిషద్వాక్యాన్ని గుర్తుకు తెస్తాయి సత్తెయ్య మాటలు. లోకమంతా తననే చూచుకుంటున్న సత్తెయ్యకు చావులేదు, భయమూ లేదు. ఉపనిషత్తులు “ఆత్మవాదం” అనే యీ ఆత్మీయత ఎంత భయంకరమైనదో రత్నాలు అడిగిన ప్రశ్నకు సత్తెయ్య చెప్పిన సమాధానంలో తెలుస్తుంది.

"నువ్వు- మీరంతా నాకైనట్టు యీ లోకమంతా నీకౌద్దా?"
“ అవుద్ది.”

అంత తడువుఁకేకుండా వచ్చిన జవాబుకు రత్తాలువద్ద ఎదురుమాట లేదు. “అయితే సరే! “ అంటూ తల తిప్పేసింది. ఆమెకు కళ్ళంబడి నీళ్ళెందుకు వచ్చేయో వాటిని ఆపడమెలాగో అతనికి కాని ఆమెక్కాని తెలీలేదు. “ నీవే నాలోకం.లోకం ఏమైతే” నాకేం అని సత్తెయ్య అనలేకపోవడం రత్నాలు కన్నీళ్ళకు కారణం. భర్త పరస్త్రీలోలుడైనా భార్య సహించగలదేమో కాని జ్ఞానియై ఆత్మవత్ సర్వభూతాని అనడం ఏ భార్యా భరించలేదు. మానవతావాదాన్ని దాని అంచులవరకు వూహించాడు కా.రా.అది అక్కడ అద్వైతపు అంచులను తాకుతుంది.

సత్తెయ్య వంటి పరమహంస, తమకోసం ప్రాణాలిచ్చినపుడు లోకం అతన్ని గురించి ఏమంటుంది? “అంసలా ఆర్నెల్లు బతికింది సాలు.”

ఆద్యంతము యిది సత్తెయ్య కథ. ఇంకా, యీ కథలో కథానాయకుడెవరు అని అడగగలమా? అడగవలె. కథ చివర, చిట్టచివర పదమూడేళ్ళ గురవడు ప్రవేశిస్తాడు. పిలిపిస్తే వచ్చాడు, పామును చంపడంలో సత్తెయ్యకు చేతికింద ఉంటాడని. మొదటినుండి అనాసక్తుడు. సుబ్బాయమ్మగారింట్లో పామును చంపబోయిన సత్తెయ్యను పాము కాటేసింది, అతడు నురగలు కక్కుతున్నాడు. ఉంటాడన్న నమ్మకం లేదు. సత్తెయ్య బతుకుతాడో లేదో, తోడుకు వెళ్ళిన గురవడికి ఆసక్తి లేదు. అట్లాంటి స్థితిలో సత్తెయ్యను వదిలేసి తన ఆవులదగ్గరకు వెళ్ళిపోయాడు గురవడు. కథ చివర అతకనట్టున్న యీ గోవులుకాచే గురవడు ఎందుకు ప్రవేశపెట్టబడినట్టు? తిరిగి తన గోవులదగ్గరకు వెళ్ళిన గురవడికి తను కాచే గోవులు కొత్తగా కనిపిస్తున్నాయి.అతడిలో కొత్త జ్ఞానం కలిగింది. (“తనకేఁవౌతుందో గురవడికి తెలియడం లేదు.”)

గురవడికి ఏమైంది? అతడికి కలిగిన కొత్త అవగాహన ఏమిటి ? తిరిగి తన ఆవులవద్దకు వచ్చాడు, తన డ్యూటీలో చేరాడు గోపాలుడు. "ఒక్కడూ కనిపించలేదు." ఏకాంతం. "చల్లని నీడ" , "శుభ్రమైన నేల". ధ్యానానికి అనువైన స్థలం. ( గీతలో ధ్యానయోగం). గురవడికి ధ్యానంలో యిప్పుడు తెలిసింది.పూర్వం అతడికి అన్నీ ఆవులు , అన్నీ సాధువులు. కానీ యిప్పుడలా కాదు. వాటిలో ప్రతి ఒక్క ఆవు తన ప్రత్యేక స్వభావంతో కనిపిస్తున్నది. సాధువేదో అసాధువేదో తెలిసిపోతోంది. దుష్టము శిష్టము తెల్లముగా తెలిసిపోతోంది.

సత్తెయ్యలాంటి వాణ్ణి సమాజం ఎప్పుడైనా యిలానే నిర్దాక్షిణ్యంగా వాడుకుంటుంది. ఎంతకాలం ఎంతమంది యిలా ప్రాణాలర్పించి సేవ చేసినా సమాజం "అంసలా ఆర్నెల్లు బతికింది సాలు.", అని మరో బలి కోసం ఎదురు చూస్తుంది. కాని సమాజం తనను తాను ఉద్ధరించే ఉద్యమం చేయదు. అది కోరుకుంటాడు గురవడు, జగద్గురువు, భారతకథలో శ్రీకృష్ణుడు. ఆయన తలచుకుంటే ఒక చక్రం వదిలితే చాలు. కాని వదలలేదు. ఆయుధం పట్టనని ప్రతిజ్ఞ చేశాడు. యుద్ధం చేయించాడు. ఇది మార్క్స్ సిద్ధాంతంలోని మూలసూత్రం. కా.రా. కథల్లో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పూర్తిగా ప్రతిఫలించిన, ప్రపంచ మార్క్సిస్టు సాహిత్యంలో శిఖరాయమైనది అని చెప్పదగిన కథ "చావు". అందులో అప్పారావు యిందులోని గురవడి ధ్యానఫలం. అతడు ఆ కథలో , తటస్థుడు. చేయడు, చేయిస్తాడు.

కనుక, కథలో వస్తువు సత్యము ధర్మము , వీటి తారతమ్యము. సత్యం వైయక్తికం. ధర్మం సామాజికం. సత్యాన్ని ఉన్నతస్థానంలో నిలుపుతూ, ధర్మాన్ని ప్రతిష్ఠిస్తుంది "భయం". దుష్టశిక్షణ శిష్టరక్షణ కొరకు గురవడి ప్రవేశం. ఆ పని గురవడు చేయడు, చేయిస్తాడు, జగద్గురువులాగా ( వందే కృష్ణం జగద్గురుమ్). సత్యము ( సత్తెకాలపు సత్యలోకపు సత్తెయ్య) , ధర్మము (గురవడు, దుష్టశిక్షణ శిష్టరక్షణ), రెంటి పరిధులు వేరు. ఒకటి ప్రధానము రెండవది అప్రధానము కాదు.

గురవడికి సత్తెయ్య ఉద్యమంలోని లోపం తెలిసింది. కనుక "భయం"లో ప్రధానపాత్ర సత్తెయ్య అయినప్పటికీ , ప్రధానసిద్ధాంతం మార్క్సిజం. కథావస్తువు వ్యక్తి ఔన్నత్యం కాదు, సామాజికచైతన్యం.

మార్క్సిజాన్ని , సనాతనధర్మాన్ని, కలిపి ఒక్క ముక్కలో పట్టుకున్నాడు శ్రీశ్రీ , మరొకడు కా.రా." నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను." రేకు ఎంత తెల్లటిదైనా రేకే, అబ్జంకాదు. దళం పుష్పం కాదు. దళపతి సేనాపతి కాడు.

***

***

.